# కాశ్మీరులో ఏం జరుగుతూవుంది?




పౌరహక్కుల నివేదిక

V. Krishna Kumari
Karalampadu
18-1-96

# కాశ్మీరులో ఏం జరుగుతూవుంది?



పౌరహక్కుల నివేదిక




జమ్ము-కాశ్మీర్

------: వాస్తవాధీన రేఖ
పడమటి, వాయువ్య ప్రాంతం పాకిస్తాన్‌లో
తూర్పు ప్రాంతం చైనాలో
మధ్యనున్నది ఇండియాలో ఉన్నాయి

# విషయ సూచిక


| | |
|---|---|
| ముందుమాట | i - v |
| కొన్ని పద చిత్రాలు | 1 - 5 |
| కాశ్మీరు - కాశ్మీరీయత్ | 6 - 14 |
| కాశ్మీరులో జాతీయోద్యమం | 15 - 23 |
| విలీనము - ప్రజాభిప్రాయ సేకరణ | 24 - 32 |
| విలీన రాజకీయాలు - 1 (1947-53) | 33 - 43 |
| విలీన రాజకీయాలు - 2 (1953-87) | 44 - 57 |
| లోయలో మిలిటెన్సీ - మూలాలు | 58 - 68 |
| జమ్ము-కాశ్మీరులో సైనిక పాలన | 69 - 102 |
| మిలిటెన్సి - ప్రజలు | 103 - 108 |
| ముగింపు | 109 - 113 |


*****


ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం
డిసెంబర్ 1995

ప్రతులు : 3000

ప్రతులకు : కె. బాలగోపాల్
**#304,** కిరణ్ అపార్ట్‌మెంట్స్
జఫర్‌బాగ్, రెడ్‌హిల్స్
హైదరాబాద్ 500 004

# ముందుమాట

*"కాశ్మీరు స్థిరాస్తి వివాదం కాదు. జాతి ప్రతిష్ఠకు సంబంధించిన విషయం కాదు. భారతీయ లౌకిక వాదానికి ప్రమాదం మాత్రమే కాదు. వీటన్నిటినీ ఎంతో ఎంతో మించినట్టిది. కాశ్మీరు అనే విషాద మానవ ఉదంతం చూసి కూడా దేశం స్పందించ కుండా అలాగే మొద్దు బారి పోయినట్లుగా ఉండిపోతే...... ఒక నాగరిక దేశంగా భారత దేశపు ఉనికికే తీవ్ర ప్రమాదం వాటిల్లుతుంది"*

*.........................బలరాజ్ పురి*
*'కాశ్మీర్ టువార్డ్స్ ఇన్‌సర్జెన్సీ' లో*

గత ఐదేళ్ళుగా భారతీయులు 'కాశ్మీరు సమస్య' గురించి వింటూనే ఉన్నారు. కాశ్మీరీలే ఒక సమస్య అన్నట్లుగా మనకీ సమస్యను వివరిస్తున్నారు. బహుశా కాశ్మీరీలకు కూడా భారత దేశంతో సమస్య ఉన్నట్లుంది. కానీ ఇండియాకు కాశ్మీరీలతో ఉన్న సమస్యను మాత్రమే మనకు చెబుతూ వస్తున్నారు.

వాళ్ళు నిలకడ లేని మనుషులని మనకు చెప్తున్నారు. దాదాపు నలభై ఏళ్ళ క్రితం వాళ్ళ రాజ్యాంగ పరిషత్తే ఒక తీర్మానాన్ని ఆమోదించిందనీ, దాని ప్రకారం వాళ్ళ భూభాగాన్ని భారతదేశంలో కలిపేసారనీ, అది తుది నిర్ణయం అన్నారనీ ఆ తీర్మానం వెనక్కు తీసుకో వీలులేని దన్నారనీ, అయితే ఇప్పుడు వాళ్ళు ఆ తీర్మానాన్ని వెనక్కు తీసుకోవాలని కోరుకుంటున్నారనీ, అందుకు అమలు కాని వాగ్దానాలూ, విశ్వాసోల్లంఘన అనే అనేక పసలేని వాదనలు చేస్తున్నారనీ మనకు చెబుతూ వస్తున్నారు. రెండోది వాళ్ళు కపటులూ, విశ్వాస ఘాతకులూ అని కూడా చెబుతున్నారు. దాదాపు ఆరు వందలేళ్ళ క్రితం 'నా ఖడ్గాన్ని విరిచేసి కొడవలి తయారు చేసుకున్నాన'ని చెప్పిన షేక్ నూరుద్దీన్ నూరానీ అనుచరులమనీ, నెమ్మదస్తులం, సాధుస్వభావులం, అహింసావాదులం అనే ఇన్నేళ్ళుగా నమ్మకం కలిగించి ఇవ్వాళ అకస్మాత్తుగా తుపాకులు బయటికి తీసారు అని మనకు చెబుతున్నారు. మూడోది---- వాళ్ళు మోసకారులని కూడా మనకు చెప్తున్నారు. **1947** లోనూ, మళ్ళీ **1965** లోనూ పాకిస్తాన్‌కు నిరాశకల్గించిన వాళ్ళు, ఇన్నేళ్ళూ ఇండియా ఎవరికి ఓటేయమంటే వాళ్ళకు ఓటేసిన వాళ్ళు ఇవ్వాళ హఠాత్తుగా నిజాం-ఎ-ముస్తాఫా-అల్లా రాజ్యం కోసం బొబ్బలు పెడుతున్నారని కూడా మనకు చెప్తున్నారు.

ఇంతటి "ఉచితానుచిత విచక్షణ లేని" "విశ్వాస ఘాతకులైన" "మోసకారులైన" ప్రజల్లో ఖచ్చితంగా ఏదో పెద్దలోపమే ఉండాలి.

బహుశా మనలోనే ఏమైనా తప్పుందేమో!

జమ్మూ-కాశ్మీరు గురించి మన పాలకులు ఏది చెప్పదలచుకొన్నారో దాన్ని భారతీయులమైన మనం ఏనాడూ ప్రశ్నించలేదు. షేక్ అబ్దుల్లా కాశ్మీరుకు ఎదురులేని

నాయకుడని మనకు చెబితే అవును ఎదురులేని నాయకుడే అని ఒప్పుకున్నాం. కాశ్మీరు లోయలో ఇండియా అతడి మీద ఢోకాలేకుండా వందెం కోమొచ్చని చెబితే --షేక్ అబ్దుల్లా రేసు గుర్రం అయినట్లు ఆయన నిరంకుశ పద్ధతుల్ని ప్రశ్నించకూడదని ఒప్పేసుకున్నాం. ఆయన విద్రోహి అని మనకు ఆ తర్వాత చెబితే, జాతి వ్యతిరేక కుట్రదారు అని చెబితే అవునవును అతగాడు విద్రోహేననీ, జాతి వ్యతిరేక కుట్రదారుడేననీ మన పాలకుల మాటను ఎంత భక్తి ప్రపత్తులతో నమ్మలేదూ? సత్యాసత్య విచక్షణ చూపించి వుంటే అబ్దుల్లా ఈ దేశంలో అత్యధికంగా అన్యాయానికి గురయిన రాజకీయ అసమ్మతి వాది అనీ (అతనిలో ఏ తప్పులున్నప్పటికీ), ఈ ఉపఖండపు నెల్సన్ మండేలా అనీ తెలుసుకుని ఉండేవాళ్ళం. కానీ అదేం పాపమో ఇండియాలో వ్యవస్థ వ్యతిరేక మేధావులుగా లబ్ద ప్రతిష్ఠులైనవారు సహితం షేక్ అబ్దుల్లాను అలా పరిగణించలేదు. ఆ రాష్ట్రంలో ఎన్నికలు ప్రజా స్వామ్యయుతంగా జరుగుతున్నాయని మనకు చెబితే నిజమే కాబోలు, ఎన్నికలు ప్రజాస్వామ్యయుతంగానే జరుగుతున్నాయిలే అని నమ్మేసాం. ఒక ప్రభుత్వం తర్వాత మరో ప్రభుత్వాన్ని ఢిల్లీ పెత్తందార్లు తమ చిత్తం వచ్చినట్లు మార్చుతోన్న విషయం మన కళ్ళముందే జరిగిపోతున్నా ఏలినవారు మాటలను నమ్మాం. లౌకిక, ప్రజాతంత్ర భారతాన్ని అస్థిరం చేయడానికి పాకిస్తాను ముస్లిము మతోన్మాదులకు శిక్షణ ఇవ్వడం తప్పిస్తే ఇప్పుడు కాశ్మీర్లో అసలు సమస్యేమీ లేదని అంటే కూడా నిజమని నమ్మేస్తున్నాం. పాకిస్తాన్‌కు గుణపాఠం నేర్పాలనే బొబ్బరింతలో మనమూ గొంతు కలుపుతాం. సాహసులైన మన వీర జవాన్లు కాశ్మీర్లో కష్టభరితమైన పని నిర్వర్తిస్తున్నారనీ, మానవ హక్కుల ఉల్లంఘన గురించి చేసే ప్రచారమంతా దుర్బుద్ధితో చేస్తున్న కాకి గోలేననీ అన్నా, అసలు సత్యం ఏమిటో తెలిసికూడ కళ్ళూ, చెవులూ, నోరు మూసేసు కోగల్గుతున్నాం.

కనీసం ఇప్పుడైనా భారతదేశంలోని ప్రజాభిప్రాయాన్ని మలిచే బాధ్యతాయుతమైన వ్యక్తులూ, శక్తులూ మేల్కొంటారనీ, ఢిల్లీ విసర్జిస్తున్న దాన్నంతటినీ నమ్మేయడం మానుకుంటారనీ ఆశించే మేం ఈ రిపోర్టును ప్రచురిస్తున్నాం. గత నలభై ఏళ్లకు పైగా జమ్మూ-కాశ్మీర్ లో జరిగిన దగా, వంచనా ఏమాత్రం క్షమార్హం కావు. అక్కడ అమానుష నేరాలు జరిగాయి. కనీసం ఇప్పటికైనా ఈ దేశంలోని ప్రజా తంత్ర వాదులు ఈ అసహ్యాకర దుష్ట చరిత్రలో భాగస్వాములు కాకూడదు. గత ఐదేళ్ళ కాలంలో ఈ నిస్సహాయ రాష్ట్రంలో అధమం 20 వేల మందిని చంపేసారు. 'సభ్యతా సంస్కారాలు ఉట్టిపడే' మన ప్రధాని పి. వి. నరసింహారావు మరో 20 వేల మంది చనిపోతేనే సమస్య పరిష్కారమవుతుందని నమ్ముతున్నట్లున్నాడు. దీన్నే యుద్ధ పరి భాషలో ఎదిరి పక్షాన్ని అలసి పోయేలా చేసే యుద్ద తంత్రం అంటారు. మన అంతరాత్మపై ఇంకేమాత్రమూ నెత్తురు చిందకూడదనుకుంటే కనీసం ఇప్పటికైనా మేల్కొందాం. ఈ అన్యాయానికి వ్యతిరేకంగా గట్టి నిర్ణయం తీసుకుందాం. జమ్మూ-కాశ్మీరు భారతదేశంలో "విడదీయ రాని భాగం" అని నమ్మినా, నమ్మకున్నా --- ఒకవేళ అది అంతర్భాగమే అని నమ్మితే మరింత ఎక్కువుగా --- ఈ రక్తపాతం ఇలా జరిగిపోవడానికి సమ్మతించకూడదు. కాశ్మీరీలు భారతీయులే అయితే వాళ్ళూ సోదర భారతీయులే, వాళ్ళు భారతీయులు కాదనుకుంటే వాళ్ళు మన తోటి మానవులు. ఆ రాష్ట్రంలో నెలకు సగటున మూడు వందల మంది చచ్చిపోతున్నారు. ఇదిలానే మరికొంతకాలం సాగిపోతే,

అలసిపోయి, గత్యంతరం లేక ఆ రాష్ట్ర ప్రజలు చచ్చినట్లు లొంగిపోతారనేది భారత ప్రభుత్వ వ్యూహంలా కన్పిస్తోంది. అంటే ఈ సమస్యను చట్టబద్ధంగానో, నైతికంగానో పరిష్కరించడం కాక చచ్చే దాకా నెత్తురు కారేలా కొట్టే ఆటవిక పద్ధతుల ద్వారా పరిష్కరిస్తారన్న మాట. మనం..... భారతీయులం...... ఘనమైన ప్రజాతంత్ర వారసత్వం వుండికూడా ఈ నేరాన్ని వివేక శూన్యులుగా చూస్తూవున్నాం. ఎప్పటికీ అలాగే ఉందామా ?

అలా ఉండకూడదనే మేం ఆశిస్తున్నాం.

ఈ ఆశను నిజం చేసుకోవాలంటే ఈ విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలి 'కాశ్మీరు సమస్య' ప్రాథమికంగా జమ్మూ-కాశ్మీరు ప్రజల సమస్యఅని, జనానికి చెప్పాలి. ఇండియా, పాకిస్తాన్‌లు ఆధిపత్యం వహించే ఈ ఉపఖండం చరిత్ర జమ్మూ-కాశ్మీరు ప్రజలు తమ తలరాతను తామే స్వేచ్ఛగా రాసుకుంటామన్న ఆకాంక్షకు చేసిన ద్రోహం ఫలితమే ఈ సమస్య. భారతీయ పాలకులు జమ్ము-కాశ్మీరు ప్రజల భవితవ్యాన్ని నిర్ణయించడానికి ఎంచుకున్న పద్ధతులు మోసం, దగా, చట్టరాహిత్యం, బల ప్రయోగాలతో కూడిన అవమానకర గాథ. దేశమంటే మట్టి కాదోయ్--దేశమంటే మనుషులోయ్ అన్న గురజాడ సూక్తి కాశ్మీరం విషయంలో ఇండియాకీ, పాకిస్తాన్‌కీ కూడా తల్లకిందులుగా అర్థమైంది. అందుకే ఈ రెండు దేశాల పాలకులకూ కాశ్మీరు అంటే ప్రజలు కాదు. అది వారి అధికార ప్రతిష్ఠకు సంబంధించిన సమస్య. అదొక ఆస్తి తగాదా. జమ్ము-కాశ్మీరు భారతదేశంలో అంతర్భాగమై పోయిందనీ, దానికి ఇక తిరుగు లేదనీ భారతీయ పాలకులు చేసే నిరంతర మంత్రోచ్చాటనకు నైతికత లేదు. దానికున్న చట్టబద్ధత కూడా చాలా చాలా పల్చనిది. బంగ్లాదేశ్‌లోని బెంగాలీలూ, శ్రీలంకలోని జాఫ్నా తమిళులూ భారతదేశంలో శిక్షణ పొందడానికీ, ఇక్కడినుంచీ ఆయుధాలు పొందడానికీ ఎలా ఇష్టపడ్డారో అలాగే కాశ్మీరీలు కూడా పాకిస్తాన్‌లో శిక్షణ పొందడానికీ, అక్కడి నుంచీ ఆయుధాలు తీసుకోవడానికీ ఇష్ట పడుతున్నారు కాబట్టే పాకిస్తాన్ కాశ్మీరు మిలిటెంట్లకు శిక్షణ ఇవ్వగలుగుతోంది, ఆయుధాలు సరఫరా చేయగలుగుతోంది. జమ్ము-కాశ్మీరులో విచ్ఛిన్న శక్తులను అదుపు చేసే పేరిట భారతీయ భద్రతా దళాలు అక్కడ చేస్తున్నదంతా మనం ఈ దేశంలో నాలుగున్నర దశాబ్దాలుగా కనీ వినీ ఎరుగని హత్యలూ, చిత్రహింసలూ, రేప్‌లూ, గృహదహనలే. ఈ విషయాలన్నీ మన దేశ ప్రజలకు వివరించి చెప్పాలి. అప్పుడే ఈ ఆశ నిజమవుతుంది.

ఇవన్నీ మేం చెబుతున్నామంటే మేమేమీ బాధ్యత లేకుండా వ్యవహరించడంలేదు. కాశ్మీరు ప్రస్తావన వస్తే చాలు భారతీయులంతా దేశ భక్తులయి పోవల్సి వస్తోంది! దేశభక్తి అనే పదంలో ఏమైనా ప్రజాస్వామిక సారం వుంటే అది ఈ దేశ చరిత్ర సృష్టించిన సామ్యవాద, న్యాయబద్ధ, ప్రజాస్వామిక సంప్రదాయాల గురించీ, ఆచారాల గురించీ గర్వంగా భావించడమేనని అర్థం. ఇదే దేశభక్తి అయితే కాశ్మీరు సమస్యను భారత ప్రభుత్వం ఎలా చిత్రిస్తోందో, ఆ సమస్యతో ఎలా వ్యవహరిస్తోందో ఆ పద్ధతికి మద్ధతు పలకడం మాని దాన్ని విమర్శనాత్మకంగా వ్యతిరేకించాలి.

ఇదిగో ఈ అవగాహనే ఆరు రాష్ట్రాల్లో పని చేస్తున్న ఎనిమిది పౌర, ప్రజాస్వామ్య హక్కుల సంఘాలు జమ్ము-కాశ్మీరు ను సందర్శించి అక్కడ జరుగుతున్న విషయాలపై సత్యాన్వేషణ చేయడానికి స్ఫూర్తి. ఈ కృషి ఒక రకంగా ఆత్మ విమర్శ అభ్యాసం. ఎందుకంటే భారతదేశంలోని పౌరహక్కుల ఉద్యమం 'కాశ్మీరు సమస్య' విషయంలో తన సంపూర్ణ బాధ్యతను నిజంగా నెరవేర్చలేదు. దీనికి కొన్ని గౌరవనీయమైన మినహాయింపుల ఏమంటే -- ఢిల్లీ కేంద్రంగా పనిచేసే కమిటీ ఫర్ ఇనిషియేటివ్ ఆన్ కాశ్మీర్, పి.యు.సి.ఎల్., సిటిజెన్స్ ఫర్ డెమోక్రసీ (సి. ఎఫ్. డి.) సంస్థలు. ఇప్పటి ఈ ఎనిమిది సంస్థలలోని నాలుగు సంస్థలు రెండేళ్ళ క్రితం ఉమ్మడిగా ఒక నివేదికను ప్రచురించాయి. అయితే కాశ్మీరీ మానవ హక్కుల గ్రూపులే సైనిక బలగాలు చేస్తున్న అత్యాచారాల గురించి సమాచారాన్ని సేకరిస్తున్నాయి. వాటికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నాయి. అలాగే ఈ సమస్యలో ఇమిడివున్న రాజకీయ, చారిత్రక అంశాల వక్రీకరణకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నాయి. పాశ్చాత్య దేశాలయిన ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ వంటి సంస్థలు వివరమయిన నివేదికలు ప్రచురించాయి.

పాశ్చాత్య దేశాలలోని సంస్థల కృషి విలువైనదేఅయినా, కాశ్మీరీ మానవ హక్కుల గ్రూపుల కృషి అమూల్యమైనదే అయినా, కాశ్మీరుకు వెలుపల పనిచేస్తున్న భారత ప్రజాస్వామ్య హక్కుల సంస్థలూ, ప్రజాతంత్ర ఉద్యమాలూ మాత్రమే చేపట్టగలిగిన ఒక కర్తవ్యం వుంది: అదే ఈదేశ ప్రజలకు కాశ్మీరు గురించిన అవగాహన అందించడం. కాశ్మీరు సమస్యతో ప్రజాస్వామ్యయుతంగా, నాగరిక పద్ధతిలో వ్యవహరించమని భారత పాలకులపై ఒత్తిడి తీసుకురావడం. అంటే ఏ ఉన్నతాదర్శాలనూ, విలువలనూ ఈ దేశం వారసత్వంగా పొందిందో, ఏ ఉన్నతాదర్శాలూ, విలువలూ తమనీతి అని నెహ్రూ కాలం నుంచీ మన పాలకులు సగర్వంగా ప్రకటించు కుంటున్నారో ఆ 'నీతి' కి కట్టుబడి వుండమని అడగడం. ఈ కర్తవ్యాన్ని ఇంకా పెద్ద ఎత్తున చేయాల్సేంది. ఈ కర్తవ్యాన్ని అత్యవసరంగా చేపట్టాల్సినదని మరీమరీ చెప్పాల్సివుంది.

ఈ అవగాహనతోనే **1995** జూన్ **18** న బొంబాయిలో ఒక సన్నాహక సమావేశం జరిగింది. దీనిలో బొంబాయికి చెందిన ప్రజా స్వామ్య హక్కుల పరిరక్షణ కమిటీ (సి పి డి ఆర్), పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంఘం (ఎ.పి.డి.ఆర్.), ఢిల్లీ ప్రజాస్వామ్య హక్కుల ప్రజా సంఘం (పి.యు.డి.ఆర్)ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. జమ్ము-కాశ్మీర్ లో పర్యటించి వాస్తవాలు సేకరించడానికి వెళ్ళే బృందంలో పాల్గొనాల్సిందిగా దేశంలోగల అన్ని పౌర, ప్రజాస్వామిక హక్కుల సంస్థలకూ ఆహ్వానాలు పంపాలని ఈ సమావేశం నిర్ణయించింది. ఎనిమిది సంస్థలు తమ అంగీకారం తెలిపాయి. పదమూడు మంది సభ్యుల బృందం **1995** జులై **30** రాత్రి కాశ్మీరు వెళ్లడానికి ఢిల్లీనుంచీ బయలుదేరింది. ఈ బృందంలో పశ్చిమ బెంగాల్ నుంచీ ఎ.పి.డి.ఆర్., ఆసన్‌సోల్ సివిల్ రైట్స్ అసోషియేషన్(ఎ.సి.ఆర్.ఎ), మహారాష్ట్ర నుంచీ సి.పి.డి.ఆర్., లోక్ షాహీ హక్ సంఘటన్ (ఎల్.హెచ్.ఎస్), ఆంధ్ర ప్రదేశ్ నుండి ఎ.పి.సి.ఎల్.సి., అస్సాం నుంచీ మానవీయ అధికార సంగ్రామ్ సమితి (మాస్), కర్ణాటక నుంచీ పీపుల్స్ డెమాక్రటిక్ ఫోరం (పి.డి.ఎఫ్), పంజాబు ఎ.ఎఫ్.డి.ఆర్. ల ప్రతినిధులు సభ్యులు.

1995 ఆగస్టు 7 వరకూ మా బృందం కాశ్మీర్‌లో పర్యటించింది. మేం జమ్మూ, నగర్, బారాముల్లా, అనంతనాగ్, రాజోరలను సందర్శించాం. అనేక మందితో మాట్లాడాం. రాజకీయ కార్యకర్తలతో, లాయర్లతో, జర్నలిస్టులతో, మానవహక్కుల కార్యకర్తలతో, విద్యావేత్తలతో, బాధిత కుటుంబీకులతో, సైనిక బలగాల అత్యాచారాలకు ప్రత్యక్ష సాక్షులైన వాళ్ళతో, హిందూ శరణార్థులతో మాట్లాడాం. ఏ సామాన్యుల కోసమని ఇదంతా చేస్తున్నారో ఆ సామాన్యులతో మాట్లాడాం. మేం వెళ్ళినప్పుడే అమర్‌నాథ్ యాత్ర కూడా జరుగుతోంది కాబట్టి జమ్ము-కాశ్మీరులో బెదిరింపులను ఎదుర్కొనేటప్పుడు సైన్యము, పౌరపాలనా యంత్రాంగం ఎలా స్పందిస్తాయో ప్రత్యక్షంగా చూసే అవకాశం కూడా చిక్కింది.

ఈ నివేదికను భారతీయ భాషల్లోకి తర్జుమా చేసి విస్తృతంగా ప్రచారం చేయాలనుకున్నందు వల్ల గత ఐదు సంవత్సరాలుగా భారతీయ, పాశ్చాత్య మానవహక్కుల సంఘాలు ప్రచురించిన నివేదికల్లోని సమాచారాన్ని కూడా సంక్షిప్తంగా పొందుపరుస్తున్నాం. ఈ సమస్యకున్న రాజకీయ, చారిత్రక నేపథ్యాన్ని కూడా సంక్షిప్తంగా చర్చించాం. ఈ చరిత్ర వివాదరహితమైంది కాదని మాకు తెలుసు. అయినా ప్రజాస్వామిక హక్కుల దృక్పథం నుంచీ సాధ్యమైనంత సంతులిత దృశ్యాన్ని చిత్రించడానికే కృషి చేసాం. ఏ జనం సమస్యను ఎదుర్కొంటున్నారో ఆ జనం ప్రాథమిక హక్కుల కన్నా ఏదీ -- అది జాతీయ ప్రయోజనం కావచ్చు, లేదా రాజ్య భద్రత కావచ్చు, లేదా ఏరకమైన ప్రతిష్ఠ అయినా కావచ్చు -- ఉన్నతమైనది కాదు అంటుంది ఈ ప్రజాస్వామిక హక్కుల దృక్పథం. ఈ దృక్పథంలో సమస్యలు లేక పోలేదు. కానీ ఆ సమస్యలను ఎదుర్కోవాలి; వాటిని పరిష్కరించాలి.

# కొన్ని పద చిత్రాలు

*నేనేం చెప్పాలి నీకు.......... నువ్వేమి వింటావు*
*నిద్రిస్తున్న వాడా........మేలుకో......విను.*

చరారె షరీఫ్ సాధువు అయిన షేక్ నూరుద్దీన్, సంపన్నుడు, అజీర్తి రోగి, అయిన తన శిష్యుడు నస్రుద్దీన్‌కు తన బోధలు ఈ విధంగా మొదలు పెట్టాడు. ప్రభుత్వం అందించే తప్పుడు సమాచారం అనే అజీర్ణ రోగంతో తీసుకొంటోంది కనుక ఇప్పుడు మేము కూడ భారతీయ ప్రజకు ఇలాగే చెప్పాల్సి వుంది.

ముందుగా కొన్ని పదచిత్రాలు

జూలై 31న మా బృందం జమ్ములో అడుగు పెట్టింది. నగరంలో ఎక్కడ చూసినా సైనికులే. పారామిలిటరీ బలగాలే. మృత్యువును తలపించే వేషధారణ గల పంజాబు కమెండోలే.

నగరాన్నంతటినీ ఈ సైనిక బలగాలతో నింపేసారెందుకు? అమర్‌నాథ్ యాత్రికులు నగరాన్ని చేరుకుంటున్నారు. పాకిస్తాన్‌ను స్థావరంగా చేసుకొని పనిచేస్తున్న మతవాద మిలిటెంటు సంస్థ అయిన హర్కతుల్ అన్సార్ యాత్రను నిషేధిస్తున్నట్లు ప్రకటించింది. అది దాడులు చేస్తే వాటినుంచీ యాత్రీకుల్ని రక్షించడానికి నగరమంతా సైనిక బలగాలు. అమర్‌నాథ్‌కు పోయే భక్తుల యాత్రపై నిషేధం విధించడాన్ని వివేకం వున్న వారు ఎవ్వరూ సమర్థించరు. ఈ నిషేధంతో తమకు సంబంధం లేదని అన్ని కాశ్మీరీ సంస్థలూ ప్రకటించాయి. చిత్రమేమిటంటే యాత్రికుల్నీ రక్షించాల్సిన రాజ్య బాధ్యత ఎలా మలుపు తీసుకుందంటే దీన్ని భారతసైన్యం శక్తికీ, ప్రతిష్ఠకూ సంబంధించిన విషయంగా మలిచారు. కాశ్మీరు లోయలోని ప్రజలు హర్కతుల్ అన్సార్‌కు ప్రతినిధులయ్యారు. మరోమాటలో చెప్పాలంటే నిషేధం విధించింది హర్కతుల్ అయితే కాశ్మీరీలే ఆ నిషేదాన్ని విధించినట్లూ, దాన్ని ఎలాగైనా సరే ఎదుర్కోవాలి అన్నట్లూ సైన్యం ప్రవర్తించింది.

మున్ముందు ఈ నివేదికలో ఈ విషయంలో పాలకుల వైఖరి గురించి మరిన్ని వివరాలు కన్పిస్తాయి. అయితే మా బృందం మా పర్యటన ప్రారంభంలోనే ఈ వైఖరి పర్యవసానాలను రుచి చూడాల్సి వచ్చింది. ప్రతి యాత్రికుణ్ణీ అమర్‌నాథ్‌కు భద్రంగా చేర్చాలనే అత్యుత్సాహంతో అధికారులు బస్సుల నన్నిటినీ పహల్‌గావ్ వైపుకు తిప్పారు. అమర్‌నాథ్ యాత్రలో మోటారు వాహనాలు పహల్‌గావ్ వరకే పోతాయి. ఆ తర్వాత రోడ్డు సౌకర్యం వుండదు. జమ్ము నగరం జమ్మూ-కాశ్మీరు రాష్ట్రానికి చలికాలపు రాజధాని కాగా శ్రీనగరు అసలు రాజధాని. వర్షాల వల్ల రోడ్లపై ఏర్పడిన ఆటంకాలను తొలగించిన తర్వాతకూడా ఈ తాత్కాలిక రాజధాని నుంచీ అసలు రాజధానికి పోవాలంటే మహా కష్టమైపోయింది. జమ్ము నుండి శ్రీనగర్‌కు పోయేది కాశ్మీరు లోయవాసులే. వారిలో అత్యధికులు ముస్లీములే. అందువల్ల ఈ ప్రయాణీకులు ఎలా వెళతారు, అసలు వాళ్ళు

శ్రీనగర్ వెళ్ళగలరా లేదా అనే విషయం ప్రభుత్వాధికార్లకు ఏ మాత్రం పట్టినట్లులేదు. ఇప్పటికే కాశ్మీరీలు బలమయిన పరాయి భావనకు లోనయి ఉన్నారు. ప్రభుత్వాధికార్ల వైఖరి కాశ్మీరీల ఈ భావనను మరింత గట్టిపరుస్తుంది. కాశ్మీరీలలో ఈ భావన అధికారులకు ఆందోళన కలిగించాలి. కానీ అధికార వర్గానికి చీమకుట్టినట్లయినా లేదు. శ్రీనగర్‌కు పోవడానికి బస్సుదొరుకుతుందేమోనని జమ్మూ బస్టాండులో వున్న టూరిస్టు రిసెప్షన్ సెంటర్‌కు మేముపోయాం. శ్రీనగర్ వైపు వెళ్ళాల్సిన ప్రయాణీకులు పాతికమంది వరకూ వున్నారు. రాష్ట్ర రాజధానికి పోయే బస్సెప్పుడు వేస్తారా, ఎప్పుడు ఇళ్లకు చేరుకుంటామా అని ఎదురు చూపులు చూస్తూ కూర్చుని వున్నారు. బస్సు తర్వాత బస్సు వస్తోనే వుంది. పహల్‌గావ్ యాత్రికుల్ని తీసుకుపోయే వరుసలోకి వెళ్లి పోతూనేవుంది. అక్కడేమో భోలేనాథ్‌ను కీర్తిస్తూ భక్తుల నినాదాల హోరు. తుపాకులు ఊపుకుంటూ సైనికులు రవాణాధికారుల్తో కల్సి యాత్రికుల్ని బస్సులెక్కిస్తున్నారు. పది పదిహేను బస్సుల్ని ఒక్కసారే సైన్యం రక్షణలో పహల్‌గావ్ వైపు తీసుకు పోతున్నారు.

మా పదమూడు మంది బృందం కూడా కాశ్మీరు పోతున్నారని తెలిసే సరికి శ్రీనగర్‌కు పోవడాన్కి కూర్చున్న ప్రయాణీకుల్లో చలనం వచ్చింది. వాళ్ళ మొహాలు విప్పారాయి. నలభైమంది వుంటేకాని బస్సువేయము అని వాళ్ళకు అధికారులు చెప్పారట. వాళ్ళు 26 మంది. మేం పదముగ్గురం. బస్సుకావాలని కోరాం. సర్లే అని ఒక బస్సు కేటాయించారు. ఒక వైపు టిక్కెట్లు ఇస్తూనేవున్నారు. టిక్కట్లివ్వడం ఆపేయమని బుకింగ్ క్లర్కును రెండుసార్లు ఆటంకపరిచాడో రవాణా అధికారి --- ఈ బస్సును కూడా పహల్ గావ్‌కు పంపాల్సి వుంటుందేమోనంటూ. ఒక్క బస్సునైనా శ్రీనగర్‌కు విడవండి బాబూ అని బ్రతిమలాడితేగానీ సరే అన్పించుకోలేక పోయాం.

****

జమ్మూనుంచీ శ్రీనగర్‌కు పోయే తోవంతటా ప్రతీ యాభై గజాలకూ ఒక ఆర్మీ చెక్‌పోస్టో, పారామిలిటరీ బలగాల చెక్‌పోస్టో ఉంటుంది. మేమెక్కిన బస్సుకూడా మధ్యలో ఆపి ఎవరన్నా అడిగితే పహల్‌గావ్‌కు పోయే బస్సేనని చెప్పమని మాతోటి ప్రయాణికులు మాతో చెప్పారు. ఎందుకంటే శ్రీనగర్ పోయే బస్సు అంటే చాలు బస్సును ఆపేసి తీరిగ్గా సోదా చేస్తుంటారట! పహల్ గావ్‌కు బలవంతంగా పంపించేసినా పంపించేస్తారట. ఆ తర్వాత గంటల తరబడి బస్సులను ఆపివేయడం మేం చూసాం. ఎందుకు ఆపారంటే ఆపినవాళ్ళ నుంచీ ఒక్కటే సమాధానం – బస్సును సోదాచేయాలి. పోనీ ఆసోదా అయినా పూర్తిగా చేస్తారా అంటే అదీ లేదు. ఒకసారి కూడా మా లగేజీ తెరువలేదు. తీరిగ్గా..... అవమానించేరీతిలో సోదా చేస్తుంటారు. దాచిన ఆయుధాల కోసం అనిగాక కేవలం ప్రయాణీకుల్ని అవమానించేఉద్దేశంతోనే సోదా జరుపుతారు.

మధ్యాహ్నానికల్లా మా బస్సు రాంబన్ చేరుకుంది. ఇది చీనాబ్ నది ఒడ్డున ఉంటుంది. అక్కడ సైన్యం మా బస్సును ఆపేసింది. అమర్‌నాథ్ వెళ్ళాల్సిన బస్సులన్నీ వెళ్ళి పోయాయనీ ఇక ఆ రోజు మేం అక్కడే గడిపి మర్నాడు పహల్‌గావ్‌కు పోవచ్చుని చెప్పారు. సైన్యం ఎస్కార్టు లేకుండా అమర్‌నాథ్ యాత్రికుల్ని అనుమతించరట! ఇక అప్పుడు చెప్పాం... మా బస్సు శ్రీ నగర్ పోతున్నదనీ, ఎస్కార్టు అవసరంలేదనీ.

మా తోటి ప్రయాణికుడు -- ఒక కాశ్మీరీ ముస్లిం-- చాలా మాములు స్వరంలో మాతో అన్నాడు. "మా ప్రాణాల కన్నా మీ ప్రాణాలు విలువైనవి కాబట్టి సైన్యానికి మీరే నచ్చజెప్పండి". ఆయన ఉద్దేశం ఏమంటే -- కాశ్మీరీయేతరులమైన మా బృందం సభ్యులు బస్సులో ఉండడం వల్ల బస్సుకు ఎస్కార్టు అవసరం అని సైన్యం భావించినట్లుంది; ఒక వేళ బస్సులో కాశ్మీరీ ముస్లిములే ఉన్నట్లయితే ఎస్కార్టు ఇవ్వాల్సిన అవసరముందని అసలు సైన్యం ఆలోచించి ఉండేది కాదు అని. ఎందుకంటే శ్రీనగర్ వైపు పోయే బస్సు శ్రీనగర్‌కు 60 కి.మీలు ఇవతలివరకు పహాల్గాం బస్సు పోయే రూట్లోనే పోతుంది. బస్సులో పోతున్న వాళ్ళు అమర్‌నాధ్ యాత్రికులని మిలిటెంట్లు అనుమానించి ఏగ్రెనేడో విసిరినా విసురుతారు. అందుకే మా ప్రాణాలు విలువైనవని చెప్పమన్నాడు. ఆయన మాట్లాండింది నాలుగు మాటలే కావచ్చుగానీ కాశ్మీరీలు తామెంతగా పరాయి వ్యక్తులనే నిరాదరణకు, అవమానానికి గురవుతున్నారో మాకు అర్థమైంది.

అక్కడే మా బస్సు ఆగీ ఆగగానే మా బస్సుకూడా అమర్‌వాథ్ యాత్రీకులదేనా అని అడగడానికి ఒక సీ ఆర్పీ అధికారి జీపులో వచ్చాడు. ఇది అమర్‌నాథ్ బస్సు కాదు అని చెప్పడానికి మాలో ఒక ప్రయాణీకుడు నచ్చజెప్పే ప్రయత్నం చేసాడు. మా బృందంలోని సభ్యుల వైపు చూపిస్తూ "వీళ్ళు అమర్‌నాథ్ పోవడం లేదు. ఇక ... బస్సులో ఉన్న తక్కిన వాళ్ళమంతానేమో కాశ్మీరీలం" అన్నాడు. ఆయన చెప్పదల్చుకుంది స్పష్టమే. టూరిస్టులుగా కన్పిస్తున్నవాళ్ళు అమర్‌నాథ్ పోవడం లేదు; తక్కిన వాళ్ళు టూరిస్టులు కాదు అని. ఇలా అమాయకంగా నచ్చజెప్పబోవడం సీ ఆర్పీ అధికారికి కోపం తెప్పించినట్లుంది. "మీరు ఇండియన్స్‌మని చెప్పండి. ప్రతి ఒక్కరూ ఇండియనే, పంజాబీలూ, కాశ్మీరీలూ అంటూ ఎవ్వరూ లేరు." అన్నాడు. ఈ అసందర్భపు ప్రేలాపనతో మాతోటి ప్రయాణికుడు అవాక్కయి పోయాడు.

****

మా బృందంలోని నల్గురు సభ్యులు ఆగస్టు 5న బారాముల్లాలో పర్యటించారు. ఇదో జిల్లా కేంద్రం. యూరి సరిహద్దు వైపునుంటుంది. అక్కడ జిల్లా సెషన్సు కోర్టుకు పోయాం. కోర్టు బిల్డింగు ముందు ఆవరణలో నాలుగు సైనిక ట్రక్కులు అడ్డంగా పెట్టిఉన్నాయి. నాలుగు ట్రక్కుల్లోను సైనికులు భారీ ఆయుధాలు పట్టుకుని ఉన్నారు. ప్రతీ ట్రక్కు మీద ఒక లైట్ మెషీన్ గన్ను, ఎత్తుగా పెట్టివుంచారు. ఎవరైనా కోర్టు హాలులోకి వెళ్లాలంటే ట్రక్కుల సందుల్లోంచి జాగ్రత్తగా ముడుచుకుపోయి నడవాలి.

ఆ రోజు కోర్టులో సమ్మె నడుస్తోంది. లాయర్లూ, గుమస్తాలు, చివరికి న్యాయాధికారులు కూడా సమ్మె చేస్తున్నారు. కారణమేమిటని మేం వాకబు చేసాం. అప్పటికి రెండురోజులు క్రితం జరిగిన ఒక ఘటన గురించి చెప్పారు. వాళ్ళు చెప్పింది నిజమా కాదా అని ధృవీకరించుకోవాలంటే నేరుగావెళ్ళి జిల్లా సెషన్సు జడ్జి అబ్దుల్ రహమాన్ భట్‌ను ఆయన ఛాంబర్‌లో కల్సుకోమని కూడా చెప్పారు. భట్ చాలా హుందాగా ఉన్న పెద్దమనిషి. ఏం జరిగిందో మాకు చెబుతున్నప్పుడు ఆయన కళ్ళు అవమానంతో ఎర్రగా దహించుకు పోతున్నాయి. కళ్ళల్లో నీరు ఉబుకుతోంది. రెండ్రోజుల క్రితం సైన్యం తనను ఎలా అవమానించిందీ చెప్పాడు. ఆరోజు...... ఆయన బారాముల్లాకు

అరవైకిలో మీటర్ల దూరానవున్న శ్రీనగర్‌కు పోవడానికి సబ్ జడ్జి అబ్దుల్ వాహిద్‌తో కలిసి తన అధికార కారులో ప్రయాణిస్తున్నాడు. బారాముల్లాను దాటగానే ఆర్మీ పికెట్ కారును ఆపేసింది. స్థానిక పోలీసు రహస్య సమాచారం ప్రకారం ఆనెంబరు కారును శ్రీనగర్‌లో మిలిటెంట్లు వాడుతున్నట్లుగా ఆయనకు చెప్పారు. కార్లోంచీ కిందకు దింపేసి కారు తాళం చెవుల గుత్తి గుంజుకున్నారు. తాను బారాముల్లా జిల్లా జడ్జిననీ, ఆకారు తన అధికార వాహనం అనీ, వాళ్ళకొచ్చిన సమాచారం తప్పుసమాచారం అయివుండొచ్చనీ భట్ వాళ్ళకు చెప్పాడు. కానీ జడ్జీ ఇచ్చిన వివరణా, తెలిపిన నిరసనా వృధాప్రయాసే అయ్యాయి. రెండున్నర గంటల పాటు ఆయన్ని అక్కడే..... ఆరోడ్డు ప్రక్కనే నిల బెట్టేసి వుంచారు. అప్పుడు ఓ ఇంటెలిజెన్సు పోలీసు అధికారి తీరిగ్గా అక్కడికి వచ్చి సైనికులు పట్టుకున్నది అసలు కారు కాదు అనీ తప్పుకారు అనీ చెప్పాడు. తాను చెప్పింది ఈ నంబరు కాదని ఆయన సైనికులకు చెప్పాడు. సైనికులు ఒక్కక్షణం అలా చూపు విసిరి..... పో.....కారు తీసుకపో అని తాళం చెవులు మొహాన కొట్టారు. అంతసేపు ఆయన్ని అలా నిలబెట్టి ఉంచినందుకు కనీసం సారీ కూడా చెప్పలేదు. అబ్దుల్ రహ్మాన్ భట్ అడిగే ప్రశ్నేమంటే.......అదే ప్రశ్న బారాముల్లా బార్ అసోసియేషన్ అడుగుతున్నదీ...... మేం కూడా అడుగుతున్నదీనూ..... ఏ జిల్లా జడ్జి కారైనా చట్ట విరుద్ధ పనులకోసం ఉపయోగిస్తున్నారనే సమాచారం ఉన్నప్పటికీ ఏరాష్ట్రంలో నైనా, ఏ జిల్లా జడ్జీతోనైనా పోలీసులు గానీ, సైన్యంగానీ ఇలాగే వ్యవహరిస్తారా?

****

అదే రోజున మా బృందంలో ముగ్గురు సభ్యులు మరోజిల్లా కేంద్రమైన అనంత్‌నాగ్‌లో ఉన్నారు. అంతకు ముందు రోజు జరిగిన ఓ ఘటన గురించి మాకు చెప్పారు. ఒక ఆటోరిక్షాలో ప్రయాణిస్తూ కొందరు సాయుధ మిలిటెంట్లు అనంతనాగ్ పట్టణం లాల్‌చౌక్ ఏరియాలో గల ఒక సరిహద్దు భద్రతా దళానికి చెందిన బంకర్‌వైపు తుపాకీ గురిపెట్టారు. వాళ్ళను ఛాలెంజి చేయడానికి బి.ఎస్.ఎఫ్ జవాన్లెవరూ బంకర్‌లోంచి బయటికి రాలేదు. కొద్దిసేపటి తర్వాత జవాన్లు బయటికొచ్చారు. ఆటోరిక్షావాళ్ళందర్నీ చుట్టేసి ఇష్టం వచ్చినట్లు బాదారు. ఆ ఘటనను చూసిన దుకాణదార్లను కూడా బాదారు.

అనంతనాగ్ నుంచీ నగర్‌కు మేం వెళ్ళినప్పుడు ఊరవతల మా టాక్సీని ఆపేశారు. మిలిటెంట్లమీద సైనిక చర్య జరుగుతోందనీ, మేం ముందుకు పోవడానికి వీల్లేదనీ చెప్పారు. మా టాక్సీని వెనక్కు తిప్పేటప్పుడు అంత గొప్పగా జరుగుతోన్న ఆ సైనిక చర్య ఏమిటా అని మేం చూసాం. మా వాహనానికి ముందు కొంతమంది సైనికులు రోడ్డు ప్రక్కనున్న ఇంటి మొదటి అంతస్తు కిటికీ వైపు తుపాకులు ఎక్కుపెట్టి ఉంచారు. అది వెన్నుజలదరించే దృశ్యం. లోపల ఏ ప్రాణి అయినా కదిలితే బుల్లెట్లు వదలడానికి సిద్ధంగా వున్నారు వాళ్ళు. వాళ్ళ బుల్లెట్లు ఎవరికి తగులుతాయో వాళ్ళకెలా తెలవడం?

*****

అదేరోజు పొద్దున్న నగర్ నడిబొడ్డున వున్న హరిసింగ్ హైస్ట్రీట్‌లో సైనికుల చేతుల్లో బాధితులైన వారి బంధువులను మా బృందంలోని ముగ్గురు ఇంటర్వ్యూ చేయాల్సి వుంది. మేం మాట్లాడాల్సిన వాళ్ళ ఇళ్ళకు వెళ్ళాం. ఆ ఇళ్ళ వెనక సందునుంచీ తుపాకీ మోతలు, ప్రేలుడు శబ్దాలూ వినబడుతున్నాయ్. ఆ ఇళ్ళనన్నిటినీ బి.ఎస్.ఎఫ్ జవాన్లు చుట్టుముట్టారు. మగవాళ్ళ నందర్నీ ఇళ్ళల్లోంచి బయటికి రమ్మని హుకుం జారీచేసారు. ఒక్కో ఇంటినీ సోదా చేయడం మొదలెట్టారు. మర్నాడు పేపర్లో చూసాం -- నగరంలో మైసుమా, కోకర్ బజార్, గౌకడల్ ప్రాంతాల్లో కిందటి రోజు సోదా జరిగిందని మేం మాట్లాడిన జనం మా సందులో ఏమీ కాదులెమ్మని హామీ ఇచ్చారు. సైనికులు తమ వారిపైన చేసిన అత్యాచారాలను నిబ్బరంగా చెప్పసాగారు. వాళ్ళ వీపుల వెనుక సందుల్లో సోదా కార్యక్రమం జరుగుతూ వుండగానే వాళ్ళు మాకు చెప్పాల్సింది చెప్పారు.

మా ప్రక్కనే తుపాకీ మోతలు, గడబిడా జరుగుతుండగానే సైనికులు చేసిన ఆరు హత్యకేసుల వివరాలను మేం విన్నాం, రికార్డు చేసాం. కాల్పులు ఆపేసి బి.ఎస్.ఎఫ్ జవాన్లు అక్కడ్నుంచీ వెళ్ళిపోతూ వుండగా వాళ్ళ వాహనం మీద ఎక్కడో దాక్కున్న మిలిటెంట్లు గ్రెనేడ్లు విసిరారు. వెంటనే జవాన్లు కాల్పులు మొదలెట్టారు. అయితే ఏ వైపునుంచీ గ్రెనేడు వచ్చి పడిందో ఆ వైపుకు కాదు .... దానికి పూర్తి వ్యతిరేక దిశలో. కొంత మంది పౌరులు గాయపడ్డా అదృష్టవశాత్తు ఎవరూ మరణించలేదు. బి.ఎస్.ఎఫ్ జవాన్లు ఎంతో ఓరిమి ప్రదర్శించారనీ, వాళ్ళ దాడిని తిప్పికొట్టలేదనీ పత్రికలకు చెప్పినట్లుగా మర్నాడు "కాశ్మీర్ టైమ్స్" పత్రిక ప్రకటించడంతో మా ఆశ్చర్యానికి అంతులేకుండా పోయింది.

****

# కాశ్మీరు - కాశ్మీరియత్

*పవిత్ర దినాల్లో ఎవరు ఉపవాసముంటారో*
*ప్రార్థనలప్పుడు సత్యసంధతతో ఎవరు ప్రణమిల్లుతారో*
*క్రోధ, లోభ, మద, మాత్సర్యాలను ఎవరు*
*పరిత్యజిస్తారో*
*అతడే...అతడే యధార్ధంగా ముసల్మాన్*
*అనిపించుకుంటాడు*

*ఒకే తల్లికి పుట్టిన సోదరుల మధ్య*
*నువ్వెందుకు కల్పించావు అడ్డంకుల్ని*
*హిందువులూ, ముస్లిములూ ఒక్కరే*
*భగవానుడు తన సేవకుల్ని ఎప్పుడు దయగా*
*చూస్తాడో?*

-------- *షేక్ నూరుద్దీన్*

ఇప్పుడు కాశ్మీరులో సాగుతోన్న సాయుధ మిలిటెన్సీకి, 1989 ప్రాంతాల్లో పునాది పడింది. ప్రాంతీయ, మత, సాంస్కృతిక గుర్తింపుకు సంబంధించిన సమస్యలపై ప్రజలు ఆందోళన చేయడం కాశ్మీరుకు కొత్తకాదు. పద్ధతి ప్రకారం ఆయుధాలను ప్రయోగించడమే కొత్త . అసలు 1989 వరకూ కాశ్మీరీలంటే పిరికి వాళ్ళుగా, మెతక వాళ్ళుగా పేరు పడ్డారు. బాంబులు విసరడం, కాల్పులు జరపడం లాంటి ఘటనలు కొన్ని 1988 లో జరిగాయి. సరిహద్దుకు ఆవల పాకిస్తానీ కాశ్మీరులో శిక్షణ పొందిన మొదటి జట్టు ఆ సంవత్సరమే కాశ్మీరు లోయకు చేరుకుందని అంటారు. అయితే 1989 ఆగస్టు 21న నేషనల్ కాన్ఫరెన్సు నాయకుడైన మొహమ్మద్ యూసుఫ్ హల్వాయి హత్య, సెప్టెంబరు 14న బి.జె.పి. నేత తికాలాల్ తిపూ హత్య, నవంబర్ 4న మాజీ జిల్లా జడ్జి నీలకాంత్ గంజూల హత్యలు కాశ్మీరులోయలో సాయుధ మిలిటెన్సీ ప్రవేశించిందనడానికి సూచన.

కానీ అసలు సమస్య 1947లో జమ్మూ-కాశ్మీరు సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయడంతో మొదలైనట్లుగా అనుకోవాలి. భారతదేశంలో జమ్మూ-కాశ్మీరు విలీనం కావడానికి దారి తీసిన పరిస్థితులు, విలీన షరతులు, భవిష్యత్తులో ప్రజామోదం ఉంటుందనే ఊహతో రూపొందించిన షరతులతో కూడిన విలీనం స్వభావం, కాశ్మీరుకు స్వయం ప్రతిపత్తినిస్తూ భారత రాజ్యాంగంలో 370వ అధికరణాన్ని చేర్చడం, కాశ్మీరు సమస్యను ఐక్యరాజ్యసమితికి నివేదించడం, ప్రజాభిప్రాయ సేకరణ (ప్లబిసైటు)కు సంబంధించి ఐక్యరాజ్య సమితి చేసిన పలు తీర్మానాలు, వీటన్నిటి తర్వాత జరిగిన పరిణామాలూ ప్రస్తుతం అక్కడ నెలకొన్న పరిస్థితికి రాజకీయ నేపథ్యంగా పరిగణించాలి.

ముమ్ముందు అధ్యాయాల్లో మనం ఈ నేపథ్యాన్ని చూస్తాం. కానీ కాశ్మీరులోయ ప్రజలకు సంబంధించినంతవరకూ ఈ కథ మరో నాలుగు వందల ఏళ్ళ వెనకటిది అని మనం గుర్తించాలి.

***# 6 కాశ్మీరులో ఏం జరుగుతూవుంది?***

పాత జమ్ము-కాశ్మీరు సంస్థానంలో కాశ్మీరులోయ బాగా జన సాంద్రత కలిగిన ప్రాంతం. ఇది మంచి సారవంతమైన భూమి. సాంస్కృతికంగా, వేషభాషలూ ఆహారపుటలవాట్ల పరంగా, ఏక జాతీయత కలిగిన ప్రాంతం. మతపరంగా చూస్తే 90 శాతానికి మించి ముస్లిములు. అరవై ఏళ్ళకు పైగా జమ్ము-కాశ్మీరులో ఇది రాజకీయంగా చురుకైన ప్రాంతం. రాజకీయ వాణిని నిరంతరం విన్పించిన ప్రాంతం. అదే ఇప్పుడు స్వయం నిర్ణయాధికారం కోసం జరుగుతున్న పోరాట రంగస్థలం. ఇదో క్లిష్ట పోరాటం. అందులో అనేక కోణాలున్నాయి. కానీ వీటన్నిటిలోకీ కీలకమైంది చారిత్రక-సాంస్కృతిక గుర్తింపు (ఐడెంటిటీ) దీన్నే కాశ్మీరీయత్ అని అభివర్ణిస్తారు. ఈ కాశ్మీరీ గుర్తింపు రూపురేఖల్ని అర్థం చేసుకోకుండా కాశ్మీరు సమస్యను అర్థం చేసుకోవడం సాధ్యంకాదు. ఈ గుర్తింపులో ఇస్లాం ప్రధాన బాగమే ఐనప్పటికీ ఇది స్థానిక ముస్లిం ఋషులు ప్రవచించిన ప్రత్యేకమైన కాశ్మీరీ ఇస్లాం. అలాంటి ఋషుల్లో అత్యంత ప్రసిద్ధుడు షేక్ నూరుద్దీన్. చరారె షరీఫ్‌లో 1995 మే 10 రాత్రి భారత సైనిక బలగాల బాధ్యతారాహిత్యం వల్ల ధ్వంసం అయింది ఈయన స్మారక మందిరమే.

సాయుధ మిలిటెన్సీ తొలిదశలో బాగా అమలు పర్చింది జమ్ము-కాశ్మీర్ లిబరేషన్ ఫ్రంటు. దీన్నే పొడి అక్షరాల్లో జె.కె. ఎల్.ఎఫ్. అంటారు. కాశ్మీరీయత్ తన ప్రాపంచిక దృక్పథానికి ప్రాతిపదిక అని స్పష్టంగా చెప్పుకుంటుంది ఈ సంస్థ. ఇవ్వాళ జె.కె.ఎల్.ఎఫ్ ఒక అణచివేయబడిన శక్తి. ప్రధాన మిలిటెంటు శక్తిగా ఉన్న దాని స్థానాన్ని హిజబుల్ ముజాహిదీన్ (హెచ్. ఎం.) భర్తీ చేసింది. సనాతన ఇస్లామిక్ దృక్పథమే దీని ప్రాపంచక దృక్పథం. కానీ కాశ్మీరీ సామాన్య ప్రభానీకం మాత్రం రెండు జాతుల సిద్ధాంతం, లేదా ఇస్లామిక్ భావజాలం కంటే కాశ్మీరీ గుర్తింపు పిలుపుక ఎక్కువగా స్పందిస్తారని అందరూ నమ్ముతారు. యథేచ్ఛగా వాడే తుపాకుల మోతల మధ్య ఇది నిజమా కాదా అని కనుక్కోవడం అంత తేలికేమీ కాదు. అయితే నిర్దిష్ట కాశ్మీరీ తాదాత్మ్యం కాశ్మీరీ ప్రజలను హృదయపులోతుల్లోంచీ తట్టి లేపుతుందనేదీ, వాళ్ళ స్వాతంత్ర్య కాంక్షకు ఆయువు పట్టు అనేదీ మాత్రం నిర్వివాదాంశం. ప్రస్తుత సంక్షోభాన్ని గురించి సాధారణ కాశ్మీరీలతో మామూలుగా సంభాషించేప్పుడు కూడా ఇది కొట్టొచ్చినట్లు కన్పిస్తుంది. కాశ్మీరీ లోయ ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్న నాయకుడు షేక్ అబ్దుల్లా చనిపోయేంతవరకూ ఈ కాశ్మీరీ జాతీయతను బలంగా నమ్మిన వ్యక్తి, జాతి ప్రయోజనాలనూ, ఆర్థిక ప్రయోజనాలనూ పక్కకు పెట్టేసే కేవలం హిందూ ముస్లిం విభజన భావనను గట్టిగా వ్యతిరేకించిన వ్యక్తి ఆయన.

అలాంటి కాశ్మీరీ జాతీయవాదుల దృష్టిలో కాశ్మీరును లోబర్చుకోవడం ప్రారంభమయ్యింది, పరిస్థితుల ఒత్తిడి వల్ల చివరి డోగ్రా పాలకుడు భారత దేశంలో విలీనం చేసిన 1947 లో కాదు. జమ్మూ డోగ్రాపాలకుడు గులాబ్ సింగ్ బ్రిటీష్ వాళ్ళనుంచీ కాశ్మీరును సంపాదించుకున్నది 1846 లోనూ కాదు. అక్బర్ చక్రవర్తి తన సామ్రాజ్యాన్ని కాశ్మీరు లోయ వరకూ విస్తరించి కాశ్మీరును కబళించిన 1586 లోనే నని వాళ్లు భావిస్తారు. కాశ్మీరీ ముస్లిములు మతోన్మాద వైఖరి కలిగిన వాళ్ళని భారత పాలకులు చెబుతూ ఉన్నారు. ఉపఖండంలో హిందూ మతోన్మాదులూ, ముస్లిం మతోన్మాదులూ చరిత్ర విభజనను పాలకుల మతాలకు అనుగుణంగా చేస్తుంటారు. కానీ అందుకు భిన్నంగా

కాశ్మీరీ జాతీయవాదం కాశ్మీరు చరిత్రను కాశ్మీరీయుగమనీ, విదేశీ యుగమనీ విభజిస్తుంది. కాశ్మీరులో ఈ విదేశీయుగమనేది అక్బర్ చక్రవర్తితో మొదలైంది. దాన్ని అఫ్ఘాన్, శిక్కు, డోగ్రా పాలకులు అదే వరుసలో కొనసాగించారు. అక్కణ్ణుంచి భారత లౌకిక ప్రభుత్వం ద్వారాకూడా ఈ విదేశీయుగం కొనసాగుతూందని వాళ్ళు భావిస్తారు.

కాశ్మీరీల్లో 90 శాతానికి మించి ముస్లిములే కావడంతో వాళ్ళ జాతీయవాదానికి ఆయువుపట్టు అయిన కాశ్మీరీ సంస్కృతీ, తాదాత్మ్యతలు ప్రధానంగా కాశ్మీరీ ఇస్లాంపై ఆధారపడతాయి. స్థానిక సూఫీ పరంపర అయిన సిల్‌సిలా-ఎ-రిషియా ప్రవచించినదే ఈ ఇస్లాం. ఈ ఋషుల మూల పురుషుడు షేక్ నూరుద్దీన్. ఆయన్నే నూరుద్దీన్ ఋషి అని లేక నంద్ ఋషి అని కూడా అంటారు. ఆయన జీవించిన కాలం 1379 - 1442. అంతకొద్ది జనాభాగా వున్న హిందువులు కూడా ఆయన్ని గొప్ప సాధువుగా పరిగణిస్తారు.

కాశ్మీరులోయలోకి ఇస్లాం వ్యాప్తి చెందడం ముస్లిం రాజ్యాలను నెలకొల్పడం ద్వారా పైనుంచీ జరగలేదనీ కిందనుంచీ అంటే సూఫీ సాధువుల ద్వారా, బోధకుల ద్వారా, ఋషుల ద్వారా వ్యాప్తి చెందిందనేది చరిత్రకారుల సామాన్య అభిప్రాయం. ప్రేమాదరణలకు ఇస్లాం ఆదర్శప్రాయమైనట్టిది అని వీళ్ళు బోధించారు. జనం వీళ్ళకు అద్భుత శక్తులను ఆపాదించారు. సూఫీలు భక్తి, మార్మిక వాదాల పైన ఆధారపడి మానవత్వం, సహనశీలత అనే సాంఘిక విలువలను ప్రబోధిస్తూ ముస్లింపాలకుల కన్నా లేదా వాళ్ళ పోషకత్వంలో సాగిన దానికన్నా ఎక్కువగా ఈ ఉప ఖండంలో ఇస్లామును వ్యాప్తి చేసారు. అయితే ఏ ఇతర ప్రాంతంలో కన్నా కూడా కాశ్మీరులో ఇస్లాం వ్యాప్తి ఈ పద్ధతిలో ఎక్కువగా జరిగినట్లు అన్పిస్తుంది.

చాలా తొలి రోజుల్లోనే ఇస్లాం కాశ్మీరుకు పరిచయమైనప్పటికీ 14 వ శతాబ్దంలో సుహార్‌లార్ది, కుబ్రనీ సంప్రదాయాలకు చెందిన సూఫీల తోనే కాశ్మీర్ లోయలో విశాల ప్రాంతం ఇస్లాం ప్రభావంలోకి రావడం మొదలైంది. పర్షియానుంచీ, మధ్య ఆసియా నుంచీ వచ్చిన ఈ సూఫీలు ఖన్‌ఖాలను నెలకొల్పారు. ఇవే ఇప్పటికీ మతపరమైన భక్తికి ముఖ్య కేంద్రాలు. కాశ్మీరు విశ్వవిద్యాలయంలో చరిత్ర బోధించే ప్రొఫెసర్ మొహమ్మద్ ఇషాక్ ఖాన్ అభిప్రాయం ఏమంటే స్థానిక కాశ్మీరీ ముస్లిం ఋషులు ఇస్లాంను ప్రచారం చేయడం, ఆచరించడం మొదలెట్టిన తర్వాతే ఇస్లాం బాగా ప్రజల్లోకి చొచ్చుకు పోయింది. సుదీర్ఘకాలంపాటు నిరంతరం ప్రజలతో సంబంధం పెట్టుకుని క్రమంగా బోధించిన ఫలితంగానే లోయలో ఎక్కువ భాగం ముస్లిం మతం స్వీకరించారు గానీ గుంపు గుంపులుగా మతమార్పిడి చేసుకునే పద్ధతి ద్వారా కాదని కూడా ఆయన అభిప్రాయం ("ఇస్లాంలోకి కాశ్మీర్ పరివర్తన" ఆయన రాసిన పుస్తకం)

అది హైందవం కావచ్చు, బౌద్ధం కావచ్చు. ఈ సంప్రదాయాలన్నిటా ఈఉపఖండం లోని మత చరిత్రలో సాధు సమూహాలు లేదా విడి విడి సాధువులు మత ప్రచారంలో ముఖ్యపాత్రే నిర్వహించారు. సుఖభోగాలనూ, ధన కాంక్షనూ, లాలసనూ పరిత్యజించడం ఈ సాధువులందరిలోనూ సాధారణంగా కన్పించే లక్షణం. వీళ్ళు బ్రహ్మచర్యం పాటించారు. కాయో, పండో ఏది దొరికితే అదే తిన్నారుకానీ

మృష్టాన్న భోజనానికి వెంపరలాడలేదు. పైగా శరీరాల్ని శుష్కింప చేసుకున్నారు. వాళ్ళు ఏ మతాన్నైతే ప్రచారం చేసారో దానికి పూర్తిగా అంకితమైపోయారు. కాశ్మీరులో హైందవశైవాచార్యులూ, మహాయాన బౌద్ధ శ్రమణకులూ పెద్ద సంఖ్యలోనే ఉండినట్లు కన్పిస్తుంది. ఈ సంప్రదాయాన్నే ముస్లిం ఋషులు కూడా ఖురాన్ భావాల చట్రంలో కొనసాగించారు. తర్వాత సనాతన ముస్లిములు వీరు పాటించిన బ్రహ్మచర్యాన్నీ, శాకాహార భోజనాన్ని సమర్థించుకోవడానికి బాగానే కష్టపడ్డారు. ఎందుకంటే ఈ ఆచారాలు ఇస్లాంకు విరుద్ధమైనవని పరిగణించబడతాయి. ఏదేమైనా ఇలాంటి ఛాందసులు కాని ముస్లిం సాధువుల వల్లే కాశ్మీరులోయలో ఇస్లాం వ్యాప్తి చెందింది. వాళ్ళు తమను తాము ఋషులమని పిల్చుకున్నప్పటికీ, వారినీతి బోధనలు "ఋషినామా"(ఋషి పత్రం)లుగా నమోదయినప్పటికీ తమ సామాజిక పాత్రలో బహుశా వాళ్ళు హిందూ తాపసుల కన్నా బౌద్ధ భిక్షువులకే దగ్గరగా ఉన్నట్లు అన్పిస్తుంది. ఎందుకంటే వాళ్ళు మార్మిక ఆత్మ జ్ఞానాన్ని సామాజిక వ్యవహారాలతోనూ, సత్యప్రచారంతోనూ జోడించారు. అక్బర్ కాలంలో కాశ్మీరాని కొచ్చిన అబుల్ ఫజల్ అప్పటికే లోయలో వున్న రెండువేల మంది ఋషులను చూసాడు. అయిన్-ఎ-అక్బరీ లో వాళ్ళ గురించి "ఈ దేశంలో జనం బాగా గౌరవించే వర్గం ఈ ఋషులే. సంప్రదాయం, ఆచారాల బంధనాల నుంచీ వాళ్ళు స్వేచ్ఛగా వున్నప్పటికీ వాళ్ళే నిజమైన దైవ భక్తులు. వేరే మతానికి చెందిన వాళ్ళను వీళ్ళు తూలనాడరు. వీళ్ళు దేన్నీ యాచించరు. దేన్ని దేబిరించరు. వీళ్ళు మొక్కలు నాటుతారు. సాధారణంగా ప్రజలకు మేలు చేసే వారిగా వుంటారు" అని రాసాడు.

పైన చెప్పినట్లు ఇలా మరింత మానవోచిత స్థాయిలో మతాన్ని జనానికి చేరువుగా తీసుకుపోయే సాధువుల ఉనికి -- అది హైందవం కావచ్చు లేదా ముస్లిం సంప్రదాయం కావచ్చు -- కాశ్మీరానికొక్క దానికే ప్రత్యేకం కాదు. ఈ సాధువులు ప్రచారం చేసిన మతం పురోహితుల సనాతనత్వాన్ని తీవ్రంగా విమర్శించింది. షేక్ నూరుద్దీన్ ఉలేమాలను విమర్శిస్తే, అతని పూర్వీకురాలు శైవ మార్మిక వాది లల్లా మాజీ -- లల్లా మాత లేక లల్లాదేవి -- బ్రాహ్మణులను విమర్శించింది. తక్కిన ఉపఖండం అంతటా ఈ విమర్శనాత్మక మానవోచిత సంప్రదాయం, పురోహితుల ప్రధాన సంప్రదాయంలో అంతఃప్రవాహంలా వుండగా (లేదా పురోహిత సంప్రదాయమే దీన్ని స్వంతం చేసుకోగా), కాశ్మీరులో మార్మిక వాదుల ఇస్లామే సమాజంలో ప్రధాన మత సంప్రదాయం అయింది. ఆ రకంగా మైనారిటీ హైందవ మత సంప్రదాయాన్నికూడా ప్రభావితం చేసింది. కాశ్మీరు విశ్వవిద్యాలయంలో ఇంగ్లీషు బోధించే ప్రొఫెసర్ జి.ఆర్. మాలిక్ చెప్పినట్లు" కాశ్మీరు జీవితాన్ని, సంస్కృతినీ గొప్పగా ప్రభావితం చేసిన విశిష్ట చారిత్రక వ్యక్తుల్లో షేక్ నూరుద్దీన్ ఒకరు. వారే నంద్ ఋషిగా కూడా సుప్రసిద్ధులు. వారి పేరు తెలియని ఇల్లేలేదు. వారు పొందినంతటి ప్రజాదరణను కాశ్మీరులో మరొకరెవ్వరూ పొందలేదని చెప్పడం అతిశయోక్తికాదు. కాశ్మీరం లోని ప్రతి మట్టి రేణువు మీదా వారి పేరు లిఖించివుంది. కాశ్మీరీలకు వారు ఆలమ్-ఎ-కాశ్మీర్ అంటే కాశ్మీరు పథ నిర్దేశకులు".

భారత సైనిక బలగాలు బాధ్యతా రహితంగా దహనం చేసివేసిన చరారె షరీఫ్

లోని స్మారక మందిరం ఈ పూజ్య కాశ్మీర్ పథనిర్దేశకుడిదేననే వాస్తవాన్ని భారతీయులు తెలుసుకోవాలి. ఈ ఋషికి జనంలో ఎంత పేరుందంటే 18వ శతాబ్దారంభంలో కాశ్మీరు అఫ్ఘను పాలన కింద ఉన్నప్పుడు కాశ్మీరు గవర్నరు కాబూల్‌కు విధేయత ప్రకటించననీ, తాను స్వతంత్రుడననీ ప్రకటించుకుని ప్రజల మద్దతు పొందడానికి నంద్ ఋషి బొమ్మతో నాణాలు ముద్రించాడు.

ఈ పరంపరకు చెందిన సాధువుల్లో స్త్రీలు (సాధ్వీలు) కూడా వుండేవారు. ఇది సనాతన ముస్లిం విశ్వాసానికి విరుద్ధమైనటిది. బెహత్ బీబీ, దెహత్ బీబీ, దేతాబీబీ, సాలా బీబీ, శ్యాందేడ్ లాంటి సాధ్వీలు నూరుద్దీన్ శిష్యురాళ్ళు. ఈ పరంపరకే చెందివ ఇతర సాధ్వీలు సంగా బీబీ, గంగా బీబీలు.

రాజకీయ, ఆర్థిక పరిస్థితుల నుంచీ, క్రమాల నుంచీ మత సంప్రదాయాలు స్వతంత్ర ఉనికి లో వుండవు. అందువల్ల కాశ్మీరీ సంస్కృతిపై నూరుద్దీన్ ప్రవచించిన మార్మిక మానవతావాదం కల్గించగలిగిన ప్రభావాన్ని అతిశయోక్తులతో నింపకుండా జాగ్రత్త పడాలి. తన ప్రాపంచిక దృక్పథంగా ఆయన మార్మిక కవిత్వాన్ని చెప్పుకునే సంస్కృతి మౌలికంగా మానవీయ సంస్కృతి (ప్రొఫెసర్ ఇషాక్ ఖాన్ మాటల్లో). "లౌకిక వాదాన్ని గురించీ, మానవ త్వాన్ని గురించీ మాకెవ్వరూ చెప్పాల్సిన అవసరం లేదు. ఎందుకంటే మా సంస్కృతికి అదే ఆయువుపట్టు" అని మా బృందంతో మాట్లాడిన అనేక మంది కాశ్మీరీలు ఆత్మవిశ్వాసంతో, ఒకింత గర్వం తొణకిసలాడే గొంతుతో చెప్పడం మాకు ఆశ్చర్యం అన్పించలేదు.

హిందువుల్లోని నిమ్నకులాల వాళ్లు ఈ ఉపఖండంలో ఇస్లాంవైపు ఆకర్షితులు కావడానికి ఇస్లాం ప్రబోధించే సమానత్వం ఒక ముఖ్యమైన కారణం. నూరుద్దీన్‌లాంటి సాధువులు ఇస్లాం ను ప్రబోధించడం మరింత ఆకర్షణీయంగా వుండివుంటుంది. చిత్రం...కాశ్మీరులో ఇస్లాం ప్రభావంలోకి పోకుండా మిగిలిపోయింది ఒక్క బ్రాహ్మణులు మాత్రమే. ముస్లిం సాధువులు ప్రవచించిన సమానత్వ మానవత్వం ప్రభావంతో శూద్రులందరూ, బ్రాహ్మణుల్లో చాలామందీ, ఇస్లాం మతం పుచ్చుకున్నారు.

బ్రహ్మణులనూ, వాళ్ళు బోధించి అమలు చేసే కుల వ్యవస్థనూ షేక్ నూరుద్దీన్ తీవ్రంగా విమర్శించాడు. కుల పీడనకు ముక్తి మార్గంగా ఇస్లాంను చూపిస్తాడు.

*కులం గొప్ప చెప్పుకునేవారు*
*వివేక హీనులు, జ్ఞానశూన్యులు*
*ఇక్కడ మంచితనానికి మాత్రమే ఘనమైన వారసత్వ అర్హత*
*అంతరించి పోతుంది ఇక ముందు కులం*
*నువ్వు ఇస్లాం సారాన్ని స్వీకరిస్తే*
*నిన్ను మించిన నిర్మలుడు మరిలేడు.*

షేక్ నూరుద్దీన్ ప్రచారం చేసిన ఇస్లాం ఒక నీతి వ్యవస్థ, క్షమ, కృప, దయ, దాతృత్వం, ఉదారత, కరుణ, ఓర్పు, వినమ్రత అనే సుగుణాలు కలిగినవాడూ, చెమటోడ్చి బువ్వ సంపాదించుకునేవాడూ మాత్రమే ఆయన దృష్టిలో నిజమైన ముస్లిం. నూరుద్దీన్ బోధనలు ఇస్లామిక్ సంప్రదాయాలకు మొత్తం మీద అనుగుణంగా వున్నాయని నొక్కి

చెప్పే మొహమ్మద్ ఇషాక్ ఖాన్ కూడా అనివార్యంగా ఈ క్రింది మాటలు చెప్పాల్సి వచ్చింది. "ప్రతీకార న్యాయాన్ని ఖురాన్ అనుమతించినప్పటికీ నూరుద్దీన్ ఆ పద్ధతిని ప్రచారం చేయలేదు. దేవుడి దృష్టిలోనూ, తోటి మానవుడి దృష్టిలోనూ హోదాను పెంచుతుంది కనుక ప్రతీకార వాక్కును వర్జించమని ఆజ్ఞాపించే విశాల ఖురానీయ సందర్భాన్ని నూరుద్దీన్ నొక్కి వక్కాణిస్తాడు".

నూరుద్దీన్ ఇలా అన్నాడు:

*నా కోసం ప్రతీచోటా స్నేహ బీజాలు నాటు*
*నా శత్రువులను సైతం సంహరించకు*

భగవదాజ్ఞకనుగుణంగా జీవితం గడపని ముస్లిం మతాచార్యులను నూరుద్దీన్ తీవ్రంగా అసహ్యించుకునేవాడు. ఉలేమాల కాపట్యాన్నీ, అహంకారాన్నీ, పేరాశనూ చూసి వాళ్ళను హేళన చేసాడు. ఉలేమా కన్పిస్తే చాలు అల్లా శరణు పొందమని తన అనుచరులకు సలహా ఇచ్చాడు.

1890 లో లేండ్ సెటిల్మెంటు కమీషనరు ఒకతను కాశ్మీర్‌లో హిందువులకూ, ముస్లిములకూ మధ్య ఉన్న అద్భుత సహనాన్ని చూసానని చెప్పాడు. బ్రాహ్మణ మతాన్ని తీవ్రంగావిమర్శించిన శైవ మార్మికవాది లల్లా మాతను కాశ్మీరీ ముస్లీములు ఇప్పటికీ గొప్ప సాధ్విగా చెప్పుకుంటారు. లల్లాదేవి షేక్ నూరుద్దీన్‌కు స్తన్యమిచ్చిందని జనంలో ఒక కథ ప్రాచుర్యంలో వుంది. షేక్ నూరుద్దీన్ అంటాడు.

*పద్మకపురా లల్లా*
*దైవామృత ప్రవాహాలనే గ్రోలిన అమ్మా*
*నువ్వు మాకు ప్రియమైన అవతారం*
*ప్రభూ... మాకూ ఆ వరమే ఇవ్వరా.*

నూరుద్దీన్ కవిత్వ నుడికారం ప్రధానంగా సూఫీ మార్మికవాదమే అయినా, ఆయన చెప్పిన కొన్ని "శ్రుఖ్" (శ్లోకాల్లాంటివి) లలో శైవ మార్మిక భాషలో కూడా తన్నుతాను వ్యక్తీకరించుకుంటాడు.

*శైవతత్త్వ సారాంశపు బాహ్య వక్తీకరణే ఈ విశ్వం . అహాన్ని*
*పరిహరించి నువ్వీ విషయం తెలుసుకుంటే*
*లింగయిక్యమవుతావు.*
*ఈ ప్రపంచంలో అతణ్ణి గుర్తించక పోతే మరణం తర్వాత ఏం*
*చూస్తావు?*
*నీలో నువ్వే అతడి కోసం అన్వేషించు. నా మాట శ్రద్ధగా విను.*

హిందూ తత్త్వశాస్త్ర నుడికారాన్ని కొనసాగిస్తూ దేవుణ్ణి నిర్గుణిగా సంబోధిస్తాడు. దేవుడు తనకూ ప్రవక్త (మహమ్మద్)కూ మధ్య దయతో ముసుగు తొలగించాడు కాబట్టి, తనకు (నూరుద్దీన్‌కు) కూడ ఖురాన్‌ను వెల్లడించి తన ఆధ్యాత్మిక ఆకాంక్షలను సాధించడంలో సహాయం చేయమని దేవుణ్ణి అడుగుతాడు. ఇలా హిందూ ప్రతీకల, భావాల, రూపాల కలయిక ఈ సాధువుల స్మారక మందిరం వద్ద జరిపే కర్మ కాండలోకి

కూడా పాకిపోయింది. సాధువుల అవశేషాలను పరిరక్షించడం (ఉదహరణకు హజ్రత్‌బాల్‌లో మొహమ్మద్ ప్రవక్త కేశాన్ని ఉంచడం), భక్తిగీతాలను బృందగానం చేయడం, ముకుళిత హస్తాలతో ప్రార్ధనలు చేయడం లాంటివి అన్నీ కాశ్మీరీ ఇస్లామిక్ సంస్కృతిలోకి వచ్చి చేరిన ఇస్లాం పూర్వపు ఆచారాలుగా చూడొచ్చు. అసలు చెప్పాలంటే మసీదులకు భిన్నంగా స్మారక మందిరాలు (జియారత్‌లు) ఉండడమే సనాతనులు ముస్లిమేతర సంప్రదాయంగా చూస్తారు. మతం పట్ల మానవీయ, సహనశీల అవగాహనను ఇముడ్చుకున్న కాశ్మీరీ సంస్కృతీ గుర్తింపులు రాజకీయ ప్రజాస్వామ్యం, లౌకిక వాదం, సమానత్వం అనే ఆధునిక భావనలను తమలో తేలిగ్గా ఇముడ్చుకోగలుగుతాయి. షేక్ అబ్దుల్లా కాలంనుంచే కాశ్మీరీలు ఈ విషయాన్నే మనకు చెప్పడానికి ప్రయత్నిస్తున్నారు. కానీ మతోన్మాదం అనే కాకి గోల ప్రచారంతో కాశ్మీరీల మాటలను మనం వినలేకుండ పోయాము. ఈ ప్రచారం ఎంతవరకు పోయిందంటే ముస్లం అనే పదమే అసహనానికీ, మతవైరానికీ పర్యాయపదమైపోయింది.

కాశ్మీరీల దృష్టిలో ఈ కాశ్మీరియత్ ఈనాడు ఇంకా ఎంత జీవించి వుంది అనే ప్రశ్నకు మేం మాట్లాడిన వాళ్ళందరి నుంచీ జవాబు రాబట్టే ప్రయత్నం చేశాం. మేం ఇంతకు ముందే చెప్పినట్లు ఏ సంస్కృతీ శూన్యంలో వుండదు. రాజకీయ, ఆర్థిక, చారిత్రక పరిస్థితుల నుంచీ స్వతంత్రంగా వుండదు. ప్రత్యేకించి కాశ్మీరు లోయలో కాశ్మీరీలు ఆచరించిన ఇస్లాంకున్న కాశ్మీరీయ స్వభావాన్ని మెచ్చని సనాతన భావాలు కూడా వుంటూ వచ్చాయి. కాశ్మీరీయ ప్రత్యేకతను సనాతన పద్ధతికి అనుగుణంగా మార్చడానికి ప్రయత్నించేవాళ్ళు ఉన్నారు. అల్లకల్లోలమైన దోడా జిల్లాలోని భదర్వాలో ఉండే ఓ ప్రముఖ లాయరు మాతో చెప్పినట్లు "ఇది ముస్లిం సాధువుల మందిరాల్లో (అంటే దర్గాలలో) నమ్మకం ఉన్నవాళ్ళకూ, వాటిలో నమ్మకం లేని వాళ్ళకూ మధ్యనున్న ఘర్షణే". ఈ రెండో ఆలోచనకు గత శతాబ్దం చివర్లో ప్రాతినిధ్యం వహించింది అహల్-ఎ-హదిత్. కాశ్మీరీ ఇస్లామియతపై పేరుకుపోయిన 'మకిలి' ని కడిగేయాలని ఇప్పుడు జమాతే ఇస్లామీ సంస్థ ప్రచారం చేస్తుంది. దీన్లోని ధార్మిక తప్పొప్పులతో మనకు సంబంధం లేదు. కానీ జమాతే ఇస్లామీ నమూనా పూర్వాచర పరాయణతో అసహనాన్నీ విభేదాలనూ అనైక్యతనూ కల్పిస్తుంది. ఈ ధోరణి లౌకిక, ప్రజాస్వామ్య సంస్కృతికి విరుద్ధం. బహుళత్వం, సహనం అనేవి ఈ లౌకిక ప్రజాతంత్ర సంస్కృతిలో ముఖ్యమైన అంతర్భాగాలు. కఠిన పూర్వాచార పరాయణత్వం -- అది హైందవం కావచ్చు ఇస్లాం కావచ్చు -- ప్రజాస్వామ్య సంస్కృతిక శత్రువు. కాశ్మీరు విషయానికి కొస్తే కాశ్మీరీ ఇస్లాంకు, ఛాందసవాద ఇస్లాంకు మధ్యనున్న వ్యత్యాసం కాశ్మీర్ విముక్తికై జరుగుతున్న పోరాటం గురించి వున్న అవగాహనలో సైతం ప్రతిబింబిస్తుంది. ఇందాక పేర్కొన్న లాయరే అన్నట్లు "సాధువుల మందిరాల్లో నమ్మకం ఉన్నవాళ్ళు స్వతంత్ర కాశ్మీర్‌ను కోరుకుంటూండగా, వాటిలో నమ్మకం లేనివాళ్లు పాకిస్తాన్‌లో కలవాలను కుంటున్నారు." (గమ్మత్తేమిటంటే ఎవరూ ఇండియాలో ఉండి పోదామనుకోవడం లేదు)

జమాతే ఇస్లామీ నెలకొల్పిన విద్యాసంస్థలు లోయంతా వ్యాపించి వున్నాయి. తన ప్రాపంచిక దృక్పధానికనుగుణంగా అది యువకుల్ని తయారు చేయడానికి గట్టిగా ప్రయత్నం చేస్తున్నదనేది ఒప్పుకోవాల్సిందే. ఈ ప్రయత్నంలో అది ఎంతవరకూ

నఫలమైందనేది వివాదాస్పదం. ఇరుపక్షాలా వున్న ఛాందసుల్ని ఈ విషయంలో సంప్రదించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ముస్లిం ఛాందసులు జమాతే ఇస్లామీ విజయం సాధించిందని నమ్ముదామనుకుంటారు. ఇక హిందూ ఛాందసులు కూడా కాశ్మీరీ ముస్లింల మనసుల్ని జమాత్ పూర్తిగా ఆక్రమించిందని మనల్ని నమ్మమంటారు. సహనంతో, భిన్నత్వంతో ఇస్లాంకు పొంతన కుదరదని ఆర్.ఎస్.ఎస్. చెప్పే భాష్యం రుజువైందని నమ్మమంటారు. ఎందుకంటే అలాంటి వాదనే దాని ఉనికికి మూలం.

ఇరు పక్షాల వున్న ఉదారవాద భావాలున్నవాళ్ళతో మాట్లాడితే, కాశ్మీరీ సంస్కృతిపై ఆధిపత్యం పొందడానికి జమాతే ఇస్లామీ ఏ ప్రయత్నాన్నీ వదులుకోకున్నప్పటికీ అది తన ప్రయత్నంలో విశేష విజయం సాధించలేక పోయిందని అర్థమవుతుంది. దీనికి భిన్నంగా ఛాందసులు సాధువుల మందిరాలతో రాజీ పడాల్సివచ్చింది అని అంటాడు ఓ పరిశీలకుడు. ఛాందసుల నాయకుడైన సయ్యద్ అలీ జిలానీ దర్గాలలో పూజలను ఖండిస్తాడు. అయినా పేరొందిన హజ్రత్‌బాల్ లాంటి దర్గాకు జనం అశేషంగా వస్తారు కాబట్టి ప్రచారం కోసం అక్కడికొచ్చి అతను ఉపన్యాసాలు ఇవ్వాల్సివచ్చింది. ఈ పరిశీలకుడి అంచనా ప్రకారం ఛాందసుల విజయం 20 శాతం మాత్రమే. వాళ్ళు బలంగా ఉన్నట్లు కనబడుతున్నారంటే, పాకిస్తాన్ నుంచీ శిక్షణ పొందిన హిజబుల్ ముజాహిదిన్ తుపాకులు వాళ్ళ వెనుక వుండడమే దానికి కారణం అంటాడు. మరో కారణం ఏమంటే కాశ్మీర్‌లో భారత ప్రభుత్వం పోరాడుతున్నది ముస్లిం ఛాందసవాదంతోనే గానీ కాశ్మీరీ జాతీయ వాదంతోకాదనే తనవాదనకు మద్దతు సంపాదించుకోవడానికి, కాశ్మీరీ ఛాందసవాదులే కాశ్మీరీ పోరాట ప్రాతినిధ్య సిద్ధాంత కారులు గానీ కాశ్మీరీ జాతీయవాదులు కాదు అని భారత ప్రభుత్వం చేసే ప్రచారం. జమాత్ ప్రభావం పాత తరం మీద వుంటే వుందేమోకానీ యువతరం మీద లేదని మరో పరిశీలకుడు అంటాడు.

కాశ్మీరీలు తమ విధిరాత తామే రాసుకుంటామనే హక్కుకూ దీనికీ ఏమీ సంబంధం లేదు. కాశ్మీరీయత్ కున్న లౌకిక, ప్రజాతంత్ర సంప్రదాయాలను మేం మెచ్చుకుంటూ మాట్లాడుతున్నామంటే కాశ్మీరీలకు తమ భవితవ్యాన్ని నిర్ణయించుకునే స్వేచ్ఛను 'ఆమోదించడానికి' చేసేవాదనకు ప్రాతిపదిక వేసే ఉద్దేశంతో కాదు. వైవిధ్య పూరితం, సహనం, మానవీయత కలగలిపిన కాశ్మీరు సంస్కృతి కాశ్మీరు సమాజ భవిష్యత్తును చూపిస్తుందని చెప్పడానికే దాన్ని శ్లాఘించాం. అది భారతదేశంలో ఉన్నా లేకున్నా ఒక ఆదర్శ నమూనాగా మొత్తం ఉపఖండంలోనే భవిష్యత్ సమాజం కోసం కాశ్మీరీయ మానవీయ స్ఫూర్తిని అది అందిస్తుంది. ఇకపోతే స్వయం నిర్ణయాధికారానికి సంబంధించి అది లౌకిక స్వతంత్ర కాశ్మీర్‌గా వుంటుందా, పాకిస్తాన్‌లో కలుస్తుందా అనేది అప్రస్తుతం. ఏ నిర్ణయం చేసుకున్నా, అదొక నాగరిక సమాజం గుర్తించిన రాజకీయ హక్కు. స్వయం నిర్ణయాధికారాన్ని ఒక రాజకీయ హక్కుగా గుర్తిస్తూ, వ్యవహరిస్తూ అలాగే సంప్రదింపులు జరపాలి. లౌకిక మానవీయ కాశ్మీరీ సంప్రదాయాన్ని అభినందించాలనీ, ఎందుకంటే అది ఇండియా 'లక్ష్యానికి ఉపయోగకరంగా' ఉంటుందనే వైఖరొకటి భారతదేశంలో వ్యాప్తిలో వుంది. అంటే జమ్ము-కాశ్మీర్ ను భారతదేశంలో కలిపేగూలని ఈ వైఖరి చెబుతుంది. దీన్ని మనం

తిరస్కరించాలి. కాశ్మీరీ సంప్రదాయాన్ని దాని గొప్పతనానికి మాత్రమే అభినందించాలి. ఆ సంప్రదాయం కాశ్మీరును భారతదేశంలోకి తీసుకొస్తుందా లేదా అనే దానితో సంబంధం లేకుండా, సమస్యను తనకు అనుకూలంగా పరిష్కారం కావడానికి ఇండియా దాన్ని ఉపయోగించు కుంటుందా లేదా అనే దానిలో సంబంధం లేకుండా దాని గొప్పతనాన్ని కీర్తించాలి. భారతదేశపు లక్ష్యం కేవలం భౌగోళిక ప్రాంతాలను స్వాధీనం చేసుకోవడం కాక సామాజిక, సాంస్కృతిక ప్రజాస్వామ్యీకరణే అయినట్లయితే అప్పుడు కాశ్మీరు, -- అది భారతదేశంలో వున్నా, దేశానికి బయటవున్నా -- మన లక్ష్యానికి ఉపయోగపడుతుంది.

****

# కాశ్మీరులో జాతీయోద్యమం

*"పదఘట్టనల కింద తొక్కి వేయబడిన కాశ్మీరీ ప్రజల ఆత్మాభిమానము, ఆకాంక్షలూ బ్రద్దలవ్వడానికి సిద్ధమైవున్న అగ్ని పర్వతంలా ఉన్నాయి. విరిలోయలో జ్వాలా తోరణం దర్శనమివ్వబోతోంది".*

--------*షేక్ అబ్దుల్లా*
*ఆతిష్-ఎ-చినార్*

ఇక్కడ ముందుగానే ఒక విషయం స్పష్టం చేస్తున్నాం. జాతీయ వాదం అంటే ఇక్కడ చెప్పుకుంటున్నది కాశ్మీరీ జాతీయవాదమేకానీ భారత జాతీయవాదం కాదు. నేషనల్ కాన్ఫరెన్సు పార్టీకి చెందిన ఒక మాజీమంత్రి చెప్పినట్లు మొత్తం ఉపఖండమంతా బ్రిటిష్ విదేశీ పాలనకు వ్యతిరేకంగా పోరాడుతుండగా కాశ్మీరీలు డోగ్రా మహారాజు విదేశీ పాలనకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు.

జమ్ము-కాశ్మీరు సంస్థానం వివిధ జాతుల, భాషల మతాల విభిన్న శక్తుల సమ్మేళనం. కనీసం పన్నెండు భాషలు (మాండలికాలు కూడా కలిపితే) మాట్లాడతారు ఇక్కడ. ప్రధాన భాషలు కాశ్మీరీ, డోగ్రీ, పహాడీ, లడఖీ, ఉర్దూలు. ఈ రాష్ట్రం ఇప్పుడు రెండు ప్రాంతాలుగా విడివడి వుంది. ఒకటి ఇండియాలో ఉండగా రెండోది పాకిస్తాన్‌లో వుంది. భారతదేశంలో ఉన్న భాగాన్ని జమ్ము-కాశ్మీరు అని భారతదేశం పిలుస్తుండగా భారత ఆక్రమిత కాశ్మీరు అని పాకిస్తాన్ పిలుస్తోంది. పాకిస్తాన్‌లో కలసివున్న ప్రాంతాన్ని ఆజాద్ కాశ్మీర్ అని పాకిస్తాన్ పిలుస్తుండగా పాక్ ఆక్రమిత కాశ్మీర్ అని భారతదేశం అంటోంది. ఉత్తర ప్రాంతమైన గిల్గిట్ కూడా పాకిస్తాన్‌లోనే వుంది.

భారతదేశంలో కలిసివున్న జమ్ము-కాశ్మీర్‌లో జమ్ము డివిజను (ఆరు జిల్లాలు), కాశ్మీరు లోయలోని కాశ్మీరు డివిజను (ఆరు జిల్లాలు), లడఖ్ డివిజను (రెండు జిల్లాలు) ఉన్నాయి. పాకిస్తాన్‌లో కలిసివున్న జమ్ము-కాశ్మీర్‌లో మీర్‌పూర్ డివిజన్ (మూడు జిల్లాలు), ముజఫరాబాద్ డివిజను (రెండు జిల్లాలు) వున్నాయి. వీటిలో మొదటిది భారతదేశంలోని జమ్ముకు ఆనుకుని వుండగా రెండోది భారతదేశంలో గల కాశ్మీరు లోయకు ఆనుకొని వుంటుంది. ఉత్తరాన ఎక్కడో వుంటుంది గిల్గిట్ ఏజెన్సీ.

దేశ విభజనప్పుడు జమ్ము-కాశ్మీర్‌లో మతరీత్యా చూస్తే 77 శాతం మంది ముస్లిములు. రాష్ట్రం మొత్తంమీదనేకాక పైన చెప్పిన డివిజన్లలో కూడా ప్రతి డివిజనులోనూ ముస్లిములే మెజారిటీ. ఒక్క లడఖ్ మాత్రం దీనికి మినహాయింపు. ఇక్కడ బౌద్ధులు, ముస్లిములూ దాదాపు సమానంగా వుండేవారు. కానీ రాష్ట్ర పాలకుడు మాత్రం హిందువు అయిన మహారాజా హరిసింగ్. 1846 నుంచి జమ్మును రాజధానిగా చేసుకొని జమ్ము-కాశ్మీర్‌ను పాలించిన డోగ్రా కుటుంబ వంశీకుడు వాళ్ళ వారసుడు. పాలక కుటుంబం క్రూర పీడక పేరొందింది. ఈవంశం గురించి చెప్పే కొన్ని కథలు ఎంతో జుగుప్సాకరంగా వుంటాయి. అయితే అవి ఆ ప్రాంతంలో అంతకు ముందు

రాజ్యం చేసిన శిక్కు, ఆఫ్ఘాన్, మొగల్ పాలకుల గురించి చెప్పే కథల కంటే భిన్నంగా ఉండకపోవచ్చు.

ఈ కుటుంబ మూలపురుషుడు గులాబ్ సింగ్, శిక్కు పాలకుడైన మహారాజా రంజిత్ సింగ్ సైన్యంలో పనిచేసినందుకు గాను ఆయనకు జమ్మును జాగీరుగా కట్టబెట్టారు. శిక్కుల రాజధాని లాహోర్. అక్కడ గులాబ్‌సింగ్ బాగా పేరు సంపాదించాడు. ఆంగ్లేయులకీ శిక్కులకీ మధ్య జరిగిన యద్ధాలలో కవటిగా మారి బ్రిటిషు వాళ్ళకు సహకరించాడు. అతగాడి సహకారంతో ఆంగ్లేయులు శిక్కులను ఓడించారు. తమకు సహాయం చేసినందుకు బహుమతిగా బ్రిటిషువాళ్ళు గులాబ్ సింగ్ కు కాశ్మీర్‌ను కట్టబెట్టారు. ఇందుకోసం 1846 లో అమృత్‌సర్ ఒడంబడిక జరిగింది. దీనికి ప్రతిఫలంగా గులాబ్ సింగ్ 75లక్షల రూపాయలు చెల్లించాడు. ఇంకొక వార్షిక కౌలుగా 12 ఉన్ని గొర్రెలు, ఒక గుర్రం, మూడు జతల కాశ్మీరీ శాలువలు ఇవ్వాలని ఒప్పందం. ఈ వ్యవహారాన్ని కాశ్మీరీ జాతీయ వాదులేకాదు చివరికి మహాత్మాగాంధీ కూడా "ఇదొక అమ్మకం వ్యవహారం తప్ప మరేమీ కాదు" అని అభివర్ణించారు. కవి అల్లమా ఇక్బాల్ "భలే మంచి చౌక బేరం" అన్నాడు.

తమను విదేశీ పాలకులు లోబర్చుకోవడం 1586 లో అక్బర్‌తో మొదలైందనీ భావించే కాశ్మీరీలు తమ లోయ మొఘల్ పాలకుల నుంచీ అఫ్ఘాన్ పాలకులకూ, అక్కణ్ణుంచీ శిక్కు పాలకులకూ, అక్కణ్ణుంచీ డోగ్రాలకూ వెళ్ళిపోయిందని భావిస్తారు. చివరి మొఘల్ పాలకుల కాలంనుంచీ కాశ్మీరీలు--అది ముస్లిం, శిక్కు, హిందు ఎవరి పాలన ఐతేనేమి -- నిరంకుశ పాలన కింద అనుభవించింది కష్టాలు కడగండ్లే. కాశ్మీరీల మీద విపరీతమైన పన్నులు వేసేవాళ్ళు. పన్నుల ద్వారా "ప్రజల రక్తాన్ని పీల్చేసే జలగ"గా గులాబ్ సింగ్ ను గురించి చెప్పుకుంటారు. హరిసింగ్ ప్రభుత్వాన్ని గురించి 1940లో ఒక బ్రిటిష్ సంఘసేవకుడు చెప్పినట్లు అది ప్రతి పొయ్యిమీదా, కిటికీ మీదా పన్ను వేసింది; ఆవుమీద పన్నేసింది; బర్రెమీద పన్నేసింది; గొర్రెమీద పన్నేసింది. ఆఖరికి భార్యమీద కూడా పన్నేసింది. చివరికి పన్నుల వసూలుకు అయ్యే ఖర్చును భరించడానికి జైల్‌దారి పన్నును కూడా విధించింది". తన అధికారానికి వ్యతిరేకంగా ఎక్కడ ఏ చిన్న తిరుగుబాటు జరిగినా దాన్ని క్రూరంగా వెంటనే అణచివేసేవాడు గులాబ్‌సింగ్. పూంచ్‌లో తిరుగుబాటు చేసిన కొందరు తిరుగుబాటుదార్లను సజీవంగా ఒళ్ళు ఒలిపించి, ఆ తోలు తిత్తిలో గడ్డికూరి జనాన్ని భయపెట్టడానికి రోడ్డుప్రక్క ప్రదర్శింప చేసాడని అతగాడి గురించి చెప్పుకుంటారు. ఇక ఈయనగారి పుత్రరత్నం రణ్‌బీర్ సింగ్ అయితే ముస్లింలను ఓడనిండా తీసుకుపోయినదిలో ముంచేసేవాడు --- ఆకలితో మాడే ముస్లింలను ఏ బ్రిటిషు ఆఫీసరూ చూడకుండా వుండడం దీని ఉద్దేశం.

కాశ్మీరు లోయలో అత్యధికులు (1947 లెక్కల ప్రకారం 93 శాతం) ముస్లింలు. రాజుగారి ఆస్థానం జమ్ములో ఉండేది. జమ్ము డోగ్రా ప్రజలు వుండే ప్రాంతం. రాజ్యంలో కీలక పదవులన్నీ క్రమక్రమంగా డోగ్రా సంపన్నులు పొందారు. లోయలో అతి తక్కువ సంఖ్యలో వుండే పండిట్‌లు అనే హిందువులు ప్రభుత్వోద్యోగాల్లో ఎక్కువ సంఖ్యలో ఉండేవాళ్ళు. రాజ్యంలోని కీలక పదవులన్నీ డోగ్రా రాజపుత్రుల గుత్తాధిపత్యం లోనే

ఉన్నందుకు ఈ పండితులు కూడా అసంతృప్త జీవులుగానే వుండేవాళ్ళు. అధికార పదవుల్లో మరింత పెద్దవాటా కావాలని ఆందోళన చేసారు. చాలామంది పండితులు గైర్హాజరీ భూస్వామ్య జాగిర్దారీ కుటుంబాలకు చెందినవాళ్ళు. అయితే గణనీయమైన సంఖ్యలో చిన్నరైతులు కూడా వుండేవాళ్ళు. కానీ జాగీర్దారు కుటుంబాలకు చెందిన కొంతమంది ముస్లిములను మినహాయిస్తే, ముస్లిములందరూ ఎక్కువగా పీడనకూ, నిర్లక్ష్యానికి గురయినవాళ్ళే. వాళ్లలోని మధ్యతరగతి జనం సైతం హిందూపాలకుల వివక్షకు గురయ్యారు. సర్ ఆల్బియన్ బెనర్జీ విదేశీ, రాజకీయ వ్యవహారాల్లో రెండేళ్లకు పైగా మహారాజుకు సలహాదారుగా పనిచేసి విసుగుతో పదవికి రాజీనామా చేసాడు. ఆయన 1929 లో ఒక పత్రికా ప్రకటన ఇచ్చారు. గ్రామాల్లో పేదరికంతో కొట్టుమిట్టాడుతున్న నిరక్షర కుక్షులైన ముస్లిం జనాభాను ప్రభుత్వం 'మూగపశువులు' గా పాలించింది. ఆ మూగ పశువులు కూలీలూ, కౌలుదార్లూ, చేతి వృత్తుల వాళ్ళూను. 1924లో శ్రీనగర్ ప్రభుత్వ పట్టు ఫ్యాక్టరీలో ఐదు వేల మంది (దాదాపు అందరూ ముస్లింలే) కార్మికులు చేసిన సమ్మెతో వాళ్ళు ఎంతటి పీడనకు గురవుతున్నారో లోకానికి తెలిసింది.

కానీ పశువులు మూగగా పడివుండలేదు. బెనర్జీ ప్రకటనను పత్రికల్లో చదివిన కాశ్మీరీ ముస్లిం యువకుల్లో ఒకడైన షేక్ మొహమ్మద్ అబ్దుల్లా ఆ ప్రకటనను సమర్థిస్తూ 'సంపాదకుడికి లేఖలు' శీర్షికకు లేఖ వ్రాసాడు. ఇలా ఉత్తరం వ్రాయడాన్ని రాజభక్తి పరాయణులైన ముస్లిం విమర్శకులు వ్యతిరేకించారు. అప్పుడాయన అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయంలో రసాయన శాస్త్రంలో పోస్టు గ్రాడ్యుయేషన్ చదువుతున్నాడు. ఆ తర్వాత శ్రీనగర్‌లోనే ఒక పాఠశాలలో సైన్సు టీచరుగా ఉద్యోగం చేసాడు. కానీ ఆ ఉద్యోగం కూడా ఎంతోకాలం చేయలేదు. ఇతర ముస్లిం యువకులతో కలిసి కాశ్మీరీల అసమ్మతిని మహారాజు ప్రభుత్వానికి వ్యతిరేకంగా కూడగట్టే పనిలో పూర్తిగా నిమగ్నమైపోయాడు. మసీదుల్లోనూ, బహిరంగస్థలాల్లోనూ మీటింగులు పెట్టాడు. పీడిత ముస్లింల సమస్యల పరిష్కారంకై ఆందోళనలు చేపట్టాడు. ముస్లింలపై అమలు పరుస్తున్న వివక్షా విధానాన్ని అంతం చేయాలని కోరుతూ మహారాజు ప్రభుత్వానికి విన్నపాలు పంపుతుండేవాడు.

తమ స్వాతంత్ర్య పోరాటంలో 1931 జులై 13 ను మైలు రాయిగా కాశ్మీరీలు ఇప్పటికీ స్మరించుకుంటారు. ఆ రోజు ప్రాధాన్యాన్ని భారత స్వాతంత్ర్యోద్యమ గాథలో జలియన్ వాలా బాగ్ నరమేధంతో పోల్చుతూ షేక్ అబ్దుల్లా తన జ్ఞాపకాల్లో రాసుకున్నాడు. ముస్లిముల కష్టాలను వినడానికి మహారాజు అంగీకరించాడు. ఏ ఏ ప్రాంతంనుంచీ ఎవరెవరు ప్రతినిధులుగా వెళ్ళాలో కూడా ఎంపిక జరిగి పోయింది. కాశ్మీరు లోయ నుంచీ ఎంపికైన ఏడుగురిలో షేక్ అబ్దుల్లా కూడా వున్నాడు. తమ మత భావాలను గాయ పరుస్తూ సంస్థానంలో జరిగిన కొన్ని ఘటనలపై ముస్లిములు అసమ్మతి వ్యక్తపరచగా ఆవిషయాన్ని చర్చించడానికి సంప్రదింపులు ఏర్పరిచాడు మహారాజు. ఇది జరుగుతుండగా 1931 జూన్ 25న అబ్దుల్ ఖాదిర్ అనే అతను ఒక ఉపన్యాసం ఇస్తున్నాడు. ఈ ఉపన్యాసం అధికారులకు రాజద్రోహకరంగా కనబడింది. అతణ్ణి అరెస్టు చేశారు. జూలై 6న విచారణ జరుగుతుందన్నారు. విచారణకు ఆటంకం

కలిగించేలా చాలామంది జనం జమగూజారు. దాంతో విచారణను జూలై 13కు వాయిదా వేసి విచారణ స్థలాన్ని శ్రీనగర్ సెంట్రల్ జైలుకు మార్చారు. జులై 13న విచారణ ప్రారంభం అవుతుందనగా చాలామంది జనం జైలులోకి తోసుకు పోవడానికి ప్రయత్నించారు. పోలీసుల్ని తీసుకొని గవర్నర్ అక్కడికి వచ్చాడు. జనం రాళ్ళు విసిరారు. కాల్పులు జరపమని గవర్నర్ పోలీసుల్ని ఆదేశించాడు. ఇరవైరెండు మందిని పోలీసులు చంపేసారు. పవిత్ర స్థలమైన ఖన్‌ఖా-ఎ-నక్ష బందియా వద్ద మృతదేహాలకు అంత్యక్రియలు జరిపారు. అప్పటి నుంచీ జులై 13ను అమర వీరుల దినంగా సంస్మరించుకుంటారు కాశ్మీరీలు.

మహారాజుకు వ్యతిరేకంగా కాశ్మీరీలు చేసిన పోరాటం పీడక, నిరంకుశ ఫ్యూడల్ పాలనకు వ్యతిరేకంగా చేసిన పోరాటం అని చెప్పకతప్పదు. హిందువు అధిపత్యాన గల ప్రభుత్వం మెజారిటీగా వున్న ముస్లింల పట్ల ప్రదర్శించిన వివక్షకు వ్యతిరేకంగా సాగిన పోరాటం. వీటన్నిటికీ మించి ఏ ప్రజలనైతే పాలించారో ఆ ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోని విదేశీ పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం. విదేశీ పీడక పాలననుంచీ స్వాతంత్ర్యం పొందాలనే వారి ఆకాంక్షే వాళ్ళ దృక్పధాన్ని నిర్ణయించింది. ఈ కాశ్మీరీ రాజకీయాకాంక్ష కోణాన్ని అర్థం చేసుకోకపోతే "కాశ్మీరీ సమస్య"ను గురించి మనం ఏమీ అర్థం చేసుకోలేమని మరీ మరీ చెప్పాల్సిన అవసరం ఉంది. ప్రారంభం నుంచే ఈ సమస్య ముస్లీముల కడగండ్లతో లంకె వేసుకుని వుందనే కారణంగా, బహిరంగ స్థలాల నుంచీ ఎంతగా ఆందోళన చేసారో అంతగానూ మతపరమైన స్థలాలనుంచి కూడా చేసారనే కారణంగా, ఆ ఆందోళన మౌలికంగా జాతీయ స్వభావం -- అదే కాశ్మీరీ జాతీయత -- కలిగిన పోరాటం అనే దాన్నుంచీ మనదృష్టి తప్పిపోకూడదు. పోరాటానికి నాయకత్వం వహించిన వాళ్ళలో ప్రజాదరణ గల నాయకులు, మరీ ముఖ్యంగా షేక్ మొహమ్మద్ అబ్దుల్లా, వాళ్ళ పోరాటం మతతత్వంలో కూడిన పోరాటం కాదనే విషయంలో ప్రారంభం నుంచే చైతన్య యుతంగా వున్నారు. పండితులలో ప్రధాన భాగం పోరాటాన్నొక మతతత్వ ఉద్యమంగా చూడ్డం పట్ల అసమ్మతి వ్యక్త పరిచారు. అబ్దుల్లా ఆస్తికుడే. మతాచార పరాయణుడే.... భావావేశంతోతన మతం ఎడల అకర్షితుడైన వ్యక్తే... సందేహం లేదు. అయినా ఆయనకూ, ఆయన సహచరులకూ న్యాయమైన ముస్లిం మెజారిటీ అసమ్మతినీ, వివక్షా పూరితమైన హిందు పాలనతో కలగలిసిపోయిన విదేశీ పాలన నుంచీ స్వేచ్ఛకావాలనే కాశ్మీరీ ఆకాంక్షనూ కలగలిపి వ్యక్తీకరించడంలో ఏమాత్రమూ కష్టమనిపించలేదు.

ముస్లిముల పట్ల ప్రదర్శించే వివక్షకు వ్యతిరేకంగా ఈ శతాబ్దం తొలినాళ్ళలో వివిధ సంప్రదాయ అంజుమన్‌లు (సంఘాలు) ఆందోళనను చేపట్టాయి. ఈ సంఘాలు ఎక్కువగా మతపరమైన దృక్పథంతో వుండేవి. ఒక వైపు నిరసనోద్యమాలు నిర్వహిస్తూనే పూర్వా చార పరాయణతను బోధిస్తూ విద్యావ్యాప్తి కర్తవ్యాన్ని చేపట్టాయి. ఈ ముస్లిం ఛాందసవాద సంస్కరణ నిరసన ఉద్యమ తొలినాయకుల్లో ఒకడు కాశ్మీరీ మీర్వాయిజ్ మౌల్వీ అహ్మదుల్లాషా. ఇతని మేనల్లుడు యూసుఫ్ షా ఇతని తరువాత మీర్వాయిజ్ పదవి చేపట్టు లోయలోని ముస్లిం రాజకీయాల్లో ఛాందసవాద కోవకు ప్రతినిధిగా నిలబడ్డాడు. అయితే ఎక్కువ ప్రజాదరణ కలిగిన ధోరణికి చెందినవారు షేక్ అబ్దుల్లా

నాయకత్వాన వుండేవారు. లౌకిక కాశ్మీరీ జాతీయవాదం దృష్టి కోణాన్నుంచీ షేక్ అబ్దుల్లా ఉద్యమాన్ని చైతన్యయుతంగా అభివృద్ధి చేసాడు.

ఇంతకు ముందు మనం చర్చించిన పరిస్థితుల్లో ముస్లిం మెజారిటీ తమ సమస్యలకు కారణాన్ని తమ పాలకుల హిందూ స్వభావానికీ, అధికార యంత్రాగంలో పెద్దసంఖ్యలో ఉన్న కాశ్మీరీ పండితుల హిందూ స్వభావానికీ ఆపాదించడం సహజమే. ఇక పండితులు కూడా తమ వంతుగా చాలా త్వరగానే ప్రభుత్వంతో మిలాఖతైపోయారు. కాశ్మీరీ పండిట్ కాన్ఫరెన్సు అనేదాన్ని నెలకొల్పుకున్నారు. మెజారిటీ ప్రయోజనాలకు భిన్నంగా తమ ప్రయోజనాలను రక్షించుకోవడమే ఈ సంస్థ నెలకొల్పడంలో ఉద్దేశం. అయితే కాశ్మీరీ అవిభక్త సంస్కృతీ, సహనశీల మానవతావాదమూ రెండు వక్కలా తగినంత మంది వ్యక్తుల్ని ఈ చీలికను అధిగమించడానికి వీలుగా తయారు చేసింది. ముస్లింలలో షేక్అబ్దుల్లా, ఆయన సహచరులూ, హిందువుల్లో ప్రేమ్‌నాథ్ బజాజ్ లాంటి వ్యక్తులూ ఈ కోవకే చెందుతారు. ఉపఖండంలో పెద్ద ఎత్తున మతం కారణంగా దొమ్మీలు జరుగుతున్నా జమ్మూప్రాంతంలో మత కలహాలు జరిగినా ఇటీవలి కాలం వరకు కాశ్మీరు లోయ మతపరమైన అల్లర్లను చూడలేరు. కాశ్మీరీలు ఈ విషయాన్ని గర్వంగా చెప్పుకుంటారు. ఇలా చెప్పుకోవడం న్యాయం కూడా.

ఈ అశాంతి జమ్ము-కాశ్మీర్ ముస్లిం కాన్ఫరన్సు స్థాపనతో పరాకాష్ఠకు చేరుకుంది. దీని మొదటి వార్షిక సమావేశం 1932 లో జరిగింది. ఇదే తర్వాత నేషనల్ కాన్ఫరెన్సుగా మారింది. మొదటినుంచీ వివిధ రాజకీయ, వ్యక్తిగత మత సంప్రదాయ సమస్యలు దీన్ని ఆవరించి వున్నాయి; అంతర్గత తగాదాల రూపంలో, బయటి నుంచీ జరిగిన దాడుల రూపంలో ఈ సమస్యలున్నాయి. వీటన్నిటితోనూ ప్రస్తుతం మనకు సంబంధం లేదు. మనం చూడాల్సిందేమంటే కాశ్మీరీ ప్రజల పోరాటం మొదటి నుంచీ రెండురకాల ప్రాథమిక ధోరణులుగా చీలివుంది. ఆ పోరాటాన్ని ముస్లిం ఛాందసవాద చట్రంలోనే నడపాలని ఒక ధోరణి కోరుకోగా రెండో ధోరణికి ప్రాతినిధ్యం వహించినవారు సాంఘిక సమానత్వంవైపు మొగ్గువుండే లౌకిక కాశ్మీరీ జాతీయవాద చట్రంలో నడపాలనుకున్నారు. ముస్లిం కాన్ఫరెన్సుకు తొలి అధ్యక్షుడిగా ఎన్నికైన షేక్ అబ్దుల్లా తన అధ్యక్షోపన్యాసంలో ఇలా చెప్పాడు:

> *"కాశ్మీరు ఉద్యమం మతపరమైన ఉద్యమం కాదని మేం ఇప్పటికే ఎన్నోసార్లు ప్రకటించాం. ప్రతి సెక్షనుకు చెందిన ప్రజల కష్టాలను చెప్పుకోవడానికి ఇది వేదిక. మన సహదేశీయులైన హిందువులకూ, శిక్కులకూ సహాయం చేయడానికి మనం ఎల్లప్పుడూ సంసిద్ధంగా వుండాలి. శాంతియుతంగా సహజీవనం చేయడాన్ని నేర్చుకోనంతవరకూ ఎలాంటి ప్రగతీ సాధ్యంకాదు. అందుకు ఒకరు మరొకరి న్యాయమైన హక్కులను పరస్పరం గౌరవించుకోవడం ముఖ్యమైన ముందుషరతు. నేను మళ్ళీ చెబుతున్నాను... కాశ్మీరు ఉద్యమం మతపరమైన ఉద్యమం కాదు".*

అబ్దుల్లా దృక్పథంతో మీర్వాయిజ్ యూసుఫ్ షా విభేదించడంతో పాటు షేక్ అబ్దుల్లా త్వరత్వరగా నాయకత్వానికి ఎదుగుతున్నందుకూ, ప్రజాదరణ పొందినందుకూ కూడా అసూయపడినట్లు అన్పిస్తుంది. అబ్దుల్లా 'అహ్మదీయా' అని నిందిస్తూ అతను అబ్దుల్లాపై దాడికి దిగాడు. అహ్మదీయ అనేది ఒక మైనారిటీ ముస్లింశాఖ.

వాస్తవానికి అబ్దుల్లా హనఫీ శాఖకు చెందిన సున్నీ ముస్లిం. అబ్దుల్లా అనుచరులకూ, మీర్వాయిజ్ అనుచరులకూ మధ్య దొమ్మీలూ, వీధి కొట్లాటలూ జరిగాయి. చివరికి మీర్వాయిజ్ ముస్లిం కాన్ఫరెన్సు నుంచీ బయటికెళ్ళి పోయాడు. తన స్వంత ఆజాద్ ముస్లిం కాన్ఫరెన్సును నెలకొల్పుకున్నాడు. కానీ ముస్లిం కాన్ఫరెన్సులో అత్యధికం నాయకులూ, కార్యకర్తలూ షేక్ అబ్దుల్లాతోనే ఉండిపోయారు. బక్షీ గులామ్ మొహమ్మద్, గులామ్ మొహమ్మద్ సాదిఖ్‌లు అలా వుండిపోయిన నాయకులే. అయితే ఆ తర్వాత వీళ్లు కాశ్మీరీ ప్రజలను వంచించడానికీ, వాళ్ళందరూ కలిసి ఉమ్మడిగా మొదలెట్టిన దాన్ని ధ్వంసం చేయడానికీ, దుష్టవాంఛలకూ, ప్రలోభాలకూ లోనై భారత ప్రభుత్వం చేతుల్లో పని ముట్లుగా పని చేయడానికీ స్వచ్ఛందంగా సిద్ధపడ్డారు.

ప్రాతినిధ్య ప్రభుత్వం నెలకొనాలనేది ముస్లిం కాన్ఫరెన్సు డిమాండ్లలో ఒకటి. మహారాజు పాలనను వ్యతిరేకించే ఇతర సంస్థలు కూడా దీన్నే డిమాండు చేశాయి. ప్రజాసభకు -- అంటే ఒక రకమైన చట్ట సభను -- నెలకొల్పుతానని 1934 లో మహారాజు ప్రతిపాదించాడు. దీన్లో 70 శాతానికన్నా ఎక్కువ మందే నామినేట్ చేయబడిన సభ్యులుంటారు. మహారాజు నామినేట్ చేస్తాడు. ప్రజాసభ చేసే చట్టాలను మహారాజు వీటో చేసి తిరస్కరించవచ్చు. మహారాజు ప్రతిపాదనల్లో సారాంశం ఇదే. ఇదొక వంచన అని భావించినప్పటికీ ఎన్నికల్లో పాల్గొనాలని ముస్లిం కాన్ఫరెన్సు నిర్ణయించుకుంది. దానితో మీర్వాయిజ్ యూసుఫ్ షా నాయకత్వాన వున్న ఆజాద్ ముస్లిం కాన్ఫరెన్సు ఎన్నికల్లో తలపడింది. కాని ముస్లిం కాన్ఫరెన్సే నెగ్గింది.

కాశ్మీరీ పోరాటాన్ని లౌకిక జాతీయ పోరాటంగా పరివర్తన చెందించే క్రమం వేగంగా కొనసాగింది. ఈ జాతీయ పోరాటంలో ప్రజాస్వామ్యం, సోషలిజాలు అంతర్భాగాలు, అంటే పోరాటం అనంతరం నెలకొనే సమాజం సోషలిస్టు ప్రజాస్వామ్య లౌకిక సమాజంగా వుంటుందని అర్థం. తన పార్టీ పేరునుంచి ముస్లిం అనేపదాన్ని వర్జించమని తనను జవాహర్లాల్ నెహ్రూ (ఈయన్ని 1937 లో కలిసాడు), కవి మొహమ్మద్ ఇక్బాల్‌లు ప్రోత్సహించారని షేక్ అబ్దుల్లా తన జ్ఞాపకాల్లో రాసుకున్నాడు. విరామమెరుగని ఆందోళనలు, తరచూ జరిగే నాయకుల, కార్యకర్తల అరెస్టులూ, జైలు నిర్బంధాల మధ్యే ఈ విషయాన్ని చర్చించుకుని నిర్ణయం తీసుకున్నారు. 1938 జూన్ 24 న వర్కింగ్ కమిటీ ముస్లిం కాన్ఫరెన్సు పేరును జమ్ము-కాశ్మీరు నేషనల్ కాన్ఫరెన్సుగా మార్చడానికీ, మతంతో సంబంధం లేకుండా ఎవరైనా సభ్యులు కావడానికీ వీలుగా నిబంధనావళిని మార్చడానికి మెజారిటీ తీర్మానంతో అంగీకరించింది. ముస్లిం కాన్ఫరెన్సు ఆవిర్భావం నుంచే' సారాంశంలో జాతీయ సంస్థ' అని షేక్ అబ్దుల్లా అభిప్రాయం. ఇక్కడ జాతీయ అంటే కాశ్మీర్ జాతి అనే అర్థం అయినప్పటికీ అప్పుడున్న వాతావరణంలో మతేతర జాతీయ గుర్తింపు ను స్పష్టంగా కనబడేట్లు చేసే కర్తవ్యం అంత సులభమైందేమీ కాదు. అబ్దుల్లానే చెప్పినట్లు -- "మమ్మల్ని.... హిందూ ముస్లింల అభివృద్ధి నిరోధకులు తిరగట్లోవేసి చూర్ణం చేసారు". కాశ్మీరీ పండిట్‌లు అనుమానంతో చూడ్డం మొదలెట్టారు. జమ్ము ముస్లిముల వ్యతిరేకత ఒక వైపు. మరోవైపు సందు దొరికితే చాలు అబ్దుల్లాపై వ్యంగ్య బాణాలు విసరడానికి సంప్రదాయ ముస్లింలు వుండనేవున్నారు. వీటన్నిటినీ అధిగమించాల్సివుంది. అయినా 1939 ఏప్రిల్ 27న జరిగిన పార్టీ సర్వ

సభ్య సమావేశం వర్కింగ్ కమిటీ ప్రతిపాదించిన సవరణను ధృవీకరించింది. దాంతో జమ్ము-కాశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్సు ఆవిర్భవించింది. జమ్ము-కాశ్మీరు అనే మాటలో ఇది రాష్ట్ర వ్యాప్త సంస్థ అనే భావనను స్ఫురింపచేసింది. లోయకు ఆవల ఈ సంస్థ మరీ నాసి అని చెప్పలేం గానీ దీని నిజమైన పునాది మాత్రం లోయలోనే. సుదీర్ఘకాలం పాటు ఇది లోయలో అన్ని పార్టీల్లోకీ బలమైన రాజకీయ శక్తి. అధికార వ్యామోహాలైన స్థానిక కుమ్మక్కుదార్ల సహాయంతో భారత పాలకులు నేషనల్ కాన్ఫరెన్సుకు ఉన్న ప్రజాదరణను అత్యంత నీతి బాహ్యమైన పద్ధతుల్లో ధ్వంసం చేసారు. ఇవ్వాళ ప్రతి ఒక్కరూ దేన్ని చూసి శోకిస్తున్నారో దానికి గేట్లు బార్లా తెరిచి పెట్టారు.

నేషనల్ కాన్ఫరెన్సు పెట్టిన జాతీయ వాద ఎజెండా చాలా మామూలుది -- అది విదేశీ ఆధిపత్యం నుంచి విముక్తి. మొదట్లో దాని అర్థం జమ్ములోగల డోగ్రా వంశం పాలననుంచి విముక్తి అని. తర్వాత అది భారత యూనియన్ పాలననుంచీ విముక్తిగా మారింది. నేషనల్ కాన్ఫరెన్సు తొలి వార్షిక మహా సభ సర్దార్ బుధ్‌సింగ్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకొంది. ఈయన జమ్ములో శిక్కు నాయకుడు. ఈయన్ని షేక్ అబ్దుల్లా తన "ఆధ్యాత్మిక జనకుడు" అని అభివర్ణించాడు. అయితే ఆయన షేక్ అబ్దుల్లా జమ్ము-కాశ్మీరం ప్రధానమంత్రిగా వుండగా అబ్దుల్లా జమ్ముప్రాంత సమస్యల పట్ల స్పందించే తీరుకు విసుగెత్తిపోయాడు. అయితే అది ఆ తర్వాత కథ అనుకోండి. 1940 లలో నేషనల్ కాన్ఫరెన్సు భారత జాతీయోద్యమంతో సన్నిహిత స్నేహాన్ని నెరపింది. భారత జాతీయ కాంగ్రేసు వార్షిక సభలకు నేషనల్ కాన్ఫరెన్సు కాంగ్రెస్ తోనే సన్నిహితంగా వుంది. ముస్లింలీగును నవాబుల పార్టీగా పరిగణిస్తూ దాన్ని వ్యతిరేకించింది. మీర్వాయిజ్ యూసుఫ్ షా నాయకత్వాన లోయలో షేక్ అబ్దుల్లాతో విభేదించిన వాళ్ళు, అబ్దుల్లా తో కలిసి లోగడ పనిచేసిన కొందరు కలిసి 1941 ముస్లిం కాన్ఫరెన్సును పునరుద్ధరించారు. 1947 తర్వాత ముస్లిం కాన్ఫరెన్సు ఆజాద్ కాశ్మీర్‌లో ప్రభుత్వాన్ని నెలకొల్పింది.

తాను ప్రకటించిన విశాల సాంఘిక లక్ష్యాలను వ్యాప్తి చేయడానికి నేషనల్ కాన్ఫరెన్సు ఒక ఎజెండాను తయారు చేసింది. దీన్ని 'నయా కాశ్మీర్' మేనిఫెస్టోలో పొందుపర్చారు. దీన్ని 1944 లో బారాముల్లా జిల్లాలోని సోపోర్‌లో జరిగిన పార్టీ వార్షిక సదస్సు ఆమోదించింది. 'స్త్రీల, కార్మికుల, సమాజంలోని బలహీన వర్గాల' హక్కులను కాపాడేందుకు ఉద్దేశించినదీ ఎజెండా. ఈ మేనిఫెస్టోను ముస్లిం లీగుకు చెందిన నవాబు లేకాక, కాంగ్రెసులోని ప్రగతి నిరోధకులు సైతం వ్యతిరేకించారు అని షేక్ అబ్దుల్లా అన్నాడు. ఈ ఎజెండా సాంఘిక సంస్కరణకూ, సంఘం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికీ గొప్పగా తోడ్పడే ఎజెండా. జమ్ము-కాశ్మీర్‌ను ఇండియాలో విలీనం చేసిన తర్వాత దీన్ని అమలు చేయడానికి నేషనల్ కాన్ఫరెన్సు కృషి చేసింది.

ఇక ఇప్పుడు కథ 1947 కు వస్తుంది. బ్రిటీషు వాళ్ళు ఇండియాను వదిలి వెళ్ళిపోవాల్సి వచ్చింది. ఇండియాను రెండు దేశాలుగా చీల్చారు. తూర్పున, వాయువ్యాన ముస్లిములు మెజారిటీగా వున్న ప్రాంతాలు పాకిస్తాన్‌గా అవతరించాయి. తక్కిన బ్రిటిషు ఇండియా భారతదేశంగా అవతరించింది. ఇక సంస్థానాలు వాటి పాలకుల కోర్కెల ప్రకారం ఈ రెండు దేశాల్లో దేనిలోనైనా చేరాలా లేక స్వతంత్రంగా వుంటాయా

అనేది నిర్ణయించుకోవచ్చు. అలా జమ్మూ-కాశ్మీరు ప్రజలు హఠాత్తుగా కొత్త పరిస్థితి నెదుర్కొన్నారు. రాష్ట్రమంతా ద్వేషించిన పాలకుడయిన మహారాజు తమనూ, తమ కోర్కెలనూ పట్టించుకోకుండా ఇండియాలోనో, పాకిస్తాన్‌లోనో కలిపేస్తాడనే కొత్త భయం వాళ్ళ ముంగిట్లోకొచ్చింది. బ్రిటిష వాళ్ళు 1846 లో ముష్టి 75 లక్షల రూపాయలకు జమ్మూ-కాశ్మీర్‌ను గులాబ్‌సింగ్‌కు అమ్మకుండా వాళ్ళే పాలించివుంటే జమ్మూ-కాశ్మీరు ఆటోమాటిగ్గా పాకిస్తాన్‌కు పోయివుండేది. ఉపఖండాన్ని చీల్చిన మతపరమైన తర్కం ప్రాతిపదికన నలభై లక్షల మంది ప్రజల తలరాతను ఒక్క మనిషి నిర్ణయించేస్తాడన్న మాట. తమకు అనుకూలంగా నిర్ణయించమంటే తమకు అనుకూలంగా నిర్ణయించమని ఎవరెవరు ఏం చేసారు అనే విషయంలో బోలెడంత వివాదం వుంది. ఆ వివాదాల వివరాల్లోకి మనం పోవడం లేదు. కానీ కొత్తగా నెలకొన్న భారత పాకిస్తాన్ ప్రభుత్వాలు రెండూ మహారాజు తమకే అనుకూలంగా నిర్ణయిస్తాడని ఎవరికి వాళ్ళే ఆశపడి అతణ్ణి రకరకాలుగా ఒత్తిడి చేసారని చెప్పుకుంటే సరిపోతుంది. వాళ్ళిట్లా ఎవరికి వాళ్ళే ఆశలు పెట్టుకుంటే మహారాజు మాత్రం తాను స్వతంత్రంగా వుండాలని కోరుకున్నాడు. లేదా షేక్ అబ్దుల్లా నాయకత్వాన గల కాశ్మీరీ ఆందోళనకారుల నుంచీ తన అధికారాన్ని ఎవరు కాపాడతారో ఆ దేశంలో కలిసిపోదామని అనుకున్నాడు.

ఈ విషయంలో నేషనల్ కాన్ఫరెన్సు వైఖరి చాలా స్పష్టంగా వుంది. 1946 లో పాలక వంశానికి వ్యతిరేకంగా "క్విట్ కాశ్మీర్" ఉద్యమం ప్రారంభమైంది. కాశ్మీరీలు స్వేచ్ఛగా తాము నిర్ణయించుకోగలిగిన తర్వాతే విలీనం సమస్యను తేల్చుకోవచ్చుననేది వాళ్ళ వైఖరి. అంటే వాళ్ళకు సంబంధించి కాశ్మీరును హరిసింగ్ పాలన నుంచీ విముక్తం చేయడం, ప్రాతినిధ్య ప్రభుత్వాన్ని నెలకొల్పడం ప్రధాన విషయాలు. విలీనానికి ముందు స్వాతంత్ర్యం అనేది వాళ్ళ నినాదం. ఈ విషయాన్ని 1947 అక్టోబర్ 2న జరిగిన ఒక బహిరంగ సభలో షేక్ అబ్దుల్లా వివరించాడు. డోగ్రా పాలకులను గద్దె దింపి 'స్వేచ్ఛ, సంక్షేమం, ప్రగతి, సాధించడానికై మార్గం సుగమం చేయడానికి ప్రాతినిధ్య ప్రభుత్వాన్ని స్థాపించడం మొట్టమొదటి కర్తవ్యమని ఆయన పేర్కొన్నాడు. నేషనల్ కాన్ఫరెన్సే గనక నిర్ణయించుకునే పరిస్థితే వుంటే ఇండియాలో కలవడానికే అది నిర్ణయిస్తుందని భారత జాతీయ కాంగ్రెసు నాయకులు నమ్మారు. ఈ విషయాన్ని బక్షీ గులామ్ మొహమ్మద్ ఆగస్టు మొదటి వారంలో శ్రీనగర్‌లో తనకు చెప్పినట్లుగా గాంధీ చెప్పాడు. కానీ మహారాజు మరోరకంగా ఆలోచనలు పోతున్నాడు. ఇండియాలో కలిస్తే తాను రాజ్యం కోల్పోవల్సి వస్తుందనీ, పాకిస్తాన్ లో కలిస్తే తన రాజ్యానికి ఢోకా ఉండదనీ అనుకుంటూ పాకిస్తాన్‌లో కలిసిపోదామా అని కూడా అనుకున్నాడు. హరిసింగ్ మహారాజు ఈ ఆశ ఎందుకు పెటుకున్నాడంటే దానికి ఒక కారణం --- కాంగ్రెసు నాయకుల కన్నా మిన్నగా రాజ్యాంగవాది అయిన మొహమ్మదాలీ జిన్నా రాజుల సార్వభౌమాధికారాన్ని గౌరవిస్తానని ఒట్టుపెట్టుకున్నాడు. మరో కారణం -- తనను తొలగిస్తే జిన్నాగారి ద్విజాతి సిద్ధాంతాన్ని విషతుల్యమైనదిగా పరిగణించిన షేక్ అబ్దుల్లాతో పాకిస్తానీలు అమీతుమీ తేల్చుకోవాల్సి వుంటుంది.

అప్పుడు జమ్ములో గల హిందూ మతతత్వవాదులు నిజానికి మహారాజు ఇండియాలో కలిసిపోతాడేమోనని విలీనాన్ని వ్యతిరేకించారు. "హిందూరాజ్యం" లౌకిక

భారతంలో కలవడం వాళ్ళకు ఇష్టంలేదు! స్వతంత్రంగా వుండమని వాళ్ళు మహారాజును కోరారు. సుప్రసిద్ధ ప్రజాతంత్రవాదీ, రాజకీయ కార్యకర్తా, జమ్మూ మీద విశేష పరిజ్ఞానం గల విశ్లేషకుడూ అయిన బలరాజ్‌పురి మాకు గుర్తు చేసినట్లు జమ్ము ప్రాంతంలో వున్న (తనలాంటి) వాళ్ళు జమ్ము - కాశ్మీరు సంస్థానం లౌకిక ప్రజాస్వామ్య ఇండియాలో కలవాలని, ఏక వ్యక్తి పాలన పోవాలనీ ఆందోళన చేసారు. వాళ్ళకు హిందూమతోన్మాదులు హిందూ వ్యతిరేకులనీ ముద్రలేసారు.

అప్పుడు సాధారణ కాశ్మీరీలు ఏమనుకుంటున్నారు? వాళ్ళు ఏం కోరుకుంటున్నారో అని తెలుసుకోవడానికి మార్గంలేదు. ఎందుకంటే వాళ్ళు తమ అభిప్రాయాన్ని వ్యక్తీకరించడానికి అప్పుడుగానీ, ఆతర్వాత గానీ ఎలాంటి ఎన్నికా జరగలేదు. ఒక విషయం మాత్రం స్పష్టం. అదేమంటే వాళ్ళందరికీ షేక్ అబ్దుల్లాలో అపారమైన నమ్మకం వుంది. ఆయన రాజకీయాభిప్రాయాల్తో వాళ్ళ కోర్కెలకు ఏకత్వం వుంది. ఇక అబ్దుల్లా విషయానికొస్తే ఆయన కాశ్మీరం విముక్తం కావాలని కోరుకున్నాడు. ఏ విషయాన్నైన ఆలోచించబోయేముందు కాశ్మీరీలు వాళ్ళంతటవాళ్ళు మాట్లాడడానికి ఒక అవకాశం ఇవ్వాలని కోరాడు. ఆయన రెండు జాతుల సిద్ధాంతాన్ని వ్యతిరేకించిన మాటనిజమే, ముస్లిం లీగును నవాబుల పార్టీగా భావించిందీ నిజమే, నెహ్రూ, గాంధీల సామాజిక దృక్పథంతో ఒకరకమైన సాన్నిహిత్యాన్ని అనుభూతించిందీ నిజమే; తన నయా కాశ్మీరు మేనిఫెస్టోకు లౌకిక, ప్రజాతంత్ర, ప్రగతిశీల భారతదేశంలో ఆదరణ లభిస్తుందని ఆశించిందీ నిజమే. అయితే ఆయన మొట్టమొదటి కోరిక మాత్రం కాశ్మీరీలకు స్వేచ్ఛ కావాలి అని. 1946 లో కేబినెట్ మిషన్‌కు ఆయన పంపిన ఒక టెలిగ్రాంలో ఇలా అన్నాడు.

"*ఇవ్వాళ కేవలం ప్రాతినిధ్య పద్ధతితో కాశ్మీరీలను శాంతింపచేయలేం. వాళ్ళు స్వేచ్ఛ కోరుకుంటున్నారు. నిరంకుశుడైన మహారాజునుంచీ స్వేచ్ఛ కోరుకుంటున్నారు.*

....

"*ఇదొక చారిత్రక క్షణం. భారతీయుల భవితవ్యం నిర్ణయమై పోతున్నది......*

"*విలీన హక్కు మూడు పక్షాల మధ్య వివాదాస్పదం సమస్య --- వాళ్ళు ప్రజలు, పాలకులు, సమాఖ్య. మేం కాశ్మీరీలం దీన్ని చారిత్రక దృష్టి కోణంలో నిలపాలి. ఒక విక్రయ పత్రానికి ఒడంబడికకు ఉండే హోదా వుండదు. అందువలన బ్రిటీషు పాలన అంతరించిన తర్వాత కాశ్మీరుకు స్వతంత్రమయ్యే హక్కుంది. మేం కాశ్మీరీలం....మాగమ్యాన్ని మేమే నిర్ణయించాలనీ కోరుకుంటున్నాం.*"

అబ్దుల్లా ఆకాలంలో తన ప్రకటనలన్నింటిలోనూ ఒకే రకంగా ముక్కు సూటిగా లేడు. అయినా ఈ ప్రకటనలు ఆయన అవగాహనను మౌలికంగా చూపెడతాయనడంలో పేచీపడాల్సిన అవసరం లేదు.

మొత్తం పరిస్థితిని సంక్షిప్తంగా చెప్పొచ్చు. కాశ్మీరీలు స్వేచ్ఛను కోరుకోగా, మహారాజు, పాకిస్తాన్, ఇండియాలు కాశ్మీరును కోరుకున్నాయి. అదే ఈనాటికీ విషాదకరంగా కొనసాగుతోంది. తేడా ఒక్కటే - ఇప్పుడు హరిసింగ్ లేడు.

# విలీనము - ప్రజాభిప్రాయ సేకరణ

*"కాశ్మీరు వివాదం, మరోమాటలో చెప్పాలంటే, భౌగోళిక ప్రాంతం పై హక్కుకై జరిగిన పోటీగా మొదలైంది. అంతేకాని అది ప్రజల ఆకాంక్షను నెరవేర్చే ప్రయత్నంగా ప్రారంభంకాలేదు".*

----- *అలాస్టీర్ ల్యాంబ్*
*(కాశ్మీర్: ఎ డిస్‌ప్యూటెడ్ లెగసీ)*

ఇంతకు ముందే చెప్పినట్లు మహారాజు జమ్మూ-కాశ్మీర్‌ను ఇండియాలో విలీనం చేయడానికి ఒత్తిడి చేసిన పరిస్థితులు ఏమిటి అనే విషయంలో పలు సిద్ధాంతాలు ప్రచారంలో ఉన్నాయి. ఆ సిద్ధాంతాల లోతుల్లోకి మేం పోవడంలేదు. అందరూ ఒప్పు కున్న వాస్తవాలనే ఇక్కడ చూద్దాం.

విలీనం పై మహారాజ హరిసింగ్ ఏ నిర్ణయాన్ని తీసుకోవడానికీ సిద్ధంగా లేడు; లేదా తీసుకోలేక పోయాడు. ఇదీ 1947 అక్టోబరు వరకు కొనసాగింది. అప్పుడే కొత్తగా ఏర్పరిచిన సరిహద్దును దాటి హిందువులూ, శిక్కులూ వచ్చి పడుతున్నారు; ముస్లింలు పాకిస్తాన్ వెళ్ళిపోతున్నారు. వీటితో పాటే ఒళ్ళు గగ్గుర్పొడిచేలా హత్యలూ, రేప్‌లూ, దోపిడీలూ, గృహదహనాలు విచ్చలవిడిగా చెలరేగాయి. దీని ప్రభావం జమ్మూ ప్రాంతంపై పడింది. ఇక్కడ ముస్లింలపై దాడి జరిగింది. కొందరు హత్యకు గురయ్యారు. అక్కడనుంచీ చాలామంది పాకిస్తాన్‌కు పారిపోయారు.

జమ్మూనుంచీ కనీసం ఐదు లక్షల మంది పారిపోయి వుంటారని అలస్టీర్ ల్యాంబ్ అంచనా. దీంతో పాకిస్తాన్ కు ఆనుకునివున్న కాశ్మీర్ లోని పూంచ్ ప్రాంతంలో ముస్లిముల నిరసన తలెత్తింది. డోగ్రా పాలకుడికి వ్యతిరేకంగా పూంచ్ ముస్లిములు గతంలో అనేక తిరుగుబాట్లు జరిపారు. [గులాబ్ సింగ్ హయాంలోనే పూంచీలు తిరుగుబాటు చేశారనీ, అయితే వాళ్ళను క్రూరంగా శిక్షించారనీ తొలుత చెప్పివున్నాం]. పైగా వాళ్ళకు సైనిక సంప్రదాయం వుంది. అప్పుడు పూంచ్‌లో దాదాపు 60 వేల మంది మాజీ సైనికులు వుండి వుంటారని ల్యాంబ్ అంచనా. పైగా వాళ్ళలో అత్యధికులు ముస్లిములు. పర్యవసానంగా 1947 సెప్టెంబర్‌లో పూంచ్‌లో మహారాజుకు వ్యతిరేకంగా తిరుగుబాటు జరిగింది. దీన్ని డోగ్రా సైన్యం క్రూరంగా అణచివెయ్యడానికి ప్రయత్నించింది. ఈ తిరుగుబాటుకు పూంచ్ ప్రజాసభలో సభ్యుడిగా పని చేసిన లా ఆఫీసర్ మొహమ్మద్ ఇబ్రహీం ఖాన్ నాయకత్వం వహించాడు. జమ్మూ-కాశ్మీరు ప్రభుత్వం ఆరోపించినట్లు ఈ తిరుగుబాటుకు కొత్తగా నెలకొన్న పాకిస్తాన్ ప్రభుత్వం నిజంగా సహాయపడిందా లేదా అనేది వివాదాస్పద విషయం కావచ్చు. అయితే పాకిస్తాన్ నుంచీ అనధికారికంగా బోలెడంత సహాయం వస్తుంటే పాకిస్తాన్ ప్రభుత్వం దాన్ని చూస్తూ మిన్నకుండి పోయింది.

రాష్ట్రంలో ముస్లిములపై జరుగుతున్న అత్యాచారాల విషయమై హరిసింగ్ ప్రభుత్వంపై పాకిస్తాన్ తీవ్రమైన విమర్శలు చేసింది. తీవ్ర పర్యవసానాలుంటాయని ఒకళ్ళనొకళ్ళు బెదిరించుకున్నారు. ఏదేమైనా పూంచ్ ప్రజలు తిరుగుబాటు చేయడానికి తగిన కారణం మాత్రం వుంది. వాళ్ళను పాకిస్తాన్ రెచ్చగొట్టాల్సిన అవసరం లేదు.

1947 అక్టోబర్ 24 న పాకిస్తాన్ వైపునున్న సరిహద్దు రాష్ట్రమైన వాయవ్య సరిహద్దు రాష్ట్రం (NWFP) నుంచీ అనేకమంది పఠాన్ తెగ ప్రజలు పూంచ్ తిరుగుబాటుదార్లకు మద్దతుగా జమ్మూ-కాశ్మీరులోకి ప్రవేశించారు. శలవులో వున్న అనేకమంది పాకిస్తానీ సైనికులు ఈ దాడిలో పాల్గొన్నారు. పాకిస్తానీ ఆర్మీలో మేజర్ జనరల్ హోదాలో వున్న అక్బర్‌ఖాన్ ఈ దాడికి నాయకత్వం వహించాడు. కానీ ఇది అధికారికంగా పథకం వేసి చేసిన దురాక్రమణ కాదు. అయితే పాకిస్తాన్ ప్రభుత్వానికి దీని గురించి తెలుసు. ఈ దాడిని నిరోధించడానికి చర్యలేమీ తీసుకోకుండా దీనికి మందకొడిగా సహాయం చేసింది. దాడి చేసిన వారి సంఖ్య రెండు వేల (ఇది షేక్ అబ్దుల్లా అంచనా) నుంచీ మూడు వేల (ల్యాంబ్ అంచనా) వరకూ వుంటుంది. అయితే భారత ప్రభుత్వం మాత్రం దాడిచేసిన వాళ్ళు ఇంకా పెద్ద సంఖ్యలోనే వుంటారని ఆరోపించింది. పఠాన్ దురాక్రమణదార్లు జమ్మూ-కాశ్మీరు సరిహద్దును సమీపించగానే జీలం నదిమీద ఒక వంతెనకు కావలి కాస్తున్న బెటాలియన్ కూడా తిరుగుబాటు చేసింది. దాడి చేసినవాళ్ళతో చేరిపోయింది. పూంచ్ ప్రాంతంలో దురాక్రమణదారులు ప్రవేశించడానికి వాళ్ళకు సహాయం చేసింది.

ఆయితే ఒక్కసారి ఈ దాడికి పాల్పడిన వాళ్ళు పూంచ్‌ను దాటి కాశ్మీరు లోయలోకి ప్రవేశించగానే బారాముల్లా జిల్లాలో విచక్షణా రహితమైన లూటీలకు, దోపిడీలకు, రేప్‌లకూ, గృహదహనాలకూ, హత్యలకూ పాల్పడ్డారు. ముస్లింలనూ, హిందువులనూ, శిక్కులనూ ఎవ్వరినీ వదిలిపెట్టకుండా వాళ్ళపై అత్యాచారాలు చేసారు. వాళ్ళను లూటీ చేసారు. దోపిడీ చేసారు. స్త్రీలను చెరబట్టారు. ఆస్తులకు అగ్గి పెట్టారు. హత్యలు చేసారు. ఒక బారముల్లా పట్టణంలోనే దాదాపు మూడు వేల మందిని చంపివేసారని ఒక అంచనా.

ఈ క్రూరమైన దాడి నుంచి తన రాజ్యాన్ని రక్షించు కోవడానికి హరిసింగ్ కాశ్మీరాన్ని భారత్ లో విలీనం చేద్దామని నిశ్చయించుకున్నాడు. దురాక్రమణ చేస్తున్న గుంపును తిప్పికొట్టడానికి అతడికి ఇండియా సహాయం అవసరమైంది. 'నా రాజ్యం భారత డొమినియన్‌లో విలీనం చేయకుండా నేను అడిగిన సహాయాన్ని వాళ్ళు నాకు అందించరు' అని తెలుసుకున్నాడు. ఇదేవిషయాన్ని విలీనాన్ని ప్రతిపాదిస్తూ రాసిన లేఖలో చెప్పాడు. 1947 అక్టోబరు 26న విలీనపత్రంపై సంతకాలు చేసారు. రక్షణ, విదేశీ వ్యవహారాలు, ప్రసార, రవాణా రంగాలలో మాత్రమే భారత యూనియన్ అధికారం చెలాయించవచ్చని మహారాజా అంగీకరించాడు ఆ పత్రంలో .విలీనాన్ని ఆమోదిస్తూ భారత ప్రభుత్వం మర్నాడు ఒక ప్రకటన జారీ చేసింది. ఒక్కసారి శాంతి భద్రతలను పునరుద్ధరించిన తర్వాత జమ్మూ-కాశ్మీర్ ప్రజల సమ్మతి తీసుకుంటామనీ, అప్పుడే విలీనం పూర్తయినట్లుగా పరిగణిస్తామని ఆ ప్రకటనలో పేర్కొంది. ఇండియా అప్పటినుంచీ ఇప్పటి వరకూ ఆసమ్మతి తీసుకోలేదు. ప్రజాభిప్రాయ సేకరణకు చెప్పిన

కారణమేమంటే 'ఏ రాష్ట్రంలోనైతే విలీనం వివాదాస్పద విషయమో, ఆ ప్రజల కోర్కెలకు అనుగుణంగానే విలీనం సమస్యను నిర్ణయించాలి' అనే సుందర సూత్రమే. ఈ సుందర ప్రజాతంత్ర సూత్రాన్ని భారత పాలకులు పాటించలేదు. అయితే దానిని ఎప్పుడు త్యజించారు అనే విషయాన్ని ఇండియా ఈనాటి వరకు వివరించలేదు.

ఈ చట్ట బద్ద లాంఛనం పూర్తి కాగానే భారత సైన్యం విమానాల ద్వారా, రోడ్డు రవాణా ద్వారా దాడి చేసిన వాళ్ళను తిప్పి కొట్టడానికి శ్రీనగర్ హుటాహుటిన వెళ్ళింది. దీనికి నేషనల్ కాన్ఫరెన్సు వాలంటీర్లు సహాయపడ్డారు. లోయలోని ఇతర ప్రజానీకం కూడా సహాయపడ్డారు. పఠాన్‌ల దాడి వార్త అందుకున్న మరుక్షణమే మహారాజాగారి అధికార యంత్రాంగ మంతా లోయను విడిచిపెట్టి జమ్ముకు పారిపోయిందనీ, స్థానిక పాలనను నేషనల్ కాన్ఫరెన్సుకు అప్పజెప్పి పారిపోయిందనీ షేక్ అబ్దుల్లా తన జ్ఞాపకాల్లో రాసుకున్నాడు. నేషనల్ కాన్ఫరెన్సు హిందువులనూ, ముస్లింలనూ సమీకరించి వంతెనలనూ, ఆస్తులను రక్షించడానికి, ముఖ్యంగా ముస్లిమేతరుల ఆస్తులను కాపాడ్డానికి కృషి చేసిందని అబ్దుల్లా అంటాడు. దురాక్రమణ దారులను ప్రతిఘటించి నందుకు, హిందువులకూ, శిక్కులకూ రక్షణ కల్పించినందుకూ నేషనల్ కాన్ఫరెన్సు కార్యకర్త లైన బారాముల్లా నివాసి మొహమ్మద్ మక్బూల్ షెర్వానీ, ముజఫరాబాద్ నివాసి అబ్దుల్ అజీజ్‌లు హత్యకు గురయ్యారు. ఒక్క అబ్దుల్లా మాటల్లోనే కాక, అప్పటి పత్రికల కథనాలను చూసినా, బ్రిటీష అధికారుల నివేదికలు చూసినా తెలిసేదేమిటంటే లోయలోని అత్యధిక ప్రజలు దాడి చేసిన వారిని వ్యతిరేకించారు.

భారతసైన్యం దాడిచేసిన వాళ్ళను పాకిస్తాన్ సరిహద్దులోకి తరిమేయగానే పాకిస్తానీ సైన్యం రంగంలోకి దిగింది. కొత్తగా పుట్టిన ఈ రెండుదేశాల మధ్య యుద్ధం మొదలైంది. 1948 డిసెంబర్ 31న కాల్పుల విరమణతో ఆ యుద్ధం ముగిసింది. అలా జమ్మూ-కాశ్మీరు ఇండియా పిలిచే పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీరు గానూ, పాకిస్తాన్ పిలిచే ఇండియా ఆక్రమిత కాశ్మీరు గానూ చీలిపోయింది.

1947 నవంబర్ 2న నెహ్రూ రేడియో సందేశమిస్తూ జమ్మూ-కాశ్మీర్ భవితవ్యాన్ని ఆ రాష్ట్ర ప్రజలే నిర్ణయించు కుంటారనే వాగ్దానాన్ని పునరుద్ఘాటించాడు. శాంతిని పునరుద్ధరించిన వెంటనే అంతర్జాతీయ సంస్థల ఆధ్వర్యాన ఆ రాష్ట్రంలో ప్రజాభిప్రాయ సేకరణ జరిపిస్తామనీ, ఈ వాగ్దానాన్ని ఇండియా వెనక్కి తీసుకోదు, తీసుకోజాలదు అని కూడా నెహ్రూ ప్రకటించాడు. తర్వాత పాకిస్తాన్ నుంచి వచ్చి దాడి చేసిన వాళ్ళను లోయనుంచీ తరిమేసిన తర్వాత శ్రీనగర్ లోని లాల్‌చౌక్‌లో నెహ్రూ గౌరవార్థం సంబరాలు జరిగాయి. అక్కడ నెహ్రూ, అబ్దుల్లాలు చేతులు కలుపుకున్నారు. ఒకరినొకరు అలింగనం చేసుకున్నారు. కాశ్మీరీలకు స్వయం నిర్ణయాధికార హక్కు వుందనీ, ఇండియా ఈ హక్కుకు హామీ పడుతుందనీ నెహ్రూ మళ్ళీ ఒకసారి కాశ్మీరీలకు వాగ్దానం చేశాడు.

ప్రజల అభిలాష గురించి నెహ్రూ మాట్లాడినప్పుడు రిఫరెండం లేదా ప్లెబిసైటు మాత్రమే కాక, సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొనడం ద్వారా విలీనాన్ని చెల్లుబాటు అయినట్లు ప్రకటిస్తారనే విషయం కూడా ఆయన మనసులో వుండే వుండొచ్చని ఆతర్వాత చెబుతున్నారు. ఈ వాదనను భారత ప్రభుత్వం ఆ తర్వాత కాలంలో లేవనెత్తింది.

విలీనం సమయంలో 'ప్రజల సమాలోచనకు పంపుతాం' అని వాగ్దానం చేసినప్పుడు ప్లెబిసైటు అనే విషయాన్ని నిర్దిష్టంగా పేర్కొనలేదు అనే మాట నిజమే. అయితే నెహ్రూ రేడియో సందేశంలో ఇచ్చిన వాగ్దానంలో వాడిన పదజాలు ప్రభుత్వం ఇవ్వాళ ఇస్తున్న వాదనలకు ఎలాంటి ఆస్కారము ఇవ్వడం లేదు. ఆ వాగ్దానం నైతికంగా బాధ్యత అవుతుందేమో గానీ చట్టబద్ధమైన బాధ్యతగా పరిగణించకూడదని అంటారేమో. కానీ భారత ప్రభుత్వం చట్టబద్ధంగా (కనీసం అంతర్జాతీయ న్యాయ సూత్రాల మేరకు) బద్ధురాలయ్యేలా ప్లెబిసైటు నిర్వహిస్తానని కొన్ని నెలల తర్వాత వాగ్దానం చేసింది. జమ్ము-కాశ్మీర్ పై పాకిస్తాన్ దురాక్రమణ చేసిందని 1947 డిసెంబరు 31న భారత ప్రభుత్వం ఐక్యరాజ్యసమితికు ఫిర్యాదు చేసింది. భారత ప్రభుత్వం దుర్బుద్ధితో వ్యవహరిస్తున్నదనే ఆరోపణను తట్టుకునేందుకు మరో సుందర సూత్రాన్ని ఆశ్రయించింది. ఐక్యరాజ్యసమితికు చేసిన ఫిర్యాదులో ఇండియా ఇలా ప్రకటించింది.

> *"జమ్ము-కాశ్మీర్‌లో గల పరిస్థితిని రాజకీయ లాభాలు పొందడానికి భారత ప్రభుత్వం ఉపయోగించుకుంటుందనే తప్పుడు భావనను తొలగించడానికి దాడి చేసినవాళ్ళను తరిమేయగానే, సాధారణ పరిస్థితి నెలకొనగానే ఆ రాష్ట్ర ప్రజలు తమ గమ్యాన్ని తామే స్వేచ్ఛగా నిర్ణయించుకుంటారు అనీ, సార్వత్రికామోదం పొందిన ప్రజాస్వామ్య పద్ధతైన ప్లెబిసైటు లేదా రెఫరెండం ద్వారా ఆ నిర్ణయం తీసుకుంటారనీ భారత ప్రభుత్వం స్పష్టం చేస్తుంది. స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ప్లెబిసైటు నిర్వహణకు ఐక్యరాజ్యసమితి పర్యవేక్షణ అవసరమవుతుంది".*

ఆ తర్వాత భారతదేశానికి మిగిలిందొక్కటే. అదే దాడి చేసిన వాళ్ళందర్నీ ఇంకా తరిమేయలేదు అని, లేదా ఇంకా మాములు పరిస్థితులు నెలకొనలేదు అని వాదించడం. ప్రజల అభిలాషను నిజంగా సీరియస్‌గా పట్టించుకుని, తెలుసుకుని దాన్ని అమలు చేయాలనుకుంటే ఇవి కృత్రిమమైన వాదనలు మాత్రమే.

వివాదం ఐక్యరాజ్యసమితికు వెళ్ళిన తర్వాత ఐక్యరాజ్యసమితి ఇండియా-పాకిస్తాన్ ల మధ్య ఉద్రిక్తతలను అంతం చేసే పనిమీద కేంద్రీకరించింది. ఐక్యరాజ్య సమితి ఆమోదించిన తొలి రెండు తీర్మానాలు ఈ విషయాన్నే చూపెడతాయి. ఒకటి1948 జనవరి17న ఆమోదించగా రెండోదాన్ని జనవరి 20న ఆమోదించారు. ఇండియా-పాకిస్తాన్ పై ఐక్యరాజ్యసమితి కమీషన్ (UNCIP) ను నెలకొల్పింది. భద్రతా సమితి మార్గదర్శకత్వంలో రెండు దేశాల మధ్య మధ్యవర్తిత్వం నెరపడం ఈ కమీషన్ పని. అయితే 1948 ఏప్రిల్ 21 న ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానం ప్లెబిసైటు ప్రశ్నను స్పృశించింది. జమ్ము-కాశ్మీరు ఇండియాలో విలీనం కావాలా, పాకిస్తాన్‌లో విలీనం కావాలా అనేది స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ప్లెబిసైటు అనే ప్రజాతంత్ర ప్రక్రియ ద్వారానే నిర్ణయించాల్సి వుంటుందని ఇండియా-పాకిస్తాన్ రెండూ కోరుకుంటున్నాయనే విషయం మాకు తృప్తి కలిగించింది అని ఆ తీర్మానం పేర్కొంది. జమ్ము-కాశ్మీరులోకి ప్రవేశించిన ఆక్రమణ దారులనూ, ఆరాష్ట్రంలోకి దొమ్మీకోసమేవచ్చిన, సాధారణ నివాసులు కాని పాకిస్తానీ జాతీయులనూ ఆ రాష్ట్రం నుంచి బయటికి పంపించి వేసే చర్యలు తీసుకోవాలని తీర్మానించింది. శాంతి భద్రతల పరిరక్షణలో పౌరప్రభుత్వానికి మద్దతుగా భారత ప్రభుత్వం కూడా తన సైనిక బలగాలను కనీస సంఖ్యకు కుదించాలని కూడా

తీర్మానం పేర్కొన్నది. విలీనంపై రాష్ట్రంలో ప్రజలందరూ స్వేచ్ఛగా ఓటేసేందుకు వీలుగా పూర్తి స్వేచ్ఛాయుత వాతావరణం నెలకొనేందుకు రెండు దేశాలూ హామీ ఇవ్వాలి. ఐక్యరాజ్యసమితి నియమించే ప్లెబిసైట్ నిర్వాహకుడికి స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ప్లెబిసైట్ నిర్వహణకు అవసరమైన అన్ని అధికారాలూ భారత ప్రభుత్వం ఇవ్వాలి. ప్లెబిసైటు పూర్తయ్యేంతవరకూ అన్ని ప్రధాన రాజకీయ గ్రూపులూ తమతమ ప్రతినిధులతో ఉమ్మడి పాలనను నెలకొల్పాలి. ఇదే ఆ తీర్మానం సారాంశం.

ఇవ్వాల్టివరకూ ఆ తీర్మానం అమలుకు నోచుకోలేదు. ఇండియా, పాకిస్తాన్ రెండూ మొదట్లో ప్లెబిసైటు నిర్వహించడానికి సూత్రరీత్యా ఒప్పుకున్నాయి. అయితే దీన్ని నిర్వహించే పద్ధతిపై అంగీకారం కుదరలేదు. రెంటిలో దేనికీ ప్రజల అభిలాషకు అనుగుణంగా సమస్య పరిష్కరించడానికి హృదయపూర్వక నిబద్ధత లేక పోవడమే కారణమై వుంటుంది. ప్లెబిసైటు ఫలితం తమకు అనుకూలంగా వుండాలంటే తమకు అనుకూలంగా వుండాలని కోరుకోవడం వల్ల ప్లెబిసైటు ఎప్పుడు నిర్వహించాలి, ఎలా నిర్వహించాలి అనే దాంట్లో విభేదాలు వచ్చాయి. అలా జమ్ము-కాశ్మీర్ ప్రజల స్వయం నిర్ణయాధికార హక్కు, ఒకసారి భారత పాకిస్తాన్ లు కొంత భూభాగంపైన అదుపు సంపాదించుకుని యుద్ధం కూడా చేసుకోవడంతో, ఈ రెండు దేశాల భౌగోళిక ప్రాంతాల స్వాధీనం సమస్యగా మారిపోయింది. బండగా చెప్పాలంటే ఇదొక గట్టుతగాదా అయిపోయింది.

1948 ఏప్రిల్ 21 నాటి తీర్మానానికి కమీషన్ (UNCIP) 1948 ఆగస్టు 13నాటి తీర్మానంతో నిర్దిష్టరూపం ఇచ్చింది. పాకిస్తాన్‌ను పూర్తిగా వైదొలగమని అడుగుతారని ఇండియా ఊహించింది. జమ్ము-కాశ్మీరులో తన అధీనంలో వున్న ప్రాంతాలలో తనను అలాగే వుంచి ప్లెబిసైటు నిర్వహించడానికి అనుమతి ఇస్తారని కూడా భారత్ వూహించింది. అసలు అలా చెయ్యాలనే కోరుకుంది. పాకిస్తాన్ దురాక్రమణపూరిత దేశమనీ, తాను చట్టపరంగానూ, నైతికంగానూ ఒప్పులే చేసాననేది ఇండియా వైఖరి. సైనిక బలగాలను కనీసానికి కుదించమని అడగడమంటే దురాక్రమణ దారులను, దురాక్రమణకు గురైనవారినీ ఒకే గాటిన కట్టడమవుతుందని భారత్ వాదన. ఐక్యరాజ్యసమితి పథకాన్ని పాకిస్తానూ వ్యతిరేకించింది. తన అదుపులో గల ప్రాంతాలలో ఇండియా కనీస సంఖ్యలో సైనిక బలగాలు పెట్టుకోవచ్చంటున్నారు కనుక ఈ పథకం తనకు సమ్మతం కాదనేది పాకిస్తాన్ వాదన. పౌరపాలనను షేక్ అబ్దుల్లా కంట్రోలు చేస్తాడనీ, లేదా బలంగా ప్రభావితం చేస్తాడనీ షేక్ అబ్దుల్లా భారతదేశపు పంచమాంగదళ సభ్యుడనీ, అతడు భారత జాతీయ కాంగ్రెసుకు ఏజెంటు (షేక్ అబ్దుల్లాను లియాఖత్ అలీ అలానే చిత్రించాడు) అనీ అందువలన ఈ పథకం సమ్మతం కాదని పాకిస్తాన్ వాదన.

పాకిస్తాన్ ప్రభుత్వం వ్యక్తపరచిన భయాలను తొలగించడానికి 1949 జనవరి 5న కమీషన్ (UNCIP) ఒక సవరణకు ప్రతిపాదించింది. రెండు దేశాలకూ చెందిన సాయుధ బలగాలతో వ్యవహరించడంలో అంటే సాయుధ బలగాలను పంపించి వేసే విషయంలో ప్లెబిసైట్ నిర్వాహకుడికి నిర్ణయాత్మకమైన అధికారం వుంటుందని సవరణ పేర్కొంది. ప్లెబిసైట్ నిర్వహణలో స్థానిక ప్రభుత్వం ప్లెబిసైట్ నిర్వాహకుడికి

పూర్తిగా సహకరించాలని సవరణ పేర్కొంది. ఈసవరణను పాకిస్తాన్ ప్రభుత్వం ఆహ్వానించగా భారత ప్రభుత్వం అట్టే సంతృప్తి వ్యక్తపరచలేదు.

ప్లెబిసైట్ నిర్వహణకు రెండు దేశాలూ సూత్రప్రాయంగా అంగీకరించాయి. రెండు దేశాలకూ ఆమోద యోగ్యమైన పద్ధతిలో ప్లెబిసైట్ నిర్వహణకు ఐక్యరాజ్యసమితి కృషి మొదలైంది. ఆ కృషి కొనసాగుతోందని చెప్పడానికన్నట్లు ఐక్యరాజ్యసమితి మళ్ళీ మళ్ళీ తీర్మానాలను ఆమోదించింది. (ఆ తీర్మానాలు -- 1948 జూన్ 3, 1950 మార్చి 14, 1951 లో మార్చి 30, నవంబర్ 10, 1952 డిసెంబర్ 23, 1957 జనవరి24, 1957 లో ఒకటి ఫిబ్రవరి 21న మరోటి డిసెంబర్ 2 న చేసినవి). ఈ తీర్మానాలన్నీ 1948 ఏప్రిల్ 21 న, 1949 జనవరి 5 చేసిన తీర్మానాలను ఉటంకిస్తాయి; ఈ తీర్మానాలకు కట్టుబడి వున్నందుకు ఇండియా పాకిస్తాన్‌లు మెచ్చుకుంటాయి; ఈ విషయంలో మిగిలిపోయిన అంశాలేమయినా వుంటే వాటిని పరిష్కరించడానికి దృఢ చిత్తంతో వున్నట్లుగా పునరుద్ఘాటిస్తాయి. ఈ సమస్య పరిష్కారానికి మెక్ నాటన్ పథకం అనేది ఒకటుంది. డిక్సన్ రిపోర్టు అనేది మరొకటుంది. గ్రాహం అనే ఆయన ఇచ్చినవి ఒక్కటి కాదు ఐదు రిపోర్టులున్నాయి. గున్నార్ జారింగ్ చేసిన మధ్యవర్తిత్వ ప్రయత్నాలున్నాయి. 1958లో ఫ్రాంక్ గ్రాహమ్ మరో దఫా మధ్య వర్తిత్వం నెరపాడు. 1957 తర్వాత సోవియట్ యూనియన్ భారత్ రక్షకురాలిగా రంగప్రవేశం చేసింది. భద్రతా సమితిలో సోవియట్ చేసిన వీటోల వలన భారత ప్రయోజనాలకు విరుద్ధంగావుండే తీర్మానాలను ఆమోదించడం ఇంకేమాత్రము సాధ్యంకాలేదు. 1964 లో భారత ప్రతినిధి ఎం.సి. చాగ్లా భద్రతా సమితిలో ఇలా ప్రకటించాడు: "కాశ్మీరులో ప్లెబిసైట్ నిర్వహించడానికి ఏ పరిస్థితిల్లోనూ మేం అంగీకరించమని నా ప్రభుత్వం తరపున నేను స్పష్టం చేస్తున్నాను".

ఐక్యరాజ్యసమితిలో కొట్టొచ్చినట్టు కనబడే దేమంటే జమ్ము-కాశ్మీరు ప్రజల ఆకాంక్షలకు సంబంధించిన సమస్యగా మొదలైనట్టిది త్వరలోనే భారత-పాకిస్తాన్ ప్రయోజనాల సమస్యగా మారిపోయింది. రెండు దేశాల ప్రయోజనాలు పరస్పర విరుద్ధమైనవి కావడంతో, వీటి మధ్య రాజీ సాధ్యం కాకపోవడంతో సమస్య ఎక్కడేసిన గొంగళి అక్కడే వేసిన చందంగా తయారయింది. ఈ రెండు దేశాలకూ రాజీ కుదరక పోవడానికి కారణమేమంటే ఈ దేశాల ప్రభుత్వాలకు తమ ప్రయోజనాలను జమ్ము-కాశ్మీరు ప్రజల ఆకాంక్షలకు లోబరిచే నిజమైన కోరిక లేదు. సమస్యను ప్లెబిసైట్ ద్వారా పరిష్కరించుకుందామనే కోరిక లేదు. పాకిస్తాన్‌కు ప్రారంభంలో ప్లెబిసైట్ పట్ల పెద్ద ఆసక్తి ఏమీలేదు. చాలా అనుకూల పరిస్థితుల్లో సైతం ప్రజల తీర్పు తనకు అనుకూలంగా వస్తుందని దానికి ఖచ్చితంగా నమ్మకం లేదు. పాకిస్తాన్ కోరుకున్నట్లు ప్లెబిసైట్ నిర్వహించివుంటే 1948లో ఇండియాకు అనుకూలంగా ప్రజలు తీర్పు ఇచ్చి వుండేవాళ్ళని లోయలో ఒక నమ్మకం వుంది. పాకిస్తాన్ అధికార వైఖరికి సాను భూతిగా వుండే చరిత్ర కారుడు అలిస్టేర్ ల్యాంబ్ కూడా ఈ విషయాన్ని అంగీకరిస్తాడు. ఎందుకంటే అప్పుడు షేక్ అబ్దుల్లా భారతదేశంలో విలీనం కావడానికే మొగ్గుచూపాడు. ఇక ఆయనకు లోయలో ప్రజాదరణ ఎంతగా వుందంటే అది మొత్తం రాష్ట్రంలోనే ఓటింగు సరళిపై పెద్ద ప్రభావం వేసి వుండేది.

కాశ్మీరును స్వతంత్ర దేశంగా వుంచడానికి 'మూడో ప్రత్యామ్నాయం' లౌకిక అబ్దుల్లా ఇండియాలో విలీనం వైపు మొగ్గు చూపాడా అనేది ఎవరికి వాళ్ళు ఊహించుకోవాల్సిందే. ఆయన చేసే ప్రకటనల్లో ఎప్పుడూ స్పష్టంగా వుండేవాడు కాదు. అయినప్పటికీ మహారాజు విలీనం చేసిన తర్వాత 1947 అక్టోబర్‌లో ఆయన బహిరంగంగా చెప్పిన విషయం నమోదయివుంది. ఆయనన్నాడు:

*"కాశ్మీరు అన్ని మతాలవారి ఉమ్మడి రాజ్యంగా వుంటుంది. పూర్తి అధికారాన్ని కాశ్మీరు ప్రజలకు బదిలీ చేయాలనేది మా మొట్టమొదటి డిమాండు. ప్రజాతంత్ర కాశ్మీరు ప్రజాప్రతినిధులు ఈ రాష్ట్రం ఇండియాలో చేరాలా, పాకిస్తాన్‌లో చేరాలా అనేది నిర్ణయిస్తారు. ప్రజలను కాదని ఈ రాష్ట్రం పాకిస్తాన్‌లోనో, ఇండియాలోనో విలీనం అవుతుందని ప్రకటిస్తే నేను తిరుగుబాటు జెండా ఎగరేస్తాను. మే పోరాడతాం. స్వేచ్ఛ కోసం మేం చేస్తున్న డిమాండును ఏదేశం గుర్తిస్తే, ఏ దేశం మద్దతు పలికితే ఆ దేశం వైపు పోవడానికి మేం సహజంగానే మొగ్గుచూపుతాం. ఈ విషయంలో ప్రజలకేమీ సంబంధం లేదు అని చెప్పే వాళ్ళతో కలవాలని మేం కోరుకోవడం లేదు."*

1944 లోనే నేషనల్ కాన్ఫరెన్సు విడుదల చేసిన నయాకాశ్మీరు మేనిఫెస్టో యూరప్‌లో స్విడ్జర్లాండు నమూనాపై స్వతంత్ర, తటస్థ కాశ్మీరును ఊహించింది. 1950 ల తొలినాళ్ళలో ఇండియాలో అమెరికా రాయబారి తన ప్రభుత్వం తరపున షేక్ అబ్దుల్లాతో చర్చలు జరిపాడు. అబ్దుల్లా స్వతంత్ర కాశ్మీరుకు మొగ్గుచూపుతున్నాడనీ, దాంట్లో విఫలమైతే పాకిస్తాన్ కన్నా, భారతలో విలీనానికే ఇష్టపడుతున్నాడనీ ఆయన ప్రకటించాడు.

ఏ రకంగా చూసినా ప్రజల తీర్పు తనకు అనుకూలంగా రావడాన్కి అవకాశం వున్నప్పటికీ ప్లెబిసైటు నిర్వహణకు ఇండియా ఎందుకు ఉత్సుకత చూపించలేదనేది కూడా ఎవరికి వాళ్ళు వూహించుకోవాల్సిందే. విశ్లేషకులూ, చరిత్ర కారులూ, చెప్పిన అన్ని సమాధానాల చర్చల్లోకి మేం వెళ్ళడం లేదు. అయితే కొట్టొచ్చేటట్లు కనబడేదేమంటే ఈ విముఖతలోనే భారత్ వైఖరి ప్రతిబింబిస్తుంది. జమ్మూ-కాశ్మీర్ సమస్య ఎడల భారత ప్రభుత్వం అనుసరించిన పూర్తి ప్రజాస్వామ్య వ్యతిరేక వైఖరి ఈ సంకోచంలో ప్రతిబింబిస్తుంది. జమ్మూ-కాశ్మీరు ప్రజలపైన ఇండియాకెప్పుడు విశ్వాసం లేదు. వాళ్ళ అభిప్రాయాలు వ్యక్తీకరించుకోనీయడానికి ఇండియా అవకాశం ఇవ్వలేదు. ప్రజల్లో 'పట్టు' గలిగిన, లేదా ప్రజాకర్షణ కలిగిన ఒకే ఒక్క వ్యక్తిపై ఆధారపడితే చాలు ఆ రాష్ట్రాన్ని ఇండియాలో కలిపేసుకోవడానికి అనేది భారత్ వైఖరి. మరో మాటలో చెప్పాలంటే ఎవరైతే ఇండియాకు అవసరమైన పనిచేసి పెడతారో వాళ్ళపైనే నిరంతరం ఆధారపడి ఉంటుంది. (అబ్దుల్లా ఈపనవికి సరిపోతాడని నెహ్రూ అన్నాడు) ఆపని ఏమిటంటే జమ్ము-కాశ్మీర్ భూభాగాన్ని అక్కడి జనాన్ని ఇండియాకు అప్పజెప్పేయడం. అందుకు ప్రతిఫలంగా ఆవ్యక్తి జమ్ము-కాశ్మీరు ప్రజలను ఏంచేసినా, అతడు అవినీతి పరుడైనా నిరంకుశుడైనా, క్రూరుడైనా అలాంటి వ్యక్తినే సమర్థించడానికి సిద్ధమైంది భారత ప్రభుత్వం. ఈ విధానమే (బలరాజ్‌పురి ఒక్కొక్క మెట్టూ వివరించినట్లు) ప్రస్తుత సంక్షోభానికి ఎలా దారి తీసిందో రాబోయే అధ్యాయంలో చూస్తాం.

కాలం గడుస్తున్న కొద్దీ 'సరుకుల బేహారులు' తగ్గిపోవడం చూసింది ఇండియా. కాశ్మీరీలు పిరికి వాళ్లూ, మెతక మనుషులూ అని వూహించుకుని (1989 వరకూ కాశ్మీరీల గురించి అందరూ అలానే అనుకొన్నారు) రాజకీయ కుతంత్రాల ద్వారా రాజ్యాంగ కుహకాల ద్వారా జమ్మూ-కాశ్మీర్ ను భారత్ లో చేర్చుకోవడం జరిగిపోయిందనేది నిరూపిత సత్యం. అందువల్ల ఇండియా ప్లెబిసైటు గురించి మాట్లాడటానికి విముఖత చూపింది. పాకిస్తానేమో దాన్ని గురించి మాట్లాడ్డానికి అత్యుత్సాహం కనబర్చింది. 1947-48 లో ఇండియా ప్రవచించిన ఉత్తమ సూత్రాలపట్ల ఎందుకు విముఖత చూపించిందో సమర్థించుకోవడానికి ఇండియా ప్రచ్ఛన్న యుద్ధ రాజకీయాల పరిభాషలో చెప్పాలంటే 1953 తర్వాత పాకిస్తాన్ అమెరికా కక్ష్యలోకి వెళ్ళిపోయింది. అది ఆగ్నేయాసియా ఒడంబడిక (దేశాల) సంస్థ (సీటో) లోను, మధ్య ఆసియా ఒడంబడిక సంస్థలోనూ (సెంటో) చేరింది. ఈ రెండూ అమెరికా మద్దతు కలిగిన ఆసియా దేశాల బృందాలే. పాకిస్తాన్ అమెరికా నుంచీ సైనిక సహాయాన్ని సైతం పొందింది. తన భూభాగాల్లో సైనిక స్థావరాలు నెలకొల్పుకోవడానికి అమెరికాను అనుమతించింది. కాశ్మీరు విషయంలో ఇండియాను మరింతగా ఒత్తిడి చేయడానికి అమెరికాతో తనకున్న మైత్రినీ, సంబంధాలనూ వాడుకుందామని పాకిస్తాన్ ఆశపడిన మాట నిస్సందేహం. పాకిస్తాన్ వేసిన ఈ ఎత్తుకు పై ఎత్తుగా భారత్ కాశ్మీరు విషయంలో ప్రచ్ఛన్న యుద్ధ రాజకీయాల పరిభాషను ప్రవేశపెట్టి సోవియట్ వీటోలలో రక్షణ పొందింది. అమెరికాతో పాకిస్తాన్ పెంచుకున్న సంబంధాలు కాశ్మీరు సమస్య స్వరూప స్వభావాలనే పూర్తిగా మార్చివేసాయని భారత ప్రభుత్వం చెప్పింది. లోగడ అనుకున్న షరతుల ప్రకారం చర్చించడం ఇక కుదరదని తెగేసి చెప్పింది. అంటే దీనర్థం "మారిన పరిస్థితుల్లో" జమ్ము-కాశ్మీర్ లో ప్రజాభిప్రాయ సేకరణకై ఇండియా కట్టుబడివుందని లోగడ చేసిన ప్రకటన విషయంలో ఇండియా పై ఇంకెంత మాత్రము బాధ్యత వుండదని చెప్పడమే. అలస్టిర్ ల్యాంబ్ చెప్పినట్లు "కాశ్మీరీ ప్లెబిసైటును నిరాకరించడానికి పాకిస్తాన్ విదేశాంగ విధానంలో వచ్చిన మార్పును నెహ్రూ వాడుకున్నాడు". ఇండియాకు మద్దతుగా సోవియట్ యూనియన్ ప్రచ్ఛన్న యుద్ధ ప్రయోజనాల్లోకి దూకడంతో "పాకిస్తాన్‌కు అమెరికా సైనిక సహాయం, ఇండియాకు రష్యా నైతిక మద్దతు కారణంగా......కాశ్మీరీ ప్లెబిసైటు కోసం రూపొందించిన వివిధ పథకాల్లో ఆసక్తి వుందని ఇంకేమాత్రమూ నటించను కూడా అవసరంలేదు." అని జవహర్లాల్ నెహ్రూ, ఆయన సహచరులూ భావించారు.

ప్రచ్ఛన్న యుద్ధ రాజకీయాల తప్పొప్పులతో మనకు ఇక్కడ సంబంధం లేదు. ఇండియా లాంటి మూడో ప్రపంచ దేశాలు అమెరికన్ విస్తరణవాద కాంక్షలను చూసి భయపడడం సహేతుకమా అనే విషయం కూడా ఇక్కడ అప్రస్తుతం. అయితే ఈ వాస్తవాలూ, భయాలూ జమిలిగా భారతదేశానికి ఒక సాకును, ఒక ఎలిబీని సృష్టించిపెట్టాయనేది సత్యం. 1947-48 లలో నెహ్రూ మరీమరీ ప్రకటించిన ఉత్తమ సూత్రాలను విడనాడడానికి ఆసాకును భారత ప్రభుత్వం నిసిగ్గుగా వాడుకుంది. జమ్ము-కాశ్మీరు ప్రజల స్వయం నిర్ణయాధికార హక్కు లోగడ భారత-పాకిస్తాన్‌ల సైనిక, రాజకీయ శత్రుత్వంలో ఇరుక్కుపోయింది. ఈ రెండు దేశాలు జమ్ము-కాశ్మీరు భూభాగంకై

చేసుకొన్న యుద్ధం కారణంగా జమ్ము-కాశ్మీరు ప్రజల తప్పిదం ఏమీ లేకుండానే ఈ రెండుదేశాల శత్రుత్వంలో అది ఇరుక్కుపోయింది. ఇప్పుడు ప్రాదేశిక పెత్తనం కోసం అమెరికా, సోవియట్‌ల మధ్య చిన్న ఘర్షణ కారణంగా కాశ్మీరీ ప్రజల తప్పిదమేమీ లేకుండానే ప్రచ్ఛన్న యుద్ధ రాజకీయాల్లో ఇరుక్కుపోయింది.

*# 32 కాశ్మీరులో ఏం జరుగుతూవుంది?*

# విలీన రాజకీయాలు --1 (1947-53)

*"రాష్ట్రంలో అత్యధిక జనాభా ముస్లిములు. అయితే షేక్ సాహెబ్ స్థానిక దేశాభిమానంతో కాశ్మీరీలను మండించాడనేది నేను గమనించాను. వాళ్ళది ఒకే భాష. ఒకే సంస్కృతి. నేను చూసినంతవరకూ వాళ్ళంతా ఒకే ప్రజ. ఎవరు కాశ్మీరీ హిందూ, ఎవరు కాశ్మీరీ ముస్లిం అనేది చూడగానే గుర్తుపట్టలేను. జమ్ము-కాశ్మీరు భవితవ్యాన్ని కాశ్మీరీల అభిలాషే నిర్దేశించాలని మామూలు వారికైనా అన్పిస్తుంది."*

-----*మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ.*

హరిసింగ్ కాశ్మీర్‌ను భారతదేశంలో విలీనం చేసినప్పుడు ఆయన తన ప్రధాన రాజకీయ ప్రత్యర్థి అయిన షేక్ అబ్దుల్లాతో అధికారం పంచుకుంటానని కూడా ప్రతిపాదించాడు. 1931 నుంచి పలుమార్లు జైలుకు వెళ్ళి బయటికి వచ్చిన షేక్ అబ్దుల్లా 1947 సెప్టెంబర్ 24 న కారాగారం నుంచి విడుదలయ్యాడు. మహారాజుకు విధేయంగా వుంటానని ఆయన్నుంచి ఒప్పుకోలు తీసుకొన్న తర్వాత ఇండియా చేసిన ఒత్తిడి ఫలితంగా ఆయన్ని విడుదల చేసారు. అయితే జైలు నుంచీ బయటికి వచ్చీ రావడంతోనే తను ఇచ్చిన హామీని అతను ఉల్లంఘించడం మొదలెట్టాడు. ఆ తరువాత పరిస్థితుల ఒత్తిడి వల్ల హరిసింగ్ కాశ్మీర్‌ను భారతదేంశంలో విలీనం చేసినప్పుడు ఆయన షేక్ అబ్దుల్లాతో అధికారం పంచుకోవాలని నెహ్రూ ఒత్తిడి చేసాడు. మహారాజు ప్రతిపాదించిన విలీనం పై భారతప్రభుత్వం స్పందిచడంలో జాప్యం జరగడానికి నెహ్రూ మనసులో ఉన్న ఈ అలోచనే కారణం అని తాను నమ్ముతున్నట్లు సీనియర్ జర్నలిస్టు అజిత్ భట్టాచార్జీ తన రచన 'కాశ్మీర్-ది-వూండెడ్ వ్యాలీ' (గాయ పడ్డలోయ - కాశ్మీరం)లో అంటాడు. విలీనాన్ని ప్రతిపాదిస్తూ మహారాజు రాసిన లేఖలో "వెంటనే మధ్యంతర ప్రభుత్వాన్ని నెలకొల్పి ఈ విపత్కర పరిస్థితిలో నా ప్రధాన మంత్రితో కలిసి బాధ్యతను నిర్వర్తించమని షేక్ అబ్దుల్లాను అడగడం" తన ఉద్దేశమని చెప్పాడు. జమ్ము-కాశ్మీర్‌లో ప్రాతినిధ్య ప్రభుత్వాన్ని నెలకొల్పే క్రమాన్ని మొదలెట్టాల్సిందిగా హరిసింగ్‌ను ఒత్తిడి చేయగలిగి వుండి కూడా నెహ్రూ ఒత్తిడి చేయలేదనేది చాలా ఆసక్తిదాయకమైన విషయం. హరిసింగ్ షేక్ అబ్దుల్లాతో అధికారాన్ని పంచుకోవాలని మాత్రమే నెహ్రూ కోరాడు. అబ్దుల్లాకు ప్రజాదరణ ఉందా లేదా అనేది కాదు ఇక్కడ అసలు విషయం (నిస్సందేహంగా అతడికి ప్రజల్లో ఆదరణవుంది. కనీసం కాశ్మీర్ లోయలో అబ్దుల్లాకు విశేష ప్రజాదరణ వుండింది అనడంలో సందేహమేమి లేదు.) కాశ్మీరును ఇండియన్ యూనియన్‌లో చేర్చడంలో అబ్దుల్లా సఫలమయి వుండేవాడు. ఎందుకంటే బలరాజ్‌పురి చెప్పినట్లు 'అప్పుడు కాశ్మీరు ఆలోచనాసరళి అదే. కాంగ్రెసు మాట్లాడిన ఆదర్శాలకు ఎక్కువగా స్పందించిన ఆలోచనారీతి అది. ముస్లింలీగూ, జమ్ము-కాశ్మీరు ముస్లిం కాన్ఫరెన్సు చేసిన మతపరమైన విజ్ఞప్తికన్నా ఎక్కువగా కాంగ్రెసు ఆదర్శాలకు స్పందించిన ఆలోచనారీతి అది'. జమ్ము-కాశ్మీరు ముస్లిం కాన్ఫరెన్సు నాయకులు మీర్వాయిజ్ యూసుఫ్‌షా, చౌదరీ గులాం అబ్బాస్ లాంటివారు త్వరలోనే పాకిస్తాన్‌కు వెళ్ళిపోయారు.

అయినప్పటికీ అబ్దుల్లా గద్దెక్కినంతమాత్రాన దాన్ని ప్రాతినిధ్య ప్రభుత్వ స్థాపనతో సమానం చేయకూడదు. జమ్ము-కాశ్మీర్‌లో భారత ప్రయోజనాలకు అబ్దుల్లాకున్న ప్రజాదరణ పనికొస్తుందనేదే నెహ్రూకు ప్రధాన విషయం. అందుకే ప్రాతినిధ్య ప్రభుత్వం గురించి ఆయనగారు పట్టుబట్టలేదు. అబ్దుల్లాను గద్దెనెక్కిస్తే ప్రాతినిధ్య ప్రభుత్వం ఉనికిలోకి వచ్చినట్లేనని ఆయన నిర్వచించాడు.

ప్రాతినిధ్య ప్రభుత్వమంటే రాష్ట్రాన్ని ఇండియాకు అప్పజెప్పే ప్రజాదరణ వ్యక్తిని నేతగా కలిగిన ప్రభుత్వం అని నిర్వచించిన పర్యవసానంగా మిశ్రమ సంస్కృతిగల రాష్ట్రంలో వివిధ మతాలకూ, భాషలకూ చెందిన ప్రజల మధ్య సంబంధాలు మరింతగా దిగజారడానికి ఆస్కారం కలిగింది. అబ్దుల్లా కాశ్మీరీ మనస్తత్వాన్ని సమర్ధంగానే ఆకళింపు చేసుకున్నాడు; సమర్ధంగానే దానికి ప్రాతినిధ్యం వహించాడు. కానీ జమ్ము, లడాఖ్ ప్రాంతాల ప్రజల్ని, ఆ ప్రాంతంలోని ముస్లిముల్ని సైతం, ఆయన అర్ధం చేసుకోలేదు; వాళ్ళ పట్ల సానుభూతితో స్పందించ లేదు. కాశ్మీరే మొత్తం జమ్ము-కాశ్మీరు అనీ, జమ్ము అంతా పాలక హరిసింగ్ కుటుంబమేనని అతను అనుకోవడంతో భిన్న ప్రాంతాల మధ్య సంబంధాలకు తీవ్ర నష్టం జరిగింది. ఇదే విషయాన్ని బలరాజ్‌పురి చెబుతాడు. అబ్దుల్లా ప్రభుత్వం జమ్ము ప్రాంతానికి అతి తక్కువ ప్రాతినిధ్యాన్ని కల్పించింది. జనాభాలో వాళ్ళ నిష్పత్తికన్నా తక్కువ ప్రాతినిధ్యం కల్పించాడు. దాంతో కాశ్మీరీలు ఆధిపత్యం చెలాయిస్తున్నారనే భావన కల్గింది జమ్ము జనానికి.

ప్రాంతీయ చీలికలకు తోడు మరోవైపు హిందూమత తత్వశక్తులు జమ్ములో తలెత్తాయి. ఈశక్తులు బుద్ధిపూర్వకంగా ప్రాంతీయ, మతపర విభజనలను మరింత రెచ్చగొట్టాయి. కాశ్మీరీల ఏకాకి తనాన్ని పెంచుతూ, అది ముస్లిం మతతత్వమనే దుష్ప్రచారానికి లంకించుకున్నారు. జమ్ము ప్రాంతంలోని హిందూ మతవాదులు కాశ్మీరీ జాతీయత ఏనాడూ ముస్లిం మతతత్వంగా వ్యవహరించకున్నప్పటికీ హిందూ మతతత్వవాదులు దానికా ముద్ర వేశారు. పర్యవసానంగా షేక్ అబ్దుల్లా నిస్పృహకు లోనై కాఠిన్యత పెంచుకున్నాడు; కాశ్మీరుకీ జమ్ముకీ ఎడం పెరిగిపోయింది. విలీనం సమస్యకు ప్రతిగా రెండు ప్రాంతాల ప్రయోజనాలకు నష్టం జరిగింది.

రాష్ట్ర పాలనాధికారాన్ని ప్రధానమంత్రి అయిన మెహర్‌చంద్ మహాజన్‌తో పంచుకోవాల్సి వచ్చింది అబ్దుల్లాకు. మహాజన్ ఆర్యసమాజికుడు. వీళ్ళిద్దరికీ పడేది కాదు. మహాజన్ ప్రధానమంత్రిగా కొనసాగగా షేక్ అబ్దుల్లాకు డైరెక్టర్ జనరల్ (పరిపాలన) అనే పదవి కల్పించారు. 1948 మార్చిలో మహాజన్ పదవీకాలం ముగియడంతో ఆయన స్థానంలో షేక్ అబ్దుల్లా ప్రధాన మంత్రి అయ్యాడు.

అబ్దుల్లా అధికారానికి రావడంతోటే నష్టపరిహారం ఏమి ఇవ్వకుండానే జాగీర్దారీ, చక్‌దారీ హక్కులను రద్దు చేస్తూ భూసంస్కరణలను చేపట్టాడు. భూములపై గరిష్ఠ పరిమితి విధించాడు. ఇది ప్రధానంగా హిందూ జాగీర్దార్లను దెబ్బకొట్టినా ముస్లిం జాగిర్దార్లుకూడా భూసంస్కరణల వేటు నుంచీ తప్పించుకోలేక పోయారు. హిందూ జాగీర్దార్లలో జమ్ముకు చెందిన డోగ్రాలూ, కాశ్మీరీ పండితులు వున్నారు. 396 పెద్ద జాగీర్దారీలను రద్దు చేసాడు. తొమ్మిది వేల మంది భూయజమానుల నుంచీ నాలుగులక్షల

ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారు. సైనిక బలగాల విషయంలో కాశ్మీరుకు జరిగిన అన్యాయాన్ని అంతం చేయడానికి ప్రయత్నించాడు. లోయలో మిలీషియాను ఏర్పాటు చేసాడు. దానిలో సహజంగానే ప్రధానంగా ముస్లీములే వుండేవారు. (లోయలో ముస్లింల జనాభాయే అత్యధికం కాబట్టి) అప్పటివరకూ ముస్లిములెవరినీ ముఖ్యమైన పరిపాలక పదవుల్లో నియమించేవారు కాదు. ముస్లిములను ముఖ్యమైన పరిపాలనా పదవుల్లో నియమించడానికి అబ్దుల్లా ప్రయత్నించాడు. ఆ తర్వాత గ్రామీణ రుణభారాన్ని తొలగించే ప్రయత్నం చేసాడు. రుణగ్రస్తుడు అసలుపై ఒకటిన్నర రెట్లు రుణదాతకు చెల్లిస్తే ఆ అప్పు రద్దయిపోయినట్లుగా భావించాల్సి వుంటుందని చట్టం చేసాడు. తన జ్ఞాపకాల్లో అబ్దుల్లా రాసుకున్నట్లు "దాదాపు నాలుగు వందల ఏళ్ళ తర్వాత కాశ్మీరీలు స్వాతంత్ర్యం పొందారు. తమ అదృష్టాన్ని మెరుగు పర్చుకునే పనిలో పడ్డారు". వాళ్ళ ఆలోచన ఇదికాగా, బయటమాత్రం అక్కడ జరుగుతున్న ఘటనలను ఇండో-పాకిస్తాన్ విలీన రాజకీయాలలో భాగంగా వ్యాఖ్యానించసాగారు. గతంలో జరిగిన అన్యాయాలకు విరుగుడుగా పూర్తిగా సమర్ధనీయంగా కాశ్మీరీలు చేపట్టిన ఈ చర్యలను మతతత్వ చర్యలుగా, హరిసింగూ, అతగాడిమురా, జమ్ములో గల హిందూ మతవాదులు చిత్రించడం కాశ్మీరీలను బాగా అవమాన పర్చింది.

మరోవైపు జమ్ములో ముస్లిములపై మతోన్మాదహింస కొనసాగుతోనే వుంది. హరిసింగూ, ఆయన భార్య తారాదేవీ, ప్రధానమంత్రి మహాజన్ (అప్పటికి ఆయన ఇంకా పదవీ విరమణ చేయలేదు) లు హిందూ మతోన్మాదులతో చేతులు కలిపారనీ, ముస్లింలపై జరిగిన అత్యాచారాలకు బాధ్యులనీ అబ్దుల్లా నమ్మకం. పాకిస్తాన్‌లో మారణహోమాన్నుంచీ బ్రతికి బయటపడి జమ్ముకు పారిపోయి వచ్చిన హిందూ, శిక్కు శరణార్ధులే జమ్ములో జరిగిన హత్యాకాండకు బాధ్యులని అనిపిస్తుంది. అబ్దుల్లా ఆరోపించినట్లుగా హరిసింగ్ ప్రభుత్వం మతోన్మాద చర్యలను చేయించినా, చేయించకున్నా, వాటిని నిరోధించి ముస్లిములను రక్షించడానికి మాత్రం ఏ చర్యలూ తీసుకోలేదు. కాశ్మీరు లోయలో హిందువులనూ, శిక్కులనూ రక్షించడంలో అబ్దుల్లా సఫలీకృతుడు కాగా -- కాశ్మీరు మతసహనానికి నమూనాగా నిలిచిపోయింది. -- డోగ్రాపాలకుడు జమ్ములో ఉన్న ముస్లీముల ప్రాణాలను రక్షించలేక పోవడం అవమానకరం అని గాంధీ అన్నాడు. జమ్ములో రెండున్నర లక్షల మంది ముస్లింలను ఊచకోత కోశారని 'ది టైమ్స్ ఆఫ్ లండన్' పత్రిక అంచనా వేసింది. ఈ హత్యాకాండకు బాధ్యత వహించి మహారాజు గద్దెదిగిపోవాలనీ, పరిపాలనను షేక్ అబ్దుల్లాకు అప్పగించాలని కూడా గాంధీ అన్నాడు. అదే సమయంలో అప్పటి హోంశాఖామంత్రి సర్దార్ పటేల్, జమ్ము-కాశ్మీర్‌లో గల ముస్లీమేతరులు మహారాజును తమ భద్రతకు సంకేతంగా పరిగణించడం సహజం అని ఒక లేఖలో అంటాడు.

మతం ప్రాతిపదిక మీద పాకిస్తాన్ చేసే అప్పీలు ఒకవైపు, భారత దేశపు లౌకిక ప్రవచనాల ఎడల దాని అనుమానాలు మరోవైపు - ఈ పరిస్థితుల్లో తన రాజకీయపట్టము నిలబెట్టుకోవడం అబ్దుల్లాకు సమస్యైపోయింది. జమ్ములో ముస్లిములపై అమలు జరిపిన నరమేధం, ఆ ప్రాంతంలో హిందూ మతోన్మాదులు చేసిన చర్యలు, బహిరంగంగా చేసిన ప్రకటనలు అబ్దుల్లా కర్తవ్యాన్ని మరింత క్లిష్టం చేసాయి. కాలం

గడుస్తున్నకొద్దీ ఆయన కఠినంగా తయారు కావడం మొదలెట్టాడు. జమ్ములో ముస్లిములపై జరుగుతున్న హత్యాకాండ అదుపులోకి వచ్చిన తర్వాత, కాశ్మీరుకు ఇచ్చిన ప్రత్యేక హోదాకు వ్యతిరేకంగా, షేక్ అబ్దుల్లాకు వ్యతిరేకంగా ప్రచారోద్యమాన్ని చేపట్టారు. మొగలుల నుంచీ డోగ్రా పాలకుల వరకూ నాలుగు వందల సంవత్సరాలుగా కాశ్మీరుకు చేసిన అన్యాయాన్ని సరిదిద్దే ఉద్దేశంతో అబ్దుల్లా ప్రారంభించిన విధానాలకు మతవాద రంగు పులిమారు. షేక్ అబ్దుల్లాకు వ్యతిరేకంగా సాగుతోన్న ఈ గుసగుసల ఉద్యమంపై గాంధీ బహిరంగంగా తన అసమ్మతి వ్యక్తం చేసాడు.

ఒక వైపు భారత హోంశాఖ మంత్రి సర్దార్ పటేల్ హరిసింగ్ చెప్పుడు మాటలు వినడానికి సిద్ధమైపోతుండగా, అబ్దుల్లాతో నెహ్రూమైత్రి సన్నగిల్లు తుండగా, మరోవైపు అబ్దుల్లా, హరిసింగ్‌లు పరస్పర నిందారోపణలు చేసుకోవడం కొనసాగింది. జాగీర్దార్ల నుంచీ స్వాధీనం చేసుకున్న భూములకు నష్టపరిహార చెల్లింపు తిరస్కరణ లాంటి తీవ్రమైన అంశాలు అబ్దుల్లా ప్రకటించిన కార్యక్రమంలో ఉన్నాయి. అలాంటివాటి తీవ్రతను తగ్గించమని నెహ్రూ అబ్దుల్లాను పోరుపెట్టాడు. ఇంతలో నెహ్రూ చేసిన ఒత్తిడి కారణంగా హరిసింగ్ గద్దెదిగడానికి అంగీకరించాడు. కొడుకు కరణ్‌సింగ్‌కు అవకాశమిచ్చాడు. ఆయనగారు **1949** మే **25**న రాష్ట్రానికి రీజెంట్ హోదాలో గద్దెనెక్కాడు. ఆ తర్వాత కరణ్‌సింగ్ ఆ రాష్ట్ర సదర్-ఇ-రియాసత్‌గా ఎన్నికయ్యాడు. భారత ప్రభుత్వానికి విశ్వాస పాత్రుడైన కుమ్మక్కుదారుగా తయారయ్యాడు. స్వయం ప్రతిపత్తి స్ఫూర్తిని ఉల్లంఘించే ఆయన మొట్టమొదటి చర్య ఏమంటే నష్టపరిహారం లేకుండా జాగీర్లను రద్దు చేస్తూ రాష్ట్రంచేసిన చట్టాన్ని రాష్ట్రపతి ఆమోదంకోసం నివేదించడం. ఈ అధికార దుర్వినియోగానికి కరణ్‌సింగ్‌కు చివాట్లుపెట్టాల్సిందిపోయి ఈ చట్టం తీవ్రతను తగ్గింపచేయడానికి షేక్ అబ్దుల్లా ప్రభుత్వాన్ని ఒత్తిడి చేయడానికి భారత ప్రభుత్వం దీన్నొక అవకాశంగా వాడుకుంది.

జమ్ము-కాశ్మీరుకిచ్చిన ప్రత్యేక హోదాకూ, షేక్ అబ్దుల్లా ప్రారంభించిన మౌలిక ఆర్థిక, సామాజిక సంస్కరణలకూ వ్యతిరేకంగా జమ్ము ప్రజాపరిషత్ ఆందోళన మొదలెట్టింది. దీనికి ఆర్.ఎస్.ఎస్. తో సంబంధాలున్నాయి. షేక్ అబ్దుల్లా ఏ లౌకిక, ప్రగతిశీల సమాజాన్ని ముస్లిములు మెజారిటీగా గల కాశ్మీర్‌లో నిర్మించే కర్తవ్యాన్ని చేపట్టాడో దాన్ని పరిపూర్తి చేయడం కష్టమై పోయింది. ఈవిషయాన్ని అబ్దుల్లా నెహ్రూకు పిర్యాదు చేసాడు. జమ్ము ప్రాంతంలో గల ప్రజాతంత్ర, లౌకిక శక్తులను గుర్తించి వాటితో స్నేహం చేయడానికి అబ్దుల్లా పెద్దగా కృషి చేయలేదు. దాంతో పరిస్థితులు మరింత వికటించాయి. ఇక అబ్దుల్లా తొందరగానే కఠినుడిగా మారిపోయాడు. అయినా అతని సహనశీల మానవతావాదాన్ని ఈ కాఠిన్యం కళంక పరచలేదు. రెండు దశాబ్దాలపాటు ఆయన్ని నిష్కారణంగా ఖైదు చేసి వుంచారు. ఇతర రూపాల్లో ఆయన్ని అణచివేసారు. ఇదంతా లౌకిక ప్రజాతంత్ర భారత రాజ్యమేచేసింది. అయినప్పటికీ తన జీవిత చరమాంకంలో రాసుకున్న జ్ఞాపకాలను ఈ సూఫీ ద్విపదతో ముగిస్తాడు.

*ఈలోకంలోకి నువ్వు వచ్చింది*
*మానవజాతిని ఐక్యం చేయడానికే కాని చీల్చడానికి కాదు.*

బలరాజ్ మధోక్ ఒక ఆర్. ఎస్. ఎస్. కార్యకర్త. తర్వాత ఆయన జనసంఘ్ నాయకుడయ్యాడు. ఆయనే 1947లో జమ్ము ప్రజాపరిషత్ ను నెలకొల్పాడు. 1947 నుంచీ ప్రజాపరిషత్ షేక్ అబ్దుల్లా ప్రభుత్వానికి వ్యతిరేకంగా, భారత రాజ్యాంగంలోని 370వ అధికరణానికి వ్యతిరేకంగా, ప్లెబిసైటుకు వ్యతిరేకంగా తీవ్ర ఆందోళనను చేపట్టింది. అబ్దుల్లా ప్రభుత్వం ప్రకటించిన సాంఘిక, ఆర్థిక సంస్కరణలను కూడా అది వ్యతిరేకించింది. ఆ సంస్కరణలు హిందూ సంపన్నుల ప్రయోజనాలను, ప్రత్యేకించి డోగ్రా సంపన్నుల ప్రయోజనాలను, దెబ్బతీసాయి. ప్రజా పరిషత్‌కు హరిసింగ్ నిధులు సమకూరుస్తున్నాడని కేవలం అబ్దుల్లానే కాదు భారత ప్రభుత్వం కూడా నమ్మింది. జమ్ము-కాశ్మీర్ ఇండియాలో పూర్తి అంతర్భాగం కావాలని 1952లో ప్రజాపరిషత్ పెద్ద ఆందోళనకు దిగింది. ఈ ఆందోళన అబ్దుల్లాకూ, కాశ్మీరీలకూ వేదన కల్గించింది. లోయలో బలమైన ప్రతిచర్యకు బీజం వేసింది.

హిందూ మతోన్మాద సంస్థల ఈ ప్రచారం నేపథ్యంలో ఇండియా ఒక లౌకిక ప్రజాతంత్ర దేశంగా వుంటుందనే తన పాత విశ్వాసం పట్ల అబ్దుల్లాకు సందేహాలు రానారంభించాయి. మరోసారి కాశ్మీరు స్వాతంత్ర్యాన్ని గురించి బహిరంగంగా మాట్లాడ్డం మొదలెట్టాడు. ప్రజా పరిషత్ ప్రచారోద్యమాన్ని దృష్టిలో పెట్టుకుని 1952 లో జరిగిన ఒక బహిరంగసభలో మాట్లడుతూ " మా గమ్యాన్ని రూపొందించుకునే మా హక్కును సవాలు చేస్తే, భారతదేశంలో మతోన్మాదం పునరుత్థనమైతే, కాశ్మీరాన్ని కబళించే ఉద్దేశం భారతదేశానికి లేదని మేం కాశ్మీరులోని ముస్లిములకు ఎలా నచ్చచెబుతాం." అనీ "అలాంటి పరిణామాలు భారతదేశంలో కాశ్మీరు విలీనం తెగిపోడానికి దారితీయొచ్చు" అనీ అన్నాడు. ఐక్యరాజ్యసమితి హామీ ఇచ్చే స్వతంత్ర జమ్ము-కాశ్మీరే సమస్యకు ఏకైక పరిష్కారం అని 1949 లో తనతో మాట్లాడిన ఒక పాత్రికేయుడితో అబ్దుల్లా తన అభిప్రాయంగా చెప్పాడు. ఈ ప్రకటనలను ఉపసంహరించుకొమ్మని భారతీయ నాయకత్వం ఆయన్ని బాగా ఒత్తిడి చేసింది. కానీ ఆయన మనసు మాత్రం తిరుగుబాటు తత్వంతోనే ఉండిపోయింది.

అప్పుడే భారత రాజ్యాంగ పరిషత్తు భారత రాజ్యాంగానికి రూపకల్పన చేస్తోంది. జమ్ము-కాశ్మీరు ప్రత్యేక హోదాకు సంబంధించిన అంశాలను రూపొందించాల్సి వుంది. ఆ అంశాలే 370వ అధికరణం రూపంలో వ్యక్తమయ్యాయి. భారతదేశంలో ఉన్నంత కాలం ఆ రాష్ట్రానికి స్వయంప్రతిపత్తి వుంటుందనీ, కాశ్మీరు భారతదేశంలో వుండాలా వద్దా అని తేల్చడానికి ప్రజలకు నివేదించాలి, అనే రెండు విషయాలు ఈ ప్రత్యేక హోదాలో ఇమిడి వున్నట్లుగా మనం ఇప్పటికే చూసాం. ఈ రెంటిలోనూ మొదటి అంశాన్ని రాజ్యాంగ నిర్మాతలు అసలు పట్టించుకోనేలేదు. 370 అధికరణంలో వాడిన భాష, జమ్ము-కాశ్మీరు భారతదేశంలో శాశ్వతంగా అంతర్భాగంగా వుంటుంది అనే అర్థం ఇచ్చేలా ఉందని ఆ అధికరణాన్ని చూస్తేనే అర్థం అవుతుంది. విలీన పత్రంలో పేర్కొన్న స్వయంప్రతిపత్తి అంశాలను ఈ ఆర్టికల్‌లో చేర్చారు. కానీ ఈ స్వయం ప్రతిపత్తిని నిరాకరించడానికి లేదా స్వయం ప్రతిపత్తిని నీరుగార్చడానికి అవసరమైన నబ్‌క్లాజులున్నాయి. మరో మాటలో చెప్పాలంటే అప్పుడే భారత పాలకుల ఉద్దేశాలు స్పష్టమై పోయాయి. 370 వ అధికరణంలో హామీ ఇచ్చిన స్వయంప్రతిపత్తికి తూట్లు

పొడవడాన్ని వ్యతిరేకిస్తూ, దానిని పునరుద్ధరించాలని డిమాండు చేస్తూ ఆందోళన చేస్తున్నప్పుడు, ఈ ఆర్టికల్ 370 ని రాసేప్పుడు సైతం భారత రాజ్యాంగ శిల్పులు లోగడ తాము చేసిన వాగ్దానాల ఎడల, హామీల ఎడల పూర్తి విశ్వాసం ప్రదర్శించ లేదనే విషయాన్ని మనం మర్చిపోకూడదు.

దేశ రక్షణ, విదేశీ వ్యవహారాలూ, ప్రసార-రవాణాలు అనే మూడు అంశాలకు మాత్రమే జమ్ము-కాశ్మీరు రాష్ట్రంలో కేంద్ర శాసన, కార్యనిర్వాహక అధికారాలు పరిమితమవుతాయని ఆర్టికల్ 370 చెబుతుంది. ఈ మూడు అంశాలూ విలీన పత్రంలో అంగీకరించినట్టివే. కానీ ఆర్టికల్ 370 ఈ క్రింది అంశాలను కూడా అదనంగా చేర్చింది! (1) రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించి భారత రాష్ట్రపతి ఏఏ అంశాలు విలీన పత్రంలో పేర్కొన్న అంశాలకు సమరూపమైనదో ప్రకటిస్తారు; (2) రాజ్యంగంలోని యూనియన్ జాబితాలోగానీ, ఉమ్మడి జాబితాలో గానీ గల ఏ ఇతర అంశాన్నయినా జమ్ము-కాశ్మీరుకు సంబంధించి ఆ రాష్ట్రం ప్రభుత్వ సమ్మతితో కేంద్ర శాసన, కార్యనిర్వాహక పరిధిలోకి రాష్ట్రపతి తీసుకు రావచ్చు.

షేక్ అబ్దుల్లా అభిప్రాయాల్ని దృష్టిలో పెట్టుకొని, ఆయనతో సంప్రదించిన మీదటనే 370వ అధికరణాన్ని రూపొందించారని ఆంగ్లేయ చరిత్రకారుడు అలస్టీర్ ల్యాంబ్ అంటాడు. అంటేమరో మాటలో చెప్పాలంటే ఆయన భారత ప్రభుత్వానికి కావలసిన పనిచేసి పెట్టాలంటే ఆయన్ని ప్రసన్నం చేసుకోవాలి. ఆయనకు సంతృప్తినిచ్చేలాగ రాజ్యాంగ రచనాకమిటీ తరపున ఆ ఆర్టికల్‌లని గోపాలస్వామి అయ్యంగార్ రూపొందించాడు. కానీ ఆర్టికల్ 370 అబ్దుల్లా అంగీకరించిన దానికి సమానంగా లేదని, దాని తుది రూపంతో షేక్ అబ్దుల్లా అసంతృప్తి వ్యక్తపరిచాడని మరోవైపు అజిత్ భట్టాఛార్జీ అంటాడు. వ్యక్తుల్ని పక్కకు పెట్టి చూసినట్లైతే, విలీన పత్రంలో హామీ ఇచ్చిన స్వయం ప్రతిపత్తిని చట్టం ఎలా పలుచన చేసి వేస్తుందనేది కొట్టొచ్చినట్లు కనపడుతుంది. అలాగే విలీనానికి తుది రూపం ఇచ్చిన ఒడంబడికలో భాగం "ప్రజల సమాలోచనకు నివేదిస్తాము" అనే అంశాన్ని పూర్తిగా అలక్ష్యం చేసారు. అంతేకాదు.. ఈ అధికరణానికున్న పొడుగాటి తోకలోనే ఆత్మవినాశకరమైన విషపుకొండి కూడావుంది. తక్కిన భారతదేశానికి సంబంధించి పార్లమెంటు ఏ విషయం పై శాసనం చేయగలుగుతుందో ఆ విషయం విలీన షరతుల పరిధిలోకి వస్తుందా రాదా అనేది కేంద్రం, రాష్ట్రం సమాన భాగస్వాములుగా వుండి నిర్ణయిచుకోవడం కాక ఆరాష్ట్రంతో సంప్రదించి కేంద్రమే నిర్ణయిస్తుంది. అంతేకాదు. విలీన పత్రంలో పేర్కొనని ఏ అంశాన్నయినా కూడా ఒక వేళ రాష్ట్రం సమ్మతిస్తే కేంద్రం పరిధిలోకి తీసుకురావచ్చు. ఈ సమ్మతిని నిరంతరం పొందడానికి వీలుగా కేంద్రంతో అనివార్యంగా ఏకీభవించే ప్రభుత్వమే జమ్ము-కాశ్మీర్‌లో అధికారంలోకి వచ్చేలా చేయడానికీ, అధికారంలో మనగలిగేలా చేయడానికి అవకాశం దొరకు పుచ్చుకుంది భారత ప్రభుత్వం. ఆర్టికల్ 370ని కొట్టి కొట్టి దాన్ని స్తొమ్మసిల్ల చేసింది భారతప్రభుత్వం. అందులోనే లభ్యమయిన సౌకర్యాన్ని భారతప్రభుత్వం దీనికోసం వాడుకుంది. ఆర్టికల్ 370 క్రమంగా క్షయమైపోయిందని మనం తరచూ వింటుంటాం. రాజ్యాంగంలోని అధికరణాలను సవరించవచ్చని భారత రాజ్యాంగం చెబుతుంది కాని వాటిని 'క్షీణింప' చేసే నిబంధనలేమీ

రాజ్యాంగంలో లేవు. అలా తరిగిపోయేలా చేయడం అనేది రాజ్యాంగ శాస్త్ర నవ్యతేమో! అన్ని రాజకీయ, రాజ్యాంగ, ప్రజాతంత్ర సూత్రాలనూ పూర్తిగా ఉపేక్షించి ఈ అద్భుతం జరిపించారు. జమ్ము-కాశ్మీర్ ప్రజల ఎడల ఇండియా పాల్పడింది కేవలం రాజకీయ, నైతిక దగాకే కాదు, రాజ్యాంగ వంచనకు కూడా పాల్పడింది. ఈ మోసకారితనమే ఇవ్వాళ జాతీయ ప్రయోజనం వేషంతో బోరవిరుచుకుని నడుస్తోంది. మన నుంచీ దేశభక్తియుత మౌన సమ్మతిని డిమాండ్ చేస్తోంది! ఏమిటీ విపరీతం అని ప్రశ్నిస్తే ఈ మధ్యనే కాలం తీరిన 'టాడా' క్రింద యావజ్జీవ ఖైదు శిక్షపడే 'విచ్ఛిన్నకర చర్య' అయిపోయింది !!!

జమ్ముకాశ్మీర్‌లోని ప్రభుత్వాలనేకాక ఆ రాష్ట్ర రాజ్యాంగ పరిషత్తును కూడా మోసపు ఎత్తుగడలకు వాడుకున్నారు. రాష్ట్ర రాజ్యంగ పరిషత్తుకు ఎన్నికలు జరిగాయి. అది **1951** లో సమావేశమయింది. చివరికి ఏదోరకంగా ఆ రాష్ట్రాన్ని భారతదేశంలో అంతర్భాగం చేయడానికి అనుకూలంగావుండే రాజ్యాంగాన్ని సృష్టించడానికి షేక్ అబ్దుల్లాపై ఆధారపడడమే భారత ప్రభుత్వం మొట్టమొదటి వ్యూహం. ఆ రాష్ట్ర ప్రజలు రాజ్యాంగ పరిషత్తును ఎన్నుకుని వాళ్ళకై వాళ్ళే వాళ్ళ కనుకూలమైన, వాళ్ళకు అనుగుణమైన రాజ్యాంగాన్ని --ఆర్టికిల్ **370** లాంఛనంగా గుర్తించిన విలీన పత్రం షరతుల ప్రకారం -- రాసుకోవడానికి గానీ, ప్లెబిసైటు నిర్వహణకు గానీ, భారత పాలకులు అంత అనుకూలంగా లేరు. ఆయన 'అవసరమైనవని చేసి పెట్టేట్లయితే' ఆయన పద్ధతుల్ని ఇండియా ప్రశ్నించదు. దానిక మారుగా భారత్ కు అనుకూలమయిన రాజ్యాంగ ఆమోదం పొందేలా అబ్దుల్లా చూడాలి. రాష్ట్ర రాజ్యాంగ పరిషత్తుకు వందస్థానాలున్నాయి. వాటిల్లో పాతిక పాకిస్తాన్‌లో వున్న కాశ్మీర్‌కు కేటాయించారు. వాటిని భర్తీ చేయడం సాధ్యం కాదు కాబట్టి తక్కిన **75** స్థానాలకు ఎన్నికలు జరగాలి. ఆశ్చర్యకరంగా అన్ని స్థానాలనూ నేషనల్ కాన్ఫరెన్స్ గెల్చుకుంది. ఇది చాలా సులభంగా జరిగిపోయింది. ఇతరుల నామినేషన్ పత్రాలను తిరస్కరింప జేశారు. అప్పటికి రెండేళ్ళుగా రాష్ట్రాన్ని మొత్తంగా నేషనల్ కాన్ఫరెన్స్ పరిపాలిస్తోందనేది గుర్తు పెట్టుకోవాలి. ప్రభుత్వానికీ, పాలక పక్షానికీ వుండే వ్యత్యాసాన్ని తుడిచేసారు. ముస్లిం కాన్ఫరెన్సు అజాద్ కాశ్మీర్‌లోకి అదృశ్యమైపోయింది. ఇక మిగిలిన ప్రతిపక్షం జమ్ము ప్రాంతంలో వున్న ప్రజా పరిషత్తే. **27** నియోజక వర్గాల్లో దాని నామినేషన్ పత్రాలు తిరస్కరించారు!

అలా షేక్ అబ్దుల్లాగారి రాజ్యాంగ పరిషత్తు నెలకొనడానికి అనుమతించారు -- ఆయన కోరిక ప్రకారం రాజ్యాంగం రాయటానికి, ఎంపిక చేసుకోవడంలో ఢిల్లీ ప్రభువులకు బాధ కలిగించకూడదనుకోండి. రాజ్యాంగాన్ని ఆమోదించేవరకూ రాజ్యాంగ పరిషత్తే రాష్ట్ర శాసన సభగా కూడా వ్యవహరిస్తుంది. అయితే షేక్ అబ్దుల్లా స్వాతంత్ర్యం లాంటి అంశాలపై అంతూ పొంతూ లేని ప్రకటనలు ఇస్తూండడంతో రాబోయే రాజ్యాంగం రూపురేఖలు ఎలా ఉంటాయోనని నెహ్రూ భయపడ్డారు. నెహ్రూ, అబ్దుల్లాలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ ఎన్నో ఉత్తరాలు రాసుకున్నారు. అభిప్రాయ భేదాల్ని తొలగించడానికి ఇరు పక్షాల చర్చలు జరిగాయి. ఈ చర్చల నుంచే **1952** ఢిల్లీ ఒప్పందం ఆవిర్భవించింది. **370**వ అధికరణంకి అనుగుణంగా జమ్ము-కాశ్మీరు రాజ్యాంగాన్ని రూపొందిస్తారని **1952**జులై**24**న కుదిరిన ఈ ఒప్పందం

పేర్కొంది. జమ్మూ-కాశ్మీర్ అధినేతను సదర్-ఎ-రియాసత్ అని పిలవాలనీ ఇతర రాష్ట్రాలకు గవర్నర్లను నియమించినట్లుగా రాష్ట్రాధినేతను రాష్ట్రపతి నియమించకూడదనీ, అధినేతను జమ్మూ-కాశ్మీర్ శాసన సభ ఎన్నుకోవాలనీ కూడా ఒప్పందంలో పేర్కొన్నారు. ఒక రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనను నెలకొల్పడానికి అధికారం ఇచ్చే 356వ అధికరణం జమ్మూ-కాశ్మీర్‌కు వర్తించదని కూడా ఒప్పందం కుదిరింది. రాష్ట్రానికి ప్రత్యేక జెండా వుంటుందనీ, దానితో పాటు భారత జాతీయ పతాకానికి గౌరవస్థానం ఇస్తారని కూడా ఒప్పందం కుదిరింది.

తొలి సదర్-ఎ-రియాసత్ ఎన్నికప్పుడు నెహ్రూతో రాజీపడేలా అబ్దుల్లాను ఒత్తిడికి గురిచేసారు. జమ్మూ-కాశ్మీరు సమస్యకు సంబంధించిన తక్కిన అన్ని విషయాలలో వ్యవహరించినట్లే ఈ విషయంలో కూడా నెహ్రూ అప్రజాస్వామికంగానే వ్యవహరించాడు. సదర్-ఎ-రియాసత్‌ను జమ్మూ-కాశ్మీర్ అసెంబ్లీలో ఎన్నిక కానిచ్చే బదులు పాలక కుటుంబానికి చెందిన యువరాజు కరణ్‌సింగ్‌ను ఢిల్లీ ఒప్పందం పుణ్యమా అని ఏకగ్రీవంగా ఎన్నికయ్యేట్లు చేసాడు. 1952 నవంబర్ 15న యువరాజు కొత్తపదవిని అధిష్ఠించాడు. కరణ్‌సింగ్ హిందూమతతత్వ వైఖరి కలిగి వున్నాడని, అబ్దుల్లా అంటే అతనికి వ్యతిరేకత ఉందనీ తెలిసే నెహ్రూ ఆయన్నే ఎంపిక చేయడమే ఆశ్చర్యం. ఇది మోసపూరిత రాజకీయాల్లో భాగమే. జమ్మూ-కాశ్మీర్‌లో ఇండియా కోర్కెలను అమలు చేయడానికి అబ్దుల్లా పై అధారపడాలి. కానీ అబ్దుల్లా నిజంగా ఆధారపడ తగినవాడు కాడు కాబట్టి అతనిని కరణ్‌సింగ్ పర్యవేక్షించాలి! ఒక శతాబ్దానికి పైగా ఏ రాజ కుటుంబానికి వ్యతిరేకంగా కాశ్మీరీలు పోరాడారో ఆ కుటుంబ వారసుణ్ణి జమ్మూ-కాశ్మీరు రాష్ట్ర అధినేతగా వాళ్ళ నెత్తిన రుద్దాడు నెహ్రూ.

అలా షేక్ అబ్దుల్లాను పూర్తిగా దూరం చేసుకోకుండానే (జమ్మూ-కాశ్మీర్‌లో ప్రజాస్వామ్యం అంటే అర్థం ఇదే), కాశ్మీరాన్ని ఇండియాలో భాగంగా చేసే (పూర్తిగా అంతర్భగంగా కాకున్నప్పటికీ) రాజ్యాంగాన్ని తయారు చేయించాలని నెహ్రూ కోరుకుంటుండగా, ఢిల్లీ ఒప్పందానికి వ్యతిరేకంగా జమ్మూ ప్రజాపరిషత్ ఆందోళనను చేపట్టింది. దీనికి దేశమంతా జనసంఘ్ వత్తాసు పలికింది. జనసంఘ్ 1951 లో పుట్టింది. ఒకే దేశంలో "దో విధాన్, దో ప్రధాన్, దో నిషాన్" (రెండూ రాజ్యాంగాలు, ఇద్దరు దేశాధినేతలు, రెండు జెండాలు) ఉండడానికి వీలులేదని లయబద్ధంగా మంత్రోచ్చాటన చేస్తూ వాళ్ళు పూర్తి హిందూ జాతీయవాద రంగులతో బయటికి వచ్చారు. షేక్ అబ్దుల్లాను ఇది కల్లోల పరిచిన విషయమూ, ఆర్టికిల్ 370 కింద వాగ్దానం చేయబడిన స్వయంప్రతిపత్తిని గౌరవించరని నమ్మడానికి కారణమైందనే విషయమూ ఇంతకు ముందే మనం చూసాం.

1950 జులై 10 న (అంటే ఈ సంక్షోభానికి చాలాముందే) నెహ్రూకు రాసిన లేఖ అబ్దుల్లా అభిప్రాయాన్ని ప్రతిబింబిస్తుంది.

*"దేశాన్ని నిజమైన లౌకిక లాజ్యంగా నిర్మించాలనే నీ ఆదర్శాన్ని అంగీకరించని వారు ఇప్పుడు ఇండియాలో బలంగా పనిచేస్తున్నారనేది స్పష్టం.......నేను అనేక సార్లుమీకు చెప్పాను.....మేం ఇండియాలో విలీనమయింది.......మేం రెండు*

*ప్రకాశవంతమైన తారకలను...... ఆశ, ఆకాంక్ష అనే తారకలను.... అంటే గాంధీజీని, మిమ్మల్నీ చూసాం కాబట్టేనని. పాకిస్తాన్‌తో మాకు పోలికలు ఎక్కువ వున్నప్పటికీ ఆవేశంతో మేం చేరలేదు. ఎందుకంటే మా కార్యక్రమం వాళ్ళ విధానంతో పొసగదు అని అనుకోవడంవల్లే. మా స్వంత పంథాలో మా ప్రత్యేకతలకు తగినట్లుగా మా రాజ్యాన్ని నిర్మించలేమనే నిర్ధారణకు మమ్మల్ని నెడితే అప్పుడు మా ప్రజలకు నేనేం జవాబు చెప్పాలి? వాళ్ళకు నా మొహం ఎలా చూపించాలి?"*

ఆర్టికల్ 370ని రద్దుచేయాలనీ, కాశ్మీరుకు ఎలాంటి ప్రత్యేకహోదా ఇవ్వవద్దనీ ప్రజాపరిషత్ వాదించింది. ఇవ్వాల్టి వరకూ ఈ వాదనలే హిందూ మతోన్మాదశక్తుల ఆందోళనలకు ఊపిరి. కాశ్మీరీ నాయకులు జమ్ము ప్రాంతం పట్ల చూపించిన అనుభవ శూన్యత వల్ల తలెత్తిన అసమ్మతిని హిందూ జాతీయవాదంతో జోడించడంతో ప్రజాపరిషత్ సఫలమైంది. బలరాజ్‌పురి చెప్పినట్లు షేక్ అబ్దుల్లా కాశ్మీరీ నాయకుడు మాత్రమే అనే అభిప్రాయన్ని అధిగమించడంలో విఫలమయి పరిస్థితుల్ని మెరుగుపర్చలేకపోయాడు.

ప్రజాపరిషత్ ఆందోళన నెహ్రూను చికాకు పర్చిందంటారు. ప్లెబిసైటుతో సహా విలీన షరతుల్ని నిజాయితిగా నెహ్రూ నమర్ధించి వుంటే అతను హిందూశక్తులతో తలపడి వుండేవాడు. కానీ ఆయన వ్యూహం కాశ్మీరీ జాతీయ నాయకుడైన షేక్ అబ్దుల్లాను లాలించో, బెదిరించో జమ్ము-కాశ్మీరును నిశ్శబ్దంగా ఇండియాలో కలిపేసుకోవడం. నెహ్రూ అంచనాలో కాశ్మీరీలను షేక్ అబ్దుల్లా ఎటంటే అటు నడిపించగలడు. అందువల్లే నెహ్రూ హిందూ మతోన్మాదుల సవాలును ఎదుర్కోలేదు.

ఆ తర్వాత జరిగిన పరిణామాలకు ఎవరెంత వరకు బాధ్యులనే విషయంపై రకరకాల కథనాలున్నాయి. కుట్రలను బహిరంగపరచడం మనకు అనవసరం. ప్రజాపరిషత్ ఆందోళన, అది దేశంలో సృష్టించిన వాతావరణం షేక్ అబ్దుల్లాను వదిలించుకుందామనుకునే వారికి సహకరించాయి. జమ్ము ప్రజాపరిషత్ ఆందోళనను దేశమంతా ప్రచారం చేస్తున్న జనసంఘ్ అధ్యక్షుడైన శ్యాంప్రసాద్ ముఖర్జీ 1953 మే 8న కాశ్మీరు లోయ లోకి ప్రవేశించాడు. అతనిని షేక్ అబ్దుల్లా ప్రభుత్వం అరెస్టు చేసింది. జైలులో డిటెన్షన్‌లో వుండగా గుండె ఆగి జూన్ 23న ఆయన చనిపోయారు. ఆయన మరణం దేశవ్యాప్త ప్రతిచర్యను రెచ్చగొట్టింది.

ఈ నేపథ్యంలోనే షేక్ అబ్దుల్లా విదేశీయులతో స్నేహంగా వుంటున్నాడనే నిరాధార ఆరోపణను సృష్టించారు. ఇండియాలో జమ్ము-కాశ్మీరు విలీనాన్ని అంతం చేసేందుకు కుట్రలు పన్నుతున్నాడని ఆరోపణలు సృష్టించారు. రాష్ట్ర సదర్-ఎ-రియాసత్ కరణ్‌సింగ్ 1953 ఆగస్టు 9న షేక్ అబ్దుల్లాను ప్రధాన మంత్రి పదవి నుంచి తొలగించి అరెస్టు చేయించాడు. ఈ ఘటనల పట్ల నెహ్రూ అసంతృప్తి వ్యక్తపరిచాడు. ఈ పరిస్థితికి ప్రజాపరిషత్ ఆందోళనే కారణమని ఆరోపించాడు. కాని "లంగరు కోల్పోయినందుకు", ప్రధాన లక్ష్యాన్నుంచీ 'తప్పిపోయినందుకూ', 'సుదీర్ఘ కాలంపాటు ఏ సూత్రాల కోసం నిలబడ్డాడో వాటిని మర్చిపోయినందుకూ' నెహ్రూ అబ్దుల్లానే తప్పుపట్టాడు. ఆ'సూత్రాలు', జమ్ము-కాశ్మీరును ఇండియాలో చేర్చడానికి ఢిల్లీకి పనిముట్టుగా పనిచేయడమే తప్ప మరేమీ కావు. జమ్ము-కాశ్మీరు రాజ్యాంగ రచన సాగుతున్నప్పుడే,

సరిగ్గా ఆ కీలక సమయంలోనే అబ్దుల్లా తన ఈ పాత్రను మార్చుకున్నాడని అనుమానించడం ఆయన్ని అధికారం నుంచీ తొలగించి జైల్లో వేయడానికి ప్రధాన భూమికగా పనిచేసిందనడంలో సందేహం ఏమీ లేదు. జమ్ము-కాశ్మీరు రాజ్యంగ పరిషత్తు విధి అని నెహ్రూ ఏ తరహా విలీనతను సూచించాడో దాన్ని కాక ఇతర ప్రత్యామ్నాయాల గురించి షేక్ అబ్దుల్లా మార్గదర్శకత్వంలో రాజ్యంగ పరిషత్తు యొక్క వర్కింగ్ కమిటీ అప్పుడు చర్చిస్తోంది. సరిగ్గా అప్పుడే ఆయన్ని ఖైదు చేసారు.

1947-53 మధ్యకాలంలో షేక్ అబ్దుల్లా అసందిగ్ధంగా ఉన్న మాటనిజమే. బాగా ఊగిసలాడిన మాట నిజమే. అయితే ఇది తాను అదుపుచేయలేని శక్తులు తనను చుట్టిముట్టవున్నందువల్లనే కాని మరే ఇతర కారణం వల్లకాదు. అయినప్పటికీ తన పాత్రగురించీ, కాశ్మీరీ ఆకాంక్షల గురించీ తన అవగాహన ఎన్నడూ భారత ప్రభుత్వం అనుకున్నట్లుగా లేదు. జమ్ము-కాశ్మీరు రాజ్యాంగ పరిషత్తు ప్రారంభోపన్యాసంలో తన భావాలను సమగ్రంగా ప్రకటించాడు. అత్యంత విశిష్టమైనదీ ఉపన్యాసం అని అజిత్ భట్టాఛార్జీ అంటాడు.

'పరస్పర గౌరవం, సహనాలనుంచీ ఉద్భవించిన ప్రామాణిక కాశ్మీరీ ప్రత్యేకతల సంశ్లేషణ ద్వారా శతాబ్దాల తర్వాత మనం స్వేచ్ఛారేవుకు చేరుకున్నాం." అని అబ్దుల్లా అన్నాడు. రాజ్యాంగ పరిషత్తు నిర్వహించాల్సిన కర్తవ్యాన్ని గురించి చెబుతూ భారత రాజ్యాంగం జమ్ము-కాశ్మీర్‌ను భిన్నంగా చూసిందనీ, దానికి స్వయంప్రతిపత్తి ఇచ్చిందనీ అందువల్ల అత్యుత్తమ సంప్రదాయాలకూ, ప్రజల విశిష్టతలకూ అనుగుణంగా వారి పురోభివృద్ధిని మరింత ముందుకు తీసుకుపోయేందుకు వాళ్ళు కోరుకున్న రాజ్యాంగాన్ని రూపొందించుకోవడానికి వారికి సంపూర్ణ స్వేచ్ఛవుంది అని అబ్దుల్లా చెప్పాడు.

పాకిస్తాన్ వైపుకన్నా ఇండియా వైపే కాశ్మీరీలు ఎందుకు మొగ్గు చూపారనే విషయాన్ని వివరిస్తూ భారత రాజ్యాంగం ఏ వ్యత్యాసాలూ చూపకుండా న్యాయం, స్వేచ్ఛ, సమానత్వంల ప్రాతిపదికన లౌకిక ప్రజాస్వామ్యాన్ని దేశలక్ష్యంగా పెట్టుకుందని చెప్పాడు. ఇండియాలాంటి హిందువులు మెజారిటీగా గల దేశంలో కాశ్మీరీ ముస్లీములు క్షేమంగా వుండరేమోనని అనుకునే వారి భయాలను భారత రాజ్యాంగలక్ష్యం తొలగిస్తుందని అన్నాడు. కాశ్మీరులో సాగిన జాతీయోద్యమం ఈ లౌకిక ప్రజాతంత్ర సూత్రాల వైపే సహజంగా ఆకర్షితమయిందన్నాడు. ఎందుకంటే ఇక్కడి ప్రజలు ఒక మతం కన్నా మరో మతం గొప్పదనో, ఒక సాంఘిక సమూహం కన్నా మరో సాంఘిక సమూహం గొప్పదనో చెప్పి ఒకదాన్ని కించపరిచి మరోదాన్ని ఆదరించే ఏ విధానాన్నీ ఎన్నటికీ అంగీకరించరు. ఇండియాలో కాశ్మీరు విలీనం కొనసాగుతూ వుంటే అది ఇండియాలో పెరుగుతున్న హిందూ మతతత్వ శక్తులను ఓడించడానికి కూడా సహాయపడుతుందనీ, మతతత్వవాద తర్కానికి విరుగుడుగా పనిచేస్తుందనీ ఆశిస్తున్నట్లు చెప్పాడు. (ఈ ఆశే గాంధీని కూడా కదిలించింది. హిందూ మతోన్మాదానికి విరుగుడుగా పని చేస్తుందనే కారణంగానే గాంధీ కాశ్మీరువైపు ఆకర్షితుడయ్యాడు)

కాశ్మీర్ ఒక ప్రాచ్య స్విడ్జర్లండుగా తయారు కావడానికి గల అవకాశాలను కూడా ఆలోచించాడు. అంటే ఒక స్వతంత్ర తటస్థ దేశంగా తయారు చేయడానికి

గల అవకాశాలను ఆలోచించాడు. "ఇది ఆకర్షణీయంగా కన్పించవచ్చు. ప్రస్తుత ప్రతిష్టంబన నుంచీ బయట పడవేసే మార్గాన్ని చూపిస్తుంది" అని కూడా ఆలోచించాడు. అయితే అనేక దేశాలు చుట్టు ముట్టివుండగా అలాంటి తటస్థ దేశపు సరిహద్దుల్ని భద్రంగా కాపాడుకోవడం కష్టమవుతుందనే ఏకైక ఆచరణాత్మక ఆలోచనతో ఆ ప్రతిపాదనను వ్యతిరేకించాడు. అలాంటి అనేక దేశాల్లో ముఖ్యమైనవి ఇండియా, పాకిస్తాన్‌లు. ఈ రెండు దేశాలు తాము నాగరిక దేశాలని చెప్పుకుంటాయి. ఈ దేశాలు తాము సగర్వంగా ప్రకటించుకునే హిందూ, ఇస్లామిక్, లౌకిక సంప్రదాయాలూ, సూత్రాల ప్రాతిపదికన నాగరిక దేశాలుగా ప్రవర్తించివుంటే ఒక స్వతంత్ర జమ్ము-కాశ్మీర్ (కనీసం కాశ్మీర్) వాస్తవ రూపం ధరించి వుండగలిగేది. తాము ప్రజాతంత్ర వాదుల మనుకునే భారతీయులూ, పాకిస్తానీలూ ఈ విషయంలో ఆత్మ పరిశీలన చేసుకోవాలి.

ఏదేమైనా షేక్ అబ్దుల్లా, ఆయనతో ఏకీభవించే ఇతర కాశ్మీరీయులూ, తమ పరిస్థితినీ, అబ్దుల్లా పాత్రనూ ఎలా చూసారనేది ఆ ఉపన్యాసం వివరిస్తుంది. ఎంత సందిగ్ధంగానైనప్పటికీ ఈ సూత్రాల కోసమే ఆయన నిలబడ్డాడు. జమ్ము-కాశ్మీరును ఇండియాలో కలిపేసే సూత్రానికే అబ్దుల్లా కట్టుబడి వున్నాడనే భావన కేవలం నెహ్రూది మాత్రమే. ఆయన ఎన్నడూ కట్టుబడి వుండని ఈ తుచ్ఛ భావన నుంచీ వైదొలిగి నందుకే ఆయన్ని శిక్షించారు.

1953 నుంచీ 1968 వరకూ షేక్ అబ్దుల్లా ఎక్కువ కాలం నిర్బంధంలోనే ఉన్నాడు. 1958 జనవరి 8న విడుదలయ్యాడు. ఏప్రల్ 30న మళ్ళీ అరెస్టు చేశారు. 1964 ఏప్రల్ 6న విడుదలయ్యాడు. 1965మే 8న మళ్ళీ అరెస్టు చేశారు. 1968 జనవరి 2 న విడుదల చేశారు. 1971 లో ఆయన్ని జమ్ము-కాశ్మీరు నుంచీ బహిస్కరించారు. ఆయనకు విశ్వాసపాత్రులుగా వుండే సహచరుడు మీర్జా అఫ్జల్ బేగ్ కూడా దాదాపు అంతేకాలం ఖైదులో మగ్గిపోయాడు. వీళ్ళిద్దర్నీ ఏకోర్టులోనూ విచారించలేదు. ఏనేరంకోసమూ, ఏ కోర్టూ శిక్షించలేదు. 1953లో అబ్దుల్లాను అరెస్టు చేసినప్పుడు కాశ్మీరులోయలో ప్రజలు కోపోద్రిక్తులై ఆందోళన చేసారు. ఈ ఆందోళనను షేక్ అబ్దుల్లా స్థానంలో ప్రధాన మంత్రి అయిన బక్షీ గులాం మొహమ్మద్ ప్రభుత్వం హింసాత్మకంగా అణచివేసింది. పోలీసు కాల్పుల్లో దాదాపు 60 మంది చనిపోయారు. బక్షీ గులామ్ మొహమ్మద్ పంథాను అనుసరించిన గులామ్ మహమ్మద్‌సాదిక్, మీర్‌ఖాసిమ్ అనే ఇద్దరు నేషనల్ కాన్ఫరెన్సు నాయకుల్ని షోపియన్ వద్ద ఇరవై వేల మందితో కూడిన సమూహం దాదాపు హతమార్చి నంతపని చేసారు. దశాబ్దం తర్వాత మళ్ళీ అదేనాటకం పునరావృతమైంది. గులామ్ మొహమ్మద్ సాదిక్ ప్రధాన మంత్రి అయ్యి బక్షీ గులామ్ మొహమ్మద్‌ను అస్పష్ట ఆరోపణలతో అరెస్టు చేయిస్తాడు. మరో అర్ధ దశాబ్దం తర్వాత సాదిక్ ను వ్యతిరేకించేందుకూ, అతణ్ణి దుర్బలుణ్ణి చేసేందుకూ ఢిల్లీ ప్రభువులు మీర్‌ఖాసిమ్‌ను ప్రోత్సహిస్తారు.

# విలీన రాజకీయాలు -- 2 (1953-87)

*"కాశ్మీరుకు ప్రజాస్వామ్య హక్కును నిరాకరించే విధానాన్ని పట్టువీడకుండా కొనసాగిస్తూ వచ్చారు. ఎన్నికల్లో కుతంత్రాలకు పాల్పడుతూ రాష్ట్రంలో ఏక పార్టీపాలనను రుద్దారు."*

*"ఈ విధానం వెనుకవున్న మౌలికమయిన ఆలోచన -- కాశ్మీరీలు ప్రజాస్వామ్యానికి తగరు; వాళ్ళు దానికి అర్హులు కాదు; ప్రజాస్వామ్యమూ జాతీయ ప్రయోజనాలూ ఒకే ఒరలో ఇమడవు"*

*"ఈఆలోచన ఒక్క కాశ్మీరు ప్రజానీకానికే కాదు మొత్తం ప్రజాస్వామిక భావనకే అవమానకరం"*

*------బలరాజ్‌పురి*
*కాశ్మీరు టువర్డ్స్ ఇన్‌సర్జెన్సీ లో*

షేక్ అబ్దుల్లాను పదవినుంచీ తొలగిచేందుకు ఆయన కేబినెట్‌లోనే వున్న కొందరు మంత్రులు సహకరించారు. వీళ్ళకు నాయకుడు బక్షీ గులామ్ మొహమ్మద్. ఆయన నేషనల్ కాన్ఫరెన్సును చీల్చి, జమ్ము-కాశ్మీర్‌ను ఇండియాలో విలీనం చేయడానికి బద్దురాలైన ఇండియా అనుకూల గ్రూపును నెలకొల్పాడు. ఈ మొత్తం కార్యక్రమానికంతా పథకాన్ని రచించిందీ, దాన్ని అమలు చేసిందీ బక్షీ గులామ్ మోహమ్మద్, డి.పి.ధర్ (ఈయనో కాశ్మీరీ పండిట్, అబ్దుల్లా కేబినేట్‌లో డిప్యూటీ హోం శాఖ మంత్రి), సదర్-ఎ-రియాసత్ కరణ్‌సింగ్, ఢిల్లీలో కూర్చున్న భారత ప్రభుత్వమునూ. డి.పి.ధర్ "ఢిల్లీకి ప్రత్యేక ఏజెంటుగా పనిచేసాడు" అని షేక్ అబ్దుల్లా తన జ్ఞాపకాల్లో రాసుకున్నాడు. ఈ వ్యవహారంలో ధర్ నీచమయిన పాత్ర నిర్వహించాడని అబ్దుల్లా రాసాడు. "ధర్‌లు వృద్ధి చెందితే కాశ్మీర్ నాశనమవుతుంది" అనే పాత కాశ్మీరీ సామెతను హాస్యస్ఫోరకంగా గుర్తుకు తెచ్చుకుంటాడు. ధర్ ఆ తర్వాత ఇందిరా గాంధీకి చాలా పలుకుబడి గల సలహాదారు అయ్యాడు. ఆయన పూర్వీకుడొకడు డోగ్రా పాలకుడైన గులాబ్‌సింగ్‌కు పర్సనల్ సెక్రటరీగా పనిచేయడం కేవలం కాకతాళీయమే కావచ్చులెండి.

బక్షీ గులామ్ మొహమ్మద్ అవినీతి పరుడు నిరంకుశుడు. జమ్ము-కాశ్మీర్ అభివృద్ధి పేరిట కేంద్రం త్వరలోనే డబ్బు కుమ్మరించడం మొదలెట్టింది. ఈ ఔదార్యం రాష్ట్రప్రధానమంత్రికీ, ఆయనగారి బంధుజనానికి బాగానే ఊతమిచ్చింది. అతగాడి పాలనను బి.బి.సి. -- బక్షీ బ్రదర్స్ కార్పోరేషన్ -- అని జనం హాస్యంగా చెప్పుకునేవాళ్ళని అజిత్ భట్టాచార్జీ అంటాడు. అతగాడు తన మనిషి కావడంతో ఢిల్లీ ప్రభువులు అతణ్ణేమీ అనలేదు. అతడివ్వాల్సిన ప్రతిఫలం -- నేషనల్ కాన్ఫరన్సులో తన ముఠాను విలీనానికి అనుకూలంగా ఉంచాలి; జమ్ము-కాశ్మీరుకు కేంద్రప్రభుత్వ అధికారులను విస్తరింపచేయడానికి అతగాడి ప్రభుత్వం సమ్మతించాలి. అలా విస్తరించిన వాటిల్లో మొదటిది 1954 నాటి రాజ్యాంగ (జమ్ము-కాశ్మీర్‌కు వర్తించే) ఉత్తర్వు. దీని ద్వారా

జమ్ము-కాశ్మీర్‌కు సంబంధించి పార్లమెంటు శాసనాధికారాన్ని పెంచారు. ఆతర్వాత మరిన్ని అంశాలను చేరుస్తూ ఈ ఉత్తర్వును సవరించారు. కేంద్ర జాబితాలో గల ఆరు అంశాలపై మినహా మిగిలిన అన్ని అంశాలపై పార్లమెంటు జమ్ము-కాశ్మీర్ కోసం చట్టాలు చేయవచ్చు. ఆయేడే జమ్ము-కాశ్మీరు రాజ్యాంగ పరిషత్తు భారతదేశంలో జమ్ము-కాశ్మీరు విలీన చట్టబద్ధతను ధృవీకరించింది. 1958లో ఐ.ఎ.ఎస్., ఐ.పి.ఎస్., ఇంకా ఇతర కేంద్ర సర్వీసులను రాష్ట్రపతి ఉత్తర్వు ద్వారా జమ్ము-కాశ్మీరుకు విస్తరింపచేశారు.

షేక్ అబ్దుల్లా అరెస్టు తర్వాత ఆయన సహచరుడు మీర్జా అఫ్జల్ బేగ్ 1955 ఆగస్టు 9న ప్లెబిసైటు ఫ్రంటును నెలకొల్పాడు. విలీనానికి అనుకూలంగా వున్న బక్షీ నాయకత్వానగల నేషనల్ కాన్ఫరెన్సును ఈ సంస్థ వ్యతిరేకించింది. అబ్దుల్లా పంపినట్లే బక్షీని కూడా పలుమార్లు జైలుకు పంపారు. 1956 నవంబర్ 17న జమ్ము-కాశ్మీరు రాజ్యాంగం రూపొందింది. 'జమ్ము-కాశ్మీరు రాష్ట్రం యూనియన్ ఆఫ్ ఇండియాలో అంతర్భాగం -- అలా అంతర్భాగంగానే ఇకముందు కూడా వుంటుంది' అని ఆ రాజ్యాంగం ఏమాత్రం అస్పష్టత లేకుండా ప్రకటించింది. అప్పుడు షేక్ అబ్దుల్లా జైలులో వున్నాడు. రాజ్యాంగం అలా ప్రకటించడం పట్ల ఆయన తన నిరసన తెలియజేసాడు. అసలు ఆయన్ని జైల్లో వేసింది ఇలాంటి ప్రకటన ఆ రాష్ట్ర రాజ్యాంగంతో చేయించడానికేనాయె! ప్లెబిసైటు తీర్మానాలను తన ముందుంచుకున్న ఐక్యరాజ్యసమితి భద్రతా సమితి కూడా ఈ ప్రకటన పట్ల అసమ్మతి తెలిపింది. 1957 జనవరి 24 న చేసిన ప్రకటనలో 'ఐక్యరాజ్యసమితి తీర్మానాల ప్రకారం ఆ రాష్ట్రాన్ని అలా విలీనం చేయడం సక్రమమన్పించుకోదు' అని ఐక్యరాజ్యసమితి తెలిపింది. కానీ ఇలా కుయుక్తితో జమ్ము-కాశ్మీరు రాజ్యాంగ పరిషత్తుచే కాశ్మీరు విలీనాన్ని ఔననిపించుకున్న అంగీకారాన్నే, విలీనానికి ప్రజల మద్దతు వుందని ఆ తర్వాత భారతదేశం వాదించడానికి ఉపయోగించుకుంది.

కొత్త రాజ్యాంగం ప్రకారం 1957లో ఎన్నికలు జరిగాయి. బక్షీ గులామ్ మొహమ్మద్ నాయకత్వాన వున్న నేషనల్ కాన్ఫరెన్సు గెలిచింది. అయితే 75 సీట్లకు గాను 32 సీట్లకే పోటీజరిగింది. తక్కిన అభ్యర్థులు (ఎక్కువగా కాశ్మీరు లోయలో) పోటీ లేకుండా ఎన్నికయ్యారు. ఇది 'బెదిరింపు, భీతావహంలో ప్రజాస్వామ్యం'. కాశ్మీరీ రాజకీయాలపై ప్రేమ్‌నాథ్ బజాజ్ ఇదే పేరుతో ఒక పుస్తకం రాశాడు. 1962 ఎన్నికల్లోనూ బక్షీ పార్టీనే గెలిచింది. 72 స్థానాలకు గాను 70 స్థానాల్లో గెలుపొందింది. కానీ పోటీ జరిగింది మాత్రం 41 సీట్లకే. ఈ ఎన్నికల గురించే "కనీసం కొన్ని స్థానాల్లోనైన ఓడిపోయివుంటే బాగుండేదని" బక్షీ గులామ్ మొహమ్మద్‌తో నెహ్రూ అన్నాడని చెబుతారు. కానీ ఈ భీతావహ పాలనతో ప్రధానంగా లాభపడింది నెహ్రూ ప్రభుత్వమే. ప్రజాస్వామ్యాన్ని ఈ విధంగా అవహేళన చేసే పని 1967లోనూ 1972 లోనూ కూడా జరిగింది. కాశ్మీరు జనం ఒక ఎన్నిక తర్వాత మరో ఎన్నికలో పోల్గొంటూ కాశ్మీరు విలీనాన్ని ధృవీకరించేసారనీ, అందువల్ల ఇక జమ్ము-కాశ్మీర్‌లో ప్లెబిసైటు నిర్వహించాల్సిన అవసరం లేదని ఇండియా ఐక్యరాజ్యసమితిలో స్థిరంగా వాదిస్తూపోయింది.

జమ్ము-కాశ్మీరు లో ఏరకమైన ప్రజాస్వామ్యమూ వేరూనకుండా చూడడమే ఇండియా వ్యూహం. జమ్ము-కాశ్మీరు ప్రజలను ఇండియా తగినంతగా విశ్వసించలేదు. ఎంపిక చేసుకున్న విలీన అనుకూలుర మీద ఆధారపడ్డానికే మొగ్గు చూపింది. అతగాడికి అన్నిరకాల వత్తాసూ ఇవ్వ స్వేచ్ఛ ఇచ్చేయి; జమ్ము-కాశ్మీర్‌కు పంపిన భారీ నిధుల్ని స్వాహా చేసే అవకాశం కల్పించు; ప్రత్యర్థుల పైన పాకిస్తానీ అనుకూల కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే నిరాధార ఆరోపణలు చేసే స్వేచ్ఛ ఇవ్వ; ఏరకమైన నిరసనను గానీ, ఆందోళనను గానీ అనుమతించకుండ అణచివేయడానికి అన్ని చట్టబద్ధ నియమాలనూ ఉల్లంఘించడానికి స్వేచ్ఛనివ్వ-- ఇదీ భారత ప్రభుత్వం అనుసరించిన విధానం.

బలరాజ్‌పురి చెప్పినట్లు కాంగ్రెసు పాలకులు అనుసరించిన ఈ విధానాన్ని గురించి భారతదేశంలోని రాజకీయపార్టీలకూ పత్రికలకూ, మేధావులకూ తెలిసినప్పటికీ వాళ్ళందరి మధ్యా ఒక రకమైన ఏకాభిప్రాయం వుంది. వాళ్ళెవరూ కాశ్మీరీల దృష్టినుంచీ చూడలేదు. ఇండో పాకిస్తాన్ వైరాన్నుంచో లేదా మతోన్మాదం లౌకిక వాదం దృష్టి నుంచో చూశారు. కాశ్మీర్‌నుంచీ పాకిస్తాన్‌నూ, ముస్లిం మతోన్మాదులనూ దూరంగా వుంచగలిగావాళ్ళే అక్కడ వుండాలని అందరూ అనుకున్నారు. భారత ప్రయోజనాల రీత్యాను, లౌకిక వాద ప్రయోజనాల రీత్యానూ అలాంటి వ్యక్తికి మద్దతు ఇవ్వాలనీ, ఆవ.క్కని హాలోపేతం చేయాలనీ అనుకున్నారు. ఆ వ్యక్తి అవినీతిపరుడు కావచ్చు; నిరంకుశుడు కావచ్చు; ప్రజల్లో అపఖ్యాతి పాలైన వాడు కావొచ్చు. అవన్నీ అప్రస్తుతం అనుకొన్నారు. నెహ్రూ తనతో ఇలా అన్నాడని బలరాజ్‌పురి చెబుతాడు.

*"మేం అంతర్జాతీయ రంగం మీద కాశ్మీరు కోసం జూదమాడాం. దాన్ని ఒదులు కోవడానికి సిద్ధంగాలేము. ప్రజాస్వామ్యమూ, నైతికతా వేచి ఉంటాయిలే"*

చాలామంది భారతీయ రాజకీయ నాయకులకన్నా ప్రజాస్వామ్యవాది అని పేరు తెచ్చుకున్న జయప్రకాశ్ నారాయణ్ కాశ్మీరీ స్వయం ప్రతిపత్తిని బాగా సమర్థించిన వాడయినప్పటికీ 'కాశ్మీర్ అంతర్జాతీయ వివాదంగా కొనసాగినంత కాలం' ఆ రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీ పెరగాలని తాను కోరుకోవడం లేదన్నాడు. నేషనల్ కాన్ఫరెన్సు కాక మరో ప్రతిపక్షపార్టీని ఏర్పర్చడానికి జరిగిన ప్రయత్నాలన్నిటినీ ఢిల్లీ సర్కారే కాదు ఇతర ప్రతిపక్ష పార్టీలూ, పత్రికలూ కూడా నిరుత్సాహపర్చాయి. వాళ్ళు చెప్పే కారణం ఒక్కటే - అలా ప్రతిపక్షం అంటూ పెరిగితే జమ్ము-కాశ్మీర్‌లో లౌకిక జాతీయవాద శక్తుల బలహీనపడతాయి. అలా బలహీనపడడాన్ని నిరోధించాలంటే ప్రతిపక్షం పెరగకూడదు! ఈ విషయం కూడా బలరాజ్‌పురీనే గుర్తుచేస్తాడు. బక్షీ నాయకత్వానగల నేషనల్ కాన్ఫరెన్సును సాదిక్ చీల్చి 1957 లో ప్రజాతంత్ర నేషనల్ కాన్ఫరెన్సును నెలకొల్పినప్పుడూ నేషనల్‌కాన్ఫరెన్సుతో తిరిగి ఐక్యం కమ్మని ఆయన్ని ఒత్తిడి చేసారు. 1961 లో ఆయన తన పార్టీని ఐక్యం చేయగానే ప్రధాన వార్తా పత్రికలైన ది హిందూ, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, హిందూస్తాన్ టైమ్స్ లాంటివి ఆయన చర్యను దేశభక్తి యుత చర్య అని పొగుడుతూ ఆకాశానికెత్తేసాయి. సాదిక్ తన గ్రూపును కాంగ్రెస్‌లో కలిపేసిన తర్వాత 1967 లో బక్షీ తన నేషనల్ కాన్ఫరెన్సును పునరుద్ధరించాడు. స్వంత గూటికి చేరుకొమ్మని ఆయన్ని కూడా ఒత్తిడి చేసారు. ఆయనలా చేయగానే జాతీయ శక్తులను

సంఘటితం చేయడంలో సహాయం చేసినందుకు పత్రికలన్నీ తెగ పొగిడేసాయి. లోయలో తమ పార్టీ శాఖలను పెంచడానికి అత్యధిక పార్లమెంటరీ పార్టీలు విముఖత చూపాయి. అలాచేస్తే లౌకిక శక్తులు బలహీనపడతాయనేదే అవి చెప్పిన కారణం. ప్రజాసోషలిస్టు పార్టీ లోయలోకి ప్రవేశించడానికి ప్రయత్నిస్తే దానిపై బక్షీ మనుషులు భౌతికంగా దాడిచేసారు. ఇక నెహ్రూ గారైతే "వాళ్ళు దేశ శత్రువులతో చేతులు కలుపుతున్నారు" అని నిందించాడు. నిజానికి ఇక్కడ స్వవచన వ్యాఘాత వైఖరి (కుట్రపూరితవైఖరి అనొచ్చేమో!) ఇమిడివుంది. జమ్ము-కాశ్మీరు ప్రజలు నిరంకుశ పాకిస్తాన్ వైపు కన్నా లౌకిక ప్రజాతంత్ర భారతం వైపు స్వచ్ఛందంగా మొగ్గి చూపారనే అభిప్రాయం ఒకటుంది. ఇండియాలో ఇదొక విశ్వాసం. ఒక వేళ ఇదేనిజమైతే మామూలు పార్లమెంటరీ సంస్థలు పెరగడానికి జమ్ము-కాశ్మీర్‌లో అవకాశం ఇచ్చి వుండాల్సింది. అప్పుడు ఇండియాతో వున్నందుకు ఈ సంస్థల ద్వారా జనం సంతోషాన్ని వ్యక్తపరచగలిగి వుండేవాళ్ళు. బలరాజ్‌పురి మాటల్లో చెప్పాలంటే జమ్ము-కాశ్మీర్‌ను భారత ప్రజాస్వామ్యంతో సమైక్యమొందించటానికి సీరియస్ ప్రయత్నం చేసి వుండాల్సింది. కానీ దీన్ని జరగనీయలేదు. భారత దేశపు స్వతస్సిద్ధ ఔన్నత్యం వల్ల జమ్ము-కాశ్మీర్‌ను భారత ప్రజాస్వామ్యంలో విలీనం కావాలని గానీ, దాన్ని భారతదేశంతో గాఢ అనుబంధం పెనవేసుకోనివ్వాలని గానీ ఎప్పుడూ మనస్సులో కూడా అనుకోలేక పోయారు. చేసిన ప్రయత్నమల్లా దాని భారత రాజ్యంలో కలిపేసుకోవడమే. ఈపనిని ఇండియా తరపున చేయడానికి ఒక ఏజెంటు మాత్రమే అవసరమయ్యాడు. అలాంటి వ్యక్తికి వ్యతిరేకంగా ఆరోగ్యకరమైన పార్లమెంటరీ ప్రతిపక్షం ఎదగడానికి కూడా ఎవ్వరూ ఒప్పుకోలేదు. ఏదో ఒక ప్రతిపక్షమంటూ పెరిగినా దాన్ని జాతివ్యతిరేకమని ముద్రవేసారు. ఒక కాశ్మీరీ విద్యావేత్త చెప్పినట్లు కాశ్మీరు పాలకులు ఢిల్లీ నుంచీ మరిన్ని నిధులు పొందడానికీ, వాళ్ళు నేరస్థ చర్యలకు పాల్పడుతూ కూడా బేఫికర్‌గా వుండడానికీ, లోయలో 'వేర్పాటువాదా శక్తుల ప్రమాదం' అనేదాన్ని సాకుగా వాడుకోవడం మొదలుపెట్టారు. ప్రజాతంత్ర రాజకీయ జీవనాన్ని నిరర్థకం చేసే క్రియ కాశ్మీర్‌కు చెప్పలేనంత హాని చేస్తుందని చూడలేక పోయారు.'కారణమేమంటే 'కాశ్మీర్ సమస్య' కాశ్మీరీల సమస్యకాదనీ, వాళ్ళను పాకిస్తాన్ నుంచీ ఎలా దూరంగా వుంచడమా అనే ఇండియా సమస్యేనని వాళ్ళు భావించారు. ప్రజాతంత్రం వుంటే కాశ్మీరీలను పాకిస్తాన్ ఎటు తీసుకుపోతుందో! అందుకని కాశ్మీరీలను నమ్మకూడదు అనుకున్నారు. బలరాజ్‌పురిని ఉటంకించాలంటే 'పరిమితమైన, ప్రమాద రహితమైన విషయాల్లో కూడా కాశ్మీరీలను విశ్వసించకూడదు అని భారతీయులు అనుకుంటున్నారనే భావన కాశ్మీరీలకు కల్గిందంటే వాళ్ళ దేశాభిమానాన్ని దుర్బలం చేయడానికి బయటి ప్రచారం ఏమీ అవసరం లేదు" ఈ రకంగా ఎవర్ని చూసినా తమ సంస్కృతినీ, తమనూ గౌరవించుకునే వాళ్ళు తీవ్ర అవమానికి గురవుతారు. ఇవ్వాళ ప్రతి ఒక్కరూ మాట్లాడుతోన్న పరాయీకరణకు మూలం జమ్ము-కాశ్మీర్ ను ఇండియాలో చేర్చడానికి ఒత్తిడి చేసిన భారతపాలకుల కుట్రపూరిత, బలవంతపు పద్ధతుల్లో వుంది.

**1958** లో షేక్ అబ్దుల్లా జైలునుంచీ విడుదలయ్యాడు. అప్పటికి రాష్ట్ర రాజ్యాంగాన్ని ఆమోదించేయడం జరిగిపోయింది. రాష్ట్రం ఇక భారత దేశంలో కల్సిపోయిందని అది ప్రకటించింది. షేక్ అబ్దుల్లా ఈ ప్రకటనను జైలునుంచే

వ్యతిరేకించాడు. అందువల్ల జైలునుంచీ వచ్చీ రావడంతోనే భారతదేశం వాగ్దానం చేసిన ప్లెబిసైటును నిర్వహించాలని మాట్లడ్డం మొదలెట్టాడు. పైగా ప్లెబిసైటు అప్పటికే ఐక్యరాజ్య సమితి తీర్మానాలకు ప్రాతిపదిక అయి కూర్చుంది. షేక్ అబ్దుల్లా కార్యకలాపాలను జాతి వ్యతిరేకమైనవని ముద్రవేయడానికి బక్షీ గులామ్ మొహమ్మద్, డి.పి.ధర్‌లు మళ్ళీ ఒక్కటయ్యారు. ప్లెబిసైటు ఫ్రంటుకు ఆయన పాకిస్తాన్ నుంచీ నిధులు పొందుతున్నాడనేది ఈసారి వాళ్ళు చేసిన కొత్త ఆరోపణ. ఆయన్నీ, మీర్జా అఫ్జల్ బేగ్ లాంటి ఆయన సహచరుల్నీ 1958 ఏప్రల్ 29 న మళ్ళీ కటకటాల వెనక్కి తోసారు. చట్టబద్ధ అధికారాన్ని కూలదోయడానికి కుట్రపన్నారని వాళ్ళపై నిందమోపారు. వాళ్ళ పై విచారణ జరపడానికి అదే సంవత్సరం ఒక ప్రత్యేక న్యాయస్థానాన్ని కూడా నెలకొల్పారు. 1962 లో విచారణ మొదలవుతుందని చెప్పి, మళ్లీవాయిదా వేసారు. కానీ చివరికి విచారణ ఏమి లేకుండానే వాళ్ళను అరెస్టు చేసిన ఆరేళ్ళకు విడుదల చేసారు. 1964 ఏప్రిల్ 8న వాళ్ళు జైలునుంచీ బయటికొచ్చారు. బక్షీ ప్రభుత్వం వాళ్ళను జైలుకు పంపితే సాదిక్ అధికారంలో వుండగా బయటికొచ్చారు. అరెస్టు చేసి జైలుకు పంపడమూ, జైలునుంచీ విడుదల చేయడమూ రెండూ రాజకీయ చర్యలే. శాంతి భద్రతలతో వీటికేమీ సంబంధం లేదు.

ఇంతలో జమ్ము-కాశ్మీరు ప్రధానమంత్రిగారి అవినీతి, బంధుప్రీతి భారత ప్రధానమంత్రి గారికి ఇబ్బంది కల్గించాయి. దాంతో 1963 అక్టోబర్ 11న బక్షీని పదవినుంచి తొలంగించారు. అయినా మళ్ళీ ఆయనగారి ఆశ్రితుడే అయిన ఖాజా షంసుద్దీన్ ను గద్దెనెక్కించారు. ఆయన్ని తొలగించి ఒకప్పటి అబ్దుల్లా సహచరుడైన జి.ఎమ్. సాదిక్‌ను మరుసటి సంవత్సరం మార్చి ఒకటిన ప్రధానమంత్రిగా ప్రతిష్ఠించారు. ప్రజలకు సంబంధం లేని ఈ మార్పు కనీసం ఈ శాసన సభ్యులు కూడా కోరుకోలేదు. ఈ ప్రధానమంత్రులను ఢిల్లీ రుద్దింది. షంసుద్దీన్ బక్షీకి అంగీకారమే గానీ సాదిక్‌కు కాదు. శాసన సభ్యులందరూ బక్షీగారు ఏరికోరి తెచ్చుకున్న మనుషులే కావడంతో సాదిక్‌కు వ్యతిరేకంగా సాదిక్ పై విశ్వాస రాహిత్య తీర్మానం పెడతానని బెదిరించాడు. ఢిల్లీ అధికార యంత్రాగం సలహామేరకు జమ్ము-కాశ్మీర్ సదర్-ఎ-రియాసత్ గారు బక్షీని అరెస్టు చేయమనీ, లేకుంటే ఆయన తీసుతోబోతున్న చర్య రాష్ట్రాన్ని అస్థిరత్వంలోకి నెడుతుందనీ సాదిక్‌ను ఒత్తిడి చేసారు. ఆయన్ని అరెస్టు చేయడానికి బక్షీగారి అవినీతి చర్యలు అప్పుడు బాగా పనికొచ్చాయి. ఆయన గారి డబ్బు పేరాసను అంతకుముందు ఢిల్లీ పాలకులు ఏనాడూ అభ్యంతర పెట్టిన పాపాన పోలేదు. బక్షీని అరెస్టు చేశారు. కోర్టులో నేర అభియోగం కానీ, విచారణగానీ ఏమీ లేకుండానే పదకొండు నెలల తర్వాత బక్షీ బయటికొచ్చాడు. కేంద్రప్రభుత్వం ఎంపిక చేసుకున్న మనిషిని శ్రీనగర్‌లో ప్రతిష్టించడానికి అలా మరో పార్లమెంటరీ ప్రజాస్వామ్య పద్ధతిని అపహాస్యం చేసారు.

ఎటంటే అటు వంగే రాష్ట్ర ప్రభుత్వం సమ్మతితో 1964లో అనేక చట్టసవరణలను తీసుకొచ్చారు. ఈ క్రమం బక్షీ ప్రధానమంత్రిగా ఉండగానే మొదలైంది. కానీ సాదిక్ హయాంలో పూర్తయింది. ఇకనుంచీ రాష్ట్ర అధినేతను సదర్-ఎ-రియాసత్ అనికాక గవర్నర్ అనిపిలుస్తారు. అతణ్ణి జమ్ము-కాశ్మీర్ శాసనసభ ఎన్నుకోవడం కాక రాష్ట్రపతి

నియమిస్తాడు. రాష్ట్ర ప్రధానమంత్రిని ఇకనుంచీ ముఖ్యమంత్రి అని పిలుస్తారు. రాష్ట్రపతిపాలనను విధించడానికి అవకాశం కల్పించే 356 వ అధికరణాన్ని జమ్ము-కాశ్మీరుకు విస్తరింపచేశారు. జమ్ము-కాశ్మీరు పార్లమెంటు సభ్యుల్ని గతంలోలా ఆ రాష్ట్ర శాసనసభ ఎన్నుకోవడం కాక తక్కిన భారతదేశంలోలా నేరుగా ప్రజలే ఎన్నుకుంటారు. గవర్నర్ నియామకం, రాష్ట్రపతి పాలన విధింపుకు సంబంధించిన అంశాలను 1980లలో ఎంత అవకాశవాదంతో వాడుకున్నారంటే అది దారుణ పర్యావసాలకు దారితీసింది. జమ్ము-కాశ్మీర్‌ను మరింత సంపుర్ణంగా ఇండియాలోకి విలీనం చేసిన ఈమార్పులకు తోడు సాదిక్, మీర్‌ఖాసిమ్ ల నాయకత్వాన వున్న నేషనల్ కాన్ఫరెన్సుకు 1965లో కాంగ్రెసు పార్టీ కాశ్మీరు శాఖగా కొత్త తీర్థం ఇచ్చారు. భారత రాజ్యము, కాంగ్రెసు పార్టీ లోయలో ఎల్లప్పుడూ పర్యాయపదాలు మాత్రనేనని ఇది సూచిస్తుంది. ఇలా నాటకీయ ఫక్కీలో జరిగిన ఘటనల పరంపర లోయలో ప్రజల ఆగ్రహాన్ని పెంచింది. హింసాత్మక నిరసన ప్రదర్శనలు జరిగాయి. షేక్ అబ్దుల్లా జైలునుంచీ బయటికి వచ్చిన తర్వాత ఇచ్చిన పిలుపుకు స్పందనగా, కాంగ్రెసు నాయకులుగా అవతారమెత్తిన కాశ్మీరీ నాయకులకు లోయలో సాంఘిక బహిష్కారం విధించారు.

రాజ్యంగ వ్యవస్థకు తీసుకొచ్చిన ఈ సవరణలను విమర్శిస్తూ జమ్ము-కాశ్మీరు మౌలిక హక్కుల (పరిరక్షణ) కమిటీ 1990 లో ఒకనోట్ ప్రచురించింది. ఈ సంస్థ నాయకుడు మాజీ ప్రధాన న్యాయమూర్తి ముఫ్తీ బహావుద్దీన్ ఫారూఖీ. ఆర్టికిల్ 370 లో రూపొందించిన సమాఖ్య నిబంధనల చుట్టూ అల్లబడిన జమ్ము-కాశ్మీర్ రాజ్యాంగ మౌలిక నిర్మాణాన్ని ఈ సవరణలు పూర్తిగా మార్చివేసాయని ఆ నోట్‌లో ఎత్తిచూపారు. ఏ రాజ్యాంగ సవరణ అయినా రాజ్యాంగ మౌలిక నిర్మాణాన్ని మార్చకూడదని భారత రాజ్యాంగ శాస్త్రమే చెబుతోంది. "కానీ ఇండియాలో ఈ మాట ఎవరైనా వింటారా?" అని వాళ్ళు నిస్పృహతో అడుగుతారు. ఏ.జి. నూరానీ లాంటి న్యాయకోవిదులు కూడా కాశ్మీరు విలీన పత్రంలో పేర్కొన్న షరతులను దాటి యూనియన్ అధికారాలను కాశ్మీర్‌కు విస్తరింపచేసే రాష్ట్రపతి ఉత్తర్వుకు ఒకసారి ఆ రాష్ట్ర రాజ్యాంగ పరిషత్తు అంతరించిపోయిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అసలు ఏకీభావం తెలపొచ్చా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే అలాంటి సమ్మతిని రాష్ట్ర రాజ్యాంగ పరిషత్తులో ప్రవేశపెట్టాలని ఆర్టికిల్ 370 చెబుతుంది. అంటే రాష్ట్ర రాజ్యంగ పరిషత్తు ఉనికిలో ఉన్నంత వరకే యూనియన్ అధికారాలను విస్తరించే ప్రతిపాదనలకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం ఇయ్యవచ్చు. ఎలా చూసినా 1964-65 లలో భారత రాష్ట్రపతి జారీచేసిన ఉత్తర్వులు చెల్లవని అర్థమవుతోంది. గతమూడు దశాబ్దాలలో జమ్ము-కాశ్మీర్‌లో జరిగిదంతా కేవలం నైతికంగానే అసహ్యాకరమైంది, చట్టం ముందు కూడా నిలబడదు అని అర్థం చేసుకోవాలి. ఇది రాజకీయ రాక్షసత్వమే కాదు; రాజ్యాంగ దానవత్వం కూడా.

షేక్ అబ్దుల్లాను మళ్లీ అరెస్టు చేశారు. 1965 ఫిబ్రవరి 5న ఆయన మక్కా వెళ్లాడు. అక్కణ్ణుంచీ ఇస్లామిక్ దేశాల సందర్శనకు వెళ్ళాడు. పలుదేశాధినేతలను కలిసాడు. వాళ్ళతో మాట్లాడాడు. అలాంటి వాళ్ళలో చైనా ప్రధాని చౌ-ఎన్-లై ఒకరు. కాశ్మీరు స్వయం నిర్ణయాధికార హక్కుకు బలం చేకూర్చేలాంటి అభిప్రాయాన్ని ఆయన

వ్యక్తీకరించాడు. వెంటనే వెనక్కి వచ్చేయమని అబ్దుల్లాను భారత ప్రభుత్వం అడిగింది. ఆయన రావడం ఆలస్యం మళ్ళీ కటకటాల వెనక్కి నెట్టారు. ఆయన పాసుపోర్టును ఇండియా రద్దు చేస్తే ఆయనకు పాసుపోర్టు ఇవ్వటానికి చాలా దేశాలు ముందుకొచ్చివుండేవని, అందువల్ల అబ్దుల్లా ఇండియాకు తిరిగిరావాల్సిన అవసరం కూడా లేకుండెననీ అజిత్ భట్టాచార్జీ అంటాడు. పాకిస్తాన్ ఆయనకు పాసుపోర్టు ఇస్తానన్నదని అలస్టేర్ ల్యాంబ్ అంటాడు. ఇండియా ఆయన్ని తిరిగి రమ్మనగానే ఆయన గౌరవంగా తిరిగివచ్చాడు. కానీ భారతప్రభుత్వం మాత్రం అంతే గౌరవంగా ప్రవర్తించలేదు. "విదేశీ ప్రభుత్వాలతో కుట్ర చేసే అవకాశాన్ని" ఆయనకు నిరాకరించినందున ఆయన్ని ఇండియాలో స్వేచ్ఛగా బ్రతకనివ్వాల్సింది. కానీ మరో మూడేళ్ళపాటు ఖైదు చేసారు. ఈ అరస్టు కూడా మరోమారు లోయలో అల్లర్లకు దారి తీసింది. పోలీసు దాడుల్లో అనేక మంది ప్లెబిసైటు ఫ్రంటు కార్యకర్తల్ని అరెస్టు చేశారు.

కాంగ్రెసు ముఖ్యమంత్రి సాదిక్ గారు తనకు ముందున్న ప్రధానమంత్రి 1957, 1962 లలో ఎన్నికల్లో గెల్చిన పద్ధతుల్లోనే 1967 అసెంబ్లీ ఎన్నికల్లో గెల్చి తన స్థానాన్ని పటిష్ఠంచేసుకున్నాడు. 118 నామినేషన్ పత్రాలు చెల్లకుండా పోయాయి. 75 నియోజక వర్గాల్లోనూ 39 స్థానల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1971 డిసెంబర్ 12న సాదిక్ చనిపోయాడు. తర్వాత మీర్‌ఖాసిమ్ జమ్ము-కాశ్మీర్‌కు కాంగ్రెసు ముఖ్యమంత్రి అయ్యాడు.

1971-72 లు భారత పాలకులకు తమ ప్రజాస్వామ్య ప్రమాణాల్ని రుజువు పర్చుకోవడానికి మరో అవకాశం కలిగింది. 1971లో పార్లమెంటు ఎన్నికలు జరగా 1972 జమ్ము-కాశ్మీరు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. షేక్ అబ్దుల్లా ఇప్పుడు నిర్బంధంలో లేడు. రాష్ట్రంలో కాంగ్రెసు పార్టీతో తలపడ్డానికి ప్లెబిసైటు ఫ్రంటు సిద్ధంగా వుంది. నిజమైన పోటీనే కనుక జరిగివుంటే, పోటీని అనుమతించి వుంటే బహుశా జమ్ము-కాశ్మీరు ప్రజానీకం, ప్రత్యేకించి కాశ్మీరీలు, భారతదేశం ఆశ చూపిన ప్రజాస్వామ్యాన్ని రుచి చూసి వుండే వాళ్ళేమో కానీ అలా జరగలేదు. 1971 జనవరి 8న అబ్దుల్లా ఢిల్లీలో వున్నాడు. పార్లమెంటు ఎన్నికలకు ప్లెబిసైటు ఫ్రంటును సిద్ధం చేయడానికి శ్రీనగర్ పోవడానికి ఆరోజున ఢిల్లీ నుండి బయలు దేరాడు. చివరిక్షణంలో ఆయన పోవాల్సిన విమానాన్ని రద్దుచేసారు. విమానంలో బాంబు పెట్టారనీ దాన్ని తొలగించడానికే ఇలా చేయాల్సి వచ్చిందనేది అధికారులు చెప్పిన కారణం. బాంబుపుకారు చివరికి అబద్ధం అని తేలింది. అసలు కారణం మర్నాడు తెలిసిపోయింది. అబ్దుల్లా, బేగ్‌లు కాశ్మీర్‌లో ప్రవేశించకూడదని వాళ్ళకు నిషేధపుటుత్తర్వులు అందించారు. ఇక అప్పుడు ప్లెబిసైటు ఫ్రంటు ఎన్నికల్లో పాల్గొనడాన్ని నిషేదిస్తూ రాష్ట్ర అసెంబ్లీ ఒక చట్టాన్ని ఆమోదించింది! 1972 అసెంబ్లీ ఎన్నికలప్పుడు కూడా ఇదే జరిగింది. ప్రధాన ప్రతిపక్షాన్ని ఎన్నికల్లో నిషేధించడంతో 75 స్థానాల్లో కాంగ్రెసు 57 స్థానాలను గెల్చుకుంది. (షేక్ అబ్దుల్లా ఒక ఘటనను తన జ్ఞాపకాల్లో రాసుకున్నాడు. ఆయన అనుచరులు ఒక జర్నలిస్టు షమీమ్ అహ్మద్ షమీమ్‌ను బక్షీ గులామ్ మొహమ్మద్‌కు వ్యతిరేకంగా నిలబెట్టి

అతణ్ణి చిత్తుచిత్తుగా ఓడించి ప్రతీకాత్మకంగా కసి తీర్చుకున్నారు అని రాసుకున్నాడు).

గమ్మత్తేమిటంటే షేక్ అబ్దుల్లా పార్టీ అయిన ప్లెబిసైటు ఫ్రంటును ఎన్నికల్లో పాల్గొనకుండా నిషేధించిన కాంగ్రెసు పార్టీ జమాతే ఇస్లామిని ఎన్నికల్లో పాల్గొనడానికీ, ఐదుసీట్లు గెల్చుకోవడానికి అనుమతించింది. ఢిల్లీ ప్రభువుల వారి స్థానిక ఇష్టులు 'అనుమతిస్తే' తప్ప 1950ల నుంచీ లోయలో ఎవరైనా గెల్చే సమస్యే లేదు. కారణం భారత పాలకులు ప్రోత్సహించిన టెర్రర్, గూండాయిజం ఆస్థాయిలో వుండేవి. 1972లో ముఖ్యమంత్రిగా పనిచేసిన మీర్ ఖాసిమ్ తర్వాత అంతర్ముఖుడై రాసుకున్న ఆత్మకథలో అంటాడు. -- "కాంగ్రెసుకు వ్యతిరేకంగా పోటీ చేయడానికి అబ్దుల్లా మద్దతుతో ఏ గ్రూపు అయినా చేసే ప్రయత్నాలను నిష్ఫలం చేసేందుకు ఖాళీ జాగాను పూరించేందుకు కాంగ్రెసు జమాతే ఇస్లామీ సహాయం తీసుకుంది; ఐదు నియోజకవర్గాల్లో గెలిచేలా దానికి హామీ ఇచ్చింది". లౌకిక వాదులయిన లేదా అంతగా మతతత్వశక్తులు కాని ప్రత్యర్థుల్ని ప్రోత్సాహించే ఈ అసహ్యకరమైన అలవాటు భారత పాలకుల ప్రత్యేక లక్షణం. ఈ లక్షణాన్ని ఆ తర్వాత కూడా మళ్ళీ మళ్ళీ ప్రదర్శించారు. నిజానికి ఒక కాశ్మీరీ విద్యావేత్త చెప్పినట్లు పందొమ్మిదివందల అరవైల నుంచీ మీర్వాయిజ్ షారఖ్ ప్రాతినిధ్యం వహించిన ఛాందసవాద ముస్లిం రాజకీయాలను అబ్దుల్లాకు వ్యతిరేకంగా బక్షీ గులాం మొహమ్మద్ బుద్ధి పూర్వకంగానే ప్రోత్సహించాడు. ఎందుకంటే షేక్ అబ్దుల్లా తరహాలాంటి వాళ్ళు భారత రాజ్యానికి అసౌకర్యం కల్గిస్తారు. వాళ్ళ వాదనలకు ఒక తర్క శక్తీ, ఒక నైతిక శక్తీ వున్నాయి. వాటికి పోటీగా అధికార వైఖరి నిలబడలేదు. జమాతే ఇస్లామీ సుఖమైన శత్రువు. దీన్ని ఎదురుగా పెట్టుకుని మతతత్వ ప్రగతి నిరోధకులతో లౌకికవాదం పోరు సలుపుతోందని భారత రాజ్యం నటించవచ్చు.

ఇంతలోనే ఇండియా-పాకిస్తాన్‌ల మధ్య 1965లో ఒకసారి, 1971లో మరొకసారి రెండు యుద్ధాలు జరిగాయి. మొదటిది 1964-65 లలో కాశ్మీర్‌లో జరిగిన ఘటనల నుంచీ లబ్ధి పొందుదామనే పాకిస్తాన్ ఆశవల్ల జరిగింది. ఆకాలంలో జరిగిన రాజ్యాంగ, రాజకీయమార్పులకు నిరసనగా వచ్చిన ప్రజా వెల్లువను గురించీ, షేక్ అబ్దుల్లా, మీర్జా అఫ్జల్ బేగ్‌లను అరెస్టు చేసినప్పుడు వచ్చిన ప్రజావెల్లువను గురించీ ఇంతకు ముందే చెప్పుకున్నాం. ఆ కాలంలోనే మరో పెద్ద అలజడి జరిగింది. 1963 డిసెంబర్ 26 న శ్రీనగర్‌లో గల హాజరత్‌బల్ మందిరం నుంచీ ఒక పవిత్ర అవశేషం -- ప్రవక్త కేశం -- అదృశ్యమైందని పుకారు పుట్టింది. అల్లర్లు మొదలయ్యాయి. ప్రజలు ఆగ్రహోదగ్రులయ్యారు. పెద్ద ఎత్తున హింస ప్రబలిపోయింది. ముఖ్యంగా బక్షీ గారి ఆస్తులు బుగ్గయి పోయాయి. ఎంత మాయగా కేశం అదృశ్యమైందో అంతేమాయగా మళ్ళీ ఆ కేశం 1964 జనవరి 3 ల తిరిగి దర్శనమిచ్చింది. అయినా దాన్ని గౌరవనీయులైన ముస్లిందైవభక్తులు బహిరంగంగా సరిచూసి ధృవీకరించేంత వరకూ ప్రజల క్రోధాగ్ని, అల్లర్లూ ఆగలేదు. ఈ భక్తులు నేషనల్ కాన్ఫరెన్సు మాజీ ప్రధాన కార్యదర్శి మౌలానా మసూద్ నాయకత్వాన కేశం అసలుదా కాదా అని పరీక్ష చేసారు. ఈ హాజ్రత్‌బాల్ సంక్షోభం తర్వాతే షంసుద్దీన్‌ను తొలగించి గులాం మహమ్మద్ సాదిక్‌ను కొత్తపాలకుడిగా ప్రతిష్ఠించారు.

ఈ ఘటనలన్నీ పాకిస్తాన్‌కు (కనీసం ఆదేశ విదేశాంగ మంత్రి జుల్ఫికార్ అలీ

భుట్టోకు) ఆశలు పుట్టించాయి. ఇప్పుడు ఇండియా మీద దాడిచేస్తే జమ్ము-కాశ్మీర్‌లోని ముస్లిములు తిరుగుబాటు చేస్తారనీ అప్పుడు వాళ్ళు కోరుకున్న భూభాగం వాళ్ళ (పాకిస్తాన్) స్వంత మవుతుందనీ దురాశపడ్డారు. అందుకు పాకిస్తాన్ ప్రయత్నించింది. కానీ విఫలమైంది. ఏతిరుగుబాటు రావాలని కోరుకుందో అది రాలేదు. పాకిస్తాన్ సైన్యాన్ని భారతసైన్యం వెనక్కి కొట్టేయగలిగింది. భారత పాలకులు గానీ, పాకిస్తాన్ పాలకులు గానీ అసలెప్పుడూ కాశ్మీరీలను అర్థం చేసుకోలేదనే అన్పిస్తుంది. కాశ్మీరీలకు వాళ్ళ ఇస్లామిక్ గుర్తింపు వాళ్ళ అవిభక్త కాశ్మీరీ గుర్తింపు నుంచీ ఎన్నడూ విడిగా లేదు. పాకిస్తాన్ ఇస్లామిక్ గుర్తింపు నుంచీ లాభం పొందుదామనుకుంటే ఇండియా మిశ్రమ కాశ్మీరీ గుర్తింపు నుంచీ లబ్ది పొందుదామని అనుకొంది. కానీ రెండు దేశాలూ విఫలమయ్యాయి. ముమ్ముందు కూడా ఇండియా సంఫలం కావడం కష్టం. ఎందుకంటే అది దేన్నయితే కబ్జా చేసుకుందామనుకుందో దాన్నెప్పుడూ గౌరవించలేదు. తన ప్రయత్నం లో సఫలమవుతానులే అని పాకిస్తాన్ ఆశపడుతున్నట్లుంది. షేక్ అబ్దుల్లా ప్రభుత్వాన్ని కూలగొట్టడాన్కి ప్రయత్నాలు నడుస్తున్నప్పుడు 1953లో మౌలానా మసూద్ ఒక పత్రికాప్రకటన ఇచ్చాడు. ఆ వివరణ నుంచీ ఈ రెండు దేశాలూ నేర్చుకోవచ్చు. 1947 తో పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా కాశ్మీరీలు ఒక్కటై నిలబడ్డారంటే కారణం కాశ్మీరీలకు అంగీకారయోగ్యం కాని స్థానానికి వాళ్ళను నెట్టడానికి పాకిస్తాన్ కోరుకుంటున్నదని భావించడం వల్లే. ప్రస్తుతమున్న స్వయంప్రతిపత్తికి ప్రమాదం కల్గించేలా ఇండియాలో ఎవరైన డిమాండు చేస్తే అప్పుడు కాశ్మీరీలు మూడో ప్రత్యామ్నాయమైన స్వాతంత్ర్యాన్ని గురించి ఆలోచించడం మొదలెడితే కాశ్మీరీలను నిందించకూడదు."

1971 లో బంగ్లాదేశ్ విషయమై మరో యుద్ధం జరిగింది. ఈ యద్ధంలో ఇండియా బలమైన శక్తిగా రుజువు చేసుకుంది. ఈ యుద్ధం జమ్ము-కాశ్మీరు గురించి కాక పోయినప్పటికీ ఇండియా సైనికంగా దుర్భేధ్యమైనదనే భావనను కాశ్మీరీనాయకులకు కల్గించినట్లు కన్పిస్తుంది.

1965 యుద్ధం ముగిసిన వెంటనే ఢిల్లీ పాలకుల్నీ, షేక్ అబ్దుల్లాను చర్చలకోసం కూర్చోబెట్టే ప్రయత్నాలు జరిగాయి. జమ్ము-కాశ్మీర్‌ను ఇండియాలో ఉంచుకుంటూనే దాని స్వతంత్ర ప్రతిపత్తిని గౌరవించాలనీ, కాశ్మీరీల ఆకాంక్షలు గౌరవిస్తూ ఈ సమస్యను పరిష్కరించాలని నమ్మిన వాళ్ళలో కొందరు ఇండియాలో ఉన్నారు. అలాంటి వాళ్ళలో ముఖ్యుడు జయప్రకాశ్ నారాయణ్, కాశ్మీరీల ఆకాంక్షలను గౌరవించాలి తప్ప వాళ్ళకు జాతీవ్యతిరేకులని ముద్ర వేయకూడదని ఇలాంటి వాళ్ళు కోరుకున్నారు. భౌగోళిక ప్రాంత వివాదాన్ని బలప్రయోగం ద్వారా పరిష్కరిద్దామని 1965లో పాకిస్తాన్ చేసిన ప్రయత్నం విఫలమవడంతో, ఆ తర్వాత భాషా పరంగా పాకిస్తాన్ ముక్కలవడంతో (మతం ప్రజలమధ్య బలమైన బంధాన్ని ఏర్పరుస్తుందని చెప్పిన మతతత్వ తర్కం అబద్ధం అని ఈ ఘటనలు నిరూపించాయి) షేక్ అబ్దుల్లాకూ, భారతదేశానికీ మధ్య చర్చలు మొదలెట్టడానికి ఇలాంటి వ్యక్తులు చేసిన కృషి క్రమంగా ఒక రూపం తీసుకొంది.

ఇండియాలో కాశ్మీరు విలీనాన్ని షేక్ అబ్దుల్లా ఎలాంటి షరతులూ లేకుండా అంగీకరించాలనేది భారత పాలకుల వైఖరి. అలా చేసేంత వరకూ రాష్ట్ర అసెంబ్లీకి పోటీచేయడం అనే కనీస రాజకీయ స్వేచ్ఛను సైతం అతడికి నిరాకరించారు. ఈ దేశంలోని

పాలకులూ, రాజకీయ పార్టీలూ తమకు గొప్ప ప్రజాతంత్ర వారసత్వం, ఆదర్శాలు ఉన్నాయని గొప్పలు పోతారు గానీ ప్రజాస్వామ్యపద్ధతుల్ని ఇలా ఉల్లంఘించడం పట్ల ఈ దేశంలో పెద్దగా చెప్పుకోదగిన నిరసనేమీ తలెత్తకపోవడం ఆశ్చర్యకరం. అయినా మన ప్రజాతంత్ర రాజకీయ వ్యవస్థ గొప్పదనీ, దాని ఔన్నత్యంవల్ల కాశ్మీరీలను మనకే విశ్వసనీయంగా ఉండాలని కోరుకోవడానికి మనకే హక్కుందనీ చెప్పుకోవడం మాత్రం భారతీయులం మానుకోలేదు. ఇంతకు మించిన నయవంచన మరోటి వుండదు.

ఇందిరా గాంధీ అబ్దుల్లా చేసుకొన్న ఒప్పందం లోయలో అతడి ప్రతిష్ఠకు బాగా నష్టం కల్గించింది. ఆ తర్వాత కూడా ఎక్కువ ప్రజాదరణ కలిగిన నాయకుడిగా ఆయనే కొనసాగినా ఆయన ప్రతిష్ఠకు నష్టం కల్గింది. జమ్ము-కాశ్మీరు భవితవ్యాన్ని సిమ్లా అగ్రిమెంటు ద్వారా ద్వైపాక్షిక సమస్యగా మార్చాయి ఇండియా, పాకిస్తాన్‌లు. ఈ అగ్రిమెంటును అబ్దుల్లా బహిరంగంగా విమర్శించాడు. ఈ రెండు దేశాలు జమ్ము-కాశ్మీరు జనం తలలవెల కట్ట జాలవని ఆయన ప్రకటించాడు. 1972 ఎన్నికల తర్వాత ఆయన్ని కాశ్మీరులోకి ప్రవేశించడానికి అనుమతించారు. కాశ్మీరులోకి ప్రవేశించడంతోటే స్వయం నిర్ణయాధికారం జమ్ము-కాశ్మీరు ప్రజల హక్కు అని ఆయన ప్రకటించాడు. ఇందిరాగాంధీ, స్వరణ్ సింగ్‌లతో జరిపిన చర్చల్లో 1953 కు ముందున్న పరిస్థితిని పునరుద్ధరించాలని నొక్కి చెప్పాడు. అంటే తనను మొదటిసారి అరెస్టుచేసిన తర్వాత భారతదేశం చేసిన రాజ్యాంగ వంచనను పూర్తిగా రద్దుచేయాలని అర్థం. అయినప్పటికీ తన తరపున మిర్జా అఫ్జల్ బేగ్ కీ భారతప్రభుత్వం తరపున పార్థసారథికీ మధ్య 1974 నవంబర్ 13న కుదిరిన ఒప్పందాన్ని ఆయన అంగీకరించాడు. 1975ఫిబ్రవరి 24ఇందిరాగాంధీ ఈ ఒప్పందాన్ని ప్రకటించింది. ఈ ఒప్పందం 1953 కు పూర్వమున్న పరిస్థితిని పునరుద్ధరించలేదు; ఆ తర్వాత జరిగిన వాటిని రద్దూ చేయలేదు. జమ్ము-కాశ్మీరు భారతదేశంలో భాగం అని ఆ ఒప్పందం ప్రకటించింది. భారతదేశంతో జమ్ము-కాశ్మీర్ సంబంధాలు 370వ అధికరణం ప్రకారం సాగుతాయని అది ప్రకటించింది. ఈ అగ్రిమెంటుకు అర్థం లేకుండా పోయింది. ఎందుకంటే షేక్ అబ్దుల్లాను తోవలోనుంచీ తొలగించిన తర్వాత చేసినదంతా 370వ అధికరణం పేరు మీదే చేసారు. 370వ అధికరణాన్ని 'దాని మూల రూపంలోనే' ఉంచాలని తాను కోరుకున్నట్లు అబ్దుల్లా తన జ్ఞాపకాల్లో రాసుకున్నాడు. ఈ అధికరణాన్ని ఎన్నడూ సవరించకపోవడంతో బహుశా ఆయన కోరుకున్నదేమంటే దాని స్ఫూర్తిని కాపాడాలనే. కానీ ఈ ఒప్పందం ద్వారా సాధించింది మాత్రం ఇదికాదు. బహుశా దాన్ని వివరించడానికే నేమో షేక్ అబ్దుల్లా 'మా లక్ష్యంలో మార్పేమీ లేదు. ఉందల్లా కేవలం వ్యూహంలోనే' అని అంటాడు. షేక్ అబ్దుల్లా తన యౌవన దశ నాటి ఆదర్శాలకే కట్టుబడి వున్నాడా లేదా అనేదాంతో మనకు సంబంధం లేదని ఇక్కడ స్పష్టంగా చెప్పక తప్పదు. ఆయన తన అభిప్రాయాల్ని మార్చుకో దల్చుకుంటే అది ఆయన వ్యవహారం. ఆయన సత్తువను నాశనం చేసి అభిప్రాయాలు మార్చుకునేలా ఒత్తిడి చేయాడానికి భారతరాజ్యం అనుసరించిన పద్ధతులతోనే మనకు విభేదం. మనం పట్టించు కోవాల్సింది కూడా అదే.

1975 ఫిబ్రవరి 25న షేక్ అబ్దుల్లా జమ్ము-కాశ్మీర్ శాసన సభలో కాంగ్రెసు శాసన సభాపక్షానికి నాయకుడిగా ఎన్నికయి ముఖ్యమంత్రి అయ్యాడు. కానీ కాంగ్రెసు

పార్టీలో చేరే ఉద్దేశం ఆయనకు లేదు. జులైలో ఆయన మళ్ళీ నేషనల్ కాన్ఫరెన్సును పునరిద్ధరించాడు. తనకున్న ప్రజాదరణ చెక్కుచెదర లేదనీ 1977 అసెంబ్లీ ఎన్నికల్లో రుజువు చేసుకున్నాడు. ఈ ఎన్నిక రాష్ట్రంలో జరిగిన మొట్టమొదటి నిష్పాక్షిక ఎన్నికలని పరిశీలకులందరూ వర్ణించారు. 75 స్థానాలకు గాను అబ్దుల్లా 47 స్థానాలు గెల్చాడు. కాశ్మీర్ లోయలో గల 42 సీట్లకుగాను 40 సీట్లు గెలిచాడు.

అలా '1977 లో భారత ప్రజాస్వామ్య సరిహద్దుల్లోకి ప్రవేశించిన' (బలరాజ్‌పురి మాటలు) రాష్ట్రాన్ని '1984 లో మళ్ళీ సరిహద్దుల ఆవలకు వెళ్ళగొట్టారు.' అలా మొదలైన ఘటనల పరంపర మిలిటెన్సీ తలెత్తడంగా పరాకాష్ఠకూ చేరుకుంది' ఇంతలో 1982 సెప్టెంబర్ 8న షేక్ అబ్దుల్లా దివంగతుడయ్యాడు. అతడి కొడుకు ఫారుఖ్ అబ్దుల్లా ముఖ్యమంత్రి అయ్యాడు. ఆయన్ని ముఖ్యమంత్రిగా తొలగించి ఆ స్థానంలో ఆయన బావ గూలాన్ మొహమ్మద్ షా ను (ఆయన్నే గుల్‌శా అని అంటారు) గద్దెనెక్కించడానికి నేషనల్ కాన్ఫరెన్సులో ఫిరాయింపులను ప్రోత్సాహించింది కాంగ్రెసు పార్టీ, 1983 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా మరోసారి నేషనల్ కాన్ఫరెన్సు విజయభేరి మ్రోగించేలా దాన్ని ఫారుఖ్ అబ్దుల్లా కదం తొక్కించాడు. ఆ తర్వాతే ఫిరాయింపులు మొదలయ్యాయి. లోయలో వున్న 47 సీట్లకు 39 సీట్లను నేషనల్ కాన్ఫరెన్సు గెల్చుకుంది. ఈ ఎన్నికల్లోనే ఇందిరాగాంధీ మతతత్వ రాజకీయాలను ఆచరించడంలో బి.జె.పి. ని సైతం దాటిపోయి జమ్ము ప్రాంతంలో కాంగ్రెసుపార్టీకు 25 సీట్లు సంపాదించి పెట్టింది.

ఎన్నికల్లో గెల్చిన ఫారూఖ్ అబ్దుల్లా నేషనల్ కాన్ఫరెన్సును ప్రతి పక్షశిబిరంలో చేర్చాడు. 1983మే 31న విజయవాడలో జరిగిన ప్రతిపక్ష పార్టీల సమావేశానికి హాజరయ్యాడు. రెండో సమావేశాన్ని ఆయనే శ్రీనగర్‌లో జరిపాడు. ఇండియా జమ్ము కాశ్మీర్ విలీనాన్నే కోరుకుని వుంటే ఇది కూడా విలీనమే కదా! కానీ జమ్ము-కాశ్మీర్ ఇండియాకు విశ్వాసపూర్ణంగా వుండాలంటే ఆ విశ్వాసం కేంద్రంలో అధికారంలో వుండే కాంగ్రెసుకు అనుకూలంగా వుండే విశ్వాసమే. ఇంకో సందర్భంలో బలరాజ్‌పురి చెప్పినట్లు 'తక్కిన భారతీయుల్లా కాక కాశ్మీరీలు తమ దేశభక్తిని రుజువు చేసుకోవడానికి దేశం పట్ల విశ్వాసాన్ని ప్రదర్శించడమే కాక కేంద్ర ప్రభుత్వం పట్ల కూడా విశ్వాసం రుజువు చేసుకోవాలి. కొన్ని పాశ్చాత్య దేశాలు ఆసియా మహిళల్ని కన్యాత్వం పరీక్షకు గురిచేసిన చర్యను పోలివుందని పురి అంటాడు.

ఫారూఖ్ అబ్దుల్లా ఈ పరీక్షలో నెగ్గలేక పోయాడు. దానితో ఇందిరాగాంధీ అతణ్ణి పదవినుంచీ తొలగించాలని నిర్ణయించుకుంది. వేర్పాటు వాద శక్తులనూ, పాకిస్తాన్ అనుకూల శక్తులను ఫారుఖ్ ప్రోత్సహిస్తున్నాడని యధాప్రకారం ఆయనపై ఆరోపణలు మోపారు. గుల్‌షా నేషనల్ కాన్ఫరెన్సును చీల్చి 13 మంది ఎమ్మెల్యేలను తనతో తీసుకపోయాడు. 26మంది కాంగ్రెసు శాసనసభ్యులతో కలిసి మెజారిటీ పక్షంగా ఏర్పడ్డాడు. కానీ గవర్నర్ బి.కె. నెహ్రూ ఫారూఖ్ ప్రభుత్వాన్ని డిస్మిస్ చేయడానికి నిరాకరించాడు. దాంతో ఇందిరాగాంధీ ఆయన్ని అక్కణ్ణుంచీ తీసివేసి 1984 ఏప్రిల్‌లో జగ్‌మోహన్‌ను జమ్ము-కాశ్మీర్ గవర్నరుగా నియమించింది. జులై 2న జగ్‌మోహన్ ఫారుఖ్ ప్రభుత్వాన్ని డిస్మిస్ చేశాడు. గుల్‌షా ముఖ్యమంత్రి అయ్యాడు.

కాని ఈ తుచ్ఛుడు ఎంతోకాలం నిలబడలేదు. 1986 మార్చి 6న కాంగ్రేసు శాసనసభ్యులు తమ మద్దతును ఉపసంహరించుకున్నారు. దాంతో జగ్‌మోహన్ గుల్‌షా ప్రభుత్వాన్ని డిస్మిస్ చేసి గవర్నర్ పాలన విధించాడు 1986లో ఫారుఖ్ అబ్దుల్లా రాజీవ్‌గాంధీతో ఒప్పందానికొచ్చే వరకూ జగమోహన్ పరిపాలించాడు. 1990 లో కూడా మళ్ళీ ఇంకోసారి ఆయన ఆ రాష్ట్రాన్ని ఏలాడు. ఆపాలన దారుణ పర్యవసానానికి దారి తీసింది. కాశ్మీరీ ముస్లిములు ఎలాంటి మినహాయింపులూ లేకుండా జగ్‌మోహన్‌ను హిందూ మతతత్వవాదిగా భావిస్తారు. లౌకిక రాజ్యంలో ఆయన ఏ పదవీ నిర్వహించేందుకు అనర్హుడని వాళ్ళ అభిప్రాయం. అందుకు వాళ్ళను నిందించి లాభం లేదు. జగ్‌మోహన్ చేపట్టిన చర్యలే ఈ విషయం చెబుతాయి. ఇవికాక ఆయన రాసిన రాతలు, ఇచ్చిన ఉపన్యాసాలు ఆయనేమిటోననేది స్పష్టంచేస్తాయి. ఆయన ఒక ప్రత్యేకమయిన జాతీయవాదంలో నమ్మకమున్నవాడు. ఆయన గారి జాతీయతలో మతపరమైన, జాతిపరమైన మైనారిటీల ఆకాంక్షలకు స్థానమే లేదు. కనీసం అలాంటి ఆకాంక్షలను కూడా కలిగి వుండకూడదు. ఇతర నిరంకుశ జాతీయవాదులలాగే పరిపాలనలో సామర్థ్యాన్నీ, క్రమ శిక్షణనూ కఠినంగా అమలు పర్చాడు. అందుకు ఆయన్ని చాలా మంది బాగా మెచ్చుకున్నారు కూడా. అయితే ఆయనగారికి ముస్లిములంటే ఎంత అయిష్టమంటే శ్రీనగర్‌లో గల గవర్నర్ కార్యాలయం నుంచీ ముస్లిం ఉద్యోగులందర్నీ బయటికి వెళ్ళగొట్టాడు. ఉద్యోగ రిజర్వేషన్లలో ముస్లిముల వాటాను సగానికి తగ్గిస్తూ రిజర్వేషన్ల పథకాన్ని సవరించాడు. జన్మాష్టమి రోజున గొర్రెలను కోయకూడదని నిషేధించాడు. అలాంటి నిషేధం దేశంలో మరెక్కడాలేదు. ఆయన ఉద్దేశం ముస్లిములను రెచ్చగొట్టడమే అయితే దాన్లో ఆయన సఫలీకృతుడైనట్లే. దక్షిణ కాశ్మీరు మీర్వాయిజ్ అని పిలవబడే ఖాడా నిస్సార్ అహ్మద్ (అనంత నాగ్ నివాసి) జన్మాష్టమి రోజున పెద్ద ప్రజాసమూహం ముందు గొర్రెను కోసాడు. జగ్ మోహన్ తన గవర్నర్ పదవినుపయోగించి భారత రాజ్యంగంలోని ఆర్టికిల్ 249 ని జమ్ము-కాశ్మీరుకు విస్తరిపజేస్తూ రాష్ట్రపతినుంచీ ఒక ఉత్తర్వు పుట్టించగలిగాడు. దీని ప్రకారం 'జాతీయ ప్రయోజనాల రీత్యా' పార్లమెంటు ఈ రాష్ట్రానికి సంబంధించిన ఏ విషయంపైనైనా శాసనం చేయొచ్చని రాజ్యసభ మూడింట రెండు వంతుల మెజారిటీతో తీర్మానం చేయొచ్చు. ఒక వేళ రేపు కాశ్మీరం విముక్తం అయితే గియితే కాశ్మీరీ ముస్లిములను ఇండియా నుంచి పూర్తిగా పరాయీకరించినందుకు జగ్‌మోహన్‌కు పాకిస్తాన్ తప్పనిసరిగా ఆదేశంలో ఇచ్చే అత్యున్నత పౌరపురస్కారాన్ని ఇస్తుందని హురియత్ కాన్ఫరెన్సు నాయకుడొకాయన మాతో జోకులేస్తూ అన్నాడు.

కాంగ్రెసుకు లొంగిపోయి కాంగ్రెస్‌తో కలిసి అధికారం పంచుకుంటానని ఒప్పుకున్న తర్వాత 1986 నవంబర్ 7న ఫారుఖ్ అబ్దుల్లా పరిపాలనను పునరుద్ధరించారు. ఆయనో పాఠం నేర్చుకున్నాడు--కాశ్మీరంలో ఎవరైనా ప్రభుత్వాన్ని నెలకొల్పాలంటే కొత్త ఢిల్లీ అధికారంలో వాటా పెట్టకుండా అది సాధ్యంకాదు అని. (ఈ విషయం ఆయనే రెండేళ్ళ తర్వాత ఒక పాత్రికేయుడికి చెప్పాడు) రాజీవ్‌గాంధీతో అధికారం పంచు కోవడానికి అవగాహన కుదరగానే ముఖ్యమంత్రిగా ప్రమాణంచేసాడు. ఈ అవమానకర ఒప్పందాన్ని కూడా లోయలో లౌకిక జాతీయ శక్తులను ఐక్యం చేసిన

ఘటనగా మరోసారి దేశంలో ఆకాశానికెత్తేసారు.

నిజానికి ఈ ఘటన కాశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్‌ను ఒక ప్రజాదరణగల సంస్థగా అంతంచేసింది. తమిళనాడు, ఆంధ్ర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ లాంటి రాష్ట్రాల్లో కాంగ్రెసేతర ప్రభుత్వాలు మనగలిగి పరిపాలన చేస్తుండగా జమ్ము కాశ్మీర్‌లో దాన్ని అనుమతించడం లేదని వివేకులైన కాశ్మీరీలు గమనిస్తూనే వున్నారు. లోయలో నేషనల్ కాన్ఫరెన్సు ప్రభావాన్ని పరిరక్షించడాన్నే భారతపాలకులు కనుక కోరుకుని వుంటే గద్దెనెక్కడానికి ఫారూఖ్ అబ్దుల్లా రాజీవ్‌గాంధీ ముందు సాగిల బడేటట్టు చేయడం అన్నిటికంటె తెలివి తక్కువ చర్య. ఇది క్షమించరానిదయింది లోయ ప్రజల దృష్టిలో. దీని తర్వాత నేషనల్ కాన్ఫరెన్సు లోయలో లోగడ ఎంత ప్రజాదరణ కలిగివుందో అంతే ప్రజాధరణ కొనసాగుతుందని ఊహించడం కాశ్మీరలంటే వున్న ఏహ్యాభావాన్ని ప్రతిబింబించింది. ఇది సహజంగానే కాశ్మీరీ ప్రజల మనోభావాలను గాయపర్చింది.

జమ్ము-కాశ్మీర్‌లో పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని పూడ్చిపెట్టే చిట్టచివరి చర్య -- 1953లో షేక్ అబ్దుల్లా ప్రభుత్వ రద్దులాంటి నేరస్త చర్యల పరంపరలో చిట్టచివరిది -- ఇంకా జరగాల్సివుంది. అది 1987 ఎన్నికల్లో భారీఎత్తున జరిగిన రిగ్గింగు.

1987 మార్చి 23 న ఎన్నికలు జరిగాయి. కాంగ్రెసు(ఐ), నేషనల్ కాన్ఫరెన్సులు కూటమి కట్టాయి. ఈ కూటమిని ముస్లిం యునైటెడ్ ఫ్రంటు ఎదుర్కొంది. దీన్లో జమాతే ఇస్లామీతో సహా 13 పార్టీలుంటాయి. ఈ గ్రూపుల పేరే చెబుతున్నట్లు ఇది కాశ్మీరీ ఆకాంక్షల నిర్దిష్ట ఇస్లామిక్ కోణానికి ప్రాతినిధ్యం వహించింది. అలాంటి ధోరణి 1930 లనుంచీ కూడా లోయలో వుంది. షేక్ అబ్దుల్లాను వ్యతిరేకించే వ్యక్తుల్లోనూ, ఆందోళనల్లోనూ ఇది వ్యక్తీకరణ పొందింది. ఈ ధోరణికి వరుసగా వచ్చిన కాశ్మీర్ మీర్వాయిజ్‌లు -- 1931వరకూ మౌల్వీ అహ్మదుల్లాషా, 1931 నుంచి ఆయన అల్లుడు మొహమ్మద్ యూసుఫ్‌షా (1947 లో ఆయన పాకిస్తాన్ వెళ్ళిపోయేంత వరకూ), 1962నుంచీ 1980 వరకూ మోహమ్మద్ ఫారూఖీ ప్రధాన ప్రతినిధులు (మొహమ్మద్ ఫారూఖీ వారసుడు ఉమర్ ఫారూఖీ ఇప్పుడు ఆల్ పార్టీ హూరియత్ కాన్ఫరెన్సుకు నాయకుడు) ప్రజాదరణ తక్కువేమీ లేకపోయినా షేక్ అబ్దుల్లా యొక్క లౌకిక వామపక్ష భావాలతో ఈ ధోరణి ఎన్నడూ సమానం కాలేక పోయింది. ఢిల్లీ పాలకులు నేషనల్ కాన్ఫరెన్సు అప్పీలును కుట్రలు, ఒత్తిడిలాంటి చర్యల ద్వారా నాశనం చేసిన తర్వాతే, అవమానకర ఒప్పందాన్ని షేక్ కొడుకుపై రుద్దిన తర్వాతే, కాశ్మీరీ రాజకీయాల్లో ముస్లిం ధోరణి ఇప్పుడు ముస్లిం యునైటెడ్ ఫ్రంటుగా నిర్మాణమైంది; ఎన్నికల్లో లాభపడతామని ఆశపట్టుకుంది. కొంతమేరకు సఫలమయ్యింది కూడా. ఒక అంచనా ప్రకారం వాళ్ళకు 30శాతం ఓట్లు వచ్చాయి. కానీ నేషనల్ కాన్ఫరెన్సు 36 స్థానాల్లో గెలవగా ఇది కేవలం నాలుగు స్థానాల్లో మాత్రమేగెల్చింది. అతికొద్ది ఓట్ల తేడాతోనే ఆపార్టీ అభ్యర్థులు ఓడిపోయారు. ఓట్ల లెక్కింపులో అక్రమాలు జరిగాయని అందరూ అనుకుంటుంటారు. కౌటింగ్ టేబుళ్ళ దగ్గర ఏ అభ్యర్థులైతే గెల్చారని చెప్పారో ఆ అభ్యర్థులే ఓడిపోయినట్టుగా రిటర్నింగ్ ఆఫీసర్లు ప్రకటించారు. జమ్ము-కాశ్మీరు ఎన్నికల అక్రమాలు నాటకంలోని ఈ తాజా అంకంలో బాధితులే తర్వాత మిలిటెంటు ఉద్యమనాయకులయ్యారు. వీళ్ళందరిలో ప్రముఖుడు షేక్ సారుద్దీన్. ఈయన ఇప్పుడు

హిజ్‌బుల్ మజాహిదీన్ నేత. ఈ సంస్థే గత మూడేళ్ళుగా లోయలో అత్యంత బలమైన మిలిటెంటు గ్రూపు. సలావుద్దీన్ శ్రీనగర్ పట్టణంలోని అనీరా కడల్ నియోజకవర్గం నుంచీ పోటీ చేసి గెల్చాడు. కానీ నేషనల్ కాన్ఫరెన్సు చేతిలో ఓడిపోయినట్లుగా రిటర్నింగ్ అధికారి ప్రకటించాడు!

ఎన్నికలను ఇలా అపహాస్యం చేయడం వల్లే యువకులు తుపాకీ తప్ప మరో పరిష్కారం లేదని అనుకున్నారని కాశ్మీరులో చాలామంది అనుకుంటున్నారు. అంతకుముందు కూడా సాయుధ హింసాత్మక చర్యలు అక్కడక్కడా జరిగిన మాట నిజమే. జమ్ము-కాశ్మీర్ లిబరేషన్ ఫ్రంటు కొన్ని చర్యలు జరిపింది. ఇంగ్లండులోని బర్మింగ్‌హాంలో రవీంద్ర మాత్రేని హత్యచేసింది. అయితే1987 ఎన్నికల్లో విచ్చలవిడిగా జరిగిన అక్రమాలు పరాకాష్ఠకు చేరుకున్న తర్వాతే లోయలో మిలిటన్సీకి అనుకూలంగా ఒక సాధారణ వాతావరణం ఏర్పడింది.

# లోయలో మిలిటెన్సీ - మూలాలు

*"స్వయం నిర్ణయాధికార హక్కుకై ఉద్యమం*

*నాలుగు దశాబ్దాల అణచివేత పీడనల గుండా కొనసాగింది. ఆ ఉద్యమంలో జయాపజాయాలున్నాయి. కానీ అంకిత భావం కలిగిన యువకులూ, అనుభవజ్ఞులైన పెద్దలూ ప్రతిఘటనాపోరాటాన్ని సమున్నతంగా నిలుపగలిగారు.*

*వాగ్దానం చేయబడిన స్వయం నిర్ణయాధికార హక్కుకై నిరంతరం శాంతియుతంగా పోరాడుతూ ఉండలేమని 1987 లో కాశ్మీరీ యువత నిర్ధారణకు వచ్చింది. ప్రపంచం దాదాపుగా కాశ్మీరీలను మర్చిపోయింది. ప్రపంచ శక్తులకు మారుతున్న ప్రయోజనాలున్నాయి..... ఇది ఇండియా వైఖరిలో మూర్ఖత్వాన్నీ, కఠోరతనూ ప్రోత్సహించింది.*

*అలా తమ విడదీయరాని హక్కు అయిన స్వయంనిర్ణయాధికార హక్కును శాంతియుత పద్ధతుల్లో సాధించలేమని తెల్సుకున్న కాశ్మీరు యువత సాయుధ పోరాటమార్గం పట్టారు.*

*అలా స్వయం నిర్ణయాధికార హక్కు పునరుద్ధరణకై శాంతియుతంగా జరుగుతున్న పోరాటం అనివార్యంగా సాయుధ పోరాటంగా పరివర్తన చెందింది."*

*------ఇన్స్టిట్యూట్ ఆఫ్ కాశ్మీర్ స్టడీస్*

ఎవరికి నచ్చినా నచ్చకున్నా కాశ్మీరీ పోరాటం గురించి కాశ్మీరీలకున్న అవగాహన అది. అయిష్టమైన దానిని ఇష్టపడాలన్న నియమం ఎవరూ పెట్టలేదు. అయితే వాస్తవాలను మాత్రం తప్పనిసరిగా చూడాల్సిన బాధ్యత వుంది. జమ్ము-కాశ్మీరులో వున్న అశాంతి గురించిన పెద్ద వాస్తవం ఏమంటే, దాన్ని ఇప్పటివరకూ శాంతియుతంగా వ్యక్తీకరించిన ఆకాంక్షలకు కొనసాగింపుగానే కాశ్మీరీలు చూస్తున్నారు. స్వయం నిర్ణయాధికార హక్కు అనేది ప్రపంచమంతా గుర్తించిన రాజకీయ హక్కు. పైగా ఈ హక్కును జమ్ము-కాశ్మీరుకి ఒక్కసారి కాదు పలుమార్లు వాగానం చేసారు. ఒక్కవేదిక మీద కాదు పలు వేదికల మీద వాగ్ధానం చేసారు. కాశ్మీరీ అశాంతిలో అసలు ప్రజాతంత్ర ఆకాంక్ష ఏమీ లేదని, కేవలం అపకార బుద్ధితో పాకిస్తాన్ ఇచ్చిన మద్దతుతో ఛాందసవాద ముస్లింలు చేస్తున్న దౌర్జన్యం మాత్రమేనని, నటించడం ఇంకెంత మాత్రమూ అంగీకార యోగ్యం కాజాలదు. ఈ విషయంలో అనేక జటిల సమస్యలు ఇమిడి వున్నాయనే మాట నిజమే. అయితే ఈ సమస్యలోని జటిలతను ప్రజాతంత్రయుతంగా పరిష్కరించాలనుకుంటే మౌలికాంశాన్ని ప్రత్యక్షంగా ఎదుర్కోవాలి. అది కాశ్మీరీల జాతీయకాంక్ష.

మేం ఇంతకు ముందే చెప్పినట్లు భారత ప్రభుత్వ ఆరోపణల ప్రకారం కాశ్మీర్‌లో మిలిటెన్సీ 1987 కన్నా చాలా ముందటి నుండి ఉంది. 1960ల చివర్లో అల్-ఫతా అనే టెర్రరిస్టు గ్రూపు లోయలో చురుగ్గా పనిచేస్తున్నదని ఇండియా ఆరోపించింది. 1971 జనవరి 30న 'గంగ' పేరుగల ఇండియన్ ఎయిర్ లైన్స్ విమానాన్ని ఇద్దరు కాశ్మీరు యువకులు లాహోర్‌కు దారి మళ్ళించారు. తాము జమ్ము జాతీయ విముక్తి సంఘటన (దీన్నే జమ్ము-కాశ్మీర్ విముక్తి సంఘటన-జె.కె.ఎల్.ఎఫ్ అని కూడా వర్ణించారు) కు చెందిన వారమనీ, చెప్పుకున్నారు. అయితే పాకిస్తాన్ ప్రభుత్వము మాత్రమే కాక, జమ్ము-కాశ్మీరు ముఖ్యమంత్రి జి.ఎం.సాదిక్ కూడా ఇది భారతీయ గూఢాచారివర్గం పన్నిన పన్నాగమని చెప్పాడు. అలస్టీర్ ల్యాంబ్ కూడా అంతే అయ్యుండాలి అంటాడు. రాబోయే ఈస్ట్ బెంగాల్ సంక్షోభంలో భారత భూభాగంపై పాకిస్తానీ విమానాలను నిషేధించడానికి (ఒక సాకు కల్పించడానికి) ఇండియా ఆడిన నాటకమని అంటాడు. ఈ నిషేధం ఆ యుద్ధంలో పాకిస్తాన్ పైనచాలా ప్రభావం వేసింది. సరే, సత్యం ఏమైనప్పటికీ ఈ ఘటనలకు కాశ్మీరులోని ఏపునాది స్థాయి మిలిటెన్సీ తోనూ లంకెలేదు.

1980 లలో బల ప్రయోగానికి అలవాటయిన అనేక గ్రూపులు భారతీయ జమ్మూ-కాశ్మీరులోనూ, పాకిస్తాన్ జమ్మూ-కాశ్మీరులోనూ, ఇంగ్లండులోని ప్రవాస కాశ్మీరీల్లోనూ పుట్టుకొచ్చినట్లు అన్పిస్తుంది. ఈ సందర్భంలోనే అమానుల్లాఖాన్, మక్బూల్ భట్ ల పేర్లు ప్రచారంలో కొచ్చాయి. 1984 ఫిబ్రవరి 6న ఇంగ్లాండులో వాళ్ళ మొదటి ప్రముఖమైన చర్య జరిగింది. బర్మింగ్‌హోంలో వుండే అసిస్టెంట్ హైకమీషనర్ అయిన రవీంద్ర మాత్రేని ఫిబ్రవరి 3న కిడ్నాప్ చేసారు. ఇండియాలో ఖైదీలుగా వున్న ఐదిగుర్ని విడిచిపెట్టమని డిమాండ్ చేసారు. ప్రభుత్వం ఒప్పుకోకపోగా అతన్ని హతమార్చారు. ఆ ఐదుగురిలో మక్బూల్ భట్ కూడా ఉన్నాడు. ఆయన్ని 1966లో జరిగిన ఒక హత్యకేసులో పట్టుకున్నారు. (సాయుధ దొంగతనం కేసు అది). ఆ తర్వాత ఆయన తప్పించుకున్నాడు. 1976 లో మళ్ళీ దొరికాడు. ఆయనకు ఉరిశిక్ష వేసారు. ఇంకా ఉరితీయలేదు. మాత్రే హత్య తరువాత ఇక హడావిడిగా 1984 ఫిబ్రవరి 11న అతనిని ఉరితీసారు. భట్‌ను విడుదల చేయమని కోరడంతో పాటే లక్ష పౌండ్ల నగదు కూడ డిమాండు చేసారు. డిమాండ్లు తీర్చక పోయేసరికి మాత్రేని మూడు రోజుల తర్వాత చంపేసారు. భట్‌కు మరణశిక్ష విధించిన జడ్జిని 1989 లో మిలిటెంట్లు చంపేసారు. ఫిబ్రవరి 11 అమరవీరుల సంస్మరణ అయింది. లోయలో ప్రతి సంవత్సరమూ ఈ దినాన్ని జరుపుతారు.

ఈ ఘటనల క్రమంలోనే జె.కె.ఎల్.ఎఫ్. పేరూ, దాని నాయకుడు అమానుల్లాఖాన్ పేరూ అందరికీ తెలిసాయి. ఆయన పాకిస్తాన్ ఆక్రమణలో గల జమ్మూ-కాశ్మీర్ వాస్తవ్యుడు. ఈ జె.కె.ఎల్.ఎఫ్ తర్వాత యూనియన్ హోంశాఖ మంత్రి ముఫ్తీ మహ్మద్ సయూద్ కుమార్తె డాక్టర్ రూబియా ను 1989 డిసెంబర్ లో జె.కె.ఎల్.ఎఫ్. కిడ్నాప్ చేసింది. ఆమెను విడుదల చేయాలంటే ఖైదులో వున్న ఐదుగురు కార్యకర్తలను విడుదల చేయాలని డిమాండు చేసి సఫలమైంది.

1992 వరకూ కాశ్మీరు మిలిటెన్సీపై జె.కె.ఎల్.ఎఫ్. ఆధిపత్యం వహించింది. అయితే పలు ఇతర గ్రూపులు-అల్లా టైగర్స్, అల్-ఉమర్, అల్-బర్క్, అల్-జెహాద్,

అల్-హదీద్, అల్-ఉమర్ ముజాహిదీన్, ముస్లిం బ్రదర్‌హుడ్, హిజ్బుల్ ముజాహిదీన్, ముస్లిం జాన్‌బాజ్, జమాత్-ఉల్ ముజాహిదీన్, ఇక్వాన్-ఉల్-ముస్లమీన్, హర్కత్-ఉల్-అన్సర్, ఇక తాజాగా అల్ ఫరాన్ లాంటి సంస్థలు రకరకాల సమయాల్లో పుట్టుకొచ్చాయి.

కాశ్మీరీ మిలిటెంట్లకు పాకిస్తాన్ శిక్షణనిస్తోందనీ, ఆయుధాలిస్తోందనీ ఇండియా నిరంతరం నిందిస్తూనే వస్తోంది. ఈ వాస్తవాన్ని కాశ్మీరీయులు సైతం ఎవ్వరూ కాదనరు. పాకిస్తాన్ కూడా నామమాత్రంగానే ఖండిస్తుంది. ఏదేమైనా 1971 యుద్ధంలో తూర్పు పాకిస్తాన్ మిలిటెంట్లకు ఇండియా శిక్షణ నిచ్చిందని పాకిస్తాన్ ఆరోపిస్తోంది. పాకిస్తాన్ నుంచీ తూర్పు పాకిస్తాన్ వేర్పడి పోవడానికి భారత్ సహకరించిందని కూడా పాకిస్తాన్ నిందిస్తోంది. ప్రజాస్వామ్య దృక్పథంతో ఆలోచించే వాళ్ళకు ఈ రెండు కేసుల్లోనూ వున్న రాజకీయ సమస్య ఒకటే. అది స్వయం నిర్ణయాధికారం. దాన్ని మనకు ముద్దొచ్చినప్పుడు విముక్తి అనీ నచ్చనప్పుడు వేర్పాటు అనీ పిలువకూడదు. శ్రీలంక తమిళ తిరుగుబాటు దార్లకు మొదట్లో భారతదేశం శిక్షణ నిచ్చిందనేదీ, వాళ్ళకు ఆయుధాలు సమకూర్చిందనేదీ కూడా నిజమే. శ్రీలంక తమిళులదీ స్వయం నిర్ణయాధికారమే. నిజం చెప్పాలంటే ఇక్కడో గమ్మత్తైన పోలిక వుంది. ఇండియన్ డిఫెన్స్ రివ్యూ (భారత రక్షణ సమీక్ష) అనే పత్రిక బృందం ఒక పుస్తకం రాసింది. దాని పేరు కాశ్మీర్: ట్రబుల్డ్ ఫ్రాంటియర్స్ (కాశ్మీర్: కల్లోల ఎల్లలు). కాశ్మీరీ మిలిటెంట్లకు శిక్షణ ఇవ్వడానికి పాకిస్తాన్‌లో దాదాపు 37 శిబిరాలున్నాయని ఆ పుస్తకం తెలుపుతుంది. ఈ శిబిరాలన్నీ కాశ్మీర్ కు జాతి పరంగానూ, స్థలపరంగానూ ఆనుకుని వున్న ఆజాద్ కాశ్మీర్ లో ఉన్నాయి. ఇండియాలో కూడా ఎల్.టి.టి.ఇ మిలిటెంట్లకు శిక్షణ ఇవ్వడానికి దాదాపు 35 శిబిరాలుండేవి. ఇవన్నీ భారతదేశంలో తమిళ మాతృ భూమి అయిన తమిళనాడు లోనే ఉన్నాయి. ఈ విషయాలన్నీ ఆ పుస్తకంలో వున్నవే.

అందుకని భారతదేశం చేసే నిందారోపణకు అర్థం లేకుండా పోతోంది. నిజానికి ఈ ఆరోపణ షేక్ అబ్దుల్లా తరహా వ్యక్తులు చేసారంటే అర్థం వుంటుంది. స్వయం నిర్ణయాధికార హక్కు డిమాండుకు మద్దతుగా 1973నవంబర్‌లో భారతదేశ అధీనంలో వున్న జమ్ము-కాశ్మీరులో బందు జరపమని పాకిస్తాన్ నాయకుడు భుట్టో పిలుపుఇస్తే తన రాష్ట్ర వ్యవహారాల్లో తల దూర్చవద్దని షేక్ అబ్దుల్లా భుట్టోకు స్పష్టంగా చెప్పాడు. మరి అబ్దుల్లా స్వయం నిర్ణయాధికార హక్కును సమర్థించే వ్యక్తేనాయె. దాని కోసం కట్టుబడిన వ్యక్తేనాయె; లేదా జె.కె.ఎల్.ఎఫ్ నాయకుల తరహాకు చెందినవాళ్ళు దీనికి తగుదురు. మా బృందంతో మాట్లాడుతూ వాళ్ళు ఆయుధాలూ, శిక్షణ పొందింది సరిహద్దుకు ఆవలనున్న సోదర కాశ్మీరీయుల నుంచేకానీ పాకిస్తాన్ సైన్యం నుంచీ కాదని మాకు స్పష్టంగా చెప్పాడు.

పొరుగువాడి శత్రువులకు శిక్షణనిచ్చే కార్యక్రమం ఉపఖండంలో వున్న జబ్బేనని ఖచ్చితంగా చెప్పవచ్చు. దాని సవ్యాపసవ్యాలతో మనకు ఈ సందర్భంలో సంబంధం లేదు. అయితే ఎవరైతే ఈ రకమైన శిక్షణ చేపడతారో వాళ్ళు తమ వల్ల శిక్షణ పొందినవారు అమాయక జనం మీద, అసహాయుల మీద చేసే అత్యాచారాలకు కూడా బాధ్యత వహించాలి. ఇక్కడ మనం చూడాల్సిందేమంటే సహాయం పొందే వాళ్ళలో తీవ్ర

ఆవేదన వుంటేనే అలాంటి సహాయం సాధ్యమవుతుంది. పరిస్థితులకు పరిష్కారం చూపించాలంటే ఈ ఆవేదనకు గల కారణాలపైన కేంద్రీకరించడం ఫలవంతంగా వుంటుంది. బలరాజ్‌పురి మాటల్లో, అసలు సమస్య ఏమంటే 'పిరికి వాళ్లనీ, మెతక వాళ్లనీ నిరంతరం హేళనకు గురయిన ఒక ప్రజానీకం వందల సంఖ్యలో ఆయుధాలు తీసుకుని బలమైన భారతరాజ్యాన్ని అపూర్వమైన తెగింపుతో ఎలా ప్రతిఘటించగలిగారు?' అనేది.

1989 లో జరిగిన హింసాత్మక చర్యలను మిలటెన్సీ అని పిలుస్తున్నారు. దీనికి ముందు 1988లో లోయలో ఎక్కడ చూసినా అశాంతే వుండేది. ఆ సంవత్సరమే సరిహద్దుకు ఆవల మిలిటెంట్లకు శిక్షణ ఇవ్వడం ప్రారంభమైంది. ఆ సంవత్సరం రెండు-మూడు వందలమంది మిలిటెంట్లు పాకిస్తాన్‌లో శిక్షణ పొంది లోయలోకి ప్రవేశించారని భారత గూఢాచారి వర్గాల అంచనా. సరిహద్దు జిల్లాల్లో రాత్రి పూట కర్ఫ్యూ విధించారు. సరిహద్దు మీదగా సరిహద్దు భద్రత దళాలు కాల్పులు జరిపిన ఘటనలున్నాయి. 'తిరగుబాటు సాయుధ పోరాటంగా తయ్యారయ్యింది' అని జె.కె.ఎల్.ఎఫ్. నాయకుడు 1988 జులై 31న ప్రకటించాడు. 1988-89 లోనూ, 1990 లోనూ మిలటరీ వచ్చిపడేంతవరకూ కాశ్మీరులో పలు సందర్భాలలో భారీ ప్రజా ప్రదర్శనలు జరిగాయి.

ఈ కాలంలో జె.కె.ఎల్.ఎఫ్. ప్రధాన మిలిటెంటు శక్తిగా ముందుకొచ్చింది. ఇండియా, పాకిస్తాన్‌ల ఆక్రమణలో వున్న మొత్తం జమ్ము-కాశ్మీరుకు పూర్తి స్వాతంత్ర్యం కావాలని తటపటాయింపులు లేని స్పష్టమైన వైఖరి అవలంబించింది. 1990 లో పాకిస్తానీ వార్తాపత్రికలకు ఇచ్చిన ఇంటర్వ్యూలలో అమానుల్లాఖాన్ ఈ విషయాన్ని స్పష్టంగా చెప్పాడు. జె.కె.ఎల్.ఎఫ్. లౌకికవాద సంస్థ అనికూడా ఆయన నొక్కిచెప్పాడు. ఈ రెండు విషయాల్లోనూ నిక్కచ్చిగా వుండడంతో ఆ సంస్థ భారీ మూల్యమే చెల్లించుకోవాల్సి వచ్చింది. దానికి పాకిస్తానీ మద్దతు కొరవడింది. ఎందుకంటే రెండు జాతుల సిద్ధాంతాన్ని ఒప్పుకొని రేపు ఎప్పుడైన జమ్ము-కాశ్మీర్ విముక్తం అయితే దాన్ని పాకిస్తాన్‌లో కలిపివేయడానికి అనుకూలంగా వుండే మిలిటెంటు సంస్థలకు మద్దతునీయడానికే పాకిస్తాన్ మొగ్గుచూపుతుంది. పాకిస్తానీ పాత్రికేయుడు ఎజాజ్ హైదర్ 'ది నేషన్' అనే పత్రిక 1994 నవంబర్ 25 నాటి సంచికలో ఇలా రాసాడు.

*'వ్యూహాత్మకంగా ప్రాధాన్యంకల భూమి వివాదంలాగా మనం కాశ్మీర్‌ను చూడ్డంద్వారా కాశ్మీరీల స్వయం నిర్ణయాధికార హక్కుకు సంబంధించి మనమే ఒక వైరుధ్యాన్ని సృష్టించాం. కాశ్మీరీలకు స్వయం నిర్ణయాధికారం ఇవ్వాలని మనం చెబుతున్నాం. అలా మాత్రమే వాళ్ళు ఇండియన్లను అక్కణ్నుంచి తరిమి వేయగలుగుతారు. కానీ ఆ తర్వాత వాళ్ళు మనలో చేరాలంటాం. అంటే ఇండియాను వదిలించుకోవడానికి వాళ్ళకు హక్కువుంది కానీ వాళ్ళకు పాకిస్తాన్ లో విలీనం కావాలా లేదా స్వాతంత్ర్యం కోరుకోవాలా అనే విషయంలో ఎలాంటి స్వేచ్ఛా లేదు. ఈ వాదన విషయానికి సంబంధించిన తర్కం తోగానీ, దాని నైతికతతో గానీ పొసగదు'.*

విషయాన్ని ఈ విధంగా చూసింతర్వాత పాకిస్తాన్ తన మద్దతును క్రమంగా జె.కె.ఎల్.ఎఫ్. నుంచీ స్పష్టంగా ఛాందసవాద, పాకిస్తానీ అనుకూల హిజ్బుల్ ముజాహిదీన్

(హెచ్.ఎమ్) కు మార్చింది. తన ఆక్రమణలో గల కాశ్మీరులో వున్న జె.కె.ఎల్.ఎఫ్. పై నిర్బంధాన్ని ప్రయోగించడానికి సైతం పాకిస్తాన్ వెనుకాడలేదు. 1992 ఫిబ్రవరి 11న (మక్బూల్ భట్ వర్ధంతి రోజు) పాకిస్తాన్‌లో ఉన్న కాశ్మీర్ నుంచీ ఇండియాలో గల జమ్ము-కాశ్మీరు వైపు అమానుల్లా ఖాన్ ఒక ఊరేగింపు నడిపాడు. పాకిస్తాన్ ప్రభుత్వం కర్ఫ్యూ విధించింది. ఊరేగింపుపై కాల్పులు జరిపి 11 మందిని చంపింది. (జె.కె.ఎల్.ఎఫ్. అంచనా ప్రకారం 20 మంది). అయినప్పటికీ జె.కె.ఎల్.ఎఫ్. తన అభిప్రాయాన్ని మార్చుకోలేదు. ఆ సంస్థ నాయకులైన యాసిన్ మాలిక్, అల్తాఫ్ హుస్సేన్ ఖాద్రీలతో మేం మాట్లాడాం. జమ్ము-కాశ్మీర్ విముక్తి అంటే మొత్తం రాష్ట్రం పునరేకీకరణ అనీ, ఇండియా పాకిస్తాన్‌ల నుంచీ స్వాతంత్ర్యం అనీ మాకు వాళ్ళు స్పష్టంగా చెప్పారు. ఇక లౌకికవాదం విషయానికొస్తే అది కాశ్మీరియత్ అనే కాశ్మీర్ సంస్కృతి స్ఫూర్తిలోనే అంతర్భాగమని వాళ్ళు చెప్పారు. వాళ్ళు ఈ కాశ్మీరీయత్‌కే గట్టిగా నిలబడతామనీ, లౌకికవాదం మీద తమకెవ్వరూ పాఠాలు బోధించాల్సిన అవసరం లేదనీ వాళ్ళు మాతో అన్నారు. బహు మతాలూ, బహు జాతులూ గల పరిస్థితిలో లౌకిక ప్రజాతంత్రయుతంగా ఉండడమంటే సమాఖ్య తరహా రాజ్యనిర్మాణం వుంటుందని కూడా వాళ్ళు గుర్తించినట్లు అన్పిస్తుంది. వాళ్ళ ఊహాలో వున్న స్వతంత్ర జమ్ము-కాశ్మీర్ రాజ్యం సమాఖ్య వ్యవస్థ లా వుంటుంది. జమ్ము, లడఖ్, పూంచ్, కాశ్మీర్, బాల్టిసస్తాన్‌లు పూర్తి స్వయం ప్రతిపత్తిని అనుభవిస్తాయి. వీటికి కేంద్రంగా శ్రీనగర్ వుంటుంది. కేవలం రక్షణ, విదేశీ వ్యవహారాలు, ప్రసార, రవాణా వ్యవహారాలు మాత్రమే కేంద్రం పరిధిలో వుంటాయి.

జె.కె.ఎల్.ఎఫ్. కన్నా హిజ్బుల్ ముజాహిదీన్ వైపు పాకిస్తాన్ మొగ్గు చూపడమే కాదు, జె.కె.ఎల్.ఎఫ్. ను భౌతికంగా నిర్మూలించడానికి కూడా హెచ్.ఎం.ను అది రెచ్చగొట్టింది. 1991 డిసెంబర్‌లో పాకిస్తాన్ రాజధానిలో జరిగిన ఒక పత్రికా విలేఖరుల సమావేశంలో అమానుల్లాఖాన్ ఈ విషయం చెప్పాడు. ఇండియా కూడా జె.కె.ఎల్.ఎఫ్. ను తన దాడికి లక్ష్యంగా పెట్టుకుంటూ హెచ్.ఎం.ను రహస్యంగా ప్రోత్సహించిదనీ, జె.కె.ఎల్.ఎఫ్.పై దాడి చేయడానికీ, దాని కార్యకర్తలను భారీ సంఖ్యలో చంపివేయడానికి ప్రోత్సహించిందనీ ఒక్క జె.కె.ఎల్.ఎఫ్. నాయకత్వమేగాక తటస్థ పరిశీలకులు, పాత్రికేయులు కూడా నమ్ముతున్నారు. జమ్ము-కాశ్మీర్‌లో మిలిటెన్సీ తలెత్తిన రెండు సంవత్సరాల తర్వాత కమిటీ ఫర్ ఇనీషియేటివ్ ఆన్ కాశ్మీర్ అనే సంస్థ 1991 డిసెంబర్‌లో ఒక రిపోర్టు ప్రచురించింది. గత రెండు సంవత్సరాల చరిత్రను చూస్తే శత్రువును తన ప్రచారానికి తగిన రూపంలో తయారు చేసుకునే పైశాచిక క్రీడలో భారత ప్రభుత్వం లోయలోని జనాన్ని పాకిస్తానీ అనుకూల మిలిటెంట్ల ఒడిలోకి తోసేయడానికే నిశ్చయించుకున్నట్లుగా తోస్తోంది. పాకిస్తానీ-అనుకూల మిలిటెంట్లను విదేశీ శత్రువులగా తేలిగ్గా అమ్ముకోవచ్చు. అణచివేత విధానానికి దేశ అనుమతినీ పొందొచ్చు. జె.కె.ఎల్.ఎఫ్. కన్నా ఇది మంచి సరుకు. కాశ్మీర్‌లోని రెండు ప్రాంతాలలోనూ ఆజాదీ (స్వతంత్రం) కోసం పోరాడుతోన్న ప్రతిష్ట దానికుంది.

షేక్ అబ్దుల్లాకు వ్యతిరేకంగా జమాతే ఇస్లామీని ప్రోత్సహించిన గత ప్రయత్నానికిది కొనసాగింపే. జమాత్ కు హెచ్.ఎం. సాయుధ విభాగం అనేది అందరికీ

తెలిసిందే. కాగా ఏ కాశ్మీరీయత్ కోసం షేక్ అబ్దుల్లా నిలబడ్డాడో దాని కోసమే నిలబడిన సంస్థ జె.కె.ఎల్.ఎఫ్. విచ్ఛిన్న శక్తిచో వ్యవహరించడం తేలిక ఏకీకరణ శక్తి స్థానంలో విచ్ఛిన్న శక్తిని నిలవడం మాత్రమే కాక, ఇండియా కోరుకున్న రూపంలో శత్రువును పునః సృష్టించడం కూడా ఈ ప్రయత్నం లక్ష్యం. కాశ్మీరీ జాతీయత కోసమే పోరాడే శక్తి పై నైతిక సాధికారతను పొందడం ఇండియాకు కష్టం. దాన్ని చట్టవిరుద్ధ సంస్థ అని చెప్పడం ఇండియాకు కష్టం. అలాంటి జాతి పై తాను చేస్తున్న యుద్ధాన్ని సమర్థించుకుంటూ ప్రపంచం ముందు వాదించడం ఇండియాకు కష్టం. కానీ పాకిస్తాన్‌లో కాశ్మీర్ ను విలీనం చేయాలని కోరే రాజకీయ సంస్థతో తన శత్రుత్వాన్ని సమర్థించుకోవడం సులభం. పైగా పాశ్చాత్య దేశాలు ఈ రోజుల్లో పాన్ ఇస్లామిజం అంటే భయ పడుతున్నాయి కదా. అందువల్ల తన శత్రువుగా ఇండియా కాశ్మీరీ జాతీయవాదికన్నా కాశ్మీరీ ఛాందస వాదివే, కోరుకుంటుంది. కాశ్మీరీ ఛాందస వాదికన్నా విదేశీ ఇస్లామిక్ ఛాందసవాదిని కోరుకుంటుంది. అందువల్ల శత్రువును పునర్ నిర్వచించుకోవడానికి ఏం చేయగలిగితే అది చేస్తుంది. పాకిస్తాన్ కూడా ఇదే రకమైన మార్పు కోరుకుంటుంది. రెండు 'శత్రు దేశాల' మధ్య ఎంత చక్కటి పొత్తు!

వ్యక్తుల్ని ఎంచుకుని చంపడమనే హింసాత్మక ఘటనల్ని మిలిటెంట్లు 1989లో మొదలెట్టారు. ఆగస్టు 21న నేషనల్ కాన్ఫరెన్సుకు చెందిన మొహమ్మద్ యూసుఫ్ హాల్వాయిని చంపారు. బి.జె.పి. రాష్ట్ర ఉపాధ్యక్షుడైన తికాలాల్ తిప్లూని సెప్టెంబర్ 14వ చంపారు. మక్బూల్ భట్‌కు ఉరిశిక్ష వేసిన నీలకంఠ్ గంజూ అనే రిటైర్డ్ న్యాయమూర్తిని నవంబర్ 4న చంపారు. డిసెంబరు 8న డాక్టర్ రూబియాను కిడ్నాప్ చేసి జైలులో ఉన్న 5గురు జె.కె.ఎల్.ఎఫ్. మిలిటెంట్లను విడిపించుకున్నారు. 'కఠినంగా' వ్యవహరించాలనుకొంది కేంద్ర ప్రభుత్వం. అనుకొని చేయగలిగిన పనుల్లో అత్యంత అభ్యంతరకరమైన పని చేసింది. జగ్ మోహన్‌ను మళ్లీ గవర్నర్ గా అక్కడికి పంపింది. 1990 జనవరి 19న ఆయన పదవిని అదిష్ఠించాడు. 1990 మే 24న అక్కడి నుంచి వెళ్ళిపోయాడు. ఈలోపల ఆయన పరిస్థితిని సర్వనాశనం చేసిపోయాడు. జగ్‌మోహన్‌ను గవర్నర్‌గా పంపించినప్పుడు ఈ చర్యను నిరసిస్తూ ఫారూఖ్ అబ్దుల్లా రాజీనామా చేశాడు. గతంలో కాశ్మీర్ లో అపకీర్తి సంపాదించుకున్న వాణ్ణి గవర్నర్‌గా నెత్తిన రుద్దినందుకు రాజీనామా చేశాడు. ఆయన నిరసనను మనం అర్థం చేసుకోనవచ్చు. కానీ అది దురదృష్టకర ఫలితాన్నిచ్చింది. జగ్‌మోహన్ పూర్తి అధికారాన్ని హస్తగతం చేసుకున్నాడు. బి.జె.పి. మద్దతు పై ఆధారపడిన జనతాదళ్ ప్రభుత్వం బి.జె.పి. చేసిన ఒత్తిడి మేరకే - ఎందుకంటే జగ్‌మోహన్ బి.జె.పి. మూసలో తయారైన మనిషి - గవర్నర్ గా పంపిందని అందరూ అనుకుంటున్నారు. కాశ్మీర్‌ను ఆయన 'తేళ్ళ లోయ'గా చూశాడు. "నూతన మత తత్వ రాజ్య ప్రకటనను" నిరోధించడమే ఆయన గారి కర్తవ్యం! ప్రభుత్వ రాజీనామాతో ఆయనకు తృప్తి కలిగినట్లు లేదు. ఏకంగా శాసనసభనే రద్దు చేసి పారేశాడు. ఎందుకంటే 'భారీ బల ప్రయోగానికి నైతిక సాధికారత ఉండదు' అని ఆయన చెప్పుకున్నాడు. తన ఉద్దేశాన్ని ఇంతకన్నా తేట తెల్లం చేసి చెప్పడం కష్టం.

జగ్‌మోహన్ అధికార పగ్గాలు చేపట్టగానే దాడులూ సోదాలు చేయడానికి సాయుధ బలగాలను కదిలించాడు. ఈ చర్యల్లో చేసే అరెస్టులు అడ్డూ అదుపూ లేని

హత్యాకాండకు దారి తీసాయి. అరెస్టయిన వ్యక్తుల్ని కస్టడీలో చంపేసి ఎదురు కాల్పుల్లో చనిపోయారని ప్రకటించేవారు. సోదాలు చేసేప్పుడు స్త్రీలపై బలత్కారం, అత్యాచారం చేసే వారనే ఆరోపణలకు కొదవేలేదు. సోదా చేసేటప్పుడు ఆ ప్రాంతంలోని మగ వాళ్ళందర్నీ ఇళ్ళలోంచి బయటకు రమ్మనే వాళ్ళు. ఇన్‌ఫార్మర్‌లతో గుర్తు పట్టించడానికి వీలుగా ఒకచోట వాళ్ళను కుర్చోమనేవాళ్ళు. మగవాళ్ళలా బయటకూర్చుంటే సైనికులు ఇళ్ళలో సోదా నిర్వహించే వాళ్ళు. ఇలాంటి సోదాల క్రమంలోనే సైనికులు స్త్రీలపై తరుచూ అత్యాచారాలకు పాల్పడేవాళ్ళు. సైన్యం చేసే అత్యాచారాలను నిరసిస్తూనూ, ఇతర సందర్భాల్లోనూ భారీ నిరసన ప్రదర్శనలు జరగాయి. లోయలో చాలా సంవత్సరాలుగా వివిధ సమస్యలపైన అలాంటి ప్రదర్శనలు జరుగుతూ వస్తున్నాయి. కానీ 1989 నుంచీ వాటిలో పాల్గొనే వారి సంఖ్య పెరిగింది. ప్రదర్శనలు ఎక్కువ సంఖ్యలో జరిగాయి కూడ.

ఈ ప్రదర్శనలతో జగ్‌మోహన్ బలగాలు భారీ ఆయుధాలతోతలపడ్డాయి. ఈ చర్యల్లో జరిగిన హత్యాకాండ గురించి వింటే ఒళ్ళు గగుర్పొడుస్తుంది. 1990 జనవరి 21 న శ్రీనగర్‌లో గల గౌకడల్ ప్రాంతంలో సాయిధ బలగాలు చేసిన అత్యాచారాల్ని నిరసిస్తూ 20 వేల మంది ప్రదర్శన చేశారు. సి. ఆర్.ఫి.ఎఫ్. విచ్చల విడిగా జరిపిన కాల్పుల్లో తక్కువలో తక్కువ 60మంది ప్రదర్శన కారులు చనిపోయారు. మర్నాడు ఈ హత్యా కాండను నిరసిస్తూ మరో ప్రదర్శన జరిగింది. మళ్ళీ సి.ఆర్.పి.ఎఫ్. కాల్పులు జరిపింది. ఈ సారి ఆరుగుర్ని శ్రీనగర్‌లోని హవాల్ ఏరియాలో చంపింది.

1990 మార్చి 1న 5లక్షల మంది జనం ఆజాది డిమాండు చేస్తూ రకరకాల ప్రాంతాల నుంచి శ్రీనగర్ చేరుకున్నారు. నగరంలో 3 చోట్ల (జకురా, తెంగ్‌పురా, షాలిమార్) సైన్యం ఊరేగింపు పై కాల్పులు జరిపింది. 33 మందిని చంపేసింది. చచ్చిన వాళ్ళలో బస్సు ప్రయాణికులు కూడా ఉన్నారు.

ఆ తర్వాతి భారీ నరమేధం 1990 మే 24న జరిగింది. ఇది 'తేళ్ళ లోయ'నుంచి జగ్ మోహన్ ను తొలగించ డానికి దారి తీసింది. దీనికి పూర్వ రంగం మీర్వాయిజ్ ఫారూఖ్ హత్య. ఈయన కాశ్మీరీ రాజకీయాలలో లౌకిక జాతీయవాద ప్రవాహానికి సనాతన ప్రతిద్వంది అనిమనం ఇంతకు ముందే చెప్పుకున్నాం. మిలిటెంట్లు చేసే హింసాత్మక చర్యలను కూడా వ్యతిరేకించాడు. ఏదో ఒక మిలిటెంటు సంస్థే ఆయన్ని హత్య చేసి ఉంటుందని చెప్పుకుంటారు. ఆయన మృత దేహాన్ని భారీ ఊరేగింపుగా తీసుకపోతూంటే ఇస్లామియా కళాశాల వద్ద ఊరేగింపులో పాల్గొంటున్న వాళ్ళనుంచి ఎలాంటి రెచ్చగొట్టే చర్యలూ లేకపోయినా సి.ఆర్.పి.ఎఫ్. కాల్పులు జరిపి 47 మందిని చంపింది. ఈ నరమేధాన్ని చాలామంది ఖండించారు. అమెరికా అధ్యక్షుడైన జార్జిబుష్‌కూడా భారత ప్రభుత్వానికి తన ఆందోళన తెలియజేస్తూ ఒక సందేశం పంపాడనీ, ప్రదర్శనలతోనూ, ఊరేగింపులతోనూ వ్యవహరించడంలో సాయుధ బలగాలను కట్టడి చేయాలని కోరాడనీ అంటారు. దీని ఫలితం ఏమంటే జగ్ మోహన్‌ను అక్కడ్నుంచి తప్పించి గిరీష్ సక్సేనాను గవర్నర్ గా పంపడం.

జగ్‌మోహన్‌కున్న హిందూ జాతీయ వాద మనస్తత్వాన్నీ గురించి, అది ఈ సమస్యకు ఎలా హాని చేసిందీ ఇంతకు ముందే చెప్పుకున్నాం. ఇలాంటి మనస్తత్వం

ఈ ఒక్క వ్యక్తికి మాత్రమే ప్రత్యేకం అని అనుకోకూడదు. ఈ మనస్తత్వం చాలా వరకు భారత రాజ్యంలోకే చొచ్చుకు పోయిన వాస్తవాన్ని చూస్తాం. మరీ ముఖ్యంగా బ్యూరాక్రసీలోకీ, సాయుధ బలగాలలోకీ ఈ మనస్తత్వం చొచ్చుకు పోయింది. గత దశాబ్దం పైగా జరిగిన మత కల్లోలాలలో ఈ విషయం ప్రస్ఫుటంగా కనబడినట్లు పౌర, ప్రజాస్వామిక హక్కుల సంఘాలు ప్రచురించిన నివేదికలు తెలుపుతాయి. జమ్ము-కాశ్మీర్ లో ని పౌరపాలన, భద్రతా దళాలూ ఈ సాధారణ ధోరణికి మినహాయింపేమీ కాదు. కాశ్మీరీ ముస్లింలను మతం పేరుతో సైనికులు దుర్భాషలాడిన ఘటనలను కమిటీ ఫర్ ఇనీషియేటివ్ ఆన్ కాశ్మీర్ తదితర పౌర హక్కుల సంస్థలు ప్రచురించిన నివేదికలు పేర్కొన్నాయి. 'వాళ్ళు ముస్లింలు, వాళ్ళు ఇండియాను ద్వేషిస్తారు, వాళ్ళు పాకిస్తాన్ ఏజంట్లు, వాళ్ళు వేర్పాటు వాదులు, వాళ్ళు కాశ్మీరును పాకిస్తాన్ లో కలుపుదామనుకుంటున్నారు' -- ఇదీ హిందూ జాతీయవాదుల తర్కం!

కాశ్మీరీ ముస్లిం గుర్తింపు ఇటీవలి కాలంలో గణనీయం గానే మతతత్వ రూపు తీసుకుందనే మాట నిజమే ఇంతకు ముందే మేంకూడా ఈ విషయాన్ని ప్రస్తావించాం. అయితే ఇది ప్రబల ధోరణిగా మారిపోయినట్లు కనబడదు. మేం మాట్లాడిన వాళ్ళలో చలా మంది కూడా ఇదే అభిప్రాయం వ్యక్తపరచారు మాతో మాట్లాడిన వాళ్ళు ఈ విషయంలో ఏ పక్ష పాతం లేని వాళ్ళుకాదు. వారిలో కొందరు బహుముఖ సహనశీల కాశ్మీరీ సంప్రదాయం వైపు పక్షపాత ధోరణి కలిగిన వాళ్ళు ఉన్నారు. మరి కొందరు సనాతన ముస్లిం మనస్తత్వంతో ఉన్నారు. మొదటి ధోరణి కలిగిన వాళ్ళందరూ సాధువులూ, వాళ్ళ స్మృతిమందిరాలు ప్రభావితం చేసేసంప్రదాయక కాశ్మీరీయతే ఈ నాటికీ కాశ్మీరీల సంస్కృతినీ తాదాత్మ్యతనూ నిర్మయిస్తుందనీ నొక్కి చెప్పడం స్పష్టంగా కనిపించింది. ఛాందసవాద భావాలనూ, పాకిస్తాన్ అనుకూల రాజకీయ భావాలనూ ప్రచారం చేసిన వాళ్లు ఆధిపత్య స్థానంలో ఉన్నట్లు బయటికి కనిపిస్తారు. కానీ దానికి కారణం, వాళ్ళ వెనుక పాకిస్తాన్ అనుకూలురైన మిలిటెంట్ల తుపాకులుడడమే అని మాకు చెప్పారు. లౌకిక వాద కాశ్మీరీ జాతీయవాదులు ఈ విషయం మాతో ఆత్మవిశ్వాసంతో నొక్కినొక్కి చెప్పగా ఛాందసవాద, పాకిస్తాన్ అనుకూల అభిప్రాయం కలిగిన వాళ్ళు తామే సమకాలీనా కాశ్మీరీ దృష్టి కోణానికి నిజమైన ప్రతినిధులమని చెప్పుకోవడంలో అంతటి ఆత్మవిశ్వాసం కనబరచలేదు. భావి స్వతంత్ర కాశ్మీర్ రాజ్యం మత రాజ్యంగా ఉంటుందా లేక లౌకిక రాజ్యంగా ఉంటుందా అని ఒక ప్రముఖుడైన సనాతన మేధావిని అడిగాం. ఆయన హురియత్. కాన్ఫరెన్సు నాయకుడు కూడా. ఆయన ఇచ్చిన జవాబు - 'అది నిర్ణయించాల్సింది ప్రజలు మేం కాదు చెప్పాల్సిందే'.

ఈ విషయం చెప్పడంతో మా ఉద్దేశ్యం కాశ్మీరు గురించి కొట్టొచ్చినట్లు కనబడే ఒక వాస్తవాన్ని నమోదు చేయడమే. ఈ వాస్తవాన్ని ఇండియాలో పద్ధతి ప్రకారం జరుగుతున్న ప్రచారం నిరాకరిస్తోంది. మత రీత్యా సాన్నిహిత్యం వుందనే కారణంపై కాశ్మీరీలు పాకిస్తాన్‌తో ఐక్యమయి పోవడాన్ని కోరుకుంటున్నట్లయితే వాళ్లను కించపరచడం సమర్థనీయమని గానీ, వాళ్ళ ఆకాంక్షలను అణచివేయడం సమర్థనీయమని గానీ మా ఉద్దేశం కాదు. ఏ ఆకాంక్షను ఐనా అలా అణచివేయడం సమర్థనీయంకాదు. ఏ ప్రజా ఆకాంక్షనైనా, దాన్ని ఎవరు ఎలా విలువ కట్టుకున్నప్పటికీ,

ఈ ఒక్క వ్యక్తికి మాత్రమే ప్రత్యేకం అని అనుకోకూడదు. ఈ మనస్తత్వం చాలా వరకు భారత రాజ్యంలోకే చొచ్చుకు పోయిన వాస్తవాన్ని చూస్తాం. మరీ ముఖ్యంగా బ్యూరాక్రసీలోకీ, సాయుధ బలగాలలోకి ఈ మనస్తత్వం చొచ్చుకు పోయింది. గత దశాబ్దం పైగా జరిగిన మత కల్లోలాలలో ఈ విషయం ప్రస్ఫుటంగా కనబడినట్లు పౌర, ప్రజాస్వామిక హక్కుల సంఘాలు ప్రచురించిన నివేదికలు తెలుపుతాయి. జమ్మూ-కాశ్మీర్ లో ని పౌరపాలన, భద్రతా దళాలూ ఈ సాధారణ ధోరణికి మినహాయింపేమీ కాదు. కాశ్మీరీ ముస్లింలను మతం పేరుతో సైనికులు దుర్భాషలాడిన ఘటనలను కమిటీ ఫర్ ఇనీషియేటివ్ ఆన్ కాశ్మీర్ తదితర పౌర హక్కుల సంస్థలు ప్రచురించిన నివేదికలు పేర్కొన్నాయి. 'వాళ్ళు ముస్లింలు, వాళ్ళు ఇండియాను ద్వేషిస్తారు, వాళ్ళు పాకిస్తాన్ ఏజంట్లు, వాళ్ళు వేర్పాటు వాదులు, వాళ్ళు కాశ్మీరును పాకిస్తాన్ లో కలుపుదామనుకుంటున్నారు' -- ఇదీ హిందూ జాతీయవాదుల తర్కం!

కాశ్మీరీ ముస్లిం గుర్తింపు ఇటీవలి కాలంలో గణనీయం గానే మతతత్వ రూపు తీసుకుందనే మాట నిజమే ఇంతకు ముందే మేంకూడా ఈ విషయాన్ని ప్రస్తావించాం. అయితే ఇది ప్రబల ధోరణిగా మారిపోయినట్లు కనబడదు. మేం మాట్లాడిన వాళ్ళలో చలా మంది కూడా ఇదే అభిప్రాయం వ్యక్తపరచారు మాతో మాట్లాడిన వాళ్ళు ఈ విషయంలో ఏ పక్ష పాతం లేని వాళ్ళుకాదు. వారిలో కొందరు బహుముఖ సహనశీల కాశ్మీరీ సంప్రదాయం వైపు పక్షపాత ధోరణి కలిగిన వాళ్ళు ఉన్నారు. మరి కొందరు సనాతన ముస్లిం మనస్తత్వంతో ఉన్నారు. మొదటి ధోరణి కలిగిన వాళ్ళందరూ సాధువులూ, వాళ్ళ స్మృతిమందిరాలు ప్రభావితం చేసేసంప్రదాయక కాశ్మీరీయతే ఈ నాటికీ కాశ్మీరీల సంస్కృతినీ తాదాత్మ్యతనూ నిర్మయిస్తుందనీ నొక్కి చెప్పడం స్పష్టంగా కనిపించింది. ఛాందసవాద భావాలనూ, పాకిస్తాన్ అనుకూల రాజకీయ భావాలనూ ప్రచారం చేసిన వాళ్లు ఆధిపత్య స్థానంలో ఉన్నట్లు బయటికి కనిపిస్తారు. కానీ దానికి కారణం, వాళ్ళ వెనుక పాకిస్తాన్ అనుకూలురైన మిలిటెంట్ల తుపాకులుడడమే అని మాకు చెప్పారు. లౌకిక వాద కాశ్మీరీ జాతీయవాదులు ఈ విషయం మాతో ఆత్మవిశ్వాసంతో నొక్కినొక్కి చెప్పగా ఛాందసవాద, పాకిస్తాన్ అనుకూల అభిప్రాయం కలిగిన వాళ్ళు తామే సమకాలీనా కాశ్మీరీ దృష్టి కోణానికి నిజమైన ప్రతినిధులమని చెప్పుకోవడంలో అంతటి ఆత్మవిశ్వాసం కనబరచలేదు. భావి స్వతంత్ర కాశ్మీర్ రాజ్యం మత రాజ్యంగా ఉంటుందా లేక లౌకిక రాజ్యంగా ఉంటుందా అని ఒక ప్రముఖుడైన సనాతన మేధావిని అడిగాం. ఆయన హురియత్. కాన్ఫరెన్సు నాయకుడు కూడా. ఆయన ఇచ్చిన జవాబు - 'అదీ నిర్ణయించాల్సింది ప్రజలు మేం కాదు చెప్పాల్సింది'.

ఈ విషయం చెప్పడంలో మా ఉద్దేశ్యం కాశ్మీరు గురించి కొట్టొచ్చినట్లు కనబడే ఒక వాస్తవాన్ని నమోదు చేయడమే. ఈ వాస్తవాన్ని ఇండియాలో పద్ధతి ప్రకారం జరుగుతున్న ప్రచారం నిరాకరిస్తోంది. మత రీత్యా సాన్నిహిత్యం వుందనే కారణంపై కాశ్మీరీలు పాకిస్తాన్‌తో ఐక్యమయి పోవడాన్ని కోరుకుంటున్నట్లయితే వాళ్లను కించపరచడం సమర్ధనీయమని గానీ, వాళ్ళ ఆకాంక్షలను అణచివేయడం సమర్ధనీయమని గానీ మా ఉద్దేశం కాదు. ఏ ఆకాంక్షను ఐనా అలా అణచివేయడం సమర్ధనీయంకాదు. ఏ ప్రజా ఆకాంక్షనైనా, దాన్ని ఎవరు ఎలా విలువ కట్టుకున్నప్పటికీ,

ఒక ఆకాంక్షగా గుర్తించి దానితో ప్రజాస్వామికంగా వ్యవహరించాలి. ఇలా వ్యవహరించేప్పుడు ఏ ప్రజలకైనా తమ కోరికలకు అనుగుణంగా తమ గమ్యాన్ని నిర్ణయించుకునే ప్రాథమిక హక్కువుంది. అనేదాన్ని ప్రాతిపదికగా తీసుకోవాలి.

కానీ భారతీయ పాలకుల్లోకీ, భద్రతా దళాలలోకీ రోజురోజుకూ మరింతగా చొచ్చుకుపోయిన హిందూ జాతీయవాదానికి. కాశ్మీరీ ఆకాంక్షలకు మతతత్వ రంగు పులమడం, దాన్ని ఆవిధంగా చూపించడం సౌకర్యంగా వుంటుంది. ఎందుకంటే ఆకాంక్షలను నిరాకరించడాన్నీ, వాటిని క్రూరంగా అణచివేయడాన్నీ బారత ప్రజల ముందూ, ఈ రోజుల్లో ఇస్లాం అంటేనే నరాల జబ్బు పట్టుకుంటున్న పశ్చిమ దేశాల ముందూ బాగా సమర్థించుకోవచ్చు.

తాను అనుకున్న దానికి అనుగుణంగా వాస్తవాన్ని కొత్త రూపంలో చూపించడం ఆ దృష్టి కోణానికి అవసరమౌతుంది. దీనికి కొన్ని దృష్టాంతాలు మేమింతకు ముందే పేర్కొన్నాం. ఇప్పుడు మరొకటి చూద్దాం.

తికాలాల్ తిపూ , నీలకాంత్ గంజూలను చంపిన తర్వాత కొంతమంది కాశ్మీరీ పండిట్స్ ను కూడా మిలిటెంట్లు చంపారు. ప్రభుత్వ ఏజంట్లనూ, ఇన్ ఫార్మర్లనూ దాడికి లక్ష్యంగా పెట్టుకన్నామని మిలిటెంట్లు చెప్పుకున్నారు. అయితే హిందూ సమాజమే మొత్తంగా అభద్రతా బావానికి గురైంది. వాళ్ళలో కొందరికి లోయ విడిచి పొమ్మని బెదిరింపులు అందాయి. (వాళ్ళ ప్రస్తుత పరిస్థితి ఏమిటీ అనేది మేం తర్వాత చర్చిస్తాం.) సరిగ్గా ఈ సమయంలోనే, ఎక్కడెక్కడో ఉన్న పండిట్ లందరికీ భద్రత కలిగించలేమని జగ్‌మోహన్ నిర్ణయించుకొని లోయ వదిలి పొమ్మని వాళ్లకు సలహా ఇచ్చాడు. వలస పోవడానికి అవసరమైన సహాయం ఇస్తామని వాళ్లకు వాగ్దానం చేశాడు. సహాయం అందిచారు కూడా. చాలామంది తరలి వెళ్ళి పోయారు. మొత్తం పండిట్ లందరికీ సైన్యం భద్రత కలిగించ లేదనే వాదనను ప్రజాభిప్రాయం కోసం ఇవ్వగా, అతని మనసులో ఏదో భిన్నమైన కారణం ఉన్నట్లు తోస్తోంది. మొత్తం పండిట్‌లంతా వెళ్ళిపోతే లోయలోని అశాంతికి మతతత్వ రంగు పులమవచ్చు. ఇండియా చేపట్టాలనుకుంటున్న ప్రచారానికి తగింది ఆ చిత్రమే. బలరాజ్‌పురి లాంటి ప్రముఖులు కాశ్మీరీ ప్రియులు మతం కారణంగా చీలి పోవడాన్ని నిరోధించడానికి చేసిన కృషి యెడల గవర్నర్ ప్రతిస్పందన ఈ విషయాన్నే రుజువు చేస్తుంది. 1990 మార్చిలో లోయలోని ముస్లింలతో బలరాజ్ పూరి విస్తృత చర్చలు జరిపాడు. పండిట్‌లు ఇలా వెళ్ళి పోవడం పట్ల చాలా మంది విచారం వ్యక్త పర్చినట్లు బలరాజ్‌పురి గుర్తు చేస్తాడు. రెండు మతాలకూ చెందిన వారితో ఒక ఉమ్మడి కమిటీని వేశారు. ఆ కమిటీలో హైకోర్టు లమాజీ ప్రధాన న్యాయమూర్తి ముఫ్తీ బహావుద్దీన్ ఫారూఖీ, కాశ్మీరీ పండిట్‌ల నాయకుడు హెచ్.ఎన్. జట్టూ ఇందా ఇతరులూ ఉన్నారు. వలస పోవడాన్ని ఆపి ఇప్పటికే వెళ్ళి పోయిన వాళ్లను తిరిగి తీసుకోచ్చేందుకు ఈ కమిటీ ద్వారా ప్రయత్నాలు జరిగాయి. లోయను విడిచిపెట్టి వెళ్ళవద్దని చాలామంది ముస్లింలు విజ్ఞాపనలు ప్రకటించారు. ఆ విజ్ఞాపనలు పండిట్‌ల భయాన్ని తొలగించడానికి సరిపోతాయా లేదా అనేది కాదు ఇక్కడ విషయం. ఇక్కడ చెప్పవలసిందేమిటంటే ఈ కృషిని జగ్‌మోహన్ సఫలం కానీయలేదు. ఆయవ జట్టూకు జమ్ము వెళ్ళిపోవడానికి ఒక విమానం టిక్కెట్టు ఒక పోలీసు అధికారి ద్వారా

పంపాడు. ఎయిర్ పోర్టుకు ఆయన్ని తీసుక పోవడానికి జీపు పంపాడు. జమ్మూలో నివాసం కల్పిస్తానన్నాడు. కాశ్మీర్ నుంచి వెంటనే వెళ్ళి పొమ్మని సలహా ఇచ్చాడు. ఈ పని ఎందుకు చేసావని బలరాజ్‌పురి అతన్ని అడుగగా, 'కాశ్మీరీ గుర్తింపు అనేది కొనసాగినంత కాలం దాన్ని అమెరికా, పాకిస్తాన్‌లు ఉపయోగించుకుంటాయి' అనీ, 'లోయలో హిందువులూ, ముస్లింలూ కలిసి ఉంటే అది సాయుధ బలగాల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీస్తుంది'. అనీ జగ్‌మోహన్ తన అభి ప్రాయాన్ని చెప్పాడు. ఈ రెండు కామెంట్లు వలన కళ్ళు తెరిపిస్తాయి. కాశ్మీరీ గుర్తింపును సర్వనాశనం చేయాలి. దాని స్థానంలో ముస్లిం గుర్తింపును ప్రోత్సహించాలి. అప్పుడు దాన్ని బల ప్రయోగంతో ఎదుర్కోనవచ్చు. దాని సాధికారత పై దుష్ప్రచారం చేయొచ్చు. హిందువులకీ ముస్లింలకు మధ్య పునస్సంధానాన్ని నిరోధించాలి. అప్పుడు మతోన్మాదులైన ముస్లింలను చంపడానికి సైన్యాన్ని రెచ్చగొట్టవచ్చు. స్వయం నిర్ణయాధికారాన్ని కోరుకుంటున్న కాశ్మీరీలను కాక ఉన్మాదులూ, పాకిస్తాన్ అనుకూల ఛాందసవాదులు అయిన ముస్లింలను చంపమని సైన్యాన్ని రెచ్చగొట్టవచ్చు.

ఈ మధ్యే కాశ్మీర్ సమస్య మీద ఒక పుస్తకం వచ్చింది. దీన్నొక హిందూ జాతీయ వాద సంస్థ, ఇండియన్ డిఫెన్స్ రివ్యూ అనే పత్రిక బృందమూ జమిలిగా కృషి చేసి ప్రచురించాయి. ఈ పత్రికను మాజీ సైనికాధికారి ఒకడు స్థాపించాడు. మరో మాజీ సైనికాధికారి, దాని సంపాదకుడు. బయటి వాళ్ళకెవరికీ దొరకని సమాచారమంతా అందిస్తూ సైన్యం పూర్తిగా సహకరించినట్లు ఈ పుస్తకం చూస్తేనే స్పష్టమౌతుంది. ఆ పుస్తకం పేరు 'కాశ్మీర్ ది ట్రబుల్డ్ ఫ్రాంటియర్స్ (కాశ్మీరు కల్లోల ఎల్లలు)'. దీని ప్రచురణకు శ్యాంప్రసాద్ ముఖర్జీ ఫౌండేషన్ నిధులు సమకూర్చింది. దీనికి పనిచేసిన వాళ్లు ఇండియన్ డిఫెన్స్ రివ్యూ అనే పత్రిక ఏర్పాటు చేసిన బృందం. ఒక రిటైరయిన మేజర్ జనరల్ అఫ్సర్ కరీం సహకారంతో ఈ బృందం పుస్తకాన్ని రాసినట్టు పై అట్ట తెలియ జేస్తుంది. అయితే ఈయనే ఆ పత్రిక సంపాదకుడు. ఈ బృందాన్ని ఏర్పాటు చేసింది ఆ పత్రికే. సంపాదకుడు బృందంలో సభ్యుడు కాకుండా వేరే వ్యక్తి లాగా ఎందుకున్నాడు అనేది స్పష్టమే. అతనికి ముస్లిం పేరు ఉంది. ఈ పేరును అనామకంగా బృందంలో కలిపేసేకంటే పుస్తకం మీద వేరేగా ఉంటేనే ఎక్కువ ఉపయోగకరం ఈ పుస్తకాన్ని రిటైర్డ్ కెప్టెన్ భరత్ వర్మ ఇంకో జర్నలిస్ట్ మానవేంద్ర సింగ్‌లు మళ్ళీ ఎడిట్ చేశారు.

'జాతీయ తాదాత్మ్యం (గుర్తింపు) అనేది ఆత్మిక దృష్టినీ, సమాజాన్నీ అత్యున్నత స్థాయి నిబద్ధతకు కొని పోతుంది' అని ఈ పుస్తక సంపాదకులు అంటారు. వ్యక్తికి సంబంధించినంత వరకూ జాతి అనేది' నిశ్చయాత్మకమైంది. తన ఉనికిని ఉన్నత స్థానానికి తీసుకుపోయే అనుభవం'. వ్యక్తి పరిపూర్ణత్వాన్ని జాతి నిర్వచిస్తుంది. వ్యక్తిని తయారు చేసే అన్ని అంగాల సంగమం అది. పౌరులకు అంతాతానే అయిన ఈ జాతి అసలేమిటి? జాతి భావనతో ఉండే స్థిర లక్షణం ఏమంటే 'దాని భౌతిక ఉనికి ద్వారా దానిని గుర్తించడం' అంటారు. అంటే దాని ఆకారమూ, పరిమాణమూ నన్నమాట; పౌరులు తమ జాతిని 'మనసులో నాటుకు పోయిన రేఖాచిత్రం ద్వారా గుర్తిస్తారు'. అంటే పాఠశాల రోజుల నుంచీ గుర్తించుకున్న పటం జాతికి నిర్వచనం. 'జాతి సరిహద్దుల్ని మనసు నిర్ణయిస్తుంది. దాన్లో ఏమి కలిసి ఉంటాయి. ఏవి కలిసి ఉంటాయి. ఏవి కలిసి

ఉండవు అనేది మనసు నిర్ణయిస్తుంది.' పాఠశాల రోజుల నుంచి గుర్తు పెట్టుకున్న పటం ఆకారంలో, మనసులో చెక్కుకుని బొమ్మ కట్టుకున్న జాతితో మమేకతే జాతీయ గుర్తింపుకు గుండెకాయ. దాన్లోనే అన్ని ఆశలూ, ఆకాంక్షలూ నిండిఉంటాయి. ఇదీ ఆ పుస్తకం ప్రచురణకర్తల విశ్లేషణ. బుద్ధిమాలిన ప్రవచనాలను చర్చించడానికి ఇంత సమయం కేటాయించవలసిన పనిలేదు. కానీ ఇది వేరెవ్వరు రాసిన పుస్తకం కాదు. భారత సైన్యానికి చాలా సన్నిహితంగా ఉన్నవారు సైన్యం సహాయ సహకారాలు తీసుకొని కాశ్మీర్‌కు సంబంధించిన సాంస్కృతిక, రాజకీయ, సైనిక చారిత్రక సమస్యలన్నిటిగురించి రాసిన వివరణాత్మకమైన ప్రచురణ.

సహజంగానే ఎప్పుడయితే ఒక దేశపు ఆయువు పట్టు దాని పటమౌతుందో ఇక అప్పుడు ఉండేది వేర్పాటేగాని స్వయం నిర్ణయాధికారం కాదు. ఇక అప్పుడు మెజారిటీ గుర్తింపుకు మాత్రమే సాధికార పరిధి ఉంటుంది కాని మైనారిటీ గుర్తింపుకు ఏదీ ఉండదు. ఆ మైనారిటీ మత పరమైంది కావచ్చు. భాషా పరమైంది కావచ్చు. ఈ అవగాహన నుంచి వచ్చే నిర్ధారణలే బహుశా సాయుధ బలగాల శిక్షణను రూపొందించే దృక్పదానికి ప్రాతినిధ్యం వహిస్తాయేమో. ఆ నిర్ధారణలలో ముఖ్యమయినవి :

(1) జమ్ము-కాశ్మీర్ భౌగోళిక, నైసర్గిక స్థితి స్వాతంత్ర్యానికే స్వయంప్రతిపత్తికీ ప్రతికూలమయినది.

(2) జమ్ము-కాశ్మీర్ కున్న భౌగోళిక వ్యూహాత్మక ప్రాముఖ్యం దృష్ట్యా ఇండియా దాన్ని వదులుకోవడం సాధ్యం కాదు.

(3) లోయలో ప్రజల పరయీకరణకూ, తిరుగుబాటుకూ మధ్య తేడా చూడటం నేర్చుకోవాలి. అంతేకాని ఆర్థికాభివృద్ధి రాహిత్యం, నిరాకరణ జమ్ము కాశ్మీర్ లో మిలిటెన్సీ తలెత్తడానికి కారణాలు కాదు. అది తలెత్తడానికి కారణం మతోన్మాదులు ప్రజల బుర్రలు చెడగొట్టడం పాకిస్తాన్ టెర్రరిజాన్ని ప్రోత్సహించడం మాత్రమే. లోయ కు ఆర్థిక విత్త పరమైన సహాయం ఇచ్చి దాన్ని తలకెక్కించుకుంటె అది టెర్రరిజానికీ తిరుగుబాటు కూ దోహదంచేస్తుంది.

(4) ఎక్కడైతే నచ్చ చెప్పడం ఫలితాన్నివ్వదో అక్కడ బలాన్నే ప్రయోగించాలి. ప్రభుత్వంతో సహకారం మెరుగైన జీవన పరిస్థితులనూ ఉపాధి అవకాశాలనూ కల్పిస్తుందనే స్పష్టమైన సందేశాన్ని ప్రజలకు తెలియజేయాలి.

ఉండవు అనేది మనసు నిర్ణయిస్తుంది.' పాఠశాల రోజుల నుంచి గుర్తు పెట్టుకున్న పటం ఆకారంలో, మనసులో చెక్కుకుని బొమ్మ కట్టుకున్న జాతితో మమేకతే జాతీయ గుర్తింపుకు గుండెకాయ. దాన్లోనే అన్ని ఆశలూ, ఆకాంక్షలూ నిండిఉంటాయి. ఇదీ ఆ పుస్తకం ప్రచురణకర్తల విశ్లేషణ. బుద్ధిమాలిన ప్రవచనాలను చర్చించడానికి ఇంత సమయం కేటాయించవలసిన పనిలేదు. కానీ ఇది వేరెవ్వరు రాసిన పుస్తకం కాదు. భారత సైన్యానికి చాలా సన్నిహితంగా ఉన్నవారు సైన్యం సహాయ సహకారాలు తీసుకొని కాశ్మీర్‌కు సంబంధించిన సాంస్కృతిక, రాజకీయ, సైనిక చారిత్రక సమస్యలన్నిటిగురించి రాసిన వివరణాత్మకమైన ప్రచురణ.

సహజంగానే ఎప్పుడయితే ఒక దేశపు ఆయువు పట్టు దాని పటమౌతుందో ఇక అప్పుడు ఉండేది వేర్పాటేగాని స్వయం నిర్ణయాధికారం కాదు. ఇక అప్పుడు మెజారిటీ గుర్తింపుకు మాత్రమే సాధికార పరిధి ఉంటుంది కాని మైనారిటీ గుర్తింపుకు ఏదీ ఉండదు. ఆ మైనారిటీ మత పరమైంది కావచ్చు. భాషా పరమైంది కావచ్చు. ఈ అవగాహన నుంచి వచ్చే నిర్ధారణలే బహుశా సాయుధ బలగాల శిక్షణను రూపొందించే దృక్పదానికి ప్రాతినిధ్యం వహిస్తాయేమో. ఆ నిర్ధారణలలో ముఖ్యమయినవి :

(1) జమ్ము-కాశ్మీర్ భౌగోళిక, నైసర్గిక స్థితి స్వాతంత్రానికే స్వయంప్రతిపత్తికీ ప్రతికూలమయినది.

(2) జమ్ము-కాశ్మీర్ కున్న భౌగోళిక వ్యూహాత్మక ప్రాముఖ్యం దృష్ట్యా ఇండియా దాన్ని వదులుకోవడం సాధ్యం కాదు.

(3) లోయలో ప్రజల పరయీకరణకూ, తిరుగుబాటుకూ మధ్య తేడా చూడటం నేర్చుకోవాలి. అంతేకాని ఆర్థికాభివృద్ధి రాహిత్యం, నిరాకరణ జమ్ము కాశ్మీర్ లో మిలటెన్సీ తలెత్తడానికి కారణాలు కాదు. అది తలెత్తడానికి కారణం మతోన్మాదులు ప్రజల బుర్రలు చెడగొట్టడం పాకిస్తాన్ టెర్రరిజాన్ని ప్రోత్సహించడం మాత్రమే. లోయ కు ఆర్థిక విత్త పరమైన సహాయం ఇచ్చి దాన్ని తలకెక్కించుకుంటె అది టెర్రరిజానికీ తిరుగుబాటు కూ దోహదంచేస్తుంది.

(4) ఎక్కడైతే నచ్చ చెప్పడం ఫలితాన్నివ్వదో అక్కడ బలాన్నే ప్రయోగించాలి. ప్రభుత్వంతో సహకారం మెరుగైన జీవన పరిస్థితులనూ ఉపాధి అవకాశాలనూ కల్పిస్తుందనే స్పష్టమైన సందేశాన్ని ప్రజలకు తెలియజేయాలి.

# జమ్ము - కాశ్మీర్‌లో సైనిక పాలన

*'..........ఇక్కడ ఆడామగా తేడా చూపించకుండా యువకుల్నీ, ముసలి వాళ్ళనీ, చిన్న పిల్లల్నీ, చివరికి శిశువుల్నీ, నెలల పాపాయిల్నీ, అందర్నీ ఈగల్నీ, దోమల్నీ చంపినట్లు చంపేస్తున్నారు. అంబులెన్సుల మీదా, ఆసుపత్రుల మీదా దాడులు చేస్తారు. వైద్య పరికరాలు ధ్వంసం చేస్తారు. మతిస్థిమితం లేని వాళ్ళనూ, రోగులనూ తుపాకులతో కాల్చేస్తున్నారు. ఉపాధ్యాయుల్నీ, డాక్టర్లనీ, ఇంజనీర్లనీ, ఇతర ప్రభుత్వోద్యోగుల్నీ క్రూరంగా చంపేస్తున్నారు. దుకాణదార్లను, వ్యాపారులునూ వీధుల్లో తిరుగుతూ సరుకులు అమ్ముకునే వాళ్ళనూ, కూలీలను, విద్యావంతులనూ, రైతులనూ, డ్రైవర్లనూ, కండక్టర్లనూ, మెకానిక్‌లనూ, నిజానికి అన్ని జీవన రంగాల వాళ్ళను బుద్ధి పూర్వకంగా చంపేస్తున్నారు........'*

*.......... అబ్దుల్ కరీం రబ్బానీ*
*చైర్మన్, ఇన్స్టిట్యూట్ ఆఫ్ కాశ్మీర్ స్టడీస్*

ఇక ఇప్పుడు మనం నిర్దిష్టమైన పౌరహక్కుల అంశానికొచ్చాం. తగిన శీర్షికల క్రింద, గత 5 సంవత్సరాలుగా వివిధ సంస్థలు ప్రచురించిన రిపోర్టులు వర్ణించిన పరిస్థితిని సంక్షిప్తంగా చెప్పి ఈ సంవత్సరము మా బృందం సేకరించిన కొన్ని కేసుల వివరాలను కూడా చేరుస్తున్నాం.

'మృత్యులోయ' అనే పదాన్ని గత 5 సంవత్సరాలుగా కాశ్మీర్ లోయ పరిస్థితిని వర్ణించడానికి వాడుతూ వచ్చారు. హత్యలు లేకుండా, చంపడాలు లేకుండా ఒక్కరోజు గడవదు. 1995న సంవత్సరం మొదటి 7 నెలల కాలంలో జమ్ము-కాశ్మీరీలో జరిగిన హత్యల సంఖ్యను ఈ క్రింది పట్టిక ఇస్తుంది.

| నెల | భద్రతాదళాలచే | మిలిటెంట్లచే | మొత్తము |
|---|---|---|---|
| జనవరి | 146 | 43 | 189 |
| ఫిబ్రవరి | 200 | 48 | 248 |
| మార్చి | 188 | 38 | 226 |
| ఏప్రిల్ | 379 | 18 | 397 |
| మే | 298 | 80 | 378 |
| జూన్ | 343 | 58 | 401 |
| జూలై | 231 | 160 | 391 |
| మొత్తం (7 నెలలు) | 1785 | 445 | 2230 |

భద్రతా దళాలు చంపిన వారిలో మిలిటెంట్లు ఉన్నారు. మిలిటెంట్లుగా చెప్పబడినవారున్నారు. మిలిటెంట్లు కాని సాధారణ పౌరులున్నారు. మిలిటెంట్లు చంపే వారిలో పౌరులున్నారు, ప్రత్యర్థి మిలిటెంట్లున్నారు. సాయుధ బలగాల సైనికులున్నారు.

మేం ఇచ్చినది కాశ్మీర్ టైమ్స్ అనే దిన పత్రిక ప్రచురించిన మరణాల సంఖ్య సారాంశం. ఇది ఖచ్చితమయిన లెక్కకాదు. ఖచ్చితంగా చెప్పాలంటే అసాధ్యం. విభిన్న వార్తా సంస్థలు రిపోర్టు చేసే అంకెల్లో కూడా పొంతన ఉండదు. లెక్క కుదిరినా కుదరకున్నా ఆ అంకెలను దినపత్రికలు ఒకదాని తర్వాత మరొకటి ముద్రిస్తూనే ఉంటాయి. అసలెలా జరిగిందో కూడా తెలియనివి బోలెడు మరణాలున్నాయి. అలాంటి సందర్భాల్లో వీలయినంత హేతుబద్ధంగా ఊహించాం. ప్రచురించిన సమాచారమంతా బేరీజు వేసుకుని ఇలా అంచనా కట్టాం.

నెలకు సగటున 300 హత్యలు జరుగుతున్నట్లు అంటేరోజుకు 10కి పై చిలుకు జరుగుతున్నట్లు పైపట్టిక తెలియజేస్తుంది. ఇంతకు ముందటి పౌర హక్కుల సంఘాల రిపోర్టులను చూస్తే 1990 జనవరి నుంచీ ఇప్పటి వరకు 20 వేల మందిని చంపేసినట్లుగా కన్పిస్తోంది. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ 'పోలీసు, ఆసుపత్రి వర్గాలపై ఆధారపడి' ఆ సంఖ్య 1994 చివరికల్లా 17వేలు అని చెప్పింది. ప్రభుత్వం 10 వేలని చెప్పింది. ఈ సంవత్సరము చనిపోయిన వాళ్ళతో సహా కలుపుకుంటే 1995 సెప్టెంబరు కల్లా ఈ సంఖ్య 20వేల వరకూ ఉంటుంది. అయితే మా బృందంతే మాట్లాడిన వాళ్ళందరూ ఈ సంఖ్య 40 వేల వరకూ ఉంటుందని చెప్పారు. ఖచ్చితమైన సంఖ్య ఎంత అని తెలుసుకోవడానికి మార్గమేదీ లేదు. కానీ పెద్ద పరిమాణంలో చనిపోయారనేది స్పష్టం.

1981 జనాభా లెక్కల ప్రకారం జమ్ము-కాశ్మీర్ జనాభా 59.87 లక్షలు. దీన్లో కాశ్మీరు లోయ జనాభా 31.34 లక్షలు. దశాబ్ది వృద్ధి రేటు (1971-81 వృద్ధి రేటు) దృష్టిలో పెట్టుకుని 1995 లో జనాభాను అంచనా వేస్తే రాష్ట్రమంతా కలిపి 86 లక్షలు ఉంటుంది. కాశ్మీర్ లోయ జనాభా 44 లక్షలు ఉంటుంది. అంటే కాశ్మీరి లోయలో జనాభా బొంబాయి నగర జనాభాలో సగం కన్నా తక్కువే!

కానీ ఈ జనాభాను 'అదుపు చేయడానికీ, అరికట్టడానికీ' 5 లక్షల సైన్యమూ, పారా మిలిటరీ బలగాలూ అక్కడ తిష్ట వేసి ఉన్నాయి. మిలిటెంట్ల సంఖ్య 20 వేలు ఉంటుందని ప్రభుత్వ అంచనా. లోయలో సైనిక బలగాల మీద రోజువారీ ఖర్చు 5 కోట్ల రూపాయలు. ఈ విషయాన్ని ప్రభుత్వమే అధికారికంగా ఒప్పుకొంటుంది. ఇంతే ఖర్చవుతోందా, ఇంకా ఎక్కువ ఖర్చవుతోందా అనేది ఈ సంఖ్యలో చేర్చని వ్యయం మీద ఆధారపడి ఉంటుంది.

జమ్మూ-కాశ్మీర్ తో భారత దేశం ఎంత పెద్ద యుద్ధం చేస్తోందో అర్థం చేసుకోవడానికి ఈ అంకెలు తోడ్పడుతాయి. దాని గుణాత్మక అంశాన్ని, సాయుధ బలగాలు పాల్పడుతున్న భిన్నరీతుల పౌరహక్కుల ఉల్లంఘనను చూస్తేనే అర్థం చేసుకో గలుగుతాం.

## కస్టడీలో చిత్రహింసలు

*"జమ్మూ-కాశ్మీర్ లో చిత్రహింసల క్రూరత్వం నమ్మ శక్యం కానంతగా ఉంది. జీవితాంతం అంగ వికలుర్ని చేసే పద్ధతి ఇది."*

*--ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ జనవరి* ***1995.***

ఇటీవలి చిత్రహింసల ఘటనలను ఈ క్రింద ఇస్తున్నాం. ఇవి చిత్రహింసల స్వభావాన్నీ, చేసే పద్ధతినీ సూచిస్తాయి.

★ **1994** మే **25-26** రాత్రి బారాముల్లా జిల్లాలోని సోపూర్ లో గల క్రాల్ టెంగ్ వీధిని సైనికులు దిగ్బంధం చేసి సోదా జరిపారు. మే **26** న ఉదయం **8-30** గంటల ప్రాంతంలో మగ వాళ్ళందర్నీ ఇళ్ళల్లోంచి బయటకు తీసుకొచ్చి రోడ్డు ప్రక్కనున్న క్లినిక్ దగ్గర కూర్చోమని చెప్పారు. **14** మంది బాలురనూ, యువకులనూ, (**19** నుంచి **33** ఏళ్ళలోపు) ఒక **65** ఏళ్ళ ముసలాయన్నీ దగ్గర్లోనే ఉన్న రెండు ఇళ్ళల్లోకి ప్రశ్నించడం కోసం అని తీసుక పోయారు. వాటిని తాత్కాలిక ఇంటరాగేషన్ కేంద్రాలుగా మార్చారు. వాళ్ళను తాళ్ళతో కట్టేశారు. నోళ్ళలో బట్టలు కుక్కారు. **4** అంగుళాల వ్యాసం కలిగిన ఇనుప గొట్టాన్ని రోలరుగా ఉపయోగిస్తూ కాళ్ళమీదా, తొడల మీదా తిప్పారు. ఇనుప చువ్వలను గుదములోకి తోశారు. కరెంటు షాకు ఇచ్చారు. ముబాషిక్ నాయికూ (**35**) విషయంలోనైతే గుద స్థానం వద్ద లోతుగా గాయం చేయడానికి రేజరు బ్లేడు ఉపయోగించారు. (ఈ విషయాన్ని స్థానిక మానవహక్కుల సంఘం, 'కాశ్మీర్ మానిటర్' రిపోర్టు చేసింది).

★ **1995** జనవరి **1**న కుప్వారా జిల్లా హంద్వారా తహశిల్, యుహామా గ్రామస్థుడైన నాజర్ అహమ్మద్ షేక్ (**25**) ను ఆయన ఊళ్ళోనే సైన్యం అరెస్టు చేసింది. కలాం చాక్లా ఇంటరాగేషన్ సెంటర్లో **12** రోజులపాటు ఇంటరాగేట్ చేసారు. ఆ తర్వాత లాన్‌గేట్ ఇంటరాగేషన్ సెంటర్లో ప్రశ్నించారు. కాళ్ళకు చెప్పులు లేకుండా గంటల తరబడి మంచులో నడిపించారు. ఆ తర్వాత స్టవ్ మీద ఆయన పాదాలను కాల్చారు. కాళ్ళు పని చేయడం మానేశాయి. నెలా 7 రోజుల తర్వాత సైనికులు అతన్ని తీసుకుపోయి రోడ్డు ప్రక్కన పడేసి పోయారు. స్థానిక పోలీసులు ఎముకల, కీళ్ళ ఆసుపత్రిలో చేర్చారు. కాళ్ళకు గాంగ్రీన్ వచ్చిందని డాక్టర్లు నిర్ధారించి రెండు పాదాలూ, ఎడమ చేతి వేళ్ళూ ఆపరేషన్ ద్వారా తొలగించారు.

ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ జనవరి **1995** లో కస్టడీ మరణాల పై ప్రచురించిన రిపోర్టులో చిత్రహింసల వల్ల తలెత్తిన శరీర అంగాల తొలగింపు ఘటనలను పేర్కొంది. (మంజూర్ అహ్మద్ గనాయి, గులాం మొహ్మద్ భట్).

★ బారాముల్లా నివాసి ఇందర్‌జిత్ సింగ్ సోదీ మా బృందంతో మాట్లాడాడు. సరిహద్దు భద్రతా దళం ఆయనను ఎలా చిత్రహింసలు పెట్టిందీ వివరంగా చెప్పాడు. ఆయనో సిక్కు పెద్ద మనిషి. మెకానికల్ ఇంజనీరింగ్ లో డిప్లోమా హోల్డరు. బారాముల్లా ఐ.టి.ఐ లో ఇన్‌స్ట్రక్టర్ గా పని చేస్తున్నాడు. 'ఆయుధాల దొంగ రవాణా, మిలిటెంట్లకు షెల్టర్ ఇవ్వడం' అనే ఆరోపణ పై మొదటిసారి 1990 లో ఆయన్ని అరెస్టు చేసారు. ఆయన తొడలకూ, మణికట్లకూ కరెంటు షాకు ఇచ్చారు. నగర్ లోని హరి నివాస్ ఇంటరాగేషన్ సెంటర్ లోను, జమ్మూలోని కోట్ బిల్ వాల్ ఇంటరాగేషన్ సెంటర్‌లోను చిత్రహింసలు పెట్టారు. ఆ తర్వాత నాలుగేళ్ళ పాటు 'టాడా' చట్టం క్రింద జైల్లో గడిపాడు. 1994 లో జైలు నుంచి బయటకొచ్చాడు. జైలు నుంచి బయటికి వచ్చీ రావడంతో బి.ఎస్.ఎఫ్ మళ్ళీ తీసుకపోయి చిత్రహింసలకు గురిచేసింది. 5 గంటల పాటు కరెంటు షాకు ఇచ్చారు. రోలరు ట్రీట్‌మెంట్ ఇచ్చారు. 6 లీటర్ల కారపు నీళ్ళను ముక్కులో లాగమని చిత్రహింసలు పెట్టి లాగించారు. అయితే చిత్రహింసల ప్రక్రియ కొనసాగుతుండగానే బారాముల్లా ప్రజలు ఆయన్ని విడుదల చేయమని ప్రదర్శనలు జరిపారు. అప్పుడు ఆయన్ని జవాన్లు ఆసుపత్రికి తీసుక పోయారు.

అలాంటి ఉదాహరణలను వేలల్లో ఇవ్వొచ్చు. సాధారణంగా ఉపయోగించే చిత్రహింసల పద్ధతులను మాత్రమే మేం ఇక్కడ ఇస్తున్నాం. శరీరంలో సున్నిత భాగాలకు అంటే పురుషాంగము, పాదాలు, కాళ్ళు, నుదురు, నాలుక, చెవులు, కణతలు లాంటి భాగాలకు కరెంటు షాకు ఇస్తారు. రోలరు ట్రీట్‌మెంటు కూడా చాలా విరివిగా వాడుతారు. ఈ పద్దతి చిత్రహింసలో బాగా బలిసిన సైనికుల్ని రోలరు మీద నిలబెడతారు. వెల్లకిలా పడుకోబెట్టి రోలరు దొర్లిస్తూ శరీరాన్ని నజ్జునుజ్జు చేస్తారు. శరీరాన్ని సిగరెటతో కాలుస్తారు. కాళ్ళను, చేతుల్ను పొయ్యిలో పెట్టి కాలుస్తారు. లేదా పారాఫిన్ దీపాలతో గానీ, కొవ్వొత్తులతో గానీ కాలుస్తారు. ఎర్రగా కాల్చిన ఇనుప ముక్కల్ని వీపు మీద, శరీరం ఇతర భాగాల మీద వేసి కాలుస్తారు. ఇవీ మామూలుగా వాడే పద్ధతులు. దాదాపు ప్రతి కేసులోను చిత్రహింసలకు గురైన వాళ్ళు ఒక విషయాన్ని ఫిర్యాదు చేస్తారు. మురుగు నీళ్ళలో ముఖం బలవంతంగా ముంచి మురుగు నీళ్ళు తాగిస్తారు. కొంత మందిని పలపల కాగే నీళ్ళు త్రాగమన్నారు. లేదా కారం కలిపిన నీళ్ళు త్రాగమన్నారు. కొంత మంది కళ్ళళ్ళో నూరిన కారం ముద్దలు పెట్టారు. కొన్నిసార్లు సైనికులు రోలరును ఉపయోగించకుండా వెల్లకిలా పడుకోబెట్టి ఐదారుగురు ఎక్కి తొక్కుతారు. రైఫిల్ మడమతో, కర్రలతో విపరీతంగా కొట్టడం ముఖ్యంగా మోకాళ్ళ మీద, కీళ్ళ మీద, చీలమండల మీద కొట్టడం మరో అభిమాన విషయం! అలా కొట్టేపుడు కొంత మందిని మణికట్ల దగ్గర కట్టేసి వేలాడదీస్తారు. లేదా చీలమండలను కట్టేసి తల క్రిందులుగా వ్రేలాడ దీస్తారు. గంటల పాటు ఏకంగా ఇలా వ్రేలాడ దీస్తారు. కొన్ని సార్లు అడ్డంగా ఉండే చువ్వ మీద మోకాళ్ళు కట్టేసి వ్రేలాడ దీస్తారు. రోజుల తరబడి అన్నం పెట్టరు. గుద సంభోగం, బలవంతపు హస్తప్రయోగం చేపిస్తారు. హస్తప్రయోగం నుండి బయట పడిన వీర్యాన్ని నాకేయమని బలవంతం చేస్తారు. కొంత మంది బాధితులకు తొడల

నుంచీ, పిరుదుల నుంచీ చిన్న చిన్న మాంసం ముక్కలను కోసేశారు. గుదం లోకి చువ్వలు దూర్చి దాన్ని కలియ దిప్పుతారు. అలా శరీరం లోపలి భాగాల్ని గాయ పర్చుతారు. గుదం లోకి కారం దూర్చుతారు. లేదా చిన్న సంచిలో కారం పోసి దాన్ని పురుషాంగానికి కట్టేస్తారు. చర్మాన్ని చీల్చడానికి రేజర్ బ్లేడులను, తుపాకి బాయ్‌నెట్లను వాడుతారు. గాయం చేస్తారు. కొంత మందిని చెట్లకు కట్టేసి ఎటు పడితే అటు తుపాకులతో కాలుస్తారు. ఆ కాల్పుల్లో చావక పోతే తూటాల గాయాలతో జీవితం అంతా బ్రతకాలి. అలాంటి కాల్పుల్లో ఆశ్చర్యకరంగా బ్రతికి బయట పడిన మస్రూఫ్ సుల్తాన్ ఘటనను ఆమ్నెస్టి ఇంటర్నేషనల్ తన **1995** జనవరి రిపోర్టులో వివరంగా పేర్కొంది. వారాల తరబడి నిర్బంధితుల్ని నిద్రపోనియ్యరు. కాలకృత్యాలు తీర్చుకోనియ్యరు. నీళ్ళు గడ్డలు కట్టే కాశ్మీరీ చలిలో రాత్రి వేళల్లో నగ్నంగా నిలబెడతారు. తమ ముస్లిం గుర్తింపునూ, నమ్మకాలనూ బూతులు తిడుతూ అవమానిస్తారని చాలా మంది చెప్పారు. ఖురాన్‌ను, మహమ్మద్ ప్రవక్తను, బూతులు తిడతారు. నిర్బంధితుడికి గడ్డం ఉంటే గడ్డం ముస్లిం గుర్తింపుకు చిహ్నం కాబట్టి దాన్ని బుద్ధి పూర్వకంగా కాలుస్తారు. లేదంటే ఒక్కోవెంట్రుకా బలవంతంగా పీకుతారు. ఇది శారీరక చిత్రహింస మాత్రమే కాదు. అవమానించడం కూడా. ఇస్లాం విశ్వాసానికి విరుద్ధంగా మద్యాన్ని బలవంతంగా త్రాగిస్తారు.

ఈ పద్ధతులను, ఇంకా ఇలాంటి చిత్రహింస పద్ధతులను, ఇన్స్టిట్యూట్ ఆఫ్ కాశ్మీర్ స్టడీస్ కు చెందిన మానవ హక్కుల విభాగం చిత్రహింసల బాధితుల నుంచి సేకరించిన ఫ్యాక్ట్ షీట్లలో వెల్లడించారు. **1993** నుంచి ఈ సంస్థ ప్రచురించిన అనేక నివేదికల్లో అలాంటి ఫ్యాక్ట్ షీట్లను చేర్చారు.

వీటిలో అనేకం (అన్నీ కాకపోయినా) భారత దేశమంతా పోలీసులు కూడా ప్రయోగిస్తున్నారని అనొచ్చు. అది నిజమే. అయితే ప్రతి కాశ్మీరీ ముస్లిం, కేవలం కాశ్మీరీ ముస్లిం అయినందుకే, ఇలాంటి చిత్రహింసలు అనుభవించాల్సి రావడం వేరే సంగతి. నిజానికి వేల మంది కేవలం కాశ్మీరీ ముస్లింలు అయిన కారణంగా ఈ చిత్రహింసలకు గురయ్యారు. రెండోది, ఈ పద్ధతులు పూర్తిగా కొత్తవి కాకపోయినా వాటిని కాశ్మీర్‌లో భారత బలగాలు చాలా విరివిగా, మరింత క్రూరంగా ప్రయోగించినట్లు కన్పిస్తోంది. శరీర భాగాలు తొలగించాల్సినంతగా గాంగ్రీన్ పెరిగి పోవడం, మరణానికి దారి తీసే మూత్రపిండాల వైఫల్యం, తరచు జరగడం దీన్ని రుజువు చేస్తున్నాయి. ఇలా మూత్రపిండాల వైఫల్యం రోలర్ ప్రయోగం వల్లే జరుగుతున్నదని కాశ్మీరీ వైద్య నిపుణులు అంటున్నారు. రోలర్ ప్రయోగం "కండరాలను నుజ్జు చేస్తుంది. కండరాలు పిగిలి పోయేలా చేస్తుంది. రక్త ప్రసరణలోకి ప్రవేశించే చెడుపదార్థాల పై ప్రభావం కల్గించి మూత్ర పిండాల వైఫల్యానికి దారి తీస్తుంది" (ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఉటంకించింది). ఈ కండరాల ధాతువులను నాశనం చేసే ప్రక్రియను రాబ్డో మయోలిసిస్ అంటారు. నగర్ వైద్య విధాన సంస్థలో డయాలిసిస్ యూనిట్ కి బాధ్యుడిగా వున్న డాక్టరు ఒక లండన్ పాత్రికేయుడితో విషాదమూ, హాస్యమూ మిళితమైన స్వరంతో ఇలా అన్నాడని అంటారు - "వైద్య శాస్త్ర సాహిత్యానికి ఈ యుగానికి సంబంధించిన లక్షణాలను తెలియ చేసే అవకాశం కాశ్మీరుకే కలిగింది". మేం ఇక్కడ చెప్పదల్చుకుందేమంటే రోలర్ ప్రయోగం అనేది ఇండియాలోని పోలీసు స్టేషన్లలో చాలా మామూలుగా ఉపయోగించే చిత్రహింసా

రూపం. అయితే జమ్మూ-కాశ్మీర్ లో భారత సైన్యం చేతిలో పడేసరికి అది మూత్రపిండాల వైఫల్యానికి దారితీస్తుందని రుజువైంది. మూత్రపిండాల వైఫల్యం అంటే మృత్యువు ముంగిట్లో వున్నట్లే.

## కస్టడీ మరణాలు

> *"ప్రతి నెలా జమ్మూ-కాశ్మీర్‌లో 25 పైచిలుకు కస్టడీ మరణాలు జరుగుతాయి".*
>
> *--కాశ్మీర్ మానిటర్*

పైన పేర్కొన్న వివిధ చిత్రహింసలు ప్రాణాంతకం కావొచ్చు. లేదా రోగాలకు దారి తీయొచ్చు. నిర్బంధితులు చనిపోవచ్చు. ఇంతకంటే సాధారణంగా జరిగే కస్టడీ మరణాలు "పట్టుకుని చంపేసే" బుద్ధిపూర్వక ప్రక్రియ ద్వారా జరుగుతాయి.

ఈ "పట్టుకుని చంపేసే" ప్రక్రియకు ఇటీవలి రెండు మూడు ఉదాహరణలు ఇస్తున్నాం. ఇవి కేవలం ఈ ప్రక్రియను రుచి చూపించడానికే.

★ 1995 జూలై 30 న అర్ధరాత్రి దాటిన తర్వాత, నగర్ లోని బెమినా బైపాస్ రోడ్డులో మందు పాతర పేలింది. సాయుధ దళాల శకటానికి తగిలి ముగ్గురు సైనికులు చనిపోయారు. మూడు గంటల్లోపే అదనపు బలగాలు అక్కడికొచ్చేసాయి. ప్రేలుడు జరిగిన స్థలానికి సమీపంలో వున్న స్పేరుపార్టుల దుకాణం యజమాని రియాజ్ అహ్మద్ (41) ని కస్టడీలోకి తీసుకున్నారు. రియాజ్ అహ్మద్ చూస్తుండగానే మిలిటెంట్లు ప్రేలుడు పదార్థాన్ని అక్కడ పెట్టారని సైనికుల ఆరోపణ. అదే రోజు సాయంత్రం ఏడున్నరకు సైనికులు రియాజ్ అహ్మద్ శవాన్ని అక్కడికి తీసుకొచ్చి తలా మొండెం వేరుగా రెండింటికీ వంద మీటర్ల దూరం వుండేలా విసిరేసి పోయారు.

★ పాకిస్తాన్ సరిహద్దున వుండే జమ్మూ ప్రాంతంలో రాజోరీ జిల్లా వుంటుంది. ఆ జిల్లాలోని గులాహాటీ నివాసి 36 ఏండ్ల మొహమ్మద్ ముష్తాఖ్. సరిహద్దు దగ్గర వుండే సైనికుల ప్రవర్తన మరీ క్రూరంగా వుంటుంది. ముష్తాఖ్ మెదడు సరిగ్గా ఎదగలేదు. 1995 జులై చివరి వారంలో ఒక రోజు రాజోరీ నుంచి తన స్వగ్రామానికి పోతూ గంభీర్ వద్దగల ఆర్మీ పోస్టును దాటి నడిచి పోతున్నాడు. ఆయన్ని ఆపి సైనికులు ప్రశ్నించారు. మొదటి రెండు మూడు ప్రశ్నలకు ఏదో జవాబులు చెప్పి తర్వాత మాట్లాడడం మానేశాడు. సైనికులు తీవ్రంగా చిత్రహింసలు పెట్టారు. తుపాకీ మడమతో తలబద్దలు కొట్టారు. ఆయన్ని రాజోరీ ఆసుపత్రికి తీసుకు పోయారు. కానీ అతని తల్లిదండ్రులచేత తామే అతణ్ణి ఆసుపత్రికి తీసుకొచ్చామని బలవంతంగా రాయించుకోవడానికి ప్రయత్నించారు. తలకు గాయం ఎలా తగిలిందో తెలీదని రాయమన్నారు. రాజోరీ బార్ అసోషియేషన్ లాయరు ఒకాయన మాకీ విషయం చెప్పాడు.

★ ఇప్పుడు చెప్పబోయేది నిజంగా దారుణమైన కథ. అనంత్‌నగ్‌లో బ్యాంకు ఉద్యోగి హిలాల్ అహ్మద్ నస్తీ, అనంత్‌నాగ్ జిల్లా హుత్‌మూరా నివాసి గులామ్ రసూల్, సాల్‌గామా నివాసులు రామ్జా అలీష్, ఫారుఖ్ అహ్మద్ వానీ అనే నలుగురునీ 1995 జూన్ 13న హుత్‌మూరాలో అరెస్టు చేసారు. ఈ కథలో బ్రతికింది ఫారుఖ్ అహ్మద్ వానీ ఒక్కడే. ఆయన చెప్పిన కథనం ఏమంటే - ఈ నలుగురునీ రాష్ట్రీయ రైఫిల్స్ క్యాంపుకు తీసుకు పోయారు. హిలాల్ అహ్మద్ నస్తీని ముందు చంపేసారు. మిగతా వాళ్ళు చూస్తున్నారు. ఆయన శవాన్ని 5 ఖండాలుగా నరికి రెండో వాడితో ఆముక్కల్ని గోనెసంచిలో వేయించి దాన్ని జీలం నదిలో పారేయమన్నారు. చెప్పినట్లే చేసి తిరిగొచ్చాడు. రెండో అతన్ని చంపారు. ఐదు ఖండాలుగా నరికారు. మూడో వ్యక్తితో చెప్పారు - ముక్కల్ని గోనె సంచిలో వెయ్యమని. వేసాడు. జీలం నదిలో పారేసి రమ్మన్నారు. పారేసి వచ్చాడు. ఆయన్ని చంపారు. ఐదు ముక్కలు చేశారు. ఫారుఖ్‌తో అన్నారు. ఐదు ముక్కల్ని గోనె సంచిలో వెయ్యమని. జీలం నదిలో పారేసి రమ్మన్నారు. జీలంనది ఒడ్డు వరకు వెళ్ళాడు. ఇక వెనక్కి తిరిగి రాలేదు. మూటతో పాటే తనూ దూకేసాడు. మీద నుంచి కురుస్తున్న తుపాకీ బుల్లెట్లను తప్పించుకుంటూ మునుగుతూ, ఈదుతూ ఆవలి ఒడ్డుకు చేరుకున్నాడు. తప్పించుకున్నాడు. ఆ తర్వాత అనంతనాగ్ లో జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ముందు ఈ విషయం ప్రమాణం చేసి చెప్పాడు.

జమ్మూ-కాశ్మీరులో మిలిటెన్సీ తలెత్తిన తర్వాత జరిగిన కస్టడీ మరణాల సంఖ్య ఎంత?

నగర్ హైకోర్టు బార్ అసోసియేషన్ నిజ నిర్ధారణ ప్రకారం డాక్యుమెంటు చేసిన వివరాలను అనుసరించి ఇన్స్టిట్యూట్ ఆఫ్ కాశ్మీర్ స్టడీస్ కు చెందిన మానవ హక్కుల విభాగం ఈ క్రింది అంచనాకు వచ్చింది.

| సంవత్సరం | కస్టడీ మరణాల సంఖ్య |
|---|---|
| 1990 | 48 |
| 1991 | 72 |
| 1992 | 95 |
| 1993 (సెప్టెంబర్ వరకు) | 289 |
| మొత్తం 1990-93 సెప్టెంబర్ | 504 |

'జమ్మూ-కాశ్మీర్‌లో కస్టడీ చిత్రహింసలు, మరణాలు' శీరికతో 1995 జనవరిలో ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఒక రిపోర్టు ప్రచురించింది. ఇందులో పేర్కొన్న దానికంటే మరో సంవత్సరం అదనంగా, అంటే 1994 సెప్టెంబర్ దాకా గణంకాలు ఇచ్చారు. ఈ రిపోర్టు 1990, 91, 93 లకు సంబంధించి మరణాల సంఖ్య తక్కువ చెబుతుంది. 1992 లో ఎక్కువ సంఖ్య చెబుతుంది.

| సంవత్సరం | కస్టడీ మరణాల సంఖ్య |
|---|---|
| 1990 | 37 |
| 1991 | 47 |
| 1992 | 253 |
| 1993 | 248 |
| 1994 (సెప్టెంబర్) | 130 |
| మొత్తం 1990-94 (సెప్టెంబర్) | 715 |

ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ రిపోర్టు చూసి భారత ప్రభుత్వానికి చిరాకు కలిగింది. ఏదో జరిగిపోయిందని దెబ్బ తగిలినట్లుగా గోల పెట్టేసింది. 715 కేసుల్లోనూ 519 కేసులకు మాత్రమే సమాధానం చెప్పింది. అయితే అలా జవాబు చెప్పిన వాటిల్లో కూడా 273 కేసుల్లో సైన్యం చెప్పిన మాటనే అప్పజెప్పింది. ఆ సమాధానం - ఎదురు కాల్పుల్లో చనిపోయారని, 85 కేసుల్లో మాత్రం మానవ హక్కుల ఉల్లంఘన జరిగిందనడానికి ప్రాధమిక ఆధారాలున్నాయనీ, దర్యాప్తు నడుస్తోందనీ చెప్పింది.

మానవ హక్కుల కార్యకర్త హెచ్. ఎన్. వాంచూ 1992 లో రిట్ పిటిషన్ దాఖలు చేసాడు. అది వేసిన తరువాత ఆయన్ని హత్య చేసారు. 1992 జులై నుంచీ నవంబర్ మొదటి పక్షం లోపల 155 కస్టడీ మరణాలు జరిగాయని ఆయన రిట్ పిటిషన్లో రాసాడు. వాటి వివరాలు ఇచ్చాడు. ఈ లెక్కన చూస్తే 1992 సంఖ్య 253 కన్నా ఎక్కువే వుంటుంది.

కాశ్మీర్ మానిటర్ అనే కాశ్మీరులో గల మానవ హక్కుల సంఘం మాస పత్రిక ఒక సంవత్సరం పైగానే కస్టడీ మరణాల నెలవారీ జాబితా ప్రచురిస్తూ ఉంది. 1994 జూన్ నుంచీ 1995 ఏప్రిల్ వరకూ ఆ పత్రిక ఇచ్చిన జాబితా : (1994 నవంబర్ మినహా)

| | నెల | సంఖ్య |
|---|---|---|
| 1994 | జూన్ | 24 |
| | జులై | 37 |
| | ఆగస్టు | 24 |
| | సెప్టెంబర్ | 40 |
| | అక్టోబర్ | 20 |
| | డిసెంబర్ | 23 |
| 1995 | జనవరి | 12 |
| | ఫిబ్రవరి | 11 |
| | మార్చి | 17 |
| | ఏప్రిల్ | 14 |
| మొత్తం 10 నెలలకు గాను | | 222 |

ఈ గణాంకాలను స్థానిక (ఉర్దూ) వార్తా పత్రికలు ప్రచురించిన వాటి నుంచీ సేకరించారు. 1994 జూన్-సెప్టెంబర్ మధ్య కాశ్మీర్ మానిటర్ ఇచ్చిన సంఖ్య 125

కాగా, ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ 1994 జనవరి -సెప్టెంబర్ ల మధ్య (అంటే 9 నెలల కాలంలో) జరిగిన కస్టడీ మరణాల సంఖ్య 130 గా పేర్కొంటోంది. కస్టడీ మరణాలకు సంబంధించి కాశ్మీర్ మానిటర్ ఇచ్చింది. నిజమైన లెక్కె అయితే, తొలి సంవత్సరాల్లో ఇదే పరిమాణంలో లేకున్నప్పటికీ, గత ఐదు సంవత్సరాల్లో జరిగిన కస్టడీ మరణాల సంఖ్య ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఇచ్చిన 715 సంఖ్య కన్నా చాలా ఎక్కువే ఉంటుంది.

సాయుధ బలగాల కస్టడీలో చావుకు గురైన వాళ్ళేగాక కస్టడీ నుంచి అదృశ్యమైపోయిన వాళ్ళూ చాలా మందే వుంటారు. జమ్మూ-కాశ్మీర్ లో అలా అదృశ్యమై పోయిన వాళ్ళ ఖచ్చితమైన సంఖ్యేమీ తెలీదు. హై కోర్టు బార్ అసోసియేషన్ దగ్గర 53 మంది జాబిత వుంది. వాళ్ళ హెబియస్ కార్పస్ రిట్ పిటిషన్లు ఇంకా విచారణలోనే వున్నాయి. కొన్ని కేసుల్లో క్రింది స్థాయి న్యాయాధికారుల్ని సాక్ష్యం రికార్డు చేసి రిపోర్టు దాఖలు చేయాల్సిందిగా హై కోర్టు ఆదేశించింది.

1992 నవంబర్ లో ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ భారత ప్రభుత్వానికి సమర్పించిన ఒక మెమోరాండంలో జమ్మూ-కాశ్మీర్‌లో 53 మంది కస్టడీ నుంచి అదృశ్యమయ్యారని పేర్కొంది. బహుశా ఈ జాబితా, హై కోర్టు బార్ అసోసియేషన్ దగ్గర వున్న జాబితా ఒకటె అయ్యుంటుంది. ఎందుకంటే ఆమ్నెస్టీ జాబితా కూడా 1992 తర్వాత ఘటనలను పేర్కొన లేదు.

1992 వరకూ చాలా మందే అదృశ్యమై పోయివుంటారు. వాళ్ళకోసం రిట్ పిటిషన్లు దాఖలు అయివుండక పోవచ్చు. లేదా పిటిషన్లపై వెంటనే ఉత్తర్వులు ఇచ్చేసి ఉండవచ్చు. 1992 తర్వాత సాయుధ బలగాల కస్టడీనుంచి అదృశ్యమై పోయిన వాళ్ళు ఇంకా వుండే వుంటారు. అలా అదృశ్యమైపోయిన వారి సంఖ్య ఎంత? నగర్ పాత్రికేయుడు ఒకాయన ఆ సంఖ్య 280 అంటాడు. అయితే ఖచ్చితమైన జాబితా మాత్రం లేదు.

## "ఎదురు కాల్పుల మరణాలు"

> *"అనుమానిత మిలిటెంట్లను భద్రతా దళాలు తరచుగా కాల్చి చంపుతున్నారు. చావులు మిలిటెంట్లకూ, భద్రతా దళాలకూ జరిగిన ఎదురు కాల్పుల్లో సంభవించాయని తర్వాత చెప్తారు. మెజారిటీ కేసుల్లో మృతుల్ని అక్కడికక్కడ చంపేసారు".*
>
> *------ఆసియావాచ్*
> *కాశ్మీర్ అండర్ సీజ్ -1990*

మిలిటెంట్లకూ సాయుధ బలగాలకూ మధ్య ఎదురు కాల్పులు కాశ్మీరులో తరచూ జరుగుతుంటాయి. అయితే ఎదురు కాల్పుల్లో చనిపోయారని చెప్పేవి అత్యధికం వాస్తవంగా సాయుధ బలగాలు చేసిన హత్యలే. అవి కస్టడీ హత్యలు కావచ్చు, ప్రతీకారంతో జరిపినవి కావచ్చు - అంటే సాయుధ బలగాల మీద మిలిటెంట్లు చేసిన దాడికి ప్రతిగా జరిపినవి, లేదా విచ్చల విడి కాల్పుల్లో ఏ దారిన పోయే దానయ్యో చచ్చి వుండొచ్చు, లేదా ఊరేగింపుల్లోని జనం మీదకు కాల్పులు జరిపి చంపి వుండొచ్చు. తక్కిన భారత

దేశంలో ఎదురు కాల్పులు మిలిటెంట్లే మొదలు పెట్టారని పోలీసులూ, పారా మిలటరీ బలగాల వాళ్ళూ చెపుతుంటారు. పోలీసులు, భద్రతా దళాలు, ఎప్పుడూ ఆత్మరక్షణ కోసమే కాల్పులు జరిపామని చెప్పుకుంటారు. కానీ జమ్మూ-కాశ్మీరు లోని సాయుధ బలగాలు ఈ విషయంలో అంత శ్రద్ధ ఏమీ చూపవు. వాళ్ళు చంపిన అన్ని సందర్భాల్లోనూ ఆత్మ రక్షణ కోసమే కాల్పులు జరిపామని చెప్పుకోరు. సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం శాంతికి భంగం కలుగుతుందని అనుమానిస్తే చాలు తుపాకులతో కాల్చే అధికారం ఇస్తుంది. కాబట్టి ఆత్మరక్షణ కోసమే కాల్పులు జరిపినట్టు చెప్పుకోనవసరం లేదు. ఆ కారణంగా కావచ్చు, లేదా జమ్మూ-కాశ్మీర్‌లో సాయుధ బలగాలు మిగతా పోలీసుల కంటే చట్టానికి మరీ తక్కువ జవాబుదారులు కావడం కావచ్చు కానీ అన్నీ ఆత్మ రక్షణ కోసమే చేసామని చెప్పుకోరు.

జమ్మూ-కాశ్మీరులో సాయుధ బలగాలు కల్గించే మరణాల్లో ప్రధాన రూపం 'ఎదురు కాల్పుల' మరణాలే. అన్ని నిజ నిర్ధారణ నివేదికలూ అలాంటి ఘటనలను లెక్క లేనన్ని పేర్కొన్నాయి. మా బృందం సేకరించిన వివరాలు, కొన్ని ఇటీవలి ఘటనలవి, ఇక్కడ ఇస్తున్నాం.

★ ఈ కేసు కాశ్మీరు అంతటా తీవ్రమైన విమర్శకూ, నిరసనకూ దారి తీసింది. 1995 జులై 23 మధ్యాహ్నం రాష్ట్రీయ రైఫిల్స్ జవాన్లు జమ్మూ-కాశ్మీర్ ప్రభుత్వంలో ఉద్యోగులైన ఇంజనీర్లనూ, ఒక రైతునూ కాల్చి చంపారు. ఆ ఇంజనీర్లు-ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంటులో జూనియర్ ఇంజినీరు షకీల్ అహ్మద్ సల్మాన్ (32), రోడ్లు, భవనాల శాఖలో అసిస్టెంటు ఇంజనీరు గులాం నబీ లోనీ (30). వీళ్ళు కేంద్ర సంప్రదాయేతర ఇంధన వనరుల మంత్రిత్వ శాఖ తరపున ఒక ప్రాజెక్టు చేపట్టారు. బుద్‌గామ్ జిల్లాలో సుఖ్‌నాగ్ వాగు మీద మినీ హైడల్ ప్రాజెక్టు నిర్మాణ సాధ్యాసాధ్యాలను పరిశీలించడం వాళ్ళు చేపట్టిన ప్రాజెక్టు. ఆ పని మీద వాళ్ళు జులై 23 న పొద్దున్న 9 గంటలకు నగర్ నుంచి కార్లో బయలు దేరారు. వాళ్ళతో పాటు నగర్ రీజనల్ ఇంజినీరింగ్ కళాశాలలో సీనియర్ లెక్చరర్ గా పని చేస్తున్న డా. నసీర్ అహ్మద్ లావే కూడా వున్నాడు. వీళ్ళకు తోవ చూపించడానికి లాయన్ లాబ్ గ్రామానికి చెందిన గులామ్ మొహియుద్దీన్ జర్గార్‌ను అనే రైతును కూడా కార్లో ఎక్కించుకున్నారు. పదకొండున్నరకు రాయర్ గ్రామం దగ్గర రాష్ట్రీయ రైఫిల్స్ పికెట్ దగ్గర ఆగారు. తమ గురించి చెప్పుకున్నారు. ఏ పని మీద పోతున్నారో చెప్పారు. వాళ్ళను జవాన్లు పొమ్మన్నారు. కొంత దూరం వెళ్ళాక రోడ్డుప్రక్కన కారాపుకుని వాగు ఎగువకు ఒక గంటన్నరసేపు నడిచి వెళ్ళారు. తమతో తెచ్చుకున్న మధ్యాహ్న భోజనం తినడానికి అదిజాల్ గ్రామం శివారులో ఆగారు. అప్పుడు మధ్యాహ్నం ఒంటిగంట అవుతుంది. హఠాత్తుగా వాళ్ళమీదకే గురిపెట్టి వున్న తుపాకులు మోగాయి. ఇద్దరు ఇంజనీర్లకూ, రైతులకూ తూటాల దెబ్బలు తగిలాయి. డా. లావే వాగులోకి దూకి పెద్ద బండరాయి వెనుక దాక్కున్నాడు. పది-ఇరవై సార్లు తుపాకులు మోగాయనీ, దాదాపు

అర్ధగంట సేపు ఫైరింగ్ జరిగిందనీ ఆయన చెప్పాడు. మూడు గంటల తర్వాత మరి కొంతమంది సైనికులు అక్కడికొచ్చారు. లావే ని బయటికి పిల్చారు. లావే బయటికొచ్చి తను ఎవరో చెప్పుకున్నాడు. ఆయవ బయటికొచ్చి చూసే సరికి ఇంజనీర్లిద్దరూ చచ్చి పడివున్నారు. రైతు తూటా గాయాలతో కొట్టు మిట్టాడుతున్నాడు. తుపాకులు కాల్చింది రాష్ట్రీయ రైఫిల్స్ జవాన్లని సైనికులు లావేతో చెప్పారు. అయితే ఎదురు కాల్పులు జరిగాయని ఆయన్ని ఒప్పించడానికి ప్రయత్నించారు. అస్సలు ఎదురు కాల్పులు జరగనేలేదని లావే మా బృందంతో గట్టిగా చెప్పాడు. సైనికులు వచ్చేటప్పటికి జర్గార్ ్రతికే వున్నప్పటికీ ఆయన్ని వెంటనే ఆసుపత్రికి తీసుకు పోవడానికి సైనికులు ఏ ప్రయత్నమూ చెయ్యలేదని మాతో చెప్పాడు. మూడు గంటల తర్వాత ఒక గుర్రాన్ని తెచ్చారు. లావే స్థానిక (బీర్వా) పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయడానికి వెళితే ఆయనతో పాటు ఒక సైనిక మేజర్ పోలీసు స్టేషనుకు వచ్చి ఎదురు కాల్పుల్లో చనిపోయినట్లుగా ఫిర్యాదు లో రాయమని ఒత్తిడి చేసారు. కానీ డా. లావే దాన్ని ఎదురు కాల్పులు అనడానికి తిరస్కరించాడు.

★ ఇది ప్రతీకారంగా జరిగిన హత్యకు ఇటీవలి ఉదాహరణ. దీనికి కూడా ఎదురు కాల్పుల ముసుగు వేసారు. అది 1995 ఫిబ్రవరి 10. నగర్‌లో చాలా రద్దీగా వుండే మార్కెట్ ఏరియా జైయినా కడాల్‌లో మిలిటెంట్లు ఒక బి.ఎస్.ఎఫ్ జవాన్‌ను చంపేసారు. నిమిషాల్లో బి.ఎస్.ఎఫ్ జవాన్లు అక్కడికి చేరుకుని రోడ్డుమీదకూ, సందుల్లోకీ, గందుల్లోకీ విచ్చలవిడిగా కాల్పులు జరిపారు. దుకాణదార్లను షాపుల్లోనుంచీ బయటికి లాక్కొచ్చి మరీ చంపారు. అలా ఏడుగుర్ని చంపారు. సలీమ్ హామిద్, పీర్ బషీర్ అహ్మద్‌షా అనే దుకాణదార్లనూ, ముస్తాఖ్ అహ్మద్ ఖాన్ అనే గడియారాలు బాగుచేసే వ్యక్తినీ రోడ్డు మీదకు లాక్కొచ్చి కాల్చారు. దుకాణదారులిద్దరూ అక్కడే చనిపోయారు. ఖాన్ తర్వాత ఆసుపత్రిలో చనిపోయాడు. హాజి గూలామ్ నబీ అనే అరవై ఏళ్ళ దుకాణదారుడు దారిన పోతున్న ఒకతన్ని బి.ఎస్.ఎఫ్. జవాన్లు కాల్చబోతే అడ్డుపడి రక్షించబోయాడు. బి.ఎస్.ఎఫ్ ఆఫీవరు ముందు నబీని చంపమని ఆర్డరు వేసాడు. ఆర్డరు అమలై పోయింది. జావేద్ అహ్మద్ షెహ్రీ అనే మరో దుకాణదారూ, బాటసారి అబ్దుల్ రషీద్, మరో గుర్తు తెలియని రిక్షాలాగే వ్యక్తీ కాల్పుల నుంచీ తప్పించు పారిపోతుంటే తూటా దెబ్బలు తిన్నారు. షెహ్రీ అక్కడికక్కడే చనిపోయాడు. మిగిలిన ఇద్దరూ ఆసుపత్రిలో చనిపోయారు. 'కాల్చు, బయటికి లాగు, చంపు' అనే ఈ బి.ఎస్.ఎఫ్. కార్యక్రమం సాయంత్రం ఆరు గంటల వరకూ సాగిపోయింది. ఆతర్వాత దిగ్బంధం, సోదా కార్యక్రమం. అది 8.15 వరకూ సాగింది. చనిపోయిన వాళ్ళంతా ఎదురు కాల్పుల్లో చనిపోయారని చెప్పారు.

★ ఈ ఘటనను కూడా ఎదురు కాల్పుల ఘటనే అని చెప్పారు. మిలిటెంట్లును చంపడానికి ఇద్దరు గ్రామస్తులను సైన్యం మానవ బాంబులుగా ఉపయోగించింది. అది **1995** జులై **23.** బుద్గామ్ జిల్లా సాయిబా గ్రామం. నేషనల్ కాన్ఫరెన్సుకు చెందిన కార్యకర్త ఎసదుల్లా మీర్ అనే పెద్దమనిషి ఇంట్లో మిలిటెంట్లు దాక్కున్నారనే అనుమానంతో రాష్ట్రీయ రైఫిల్స్ జవాన్లు తెల్లవారు జామున మూడు గంటలకు సోదా మొదలెట్టారు. గ్రామంనుంచీ ఒక కిలోమీటరు దూరాన గ్రామస్తులందర్నీ జమ వేసారు. అలా జమ వేసిన జనంలోంచి ఇద్దరు యువకుల్ని ఎంపక చేసుకున్నారు. వాళ్ళ వీపులకు ప్రేలుడు పదార్ధాలు పట్టీలతో కట్టారు. అసదుల్లా ఇంట్లోకి వాళ్ళను వెళ్ళమన్నారు. వాళ్ళు ఇంట్లోకి వెళ్లడం ఆలస్యం రాష్ట్రీయ రైఫిల్స్ జవాన్లు రిమోట్ కంట్రోలునుపయోగించి ప్రేలుడు పదార్ధాలను పేల్చారు. మొత్తం ఇల్లంతా కూలిపోయింది. ఇద్దరు యువకులూ, ఇంట్లో దాక్కున్న ఐదుగురు మిలిటెంట్లు అక్కడికక్కడే చనిపోయారు.

★ **1995** ఏప్రిల్ **4** న రాష్ట్రీయ రైఫిల్స్ జవాన్లు బారాముల్లా పట్టణంలో ఒక యువకుడి కోసం వేటాడుతున్నారు. అతడి గురించి వాకబు చేస్తూ జనాన్ని బూతులు తిడుతూ కొడుతున్నారు. గులామ్ మొహమ్మద్ బంగీ ఒక రోడ్లు వూడ్చే పనివాడు. మునిసిపల్ కార్మికుడు. ఆయన్ని జవాన్లు గనామ్ హామామ్ వీధిలో పట్టుకున్నారు. యువకుడి గురించిన వివరాలు ఆయనకు తెసుననే అనుమానంతోఆయన్ని ఈడ్చుకుపోయారు. అక్కడ వుండే స్త్రీలు జోక్యం చేసుకుని అలా లాక్కు పోవడాన్ని నిరసించారు. రాష్ట్రీయ రైఫిల్స్ జవాన్లు స్త్రీలను కూడా కొట్టారు. కానీ ఇద్దరు అక్కాచెల్లెళ్ళు మెహబూబా**(22)**, షాజాదాలు బంగీని రక్షించడానికి ఆయనమీద పడుకున్నారు. మహబూబా ను సైనికులు కాల్చి చంపారు. అక్కడి కక్కడే చంపేసారు. దీన్ని కూడా ఎదురు కాల్పులనే అన్నారు. టౌన్‌లో సంపూర్ణ బంద్ జరిగింది దీనికి వ్యతిరేకంగా.

## సాయుధ బలగాలచే మూకుమ్మడి హత్యాకాండ

*"కాశ్మీరు ప్రజానీకం పై భద్రతా దళాలు తీవ్రమైన దుర్మార్గాలకు పాల్పడుతున్నారు అకస్మాత్తుగా దాడి చేస్తారు. అందర్నీ అవమానించేలా గుర్తింపు పెరేడ్లు నిర్వహిస్తారు. అమాయకుల్ని చంపేస్తున్నారు. హతుల సంఖ్య ఇప్పటికే దాదాపుగా* **40** *వేలకు చేరుకుంది. లాల్‌చౌక్, గౌకడల్, ఛోటాబజార్, దరీబాల్, కంగన్, సోపోర్, హంద్వారా, బిజ్‌బాహారా లాంటి చోట్ల నరమేధానికి పాల్పడ్డారు."*

*--- కాశ్మీర్ యూనివర్శిటీ ఉపాధ్యాయులు*
*అమెరికా ప్రభుత్వానికి పంపిన మెమోరాండం.*

పెద్ద సంఖ్యలో జనాన్ని చంపడం భారత సాయుధ బలగాలు మూడు రకాల

రూపాల్లో చేస్తున్నారు. ఒకటి -- ఊరేగింపుల మీదా, ప్రదర్శనల మీదా కాల్పులు జరపడం. వీటిల్లో మూడు ముఖ్యమైన ఘటనలను (1990 జనవరి 21న గౌకడల్, 1990 మార్చి 1న తెంగ్‌పురా-జకూరా, 1990 మే 24వ ఇస్లామియా కళాశాల) ఇంతకు ముందటి అధ్యాయంలో పేర్కొన్నాం. ఆ తర్వాత కూడా ఇలాంటి ఘటనలు జరిగాయి. 1991మే 8 న శ్రీనగర్‌లోని ఖన్యార్ లో ఒక చావు ఊరేగింపుపై కాల్పులు జరిపి14 మందిని చంపేసారు. దీని వెనుక ఒక కథ ఉంది. 1991మే 5న సైనికుల్తో జరిగిందని చెప్పబడుతున్న ఎన్ కౌంటర్లో సైనికులు 73 మందిని చంపేసారు. పాకిస్తాన్ వైపు నుంచీ భారత ఆక్రమణలో వున్న జమ్ము-కాశ్మీర్ లోకి ప్రవేశిస్తుంటే సరిహద్దు మీద ఈ ఎన్‌కౌంటర్ జరిగిందని సైన్యం కథనం. వాళ్ళకు శ్రద్ధాంజలి సమర్పించేందుకు ఆ ఊరేగింపు. ఖన్యార్ కాల్పులు 'జరిగి ఉండకూడదు' అని గవర్నరు సక్సేనా అన్నట్లు అమ్నెస్టీ ఇంటర్ నేషనల్ పేర్కొంది. మే 5న సరిహద్దున జరిగిన మూకుమ్మడి హత్యాకాండ గురించి ఏమీ తెలియడం లేదు. 1993లో జరిగిన బిజ్ బెహారా హత్యాకాండ ఇంకా చాలా దుర్మార్గమైంది. ఈ ఘటనలో జాతీయ మానవ హక్కుల కమీషన్ చైర్మన్ రంగనాథ్ మిశ్రా కూడా ఆసక్తి చూపాడు. హజ్రత్ బాల్ స్మారక మందిరాన్ని సైన్యం చుట్టుముట్టినందుకు నిరసనగా 1993 అక్టోబర్ 22న అనంత్‌నాగ్ జిల్లాలో గల బిజ్ బెహారాలో భారీ ప్రజాప్రదర్శన జరిగింది. కొందరు మిలిటెంట్లు స్మారక మందిరాన్ని స్వాధీనం చేసుకోగా అక్కణ్ణుంచీ వాళ్ళను తరిమేయడానికి సైన్యం ప్రయత్నం చేసింది. అప్పుడు ఈ ప్రదర్శన జరిగింది. ఊరేగింపులో పాల్గొన్న జనం వైపునుంచీ గానీ మరెక్కడ నుంచీ గానీ, ఎలాంటి రెచ్చగొట్టే చర్యలూ లేకపోయినా బి.ఎస్.ఎఫ్ బిజ్ బెహారా ఊరేగింపుపై కాల్పులు జరిపి 47 మందిని చంపేసారు. దీని మీద మే 7న మెజిస్ట్రేటు విచారణ కూడా జరిగింది. ఎలాంటి రెచ్చగొట్టే చర్యలూ లేకపోయినా కాల్పులు జరిపారనీ, కాల్పులు సమర్థనీయం కావనీ విచారణలో తేలింది. 12మంది బి.ఎస్.ఎఫ్ జవాన్లను ప్రాసిక్యూట్ చెయ్యమని విచారణాధికారి సిఫార్సు చేశారు. బి.ఎస్.ఎఫ్. అంతర్గతంగా జరిపిన విచారణలో కూడా 14మంది జవాన్లు ఈ కాల్పులకు బాధ్యులని తేలింది. అయినా ఇప్పటివరకూ ఎవరినీ శిక్షించలేదని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ తెలిపింది.

జనాన్ని పెద్ద సంఖ్యలో చంపివేసే మరో పరిస్థితి ఎప్పుడంటే --సైనిక బలగాల మీద మిలిటెంట్లు దాడి చేస్తే దానికి ప్రతీకారంగా స్థానిక ప్రజలమీద కసి తీర్చుకోవడానికి సాయుధ బలగాలు విచ్చల విడి కాల్పులు జరిపినప్పుడు. గత ఐదేళ్ళ కాలంలో జమ్ము-కాశ్మీర్‌లో అలాంటివి అనేక ఘటనలు జరిగాయి. 1990 ఆగస్టు ఒకటిన శ్రీనగర్ బారాముల్లా రోడ్డుమీద పట్టన్ గుండా పోతున్న సైన్యం బాగా రద్దీగా వుండే మార్ట్ ఏరియా పైకి అకస్మాత్తుగా కాల్పులు జరిపి 12మంది పౌరుల్ని చంపేసారు. ఒక సైనిక శకటం ఒక గుంటలో పడడంతో మర తుపాకి అనుకోకుండా పేలింది. ఇది మిలిటెంట్ల పని అని సైన్యం అనుకుంది. 1990 ఆగస్టు 6న శ్రీనగర్‌లోని మశాల్లీ వీధిలో మిలిటెంట్ల గ్రెనేడ్ దాడిని ఎదుర్కున్న బి.ఎస్.ఎఫ్. జవాన్లు ఇళ్ళలోకి చొరబడి 10 మందిని కాల్చి చంపారు. 1990 ఆగస్టు 10న కుప్‌వారా జిల్లాలోని ఫాజీపూర్ గ్రామంలోకి సైన్యం ప్రవేశించి 50 ఇళ్ళకు అగ్గి పెట్టారు. విచ్చల విడిగా కాల్పులు జరిపారు. 25మందిని చంపేసారు. వాళ్ళలో ఎక్కువమంది పొలాల్లో పని చేసుకుంటున్న రైతులు. ఫాజీపూర్

నుంచీ రెండు కిలోమీటర్ల దూరాన గల ట్రెఘూమ్ సైనిక క్యాంపుపై మిలిటెంట్లు చేసిన దాడికి ప్రతీకారంగా సైన్యం ఈ దాడికి పాల్పడింది. 1990 అక్టోబర్ ఒకటిన కుప్వారా జిల్లా సరిహద్దు పట్టణం అయిన హంద్వారాలో బి.ఎస్.ఎఫ్ జవాన్లు మార్కెట్ ఏరియాలో చిత్తం వచ్చినట్లు కాల్పులు జరిపారు. బి.ఎస్.ఎఫ్ జవాన్లను మిలిటెంట్లు చంపినందుకు ప్రతీకారంగా ఈదాడి జరిగింది. 350 ఇళ్ళకూ దుకాణాలకూ కూడా బి.ఎస్.ఎఫ్ జవాన్లునిప్పుపెట్టారు. 16మందిని చంపారు. 15మంది బుల్లెట్ గాయాలతో చావగా ఒక వ్యక్తి ఒళ్ళు కాలి చనిపోయాడు.

శ్రీనగర్‌లోని జైనాకడల్ ప్రాంతంలో ఒక కేంద్ర రిజర్వు పోలీసు జవానును మిలిటెంట్లు చంపినందుకు 1991 జూన్ 11న సి.ఆర్.పి.ఎఫ్ చోటాబజార్‌లో జనాన్ని చంపుకుంటూపోయింది. ఇది జైనాకడల్‌కు నాలుగు కిలోమీటర్ల దూరాన వుంటుంది. ఈ దాడిలో 25మంది పౌరుల్ని చంపారు.

బారాముల్లా జిల్లాలోని పాకిస్తాన్ సరిహద్దున ఉండే సోపోర్ టౌనులో బి.ఎస్.ఎఫ్ జవాన్లు రెండుసార్లు ప్రతీకార హత్యలకు పాల్పడ్డారు. ఈ పట్టణానికి అనేక సార్లు నిప్పుపెట్టారు. తరువాతి సెక్షన్లో ఈ విషయాన్ని చూద్దాం. మొదటి హత్యాకాండ 1992 ఏప్రిల్ 13న జరిగింది. సోపోర్‌కు చాలా దూరంగా ఉన్న ఒక ప్రాంతములో బి.ఎస్.ఎఫ్ జవాన్లపై మిలిటెంట్లు దాడి చేసారు. ఐదు గంటల తర్వాత, మధ్యాహ్నం పూట బి.ఎస్.ఎఫ్ జవాన్లు సాపోర్ టౌన్‌లోకి ప్రవేశించారు. ఇళ్ళల్లోంచి జనాన్ని బయటకి ఈడ్చుకొచ్చి వాళ్లను తుపాకులతో కాల్చడం మొదలెట్టారు. 13 మందిని అలా చంపేసారు. రెండోసారి 1993 జనవరి 6న – ఆరోజు ప్రొద్దున్న మిలిటెంట్లు ఒక బి.ఎస్.ఎఫ్ జవాన్ను చంపేసారు. వెంటనే బి.ఎస్.ఎఫ్ జవాన్లు హత్యాకాండకు పాల్పడ్డారు. పట్టణం మీద బుల్లెట్ల వర్షం కురిపించారు. ఇళ్ళల్లోంచీ దుకాణాల్లోంచీ జనాన్ని బయటకు ఈడ్చుకొచ్చారు. వాళ్ళను కాల్చి చంపారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన ఒక బస్సుపై కాల్పులు జరిపారు. ఆ బస్సు బండిపురా పోతోంది. బస్సు ప్రయాణికుల్ని చంపేశారు. ఈదాడిలో 45మందిని వధించారు. వారిలో 15మంది బస్సుప్రయాణీకులు.

1992 జులై 13వ బుద్ గామ్ జిల్లా నస్రుల్లా పూర్ గ్రామం వద్ద బెమినా వైపు పోతున్న ఒక సైనిక సమూహం పై మిలిటెంట్లు దాడి చేసి ఒక జవాన్ను చంపివేసారు. ఒక గంట తరువాత సాయంత్రం నాలుగు గంటలకు సైనికులు గ్రామంలో దిగిపోయారు. విచ్చల విడిగా కాల్పులు జరిపి 10మందిని చంపేశారు. ఎక్కడైనా ప్రేలుడు జరిగితేనో లేదా టైరు పగిలి శబ్దం చేస్తేనో అది తమపై జరిగిన గ్రెనేడు దాడి అనుకొని సైనిక దళాలు కాలికల్లైపోయి పిచ్చి పిచ్చిగా జనంపై కాల్పులు జరిపిన ఘటనలు ఉన్నాయి. బారాముల్లాలో 1990 జులై 15న అలాంటిదే ఒక ఘటన జరిగింది. ఎక్కడో దూరంగా వినబడ్డ శబ్దాన్ని ప్రేలుడు శబ్దం అనుకున్నారు సి.ఆర్.పి.ఎఫ్., బి.ఎస్.ఎఫ్ జవాన్లు జనం మీద కాల్పులు జరిపి ఇద్దర్ని చంపారు. నలుగుర్ని గాయపర్చారు.

1993 ఏప్రిల్ 10న బి.ఎస్.ఎఫ్ జవాన్లు శ్రీనగర్ నడిబొడ్డున ఉన్న లాల్ చౌక్‌లో ఇళ్ళకూ దుకాణాలకూ నిప్పు పెట్టి జనంమీద కాల్పులు మొదలెట్టారు. 10 మంది చనిపోయారు. 165 షాపులు తగలబడిపోయాయి. 57 భవనాలు పూర్తిగా బూడిదైపోయాయి. ఇలాంటి ప్రతీకార హత్యలు ఈ సంవత్సరం కూడా కొనసాగాయి.

ఇంతకు ముందటి సెక్షనులో 1995 ఫిబ్రవరి 10న జరిగిన జైనకడల్ హత్యాకాండను పేర్కొన్నాము.

మూడోరకం మూకుమ్మడి హత్యలు టౌన్లమీద, గ్రామాల మీద దాడులు చేసినప్పుడు జరుగుతుంటాయి. అక్కడ దాడుల్లో ఎవర్నో ఒకర్ని పట్టుకుపోయి కాల్చి చంపుతారు. ఈదాడుల్లో మామూలుగా సైనిక బలగాలు ముందు ఆ ప్రాంతాన్ని అన్ని వైపుల నుంచీ మూసేస్తారు. మగవాళ్ళనందరినీ ఇళ్ళలోంచి బయటకు రమ్మంటారు. ఒక చోట జమ కూడ మంటారు. ఒక ఇన్ ఫార్మర్ ("క్యాట్")ను అక్కడికి తీసుకొస్తారు. మిలిటెంట్లకు సహాయపడుతున్న వారెవరో, మద్దతు ఇస్తున్న వాళ్ళెవరో, పాల్గొంటున్న వారెవరో గుర్తు పట్టమని ఇన్ ఫార్మర్ని అడుగుతారు. ఎవరినైతే గుర్తు పడతారో అలా గుర్తించ బడిన వ్యక్తుల్ని పట్టుకుంటారు. ఆర్మీ క్యాంపుకు తీసుకు పోతారు. లేదా అక్కడి ఇళ్ళలోనే ఒకదాన్ని తాత్కాలిక ఇంటరాగేషన్ సెంటర్గా మారుస్తారు. ఇది నడుస్తుండగానే ప్రతి ఇల్లూ సోదా చేసే కార్యక్రమం కూడా నడుస్తుంటుంది. ఈ సోదాలు జరిగేప్పుడు సాధారణంగా స్త్రీలపై లైంగిక అత్యాచారాలు చేస్తారు. లేదా అడ్డమైన బూతులు తిడతారు. ఈ క్రమంలో గుర్తించ బడిన వ్యక్తుల్ని మామూలు మనుసుల్ని కాల్చి చంపుతారు.

ఇలా మూకుమ్మడిగా చంపిన ఘటన ఒకటి 1991 సెప్టెంబర్ 12 న వుల్లార్ సరస్సు చుట్టువట్ల గ్రామాలపై చేసిన దాడుల్లో జరిగింది. ఒక్కరోజు దాడిలోనే 15నుంచీ 25మందిని అలూసా గ్రామంలోనూ, సరస్సు చుట్టుపట్ల గల ఇతర గ్రామాల్లోనూ చంపేసారని అంటారు.

ఈ సంవత్సరం ఇలాంటి దాడుల్లో మూకుమ్మడి హత్యాకాండ జరిగిన ఘటన ఒకటుంది. 1995 ఏప్రిల్ 28 న కుప్వారాజిల్లా, హంద్వారా తహసిల్, హామామ్ మస్కోట్ అనే సరిహద్దు గ్రామంపై సైన్యం చేసిన దాడిలో 'ముస్లిం జాన్‌బాజ్' గ్రూపుకు చెందిన 43మంది మిలిటెంట్లను సైన్యం కాల్చి చంపిందని 'కాశ్మీర్ టైమ్స్' ప్రచురించింది.

## సైనిక బలగాలచే దహనాలు

> *"గత ఐదేళ్ళ కాలంలో 6931 దహనం కేసుల్లో 265 కోట్ల రూపాయల విలువగల ఆస్తి ధ్వంసమైపోయింది. 148 మందిని సజీవ దహనం చేసారు."*
>
> *----కాశ్మీర్ టైమ్స్, 1995 ఏప్రిల్ 19.*

ఈ దహనం ఘటనలన్నిటికీ సైనిక బలగాలే కారణం కాదు. మిలిటెంట్లు కూడా అనేక ఇళ్ళనూ, సినిమా హాళ్ళనూ, స్కూళ్ళనూ అగ్నికి ఆహుతి చేసారు. అయితే దాక్కున్న మిలిటెంట్లను బయటికి రప్పించడానికీ, వాళ్ళను సజీవంగా దహనం చేయడానికీ, మిలిటెంట్లకు రక్షణ కల్పించే లేదా మిలిటెంట్ల ఉద్యమానికి మద్దతు నిచ్చే గ్రామాలకూ, గల్లీలకూ ఒక గుణ పాఠం చెప్పడానికే ఒక ఆయుధంగా గృహ దహనాలను భారత సైనిక దళాలు ఒక పద్ధతి ప్రకారం ఉపయోగిస్తున్నాయి. ఒక్క 1990లోనే, 'ఏసియా వాచ్' ఉటంకించిన ఒక నివేదిక ప్రకారం, సైనికులూ, బి.ఎస్.ఎఫ్. జవాన్లూ కలసి

మూడువేల నివాస గృహాలను అగ్నికి ఆహుతి చేసారు.

సోదా కార్యక్రమం జరుపుతూ అగ్నికి ఆవూతి చేసిన ఇటీవలి ఘటన ఒకటుంది. శ్రీనగర్‌కు దాదాపు 48 కిలోమీటర్ల దూరాన, పుల్‌వామా జిల్లా, ట్రాల్‌కు సమీపంలో వుంటుంది. లాప్రే జాగీర్ గ్రామం. 'కాశ్మీర్ మానిటర్' చెప్పుతున్నదాని ప్రకారం 1995 జనవరి 10న పొద్దున 8-30 కు ట్రాల్ సైనిక విభాగం లాప్రే జగీర్ గ్రామాన్ని చుట్టేసి సోదా మొదలెట్టింది. మగవాళ్ళ నందర్నీ ఒక చోట జమేసి పదకొండు గంటల వరకూ తుపాకీ మడమలతో వాళ్ళను కొట్టారు. ఇక అప్పుడు ఇళ్లిలు సోదా చేసారు. సోదా అయిపోయిన తర్వాత పశువుల పాకనుంచి ఎండుగడ్డి తీసుకొచ్చి ప్రతిఇంటికీ నిప్పు పెట్టడానికి వాడారు. ఈ సోదా, అగ్ని ప్రీతి కార్యక్రమం మూడురోజుల పాటు నిరాటంకంగా సాగిపోయింది. 17 ఇళ్ళను కాల్చేసారు. వాటిల్లో ఒకటి నాలుగు అంతస్తుల భవంతి, మూడంతస్తుల భవంతులు 8, రెండంతస్తులవి నాలుగు. ట్రాల్ నుంచి అగ్నిని ఆర్పే ఫైర్ బ్రిగేడ్ వచ్చినా దాన్ని గ్రామంలోకి ప్రవేశించకుండా మూడు రోజులపాటు సైన్యం అడ్డుకొంది. ఒక గ్రామస్తుడు చేసిన ఫిర్యాదు మేరకు పుల్వామా డిప్యూటీ కమీషనరు (ఈయనే జిల్లా మేజిస్ట్రేటు కూడా) పోలీసు డిప్యూటీ సూపర్నెంట్ ను తోడ్కొని అక్కడికి రాగా వాళ్ళను గ్రామంలోకి వెళ్ళడానికి సైన్యం అనుమతించింది. అయితే గృహదహనాలూ, తుపాకి కాల్పులూ జరుగుతుండడంతో వాళ్ళు హడావిడిగా అక్కణ్ణుంచీ వెళ్ళిపోయారు. ఈ ఘటనకు కారణం సైనిక బలగాలపై మిలిటెంట్లు చేసిన దాడిలో ఒక జూనియర్ కమాండింగ్ ఆఫీసర్ చనిపోవడమే నన్పిస్తోంది.

1990లో కాశ్మీర్‌లో పలు భారీ గృహదహనాలు జరిగాయి. 1990 అక్టోబర్ ఒకటిన హాంద్వారాలో 350 ఇళ్ళనూ దుకాణాలనూ దహనం చేసి, 16 మందిని చంపిన ఘటనను ఇంతకు ముందే పేర్కొన్నాం. 1990 లో జరిగిన ఇలాంటి ఘటనల సంఖ్య 'ఒకడజను' ఉంటుందని 'ఏసియావాచ్' లెక్క కట్టింది. ఈ అన్ని ఘటనల్లోనూ అధికారికంగా ఇచ్చిన వివరణ ఏమంటే సైనిక బలగాలకూ, మిలిటెంట్లుకూ మధ్యా జరిగిన ఎదురు కాల్పుల్లో ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదాలని! కాని ఇవన్నీ సైనిక బలగాలు బుద్ధిపూర్వకంగా చేసిన నేరాలే. కాశ్మీర్‌లో ఇళ్ళన్నీ ఎక్కువగా కలపతో చేసినవే కావడంతో సైనిక బలగాలు ఇళ్లను కాల్చివేయడానికి ఒక పథకం ప్రకారం ప్రేలుడు పదార్థాలనుగానీ, పెట్రోలును గానీ, మంటలు లేపే పౌడరులాంటి పదార్థాన్ని గానీ వుపయోగించే వారని దాదాపుగా అన్ని రిపోర్టులూ పేర్కొన్నాయి. శ్రీనగర్‌లోలోని నూర్‌బాగ్ (1990 అక్టోబర్ 7), రంగ్ తెంగ్ కాందరా (అక్టోబర్ 7, 1990), సోపోర్ (1990 జూన్ 26, జులై 26, సెప్టెంబర్ 20), బుద్‌గాం జిల్లా చాక్‌కాల్ వూసా (1990 జులై 13), బుద్‌గాం జిల్లా వాత్మగామ్-అదీనా (1990 జులై 8 ), బైగామ్ (1990 ఆగస్టు 11), అనంతనాగ్ జిల్లా శ్రీ గుప్‌వారా (1990 ఆగస్టు 11), పుత్షాయీ (1990 ఆగస్టు 14)లలో జరిగిన ఘటనలను ఏసియావాచ్, జమ్ము-కాశ్మీర్ ప్రజల ప్రాథమిక హక్కుల (పరిరక్షణ) కమిటీలు ప్రచురించిన నివేదికల్లో వివరంగా పేర్కొన్నారు.

1992 లో శ్రీనగర్‌లోగల హజ్రత్‌బాల్ వద్ద విషాదకరమైన దహన ఘటనే జరిగింది. జనవరి 22న జరిగిన ఈ ఘయనలో 16వేల పుస్తకాలతో, పలు అరుదైన

చేతిరాత పుస్తకాలు కలిగి వున్న గ్రంథాలయం పూర్తిగా మాడి మసై పోయింది. ఆ ప్రాంతంలో జె.కె.ఎల్.ఎఫ్ జెండాలను గమనించిన బి.ఎస్.ఎఫ్. వాటిని తొలగించడం మొదలెట్టింది. దాంతో అక్కడి ప్రజలతో ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో కొంతమంది మిలిటెంట్లు బి.ఎస్.ఎఫ్ కాల్పులు జరిపారు. బి.ఎస్.ఎఫ్. తుపాకులతో ఎదురు కాల్పులు జరిపింది. ఒక వ్యక్తిని చంపేసారు. వెంటనే గ్రంథాలయానికి నిప్పంటుకుంది. మిలిటెంట్లే దీనికి కారణమని బి.ఎస్.ఎఫ్ నిందించింది. కాశ్మీరీ చరిత్రకూ, సంస్కృతికీ, భాండాగారమైన గ్రంథాలయాన్ని తాము తగలెయ్యము అని, బి.ఎస్.ఎఫ్. మంటపెట్టిందని మిలిటెంట్లు ఆరోపించారు. ఈ ఆరోపణను హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి మియా జలాలుద్దీన్ కూడా సమర్థించారు. ఈ ఘటనపై విచారణ జరపమని స్థానికులు ఆయన్ని అభ్యర్థించారు.

1993 లో మే 2-3 మధ్యరాత్రి సోపోర్ టౌన్ మళ్ళీ ఇంకోసారి మండి పోయింది. బి.ఎస్.ఎఫ్ క్యాంపు మీద మిలిటెంట్లు చేసిన రాకెట్ దాడికి ప్రతీకారంగా బి.ఎస్.ఎఫ్ జవాన్లు దహనానికి పాల్పడ్డారు. హాతీషా, జామియా ఖదీమ్ ప్రాంతాలలో నిప్పు పెట్టారు. 33 షాపుల్ని, వాణిజ్య సంస్థల్నీ నివాస భవనాల్నీ తగల బెట్టారు. మూడుగంటల పాటు అగ్నిని ఆర్పే వాహనాలను కాలి పోతున్న ప్రాంతాలకు చేరకుండా బి.ఎస్.ఎఫ్. నిరోధించింది. మే9న సైన్యం బండిపురా టౌన్ దగ్గర్లోని బాపురా, ఎరిన్ గ్రామాలను తగలేసింది. కునక గ్రామం సమీపంలో మిలిటెంట్లు సైన్యం మీద చేసిన దాడికి ప్రతీకారంగా ఈ ఊర్లను పరశురామ ప్రీతి చేసింది. శ్రీనగర్ లాల్ చౌక్ లో బి. ఎస్. ఎఫ్ 165 దుకాణాలకూ, 67భవనాలనూ నిప్పుపెట్టిన పెద్ద ఘటనలను ఇంతకు ముందే పేర్కొన్నాం.

1994లో పి.యు.సి.ఎల్., కాశ్మీర్ మానిటర్ సంస్థలు ఒక పెద్ద గృహదహనం కేసును నమోదు చేసాయి. కుప్వారా జిల్లా, హంద్వారా తహసీల్, మావర్-బాలా గ్రామంలో 54 నివాస గృహాలను అగ్నికి ఆహుతి చేసారు. 1994 ఏప్రిల్ 23 సాయంత్రం సైన్యం ఈ గ్రామాన్ని చుట్టేసి ఇల్లిల్లూ సోదాచేయడం మొదలెట్టింది. షాబన్ లోనీ అనే అతని ఇంట్లో మిలిటెంట్లు దాక్కున్నారనే అనుమానంతో ఆయన ఇంటికి నిప్పు పెట్టడానికి ఎండుగడ్డి వాడారు. మిలిటెంట్లు ఇంట్లో నుంచి బయటకు రావడానికి ప్రయత్నించారు. సైన్యం అలర్ట్‌గా వుండి నలుగురు మిలిటెంట్లనూ కాల్చిచంపింది. మిలిటెంట్లు బయటికి వస్తూ కాల్పులు జరిపారు. సైనికులు కూడా చనిపోయారు. కసితో రేగిపోయిన సైనికులు ఇతర ఇళ్ళకు అగ్గిపెట్టడం మొదలెట్టారు. గోడలు దూకి బయటికి రావల్సి వచ్చింది, ఆ ఇళ్ళల్లోని వాళ్ళు ప్రాణాలు కాపాడు కోవడానికి. పోలీసులను తీసుకుని అప్పుడు అక్కడికి వచ్చిన స్థానిక సబ్‌డివిజన్ మేజిస్ట్రేట్‌ను అక్కణ్ణుంచి వెంటనే వెళ్ళి పొమ్మని సైనికులు బలవంత పెట్టారు. లేకుంటే ఎదురుకాల్పుల్లో చనిపోతాడని బెదిరించారు. అక్కడికి వచ్చిన అగ్నిమాపక దళాన్ని తన పని తాను చేసుకు పోనీయకుండా సైన్యం నిరోధించింది. గ్రామస్తులు ఈ ఘటనలో జరిగిన నష్టం 64 లక్షల 52 వేల రూపాయలు వుంటుందని అంచనా వేసారు.

1994 జులై 30న సోపోర్‌ను బి.ఎస్.ఎఫ్. మళ్ళీ ఇంకోసారి తగలెట్టింది. కాశ్మీర్ మానిటర్ ప్రకారం టౌనులోని కుషాల్ మటో, సంగ్రామ్ పురా ప్రాంతాలను బి.ఎస్.ఎఫ్

చుట్టేసింది. మగవాళ్ళు నందర్నీ ఒక చోట జమేసింది. అహ్మద్ ఖన్నా, జాన్ మొహమ్మద్ షేక్, గులామ్ నబీదర్కీ, మొహమ్మద్ షేక్, మొహమ్మద్ షేక్, మొహమ్మద్ రంజాన్, మెహ్రాజుద్దీన్ బుద్దా అనే వాళ్ళను కస్టడీలోకి తీసుకున్నారు. ఇంటరాగేషన్ సెంటర్‌కు తీసుకపోయి వాళ్ళను చంపేసారు. అక్కణ్ణుంచి వెళ్ళి పోయేముందు మంట అంటుకునే పదార్థాన్ని చల్లి 40 ఇళ్ళను తగలబెట్టారు.

## చరారె షరీఫ్ దహనం

*ఒక దశాబ్ద కాలంలో దేశంలో నాశనం చేయబడిన పవిత్ర స్థలాల్లో ఇది మూడవది. ఈ పూజా స్థలాలన్నీ మైనారిటీలకు చెందినవే కారణం ఏదేమైనప్పటికీ ఇది కలత పరిచే ధోరణి"*

*-----పౌరహక్కుల ప్రజాసంఘం (పి యు సి ఎల్)*
*ప్రజాతంత్ర పౌరులు (సి ఎఫ్ డి)*

ఈ సంవత్సరం జమ్ము-కాశ్మీర్‌లో మిలిటెన్సీతో వ్యవహరించే క్రమంలో భారత సైనిక బలగాలు చేసిన పనులలో చరారే షరీఫ్‌ను, షేక్ నూరుద్దీన్ స్మారక మందిరంతో సహా దహనం చేయడం అన్నిటికంటె ప్రాధాన్యం కల ఘటన, అత్యంత విషాదకరమైన ఘటన కూడ. ఈ దహనక్రియ గురించి పి యు సి ఎస్, సి ఎఫ్ డి బృందము, కమిటి ఫర్ ఇనీషియేటివ్ ఆన్ కాశ్మీర్ సంస్థలు వివరమైన రిపోర్టులు ప్రచురించాయి. పలు పత్రికలు కూడా ప్రచురించాయి. అందువల్లే మాబృందం ఈ ఊరిని సందర్శించలేదు. ఈపైన చెప్పిన రెండు రిపోర్టుల నుంచీ లోయలో మేం ప్రజలతో జరిపిన సంభాషణల నుంచి సేకరించిన వివరాలను క్లుప్తంగా పేర్కొంటాం.

1995 ఫిబ్రవరి చివరి వారంలో చరారెషరీఫ్ పట్టణ నివాసులైన ముగ్గురు మిలిటెంట్లను ఊరికి సమీపంలో ఒక ఎన్‌కౌంటర్లో బి ఎస్ ఎఫ్ కాల్చి చంపింది. 1995 మార్చి 6న ఆ ఊరి గుండా పోతున్న ఒక బి ఎస్ ఎఫ్ బృందంపై మిలిటెంట్లు దాడి చేసి ఇద్దర్ని చంపేశారు. ఊరు దాటిపోయే వరకూ బి ఎస్ ఎఫ్ చిత్తం వచ్చినట్లు కాల్చుకుంటూ పోయింది. ముక్తార్ బేగం అనే ఒక స్త్రీ చనిపోయింది. ఐదుగురు మహిళలు, ఒక రెండు సంవత్సరాల బాలుడితో సహా 16మంది గాయపడ్డారు.

పలువురు విదేశీ మిలిటెంట్లు, ఊరిలో ఉన్నారని ఒక పుకారు లేసింది. దాంతో వాళ్ళను అక్కణ్ణుంచీ బయటకు తోలేయడానికి 7-3-1995న బి ఎస్ ఎఫ్ ఊరిని చుట్టుముట్టింది. మస్త్‌గుల్ నాయకత్వాన ఉన్న ఈ మిలిటెంట్లు ఫిబ్రవరి నుంచీ ఆ ఊరిలోనే ఉన్నారు. అయితే వాళ్ళ సంఖ్యను అతిగా చూపించినట్లున్నారు. (ఈ విషయం ఒక పత్రికా సంపాదకుడు చెప్పాడు) తెలియక కావచ్చు, లేదా చుట్టివేతను కొనసాగించడాన్ని సమర్థించుకోవడానికి కావచ్చు. ఆఖరికి 23 మృత దేలాలను వెలికి తీయగా ఐదుగుర్ని మాత్రమే విదేశీ మిలిటెంట్లుగా గుర్తించారు. 'ఫ్రంట్ లైన్' పత్రిక విలేకరి సుకుమార్ మురళీధరన్ రిపోర్టు ప్రకారం ఆఖరికి ఇది కూడ సందేహాస్పదమే. ఎందుకంటే స్థానిక ప్రజలు ఈ ఐదుగుర్నీ కూడా పేరూ, ఊరుతో సహా గుర్తించారు.

ఈ చుట్టివేత రెండు నెలలకు పైగా సాగింది. చివరికి మొత్తం పట్టణం మంతట్నీ

స్మారక మందిరం తో సహా ధ్వంసం చేశారు. బూడిద చేసేశారు. ఇది మే 10-11 రాత్రి జరిగింది. ఈ రెండు నెలల కాలంలోనూ సైన్యానికీ, మిలిటెంట్లకూ మధ్య అప్పుడప్పుడూ ఎదురు కాల్పులు జరిగాయి. సైన్యం మోర్టారులను కూడా ఉపయోగించింది. మే 8 సాయంత్రం చీకటి పడుతుండగా దహనం మొదలైంది. మే 11 పొద్దున్న కల్లా మొత్తం పట్టణం అంతా ఆహుతయిపోయింది. మస్తగుల్ నాయకత్వానగల హిజ్‌బుల్ ముజాహిన్ మిలిటెంట్లు ఊరికీ, స్మారక మందిరానికీ నిప్పు పెట్టారనీ ప్రభుత్వం అంటుంది. విదేశీ మిలిటెంట్లు ఛాందస సున్నీ ముస్లీములనీ, వీళ్ళు సూఫీసాధువుల స్మారక మందిరాలను పూజించడాన్ని నమ్మరని కూడా చెప్పింది. కానీ లోయలోని పలువురు ప్రజలు, మస్తగుల్‌తో ఏకీభవించనీవారితో. సహా కాశ్మీరీ ప్రజలకు విదేశీ మిలిటెంట్లకు మధ్యనగల ఈ తేడానుంచీ ప్రయోజనం పొందే ఉద్దేశం తోనే సైన్యం మూర్ఖంగా ముట్టడిని కొనసాగించింది అని నమ్ముతున్నారు. ఈ మూర్ఖత్వాన్ని పి యు సీ ఎల్, సి ఎఫ్ డి రిపోర్టు వివరంగా పేర్కొంది. మిలిటెంట్లు, వారు కాశ్మీరులైనా, కాశ్మీరేతరులనైనా లోయంతా ఉన్నారు కాబట్టి, చరారే షరీఫ్‌తో వాళ్ళు ఉండటం ప్రత్యేకమైన ఘటన ఏమీకాదు. కాశ్మీరీ గుర్తింపుకు చిహ్నమైన షేక్ నూరుద్దీన్ స్మారక మందిరం ప్రాముఖ్యత దృష్ట్యా, ఆ ఊరి ముట్టడిని కొనసాగించాల్సినంత అవసరమేమీ ఉండలేదు. మొదటి రోజు సైన్యం ఊరికి 6కిలో మీటర్ల దూరాన ఉండేది. క్రమంగా దగ్గరికి, మరింత దగ్గరికి వస్తూ సైన్యం ఒక కిలో మీటరు దూరంలోకి వచ్చేసింది. ఊరి మీద మోర్టారులను ప్రేలుస్తూనే ఉంది. ఈ ఊరు ప్రధానంగా కలపతో నిర్మించింది కావడంతో ఇలా మోర్టార్లను ప్రేల్చడమే దానంతటదే తీవ్రమైన గృహ దహనానికి దారి తీయగలదు. ముట్టడి జరిగిన వెంటనే ఊరిలోని డెబ్బయి శాతం జనం బయటికి వెళ్ళి పోయినా, సైన్యానికి, మిలిటెంట్లకు మధ్య వర్తిత్వం నెరపడానికే తమంతటతామే బాధ్యత తీసుకున్న కొందరు ఇంకా అక్కడే ఉండిపోయారు. ఒక పెద్ద మనుషుల బృందం స్థానిక న్యాయవాది బాబా అబ్దుల్ ఖరీక్ నాయకత్వాన మధ్య వర్తిత్వానికి ప్రయత్నించింది. కానీ మిలిటెంట్లు లొంగి పోవడం తప్ప మరో ప్రతిపాదనకు అధికారులు ఒప్పుకోవడానికి నిరాకరిచారు. వాళ్ళు లొంగిపోతే వాళ్ళను పాకిస్తానుకు తిరిగి పంపించి వేస్తామని వాగ్దానం చేసారు. మిలిటరీ చట్రంలో ఇది హేతుబద్ధమైన ప్రతిపాదన అయి ఉండవచ్చేమో. అయితే స్మారక మందిరం విధ్వంసం అయ్యే అవకాశం ఉన్న పరిస్థితుల్లో లొంగి పొమ్మని ఒత్తిడి చెయ్యడం బాధ్యతారాహిత్యమే. ఎందుకంటే ఆర్మీ చుట్టివేత కార్యక్రమం ప్రారంభంలో స్మారక మందిరాన్ని రక్షించడం. దాన్ని పరిరక్షించడమే తమ ఏకైక లక్ష్యం అని చెప్పుకునింది. మస్తగుల్ స్మారక మందిరానికి నష్టం కలిగించి కాశ్మీరీలను తననుంచి దూరం చేసుకోవడానికి ఇష్టపడడు కాబట్టి మస్తగుల్ లొంగిపోతాడని సైన్యం అంచనా కావచ్చు. అయితే కాశ్మీరీలను మరింత దూరం చేసుకునే లాగ స్మారక మందిరాన్ని విధ్వంసం చేసి అయినా సరే తన లొంగుబాటు సాధించడానికె సైన్యం సాహసం చేయదని మస్తగుల్, ఆయన స్నేహితులు అనుకోగలరు.

మార్చి 19నుంచి పత్రికల వాళ్ళనీ, బయటివాళ్ళనీ పట్టణంలోకి పోవడానికి అనుమతించలేదు. చాలామంది నివాసులు కూడా క్రమంగా పట్టణాన్ని వదిలి వెళ్ళి పోవడంతో పుకార్లు, పక్షపాత కథనాలే ఇక సత్యాలై పోయాయి. పట్టణానికి నిత్యావసర సరఫరాలను బందుపెట్టారు. పట్టణవాసులు నిరసన తెలిపిన తర్వాత మాత్రమే వాటిని

పునరుద్ధరించారు. ఆల్ పార్టీ హురియత్ కాన్ఫరెన్స్ నాయకులైన సయ్యద్ అలీషాజిలానీ, షబ్బీర్ అహ్మద్‌షాలు అవసరమైన నిత్యావసర వస్తువులనూ, మందులనూ తీసుకొని వస్తుంటే వాళ్ళు మిలిటెంట్లకి ప్రేలుడు పదార్థాలను మందుల క్రింద దాచి మరీ తెస్తున్నారనే హాస్యాస్పద కారణంతో ఏప్రిల్ 6న ముట్టడికి గురై ఉన్న పట్టణంలోకి వారిని ప్రవేశించ నీయలేదు. కాశ్మీరీ ప్రతినిధుల యెడల భారతీయ అధికారులు ఎల్లప్పుడూ చూపించే కించపరచే వైఖరికి ఇది మరో ఉదాహరణ. తర్వాత పరిస్థితి మరింత ఉద్రిక్తంగా తయారు కావడంతో జె.కె.ఎల్.ఎఫ్ నాయకుడు యాసిన్ మాలిక్ పీపుల్స్ లీగ్‌కు, అలాగే హురియత్ కాన్ఫరెన్స్‌కూ నాయకుడయిన షబ్బీర్ అహ్మద్ షాలు పట్టణంలోకి వెళ్ళి మధ్య వర్తిత్వం నెరుపుతామని ముందుకొచ్చారు. వీళ్ళిద్దరూ కూడా కాశ్మీరు సమస్యకు సైనికేతర పరిష్కారాన్ని సాదిద్దామనే ఆలోచనతో వున్నవాళ్ళే. పైగా షబ్బీర్ షా భారతీయ రాజకీయ నాయకుల తోనూ ఇతర ప్రముఖులతోనూ ఢిల్లీలో ఎప్పటినుంచో మాట్లాడుతున్నాడు. ఇక యాసిన్ మాలిక్ అయితే చరార్-ఎ-షరీఫ్ స్మారక కేంద్రం ప్రాతినిధ్యం వహించే కాశ్మీరీయత్ గుర్తింపుకు ప్రతినిధి. చరారె షరీఫ్‌లో రక్షణ తీసుకుంటున్న పాకిస్తాన్ అనుకూల మిలిటెంట్ల వ్యతిరేకి. వాళ్ళను మధ్య వర్తిత్వం నెరపడానికి అనుమతించివుంటే వాళ్లా ప్రయత్నంలో విఫలమయి ఉన్నా అది వాళ్ళ ప్రతిష్ఠకే నష్టకరం అయివుండేది. అది భారత సైన్యానికి ఎలాంటి నష్టమూ కలిగించి ఉండేది కాదు. అయినప్పటికీ వాళ్ళు తమ బాధ్యతను గుర్తించి మధ్య వర్తిత్వం నెరపడానికి ముందుకు వచ్చారు. కానీ భారతీయ సైన్యం బాధ్యతా రాహిత్యంతో వాళ్ళనా పనిచేయనివ్వలేదు. పట్టణ నివాసులు ఏప్రిల్ 21న ఒక ప్రతిపాదన చేసారు. ఒక్క పదిరోజుల పాటు సైన్యం అక్కడ నుండి ఉపసంహరించు కోవాలని కోరారు. అలా మిలిటెంట్లు వెళ్ళిపోవడానికి అవకాశం ఇవ్వాలని కోరారు. అలాగే అక్కణ్ణుంచి సైన్యం ఉపసంహరించుకునే పక్షంలో మిలిటెంట్లు తామక్కడి నుండి వెళ్ళిపోతామని హామీ యివ్వాలని కూడా కోరారు. మిలిటెంట్లు ఈ ప్రతిపాదనకు ఒప్పుకొని ఉండేవాళ్ళే. ఎందుకంటే వాళ్ళపై దాడి చెయ్యకుండా ఉంటే తాము ఊరు వదిలి వెళ్ళి పోతామని వారు ప్రారంభం నుండే చెబుతూ వచ్చారు. ఈ ప్రతిపాదనను సైతం సైన్యం తిరస్కరించింది. ఎందుకంటే "మిలిటెంట్లను ఊరు వదిలిపెట్టి పోవలసిందిగా ఒత్తిడి చేయాల్సిన బాధ్యత చరారే నివాసులదే" అనేది సైనికాధికారుల వైఖరి అని ఏ.జి. నూరాని ఫ్రంట్ లైను లో వ్రాశాడు. ఈ విషాదాంతం తర్వాత సైనికాధికారులు జర్నలిస్టులతో మాట్లాడుతూ పవిత్ర స్థలాల్లో మిలిటెంట్లు రక్షణ పొందడాన్ని కాశ్మీరు ప్రజలు నిరోధించ లేక పోయినట్లయితే అప్పుడు ఆ స్థలాల విధ్వంసాన్ని ఆమోదించక తప్పదని, దానికి సైన్యాన్ని నిందించకూడదని అన్నారు. షేక్ నూరుద్దీన్ స్మారక మందిర దహనాన్నుంచీ కాశ్మీరు ప్రజలు నేర్చుకోవలసిన గుణపాఠం ఇదేనని సైన్యం ఉవాచ.

మిలిటెంట్లూ, సైనికులూ పరస్పరం కాల్చుకోవడం కొనసాగించారు. చివరికి మే 8 న చీకటి పడుతుండగా కొన్ని భవనాలకు నిప్పంటుకుంది. "మార్కెట్లో ప్రేలుడు సంభవించింది. దాని తర్వాత సైనికులు కాల్పులు మొదలెట్టారు. ఆ తర్వాత దహనం మొదలైంది" అని పి.యు.సి.యల్., సి. ఎఫ్.డి. రిపోర్టు పేర్కొంది. ఆఖరికి ఆమరునాడే కొన్ని ఢిల్లీ వార్తాపత్రికలు ప్రచురించిన రిపోర్టుల ప్రకారం సైనిక చర్యే దహనాన్ని

మొదలెట్టింది. చుట్టు పక్కల భవనాలకు నిప్పంటుకోగానే మిలిటెంట్లు స్మారక మందిరంలోకి వెళ్ళారు. 8-11 తేదీల మధ్య మస్తగుల్ పాకిస్తాన్‌కి వైర్‌లెస్ మెసేజ్ పంపించాడనీ దాన్ని సైన్యం విన్నదనీ ఈ సందేశం ప్రకారం ముందు వేసుకొన్న పథకం ప్రకారమే దహన కార్యక్రమం మొదలైందని రుజువయిందనీ భారతీయ సైన్యం చెప్పుకుంది. అయితే పలువురు పరిశీలకులు అడిగినట్లు మిలిటెంట్లు తమకున్న ఒకే ఒక షెల్టర్‌కు నిప్పెందుకు పెట్టుకుంటారు? తమను తాము బయట పడేసుకునేలా ఎందుకు చేసుకుంటారు? ఏదో నిప్పును మండించే పదార్థాన్ని హెలికాప్టర్ నుంచి జారవిడిచి సైన్యమే బుద్ధి పూర్వకంగా మంటలు కలిగించిందని చరార్ ప్రజలు నమ్ముతున్నారు. ఇలా జరిగి ఉంటుందనే సిద్ధాంతాన్ని తిరస్కరించినా నిరాటంకంగా, బాధ్యతా రాహిత్యంగా సైన్యం ఊరి మీద కురిపించిన గుళ్ళ వర్షం దహనానికి దారి తీసిందని ఖచ్చితంగా అనుమానించవచ్చు. ఏదేమైనా అసలు సమర్థనీయం కాని విషయమేమంటే సైన్యం నైతిక స్థైర్యం దెబ్బ తింటుందనే కారణంతో న్యాయ విచారణను ఆదేశించడానికి భారత ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తపరచక పోవడం.

## సైనికులు చేసిన రేప్‌లు - బలత్కారాలు

*సైనికులు హింసాత్మకంగా మారి*
*క్రూర మృగాల్లా ప్రవర్తించారు.......*
*వాళ్ళు చేసిన అత్యాచారాలూ,*
*వాటి పరిమాణమూ నాదృష్టికి వచ్చాయి.....*
*చెప్పాలంటే నాకే సిగ్గనిపిస్తోంది."*

*-----ఎస్.ఎమ్.యాసిన్, కుప్‌వారా జిల్లా మేజిస్ట్రేట్, 1991 మార్చి 7.*

సైనికులు చేసే రేప్ ఒక చిత్రహింసారూపం. ఏ ప్రజలతోనైతే సైనికులు పోరాడుతున్నారో వాళ్లను అణచి వేయడానికి రేప్‌ను ఒక అణచివేత ఆయుధంగా వాడతారు.

జమ్మూ-కాశ్మీర్ స్త్రీలను అరుదుగానే కస్టడీలోకి తీసుకున్నారు. కానీ ఇళ్లు సోదా చేసినప్పుడు అది పట్టణాల్లో కావచ్చు గ్రామాల్లో కావచ్చు స్త్రీలు సైనికుల కామ వాంఛకు లక్ష్యాలవుతారు. అలాంటి సోదాల్లో మామూలుగా మగ వాళ్ళందర్నీ ఇళ్ళల్లోంచి బయటికి లాగి ఒక చోట జమవేస్తారు --సైనికులకు సహకరించే ఇన్‌ఫార్మర్ గుర్తు పట్టడానికి వీలుగా. మగవాళ్లు లేకుండా ఇళ్ళలో సోదా చేస్తారు. సోదా పూర్తయి పోయేంత వరకూ మగవాళ్ళను తిరిగి రానివ్వరు. రక్తాన్ని గడ్డ కట్టించే చలిలో సైతం.... ఎంతసేపు సోదా జరిగానా, వాళ్లు బహిరంగ స్థలంలో ఉండవలసిందే. సోదా జరిగేటప్పుడే సాయుధ సైనికులు స్త్రీలపై బలత్కారానికి పాల్పడతారు. స్త్రీలను పాకిస్తానీ ఏజెంట్లకు ముస్లిం మతోన్మాద మిలిటెంట్లుకు, తల్లులు గా భావించడంతో సైనికులు అన్నిరకాల సున్నితత్వాలనూ కోల్పోతారనేది నిస్సందేహం. భారతీయ సైనిక బలగాలను మతతత్వీకరించడం వలన వచ్చిన అనేక పర్యవసానాల్లో ఇదొక్కటి. అది లేకపోతే సైనికులు లైంగిక హింసకు పాల్పడరని కాదు. కానీ దాని వల్ల ఈ హింస

ద్విగుణీకృతమవుతుంది.

సరిహద్దు గ్రామాల్లో ఈ అత్యాచారాలు మరీ ఎక్కువ. ఇక్కడ గ్రామస్తుల కన్నా సైనికుల, బి ఎస్ ఎఫ్ జవాన్ల సంఖ్యే ఎన్నో రెట్లు ఎక్కువ వుంటుంది. ఎందుకంటే, "పాకిస్తానీ చొరబాటు దార్ల" నుంచీ సుదీర్ఘమైన సరిహద్దులను రక్షించే విధి నిర్వహణ వాళ్ళు చేయాల్సి వుంది. ఈ పాకిస్తానీ చొరబాటు దార్లు అని ముద్ర వేయబడిన వాళ్ళలో ఆయుధాలు పొందడానికీ, ఆయుధాలనుపయోగించడానికీ శిక్షణకై సరిహద్దు దాటిన కాశ్మీరీ యువకులే ప్రధానం. సరిహద్దు గ్రామాలు వీళ్లకు రక్షణ కల్పిస్తున్నాయనీ సహాయం అందిస్తున్నాయనీ అనుమానించడంతో ఆ గ్రామాలు సైన్యమూ, బి ఎస్ ఎఫ్ చేసే సోదాల భారాన్ని మోయాల్సి వస్తోంది.

ఒక్కోసారి సోదా కార్యక్రమం 6,7 రోజులు ఎడతెరిపిలేకుండా సాగిస్తారని ఒక జర్నలిస్టు చెప్పాడు. ఆ సోదా నడుస్తున్నప్పుడు గ్రామాన్ని పూర్తిగా దిగ్బంధం చేసి వేస్తారు. పైగా బయటి వాళ్ళెవరూ సరిహద్దు సమీపానికి పోవడానికి వీల్లేదు. అందువల్ల వాస్తవానికి అక్కడేమి జరుగుతుందనేది అరుదుగానే తెలుస్తుంది. ఈ కారణాల రీత్యా సైన్యమూ, బి ఎస్ ఎఫ్ చేసే అత్యాచారాలు హత్యలూ రేప్‌లూ మరింత క్రూరంగా వుంటాయి. సరిహద్దు ప్రాంతాలు కావడం వల్ల తక్కువ ప్రచారానికి నోచుకుంటాయి. ఇప్పటిదాకా మేం ఇచ్చిన ఈ నివేదికలో సాపోర్, హంద్వారా లాంటి ప్రాంతాల పేర్లు మళ్ళీ మళ్ళీ కనపడడాన్ని పాఠకులు గమనించే వుంటారు. ఆ ప్రాంతాలు సరిహద్దున వున్నాయి. జమ్ము - కాశ్మీరు సరిహద్దు జిల్లాలు -కాశ్మీర్లో బారాముల్లా, కుప్‌వారాలు కాగా, జమ్ములో పూంచ్, రజోరీలు. కాశ్మీర్ మానిటర్ పేర్కొన్నట్లు --"సరిహద్దు ప్రాంతాల్లో, ఎక్కడో సుదూరాన వున్న ప్రాంతాల్లో, పత్రికల, మానవహక్కుల సంస్థల వెలుగు ప్రసరించని ప్రాంతాల్లో భద్రతా దళాలు చేసిన బలత్కారాలు, రేపులు, అసలు ఘటనలే కాకుండా పోయాయి."

సరిహద్దు జిల్లా అయిన కుప్‌వారా జిల్లాలోని కునన్ పోష్‌పోరా గ్రామం ఒక పెద్ద బలాత్కార ఘటనను చవి చూసింది. దీనికి బాగా ప్రచారం కూడా వచ్చింది. **1991** ఫిబ్రవరి **23** రాత్రి వందల మంది సైనికులు, చాలామంది పూటుగా తాగిన వాళ్ళు, గ్రామానికి వచ్చారు. రిటైరైన ప్రధాన న్యాయమూర్తి ముఫ్తి బహావుద్దీన్ ఫారూఖీ నాయకత్వాన వెళ్ళిన ఒక నిజ నిర్ధారణ కమిటీ ఆ గ్రామాన్ని సందర్శించింది. మగవాళ్ళందర్నీ ఇళ్ళల్లోంచి బయటకు లాక్కు పోయారు - ప్రశ్నించాలని. అంతలోనే ఇళ్ల మీద దాడులు చేసి స్త్రీలను మూకుమ్మడిగా రేప్ చేసారు. కొంత మంది స్త్రీలను ఏడుగురు, మరికొందర్ని పదిమంది రేప్ చేసారు. అలా కనీసం అంటే **23** మంది స్త్రీలను రేప్ చేసారు అని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ అంటుంది. జస్టిస్ ఫారూకీ **53** మంది రేప్ బాధితులనుంచీ స్టేట్‌మెంట్లు తీసుకున్నారు. వందమందికి పైగా రేప్ కు గురై వుంటారని ఆయన భావించారు. ఈ ఘటన గురించి విన్న జిల్లా మేజిస్ట్రేట్ ఎస్.ఎమ్.యాసీన్ మార్చి 5న ఆ గ్రామాన్ని సందర్శించి తాను విన్నది నిజమేనని ధృవీకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ పంపాడు. సైనికులకు వ్యతిరేకంగా కేసు నమోదు చేయమని ఆదేశమిచ్చారు. స్థానిక పోలీసుల్ని దర్యాప్తు చెయ్యమని ఆదేశాలిచ్చారు. కానీ వాళ్లు స్త్రీలను వైద్య పరీక్షలకు పంపలేదు. ఎలాంటి దర్యాప్తు చేయలేదు. ఇది

పుట్టించిన కథ అనీ, తమ ప్రతిష్ఠను మంట కలిపేందుకే ఈకథ పుట్టించారనీ సైన్యం పేర్కొన్నది. భారత సైన్యపు "జగజ్జేయమాన ప్రతిష్ఠను" దిగజార్చేందుకు జిల్లా మేజిస్ట్రేటుతో సహా కుట్ర పన్నారేమే పాపం! "ఆరోపిత ఘటన జరిగిన రెండువారాల తర్వాత జిల్లా మేజిస్ట్రేటు రిపోర్టు పంపడాన్ని బట్టే మొత్తం కథ అంతా కల్పితం అని అర్థం అవుతుంది అని సైన్యం చెప్పుకుంది.

1992 అక్టోబర్ 10 రాత్రి పుల్వామా జిల్లా షాపియన్ సమీపంలోని చాక్ సైదాపురా లోని గుజ్జర్ల గ్రామం పై సైన్యం దాడి చేసింది. మగవాళ్లనందర్నీ ఇళ్ళల్లోంచి తీసుకు పోయారు. 9 మంది స్త్రీలను -11 ఏళ్ళ బాలిక జైటూన్‌తో సహా వాళ్ళ ఇళ్ళల్లో సైనికులు రేప్ చేసారు. షోపియన్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఏడుగురు మహిళల్ని వెంటనే వైద్య పరీక్ష చేసారు. ఆరుగురి విషయంలో బలవంతపు రతి జరిగినట్లుగా సాక్ష్యం కనబడింది డాక్టరుకు. తక్కిన ఇద్దర్నీ మూడురోజుల తర్వాత పరీక్ష చేసారు. వీళ్ళ శరీరాల మీద రక్కిన గాయాలూ గీరుకుపోయిన గాయాలున్నాయి. అయితే ఈ కేసులో కూడా ఇద్దరు స్త్రీలు హార్డ్‌కోర్ మిలిటెంట్ల భార్యలని సైన్యం చెప్పింది. ఆరోపణలు భారత సైనిక దళాలపై బురదజల్లే కార్యక్రమంలో భాగమేనని ప్రకటించింది. కానీ సైన్యమే ఈ ఘటన పై విచారణ జరిపింది. నేరస్తులు వెటనే కదిలి సాక్ష్యాన్ని లేకుండా చేసారు అని జమ్ము-కాశ్మీరు ఫోరం ఫర్ హ్యూమన్ రైట్స్ అండ్ సివిల్ లిబర్టీస్ ప్రకటించింది. ఆ గ్రామానికి చెందిన ఒక గుజ్జార్ యువకుడు మిలిటెంటుగా పని చేస్తున్నట్లున్నాడు. ఆయన సోదరుడు వూళ్ళోనే నివసిస్తున్నాడు. ఆ సోదరుడుకి బలవంతంగా భుజానికి తుపాకీ తగిలించి సైనికులు ఫోటో తీసుకుని, ఎవరైనా విచారణ అధికారికి ఎలాంటి స్టేటుమెంటు ఇచ్చినా అతణ్ణి చంపేస్తామని అతని తండ్రిని సైనికులు హెచ్చరించారు. మెడికల్ ఆఫీసర్ రిపోర్టుల గురించి ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ అడిగిన ప్రశ్నకు 'అవన్నీ పరిస్థితుల సాక్ష్యం మీదనే కానీ స్వచ్ఛమైన వైద్య కారణాల మీద ఆధారపడినవికావు' అని ప్రభుత్వం జవాబు చెప్పింది. అది మిలిటెంట్ల లక్ష్యంలో డాక్టరు గారికి ఉన్న సానుభూతి వల్ల రాసిన రిపోర్టే తప్ప 'స్వచ్ఛమైన వైద్య కారణాల మీద ఆధారపడినది కాదు అని మరింత పచ్చిగా చెప్పి వుండాల్సిందేమో!

సోదా జరిగేటప్పుడు సైనికులు పారా మిలిటరీ బలగాలు చేసిన అత్యాచారాల్లో అవమానించడం, రేప్‌లు వున్నాయని దాదాపు ప్రతినివేదిక పేర్కొంటోంది. అయితే కొన్ని ఘటనలను మాత్రమే సరిగ్గా నమోదు చేసారు. జమ్ము-కాశ్మీరు మానవ హక్కుల, పౌరస్వేచ్ఛల ఫోరంతో సంబంధం వున్న ఒక శ్రీనగర్ హైకోర్టు లాయరు మాబృందంతో అన్నాడు. --- గత ఐదేళ్ళ కాలంలో సాయుధ బలగాల సోదాల్లో దాదాపు 13 వేల మంది స్త్రీలపై అత్యాచారం చేసారని. ఈ ఆరోపణలో నిజం పాలెంత అతిశయోక్తి పాలెంత అని రుజువు పర్చుకోవడానికి మార్గమే లేదు. ఇటీవలి రెండు ఘటనలను పేర్కొని ఇది ముగిస్తాం.

మొదటిది కాశ్మీర్ మానిటర్ రిపోర్టు చేసినది. గుజ్జార్ల గూడెంకు సబంధించినది. ఆ హేమ్లట్ పేరు ధేనోబుద్ పాథేరీ. కంగన్ గ్రామానికి దగ్గరలో కొండ చరియల్లో ఉంటుంది. కాశ్మీరు గుజ్జర్లు చాలా వెనుక బడిన వారు. అతిపేదవాళ్ళు. కొండల్లో వుండే గూడెంలలో నివసిస్తారు. స్థిర నివాసం వుండరు. ఈ గూడెం వద్ద ఒక సైనిక

పికెట్ ఉంది. ఈ గుజ్జరలతో సైనికులు బలవంతంగా చాకిరీ చేయుంచుకుంటున్నారు. దీంతో తృప్తి చెందక సైనికులు 1994 సెప్టెంబర్ 11రాత్రి గూడెంకు వచ్చారు. గుజ్జర గుడిసెల్లోకి చొరబడి అయిదుగురు మహిళల్ని రేప్ చేశారు. వారు జకీరా (21) జేనాబ్(20) బీబీ (35) జూరా(25) వాహబ్ నూరి (35), జకీరా ఒక స్తంబాన్ని పట్టుకుంది -- తన్ను తాను కాపాడుకోవాడానికి. పొయ్యిలోంచి కణకణలాడే బొగ్గును తీసుకొచ్చి ఆమె చేతివేళ్ళమీద కాల్చారు గట్టిగా పట్టుకున్న చేతుల్ని వదులు చేయడానికి. దాదాపు అందరినీ గ్యాంగ్ రేప్ చేశారు. కొంతమంది స్త్రీలను మిలిటెంట్లు గురించి ప్రశ్నించే నెపంతో ఇళ్ళ వెనక్కి లాక్కుపోయి అక్కడరేప్ చేశారు. మరో ఘటన గురించి కూడా మా టీము వివరాలు సేకరించింది. అదీ ఈ సంవత్సరమే బారాముల్లా జిల్లాలోని యూరీ సరిహద్దున జరిగింది. ఆ గూడేం పేరు-జుబ్లా జనాభా రెండు వందలు. 1995 మార్చి 18 రాత్రి గ్రామం దగ్గర మందు పాతర పేలింది. కొందరు సైనికు గాయపడ్డారు. సైనికులు గ్రామంలోకి ప్రవేశించారు. మగవాళ్ళందరినీ ఇళ్ళలోంచి ఈడ్చుకొచ్చి వూరవతల జమచేసారు. మర్నాడే వాళ్ళు ఊళ్ళోకి వెళ్ళనిచ్చారు. వాళ్ళు వూళ్ళోకి వచ్చి చూస్తే చాలామంది ఆడవాళ్ళు కనబడడం లేదు. కాసేపటికి పదుగురు తప్ప ఆడాళ్ళంతా తిరిగి వచ్చారు. కళ్ళలో నీళ్ళు ఉబికి వస్తున్నాయి. తమమీద అత్యాచారం జరిపారని చెప్పారు. తక్కిన ఏడుగురి స్త్రీలకు ఏమయింది? వాళ్ళు తరువాత తిరిగి వచ్చారా లేదా అనేది మనకు తెలియదు. ఎందుకంటే మాకీ విషయం చెప్పిన తను శ్రీనగర్ వాసి. అతనికి కడపటి పరిస్థితి తెలియదు. లోయలో అనేక గ్రామాల్లో అలా మిస్సింగ్ స్త్రీల కేసులు కనీసం వందయినా ఉంటాయనీ, వాళ్ళందర్నీ సైనికులు రాక్షస రతికి వాడుకుంటూ వుండవచ్చుననీ శ్రీనగర్‌లో ఒక జర్నలిస్టు మాతో అన్నాడు.

**కోర్టులూ - చట్టాలు**

> *"పోలీసులూ, పౌరపాలనా చట్టబద్ధపాలనను గాల్లోకి విసిరేసినట్లుగా అన్పిస్తోంది. వాళ్ళు అన్ని రకాల చట్ట విరుద్ధ చర్యలకూ పాల్పడుతున్నారు. వాళ్ళను చూసి నేరస్తులు, టెర్రరిస్టులు కూడా సిగ్గు పడతారేమో.... డిటెన్యూలను చట్ట విరుద్ధంగా కస్టడీలో వుంచుకుంటున్నట్లు నాదృష్టికి వందల కేసులొచ్చాయి. ఈ కోర్టు గట్టి ఆదేశాలిచ్చినప్పటికీ వాళ్ళను విడిచి పెట్టటం లేదు. డిటెన్యూల ఆచూకీ తెలియని కేసులు వందల కొద్ది పెండింగులో ఉన్నాయి. అరస్టు చేసిన తర్వాత చం పేసారని ఆరోపిస్తూ వున్న కేసులు ఆజన్ల సంఖ్యలో పెండింగులో ఉన్నాయి. క్లుప్తంగా చెప్పాలంటే శాంతి భద్రతల యంత్రాంగం కుప్పకూలిపోయింది. చట్టాల్ని అమలు పరిచే యంత్రాంగం ఈ కోర్టును కూడా నిస్సహాయరాల్ని చేసిందని చెప్పడానికి నేను సిగ్గు పడడం లేదు. ఈ కోర్టు ఆదేశాన్ని ఎవరూ పాటించడం లేదు. వేల ఆదేశాలిచ్చాం. వాటికి స్పందనే లేదు".*

*-----జస్టిస్ ఎస్. ఎన్. రిజ్వీ, జమ్ము-కాశ్మీర్ హైకోర్టు,* 1994 *అక్టోబర్* 17

ఇది గౌరవనీయ న్యాయమూర్తి గారి రాజకీయ ఉపన్యాసం కాదు. రిట్ పిటీషన్ నెం. 850/94 (జలీల్ ఆంధ్ర బీ వర్సెస్ స్టేట్) లో ఇచ్చిన ఉత్తర్వులో ఈ మాటలు రాసారు. ఆయన నిర్బంధితుల పేర్లన్నీ వెల్లడించాలనీ, ఏకేసుల్లో వారిని నిర్బంధించారో తెలపాలనీ, ఎంతకాలంగా నిర్బంధంలో ఉన్నదీ తెలపాలనీ ప్రతీ ఇంటరాగేషన్ సెంటర్‌లోనూ, జైల్లోనూ సబ్ జైల్లోనూ, పోలీసు స్టేషన్లోనూ లభ్యమవుతున్న ఇతర సౌకర్యాలు తెలపాలనీ ఆదేశాలివ్వాలని కోరుతూ రిట్ పిటిషన్ దాఖయ్యింది. న్యాయమూర్తి ఈ ఉత్తర్వులో ప్రతి జిల్లాలోనూ జిల్లాజడ్జీ జిల్లా మెజిస్ట్రేటు, జిల్లా పోలీసు సూపరింటెండెంటు, ఛీఫ్ మెడికల్ ఆఫీసర్లు కూడిన ఒక కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కమిటీ ఇంటరాగేషన్ సెంటర్లలోనూ, డిటెన్షన్ సెంటర్లలోనూ వున్న పరిస్థితిని పరిశీలించి హైకోర్టుకు నివేదిక పంపాలని ఆదేశించారు. ఈ ఉత్తర్వు ప్రకారం ఏర్పర్చే జిల్లా కమిటీలకు పూర్తి సహకారం అందించమని కూడా రాష్ట్ర చీఫ్ సెక్రటరీనీ, పోలీసు డైరెక్టర్ జనరల్ నూ వారివారి క్రింది స్థాయి అధికారులనూ ఆదేశించాలని కూడా న్యాయమూర్తి ఆజ్ఞాపించారు.

ఈ ఉత్తర్వు అమలు కానేలేదని వేరే చెప్పాల్సిన అవసరం లేదు. జస్టిస్ రిజ్వీని కర్ణాటకకు బదిలీ చేయడానికి ప్రయత్నించారు. కానీ ఆయన నిరసన తెలుపడంతో కాశ్మీర్ హైకోర్టు జమ్ము బెంచికి బదిలీ చేశారు. దాంతో కాశ్మీర్ లోయను ఆ న్యాయమూర్తి పరిధి నుంచి తీసివేయచ్చు! మరి ఆయనగారి చౌరవ దేశభక్తి యుత చర్యకాదు కదా!!

జమ్ము-కాశ్మీరు హైకోర్టు (శ్రీనగర్ బెంచ్)లో ఏరోజైనా 60 శాతం కేసులు సైనిక బలగాలు నిర్బంధిత వ్యక్తుల విడుదల కోరుతూ దాఖలైన హెబియస్ కార్పస్ రిట్ ఫిటీషన్లో పబ్లిక్ సేఫ్టీ చట్టం క్రింద నిర్బంధంలోకి తీసుకున్న వారి వారి నిర్బంధాన్ని సవాలు చేస్తూ దాఖలయిన ఫిటీషన్లో టాడా చట్టం క్రింద ఆరోపణలను సవాలు చేస్తూ దాఖలయ్యే పిటీషన్లో సైనిక బలగాలు చేసే హత్యల్లో విచారణను ఆదేశించమని కోరుతూ దాఖలయ్యే పిటీషన్లో, సైనిక బలగాల నిర్వహణలో వుండే ఇంటరాగేషన్ సెంటర్లలో గల అమానుష పరిస్థితులను విచారించమని కోరుతూ దాఖలయ్యే పిటీషన్లో ఉంటాయని శ్రీనగర్‌లో గల హైకోర్టు లాయర్లు మాకు చెప్పారు. కాశ్మీర్ లో భారత ప్రభుత్వం చేస్తున్న యుద్ధపు నిర్హేతుకతను అరికట్టే రకంగా చట్టాన్ని వ్యాఖ్యానించడం తప్ప శ్రీనగర్ కోర్టుకు వేరే పనిలేదు. కానీ చాలామంది లాయర్లు చెప్పేదేమంటే కోర్టు తన విధిని నిజంగా నెరవేర్చడం లేదు అని. జస్టిస్ రజ్వీ లాగా విచారణ జరిపే అతి కొద్ది మంది జడ్జీలు పంపే నోటీసులకు జవాబేవుండదు. వాళ్ళ ఉత్తర్వులను అసలు పట్టించుకోరు. నోటీసులు, ఉత్తర్వులు నిష్ఫలమైపోతున్నాయి. ఇతర జడ్జీలు అసలు విచారణ కూడా జరుపరు.

జమ్ము-కాశ్మీర్ ప్రజా భద్రతా చట్టాన్ని (పి. ఎస్. ఏ) 1978లో చేసారు. ఇది ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం. అంటే నేరం చేస్తారెమోననే అనుమానంతో ముందుగానే ఎవరినైన నిర్బంధిచడాన్కి వీలు కల్పించే చట్టం. గత కొన్ని సంవత్సరాలుగా దీన్ని విచ్చలవిడిగా వాడారు. ఇది తక్కిన భారత దేశానికి వర్తించే జాతీయ భద్రతా చట్టం (నాసా) వంటిది. విచారణ లేకుండానే పి.యస్.ఏ. కింద రెండేళ్ళ పాటు నిర్బంధంలో ఉంచవచ్చు. ప్రాంతం, మతం ప్రాతిపదికనా శతృత్వాన్నీ, ద్వేషాన్నీ సృష్టించడం

కూడా (ఇతరకారణాలతో పాటు) పి ఎస్ ఏ క్రింద నిర్బంధించడానికి కారణాలు కావడంతో స్వయం నిర్ణయాధికారాన్ని గురించి ఎవరు మాట్లాడినా లేదా ఇస్లాం మాపెత్తిన జమ్ము-కాశ్మీర్‌లో రెండేళ్ళపాటు విచారణ లేకుండా నిర్బంధించవచ్చు. ఒక హూరియత్ నాయకుడిని (లోగద పర్షియన్ భాష బోధించే ఉపాధ్యాయిణ్ణి) పి ఎస్ ఏ క్రింద అరెస్టు చేసినప్పుడు చెప్పిన కారణాల్లో ఒకటి, 'నువ్వు సంభాషణకారివి' (యూ ఆర్ ఎ కాన్వర్జేషనలిస్ట్)అని! పి ఎస్ ఏ చట్టం క్రింద డిటెన్షన్లను సవాలు చేస్తూ దాఖలైన పిటీషన్లూ ఎన్నడూ విచారణకు నోచుకోలేదని లాయర్లు పిర్యాదు చేశారు. ఒక వేళ ఎప్పుడైనా, దేన్నైనా విచారించి, ఉత్తర్వులు ఇచ్చినా అది డిటెన్షన్ గడువు పూర్తయిన తర్వాతే ఇచ్చారు. పి ఎస్ ఏ క్రింద ఇప్పటివరకూ 20 వేల మందిని నిర్బంధించారని మాకు న్యాయవాదులు చెప్పారు. చాలా డిటెన్షన్ల చట్టబద్ధతను సవాలు చేశారు. కానీ నాలుగు వందలో, ఐదు వందలో మాత్రమే తొలి ఉత్తర్వులకు నోచుకున్నాయి. అదీ డిటెన్షన్ గడువు పూర్తయిన తర్వాతే ఆ ఉత్తర్వులు వెలువడ్డాయి.

జమ్ము-కాశ్మీర్‌లో టాడాను కూడా విచ్చల విడిగా వాడారు. ఈ చట్టంలోని సెక్షన్ మూడు ప్రకారం రాజ్యాన్ని ఇబ్బందులకు గురిచేసే ఏ హింసాత్మక చర్య అయినా నేరమే (మిలిటెంటు కార్యక్రమాలు దీని కిందికే వస్తాయి). వేర్పాటును ప్రచారం చేసే, ప్రోత్సహించే మాట, రాత నేరం సెక్షను 4 క్రింద. దీని క్రింద జీవితఖైదు వెయ్యవచ్చు మాటకూ, రాతకూ కూడా. మరో మాటలో చెప్పాలంటే స్వయం నిర్ణయాధికారాన్ని గురించిగానీ, ప్లెబిసైటు గురించి గానీ మాట్లాడినా, రాసినా టాడా క్రింద జీవిత ఖైదు శిక్ష వెయ్యచ్చు. గత ఆరేళ్ళలో దాదాపు 15 వేల మంది పై టాడా కింద కేసులు పెట్టారని లాయర్లు మాకు చెప్పారు. పి ఎస్ ఏ ను గానీ టాడాని గానీ ఒకదాని తర్వాత మరోదాన్ని పెడతారు. ఒక వ్యక్తిని టాడా క్రింద అరెస్టు చేసి జైల్లో పెడతారు. సంవత్సరం లోపల ఛార్జిషీటు దాఖలు చెయ్యకపోతే ఆ వ్యక్తికి బెయిలు పొందడానికి అర్హత వస్తుంది. అందుకని వెంటనే పి ఎస్ ఏ వారెంటును మొఖం మీద కొట్టి మరో రెండేళ్ళు జైల్లో పారేస్తారు.

టాడా కేసుల్లో బెయిలు పొందడం సాధారణంగా అంత సులభం గాదు. అంటే ఒక సూత్రంగానే అసాధ్యమని కాదు. టాడా కేసులు చూసే ఒక జమ్ము లాయర్ (ఆంధ్రప్రదేశ్ వంటి కొన్నిరాష్ట్రాల్లో ప్రతి సెషన్స్ కోర్టూ టాడా క్రింద ప్రత్యేక కోర్టు కాగా జమ్ము-కాశ్మీర్ మొత్తానికీ కలిపి ఒకే ఒక కోర్టు జమ్ములో ఉంది) జమ్ము-కాశ్మీర్‌లో టాడా క్రింద అసలు ఎవ్వరికీ బెయిలే మంజూరు కాలేదని మాతో చెప్పాడు. టాడా కింద ఇంత మట్టుకు ఒక్క వ్యక్తిని కూడా ఆ రాష్ట్రంలో శిక్షించలేదని మరో సీనియర్ లాయర్ చెప్పాడు. ఎవరినైనా ప్రాసిక్యూట్ చేద్దామనే ఆసక్తి ప్రభుత్వానికి లేదని ఆయన చెప్పాడు. ప్రజల్ని జైల్లో పెట్టడం, ఎంతకాలం సాధ్యమైతే అంతకాలం అక్కడ కొనసాగించడమే ప్రభుత్వం పని. దాని ఆసక్తి అంత మేరకే. టెర్రరిస్టు నేరాలు పెరిగిపోతున్నాయో అనే కాకిగోల ఒక వైపు నిరంతరం చేస్తూనే టాడా కింద సరిగ్గా ప్రాసిక్యూట్ చెయ్యడానికి ఏ ప్రయత్నము చెయ్యలేదు. ఇద్దరు పేరు మోసిన టాడా డిటెన్యూల గురించి ఆయన మాకు చెప్పాడు. వాళ్ళిద్దరూ యాసీన్ మాలిక్, షబ్బీర్ అహ్మద్ షాలు. 1989 లో చాలా తీవ్రమైన నేరాలకు గాను వాళ్ళను అరెస్టు చేసారు.

కాని ఆరేళ్ళ తరువాత కూడా వాళ్లపై ఇంకా చార్జిషీటు దాఖలు కావాల్సేఉంది. జనం స్వేచ్ఛను అరికట్టడానికి చట్టాన్ని ఎలా దుర్వినియోగం చేస్తున్నారో ఆ లాయరే చెప్పాడు. ఆయుధ ప్రయోగములో శిక్షణ పొందడానికి పాకిస్తాన్ వెళ్లాడనే ఆరోపణ కింద ఏ ముస్లిం యువకుడి మీదనైనా అభియోగం మోపవచ్చు. ఒక కేసు గురించి మాకు ఆయన చెప్పాడు. దాని క్రైనంబర్ 2/1990. ఒక ప్రత్యేక సైనిక ఇంటిలిజెన్స్ సంస్థ దాఖలు చేసింది. ఇది తిరుగుబాటు వ్యతిరేక గూఢచార సంస్థ. కొందరు వ్యక్తులు శిక్షణ పొందడానికి పాకిస్తాన్‌కు పోయి ఆయుధాలతో సహా తిరిగి వచ్చారని ఎఫ్.ఐ.ఆర్. లో వుంది. ఎంతమంది అనే సంఖ్య లేదు. రెండేళ్ళ పాటు ఎవర్ని అరెస్టు చేసినా ఈ ఎఫ్.ఐ.ఆర్ క్రిందే అరెస్టు చేసి ఈ కేసు పెట్టారు. టాడా ఇప్పుడు కాలంతీరి అంతరించినా పాత టాడా కేసులని చెప్పి జనాన్ని ఇంకా ఈ చట్టం క్రింద అరెస్టు చేస్తున్నారని ఆ లాయరు మాకు చెప్పాడు. టాడా అంతరించిపోయినా పాత కేసులు కొనసాగుతాయనే ఒక్క అంశాన్ని వాడుకుని ప్రభుత్వం ఈ దుర్మార్గపు పని చేస్తుంది.

1990లో జమ్ము-కాశ్మీర్ గవర్నర్‌గా కొద్ది కాలం పనిచేసిన జగ్ మోహన్ ఈ చట్టాలను విచ్చల విడిగా వాడడాన్ని ప్రోత్సహించడమే గాక వాటి అమలులో అవి మరింత క్రూరంగా తయారయ్యేట్లు చేసాడు. డిటెన్యూలను రాష్ట్రం అవతలికి పంపించడానికి వీలు కల్పించేలా పి ఎస్ ఏ ను సవరించారు. శ్రీనగర్‌లో వున్న టాడా ప్రత్యేక కోర్టును రద్దు చేసి అన్ని టాడా కేసులను జమ్ముకు బదిలీ చేసాడు. ఎక్కువ మంది టాడా డిటెన్యూలు కాశ్మీరు ప్రాంతానికి చెందినవారే కావడంతో ఇలా కేసులను జమ్ముకూ బదిలీ చేయడం మరిన్ని కష్టాలను తెచ్చి పెడుతుందని గుర్తించిన లాయర్లు ఒక నెల రోజుల పాటు ఈ ఉత్తర్వుకు వ్యతిరేకంగా సమ్మె చేసారు. దీన్ని సవాలు చేస్తూ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసారు. కానీ ఫలితమేమీ రాలేదు. ఐదేళ్ళ తర్వాత కూడా ప్రత్యేక కోర్టు ఇంకా జమ్ములోనే వుండిపోయింది.

జమ్ము-కాశ్మీరు కు వర్తించేలా 1983 లో ఒక క్రిమినల్‌లా సవరణ చట్టాన్ని చేసారు. దీని కింద ఏ సంస్థలనైనా, రాజకీయ పార్టీలనైనా చట్టవిరుద్ధమైనవని ప్రకటించవచ్చు. నిషేధపుటుత్తర్వు సవ్యాపసవ్యాలను నిర్ణయించడాన్కి ఒక ట్రిబ్యునల్‌ను నెలకొల్పుతారు ఈ చట్టం క్రింద. నిషేధం సక్రమ మేనా కాదా అని ట్రిబ్యునల్ ఇచ్చే తీర్పే తుది తీర్పు. ట్రిబ్యునల్ ను అవశ్యనియమంగా పెట్టిన ఈ చట్టాన్ని జగ్ మోహన్ సవరించాడు. ఇక నుంచీ కార్య నిర్వాహక వర్గం అంటే ప్రభుత్వం ఇచ్చే నిర్ణయమే తుది నిర్ణయం. దాంతో లోయలో రాజకీయంగా సంబంధమున్న అన్ని సంస్థలనూ, పార్టీలనూ జగ్‌మోహన్ నిషేధించి పారేసాడు. లోయలో చట్ట బద్ధ రాజకీయ సంస్థలు ఏవంటే ప్రభావం అతి కొద్దిగా వుండేవి మాత్రమే.

సైనిక బలగాలకూ, పోలీసులకూ పౌరుల్ని చంపే అసాధారణాధికారాలను ఇచ్చే రెండు చట్టాలను 1990 జులై 5న జమ్ము-కాశ్మీర్ లో అమల్లోకి తెచ్చారు. ఒకటి సాయుధ బలగాల (జమ్ము-కాశ్మీర్) ప్రత్యేకాధికారాల చట్టం. (ఇది జులై 5న ఆర్డినెన్సుగా వచ్చి సెప్టెంబర్‌లో చట్టమైంది) రెండోదేమో జమ్ము-కాశ్మీర్ కల్లోలిత ప్రాంతాల చట్టం. ఈ రెండు చట్టాలూ ఒకే రకం అధికారాలను ఇస్తాయి. మొదటి చట్టం సైనిక బలగాలకూ - రెండోది పోలీసులకూ. సోదా, జప్తు, అరెస్టు, బలప్రయోగంలకు చెందినవీ అధికారాలు.

ఏ వ్యక్తి అయినా ఆయుధాన్ని కలిగివున్నా లేదా ఆయుధంగా వుపయోగించి గలిగే ఏ వస్తువును కలిగి వున్నా, లేదా ఐదుగురు లేదా అంతకు మించి సమావేశం కాకూడదని ఇచ్చిన ఉత్తర్వును ఉల్లంఘించినా అలాంటి వ్యక్తిని చంపేంతవరకు బల ప్రయోగం చేయవచ్చని సైనిక బలగాల చట్టం అధికారం ఇస్తోంది. ఈ అధికారాలకు తోడు ప్రజా శాంతికి భంగం కలిగించే ఏ చర్యకు పాల్పడ్డా కాల్పులు జరపడానికి కల్లోలిత ప్రాంతాల చట్టం అధికార మిస్తుంది.

అలాంటి చట్టాలను దాదాపు అవే నియమాలతో , అదే పేర్లతో ఇండియాలోని ఇతర ప్రాంతాల్లో కూడా అమలు చేస్తున్నారు. ఇవి జీవించే హక్కును ఉల్లంఘిస్తాయి. ఎందుకంటే సైనిక బలగాలకూ, పోలీసులకూ కాల్పులు జరిపి చంపేసే అధికారాన్ని అదేదో మామూలు వ్యవహారం అన్నట్లుగా అంటబెట్టకూడదు. పైగా వాళ్ళు ' ఈ చట్టం క్రింద ఇచ్చిన అధికారాలను అమలు పరుస్తున్నప్పుడు లేదా అమలు పరుస్తున్నానని అనుకున్నప్పుడు' వాళ్ళకు ప్రాసిక్యూషన్‌నుంచీ మినహాయింపు వుంది. వాళ్ళను ప్రాసిక్యూట్ చెయ్యాలంటే వాళ్ళను నియమించిన ప్రభుత్వన్నుంచి అనుమతి తీసుకోవల్సి వుంటుంది.

కాశ్మీరు ప్రత్యేకత (మొత్తం జమ్ము-కాశ్మీరు కాకున్నప్పటికీ) ఒక్కటి ఏమంటే స్థానిక పోలీసులను సైన్యంగానీ, కేంద్ర ప్రభుత్వం కానీ నమ్మదు. 'కాశ్మీరులోని ప్రతి ఒక్కరూ మిలిటెంటే' అని జగ్‌మోహన్ చెప్పే మాటలు వాస్తవంగా అభిప్రాయమే. (కాశ్మీరు లోని ప్రతి ఒక్కరూ ఎందుకు మిలిటెంటుగా మారారు అని ఇది ప్రభుత్వాన్ని ఆలోచింప జేయవలసింది. అలాగే అలాంటి మిలిటెన్సీని కేవలం పాకిస్తాన్ ప్రేరేపితం అని అనడంలో అర్థంవుందా అని ఆలోచింప చేయవలసింది. కానీ అధికారగణం ఆ విషయాన్ని ఎప్పుడూ ఆలోచించలేదు). అందుకే సైన్యం తన స్వంత ఇంటరాగేషన్ ఉపయోగిస్తుంది. ప్రతి సైనిక క్యాంపూ, ప్రతి పారామిలిటరీ క్యాంపు ఒక ఇంటరాగేషన్ సెంటరే. వీటికి తోడు సైన్యమూ, బి ఎస్ ఎఫ్, సి ఆర్ పి ఎఫ్ అనేక స్కూళ్ళనూ, హాస్టళ్ళనూ, సినిమా హాళ్ళనూ స్వాధీనం చేసుకున్నాయి. వాటిని కూడా ఇంటరాగేషన్ సెంటర్లుగా వాడుతున్నారు. ' కాశ్మీర్ వార్ - ప్రాక్సీ వార్' (కాశ్మీర్ యుద్ధం - పరోక్ష యుద్ధం) శీర్షకతో **1993** అక్టోబర్‌లో కమిటీ ఫర్ ఇనిషియేటివ్ ఆన్ కాశ్మీర్ సంస ప్రచురించిన రిపోర్టులో కాశ్మీరు లోయలోని ఆరు జిల్లాల్లో ఉన్న **54** సైనిక, పారామిలిటరీ క్యాంపుల జాబితా ఇచ్చింది. వాటిలో కొన్నటిని ఉమ్మడి ఇంటారాగేషన్ సెంటర్లు అని పిలుస్తారు. అంటే అన్ని రకాల సాయుధ బలగాలూ వాటిని వాడుకుంటాయన్న మాట'. లోయలోని అన్ని సినిమా హాళ్లూ, సైనిక బలగాల ఆధీనంలో గల పలు స్కూళ్ళు, టూరిస్టు కేంద్రాలూ, డాక్ బంగ్లాలు, విశ్రాంతి గృహాలూ - వాటిని ఇంటరాగేషన్ సెంటర్లుగా ఉపయోగిస్తున్నారని రిపోర్టు పేర్కొంది. లోయలో వున్న పోలీసు స్టేషన్లలు కూడా సైనిక బలగాలకు ఇంటరాగేషన్ సెంటర్లూగా వాడుకోవడానికి లభ్యమవుతాయి. ఎయితే పోలీసు స్టేషన్లనూ సైన్యం ఎక్కువగా వాడుకున్నట్లు కనిపించదు- ఎందుకంటే పోలీసులకు, సైన్యానికీ మధ్య సంబంధాలు అంత బాగాలేవు. సత్యమేమంటే సాయుధ బలగాలు జరిపే ప్రతి సోదాలోనూ స్థానికంగా దొరికే ఇల్లో, స్కూలో, దుకాణమో తత్కాలిక ఇంటరాగేషన్ సెంటర్ గా తయారయిపోతుంది. ఇంతకీ ఇంటరాగేషన్ అంటే

ఏమనుకుంటున్నారు? అక్కడ ప్రశ్నించడం అంటూ వుండదు. కావల్సిన సమాచారం చెప్పేంతవరకూ చిత్రహింసలు పెట్టడమే. సమాచారం తొక్కి పట్టి సైనికులకు సహాకరించలేదా - చంపేస్తారు. కావల్సిన సమాచారం ఇచ్చావా - అప్పుడు వదిలేస్తారు అనుకుంటే పొరపాటు. అప్పూడూ మరణమే తధ్యం.

అలాంటి ఇంటరాగేషన్ సెంటర్ల ఉనికిని అనుమతించే చట్టమేమీ లేదు. జమ్ము-కాశ్మీరులో సైన్యాన్ని దింపింది అక్కడి పాలనాధికారులకు సహాయం అందించడానికే అని చట్టం చెప్తుంది కాబట్టి సైనిక బలగాల (జమ్ము-కాశ్మీరు) ప్రత్యేకాధికారాల చట్టంలోని సెక్షన్ 6 ఏమంటుందంటే సైనిక బలగాలు ఏ వ్యక్తినైనా కస్టడీలోకి తీసుకున్నా, ఏ ఆస్తినైనా జప్తు చేసుకున్నా సదరు వ్యక్తినీ, లేదా ఆస్తినీ వెంటనే స్థానిక పోలీసు స్టేషన్‌కు అప్ప జెప్పాలని. కానీ సైనిక బలగాలు ఈ పని ఎప్పుడూ చెయ్యలేదు. సైనికులు ప్రజల్ని నిర్బంధిస్తారు కొన్నిసార్లు నెలల తరబడి - తమ చట్ట విరుద్ధమైన డిటెన్షన్ సెంటర్లలో. ఎక్కువ కేసుల్లో శవాన్ని మాత్రమే స్థానిక పోలీసులకు అప్పజెప్పుతారు.

ఏ ఇంటినైనా మిలిటెంట్లు వాడుకుంటున్నారనే అనుమానం ఉంటే సైనికులకు ఆ ఇంటిని ధ్వంసం చేసే అధికారం కూడా ఈ సైనిక బలగాల చట్టం ఇస్తోంది. ఈ చట్టం ఇచ్చే అధికారమే సైన్యం విచ్చలవిడిగా దహనకాండకు పాల్పడ్డానికి సాకుగా వుపయోగపడుతోంది. ఈ దహన కాండల వివరాలు ఇప్పటికే ఇచ్చివున్నాం.

### మానవ హక్కుల కార్యకర్తలపై దాడులు

> *'కాశ్మీర్ లాంటి కల్లోల భూమిలో మానవ హక్కుల ఉల్లంఘనలను డాక్యుమెంట్ చేయడం అసాధ్యంకాక పోవచ్చుగానీ అంత తేలిక కూడా కాదు.'*
>
> *.....కాశ్మీర్ మానిటర్*

జమ్ము-కాశ్మీరులో వున్న పరిస్థితుల్లో మానవ హక్కుల ఉల్లంఘనలను డాక్యుమెంట్ చేయడం ఏమాత్రం సులభం కాదు. ఉల్లంఘనలు అనేకం. చాలా చాలా తరచూ జరుగుతుంటాయి. ప్రయాణ స్వేచ్ఛ మీద పరిమితులు ఉన్నాయి. తిరగాలంటే భౌగోళిక ప్రాంతం చాలా కష్టంగా వుంటుంది. రాడకీయ వాతావరణం కూడా అంత సున్నితంగా ఏమీ ఉండదు. సైనిక బలగాల ప్రతీకార చర్యలు నిరంతరం నెత్తిమీద వేలాడుతుంటుంది.

అయినప్పటికీ పలువురు సాహసులైన వ్యక్తులూ, కొన్ని గ్రూపులూ దాదాపు అసాధ్యమయ్యే పనిని చేస్తూనే వున్నారు. జర్నలిస్టులు, లాయర్లు, డాక్టర్లకు తమ తమ వృత్తి నిర్వహణ క్రమంలోనే మానవ హక్కుల ఉల్లంఘన సంఘటనలను గమనించి తమ వృత్తులను మానవహక్కుల పనికి కూడా విస్తరిస్తున్నారు. వాళ్ళు చాలా విస్తృతమైన కృషి చేసారు. అయితే అసంపూర్తిగానే చేసారు. సైనిక బలగాలు చేసిన అత్యాచారాల ఘటనలను, వాటి ప్రభావాలనూ డాక్యుమెంట్ చేశారు.

మాజీ హైకోర్టు న్యాయమూర్తి మియా జలాలుద్దీన్ నాయకత్వాన వున్న జమ్ము-కాశ్మీర్ మానవహక్కుల, పౌరస్వేచ్ఛల వేదిక, మరో మాజీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ముఫ్తీ బహావుద్దీన్ ఫారూఖీ నాయకత్వాన వున్న జమ్ము- కాశ్మీరు ప్రజల ప్రాథమిక హక్కుల (పరిరక్షణ) కమిటీ, ఇన్స్టిట్యూట్ ఆఫ్ కాశ్మీరీ స్టడీస్ సంస్థకు చెందిన మానవ హక్కుల విభాగం, హైకోర్టు లాయరు పర్వేజ్ ఇమ్ రోజ్ ప్రాతినధ్యం వహించే కాశ్మీర్ మానిటర్ సంస్థలతో మాకు పరిచయాలేర్పడ్డాయి. మే వాళ్ల సహాయం తీసుకున్నాం.

లోయలోని మానవ హక్కుల కాల్యకర్తలందరూ భయాన్నీ, అనిశ్చిత భావననూ వ్యక్తపరిచారు. మానవహక్కుల కృషిలో పాల్గొన్నందుకు లోయలో కనీసం ముగ్గుర్ని చంపేసారు. ఒకాయన హృదయ్‌నాథ్ వాంచూ (65), జమ్ము-కాశ్మీర్ లో జరిగిన కస్టడీ మరణాల మీద, అదృశ్యం కేసుల మీద బాగా కృషి చేసాడు. ఈ ఘటనలు మీద ఆయన శ్రీనగర్ హైకోర్టులో పలు రిట్ పిటిషన్ల ను దాఖలు చేసాడు. ఆయనో రిటైరైన ప్రభుత్వోగి. చురుకైన ట్రేడ్ యూనియనిస్టు. మానవ హక్కుల విషయంలో ఆయన చూపించిన చొరవను సైనిక బలగాలు రెండు రకాలుగా 'తలనొప్పి'గా భావించాయి. ఒకటి మామూలుదే. అత్యాచారాలు వెలుగుచూడడం సైనిక బలగాలకు ఇష్టం ఉండదు. మరోటి - వాంచూ కాశ్మీరీ పండితుడై వుండికూడా పండిట్‌లు చాలామంది కాశ్మీరును వదలి పోయినా ఇంకా ఆయన కాశ్మీరులోనే వుండిపోయాడు. ఆలావుండి పోవడమే కాదు మానవ హక్కుల కోసం చురుగ్గా ప్రచారం చేస్తున్నాడు. అలా ప్రచారం చేస్తూ కాశ్మీరు సమస్య ముస్లిం ఛాందసవాద సమస్య అని ప్రభుత్వం చేస్తున్న ప్రచారం అబద్ధమని తెలియజెప్తున్నాడు.

1992 డిసెంబర్ 5న శ్రీనగర్ సిటీలో ఆటో రిక్షాలో వెళుతున్నాడు వాంచూ. ఆయన ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు ఆపారు. ఆటోలోంచి ఆయన్ని బయటికి లాగారు. ఆయన్ని కాల్చి చంపారు. మిలిటెంట్లే చంపారని చెప్పడానికి ప్రభుత్వం ప్రయత్నించింది. కానీ హజ్బుల్ ముజాహిదీన్, జె.కె.ఎల్.ఎఫ్ రెండూ ఈ హత్యను ఖండించడమేగాక నిరసనగా లోయబంద్‌కు పిలుపునిచ్చాయి. వాంచూ హత్యవెనుక బి.ఎస్.ఎఫ్ హస్తముందని నమ్మడానికి ఆధారాలున్నాయి.

హత్యకు గురైన రెండో వ్యక్తి డాక్టర్ ఫారూఖీ అహ్మద్ అషాయ్. శ్రీనగర్‌లోని బర్‌జుల్లా ఎముకల, కీళ్ల ఆసుపత్రిలో ఈయన ఆర్థోపెడిక్ సర్జను. శ్రీనగర్ మెడికల్ కాలేజీ ఆర్థోపెడిక్ విభాగానికి అధిపతి. ఈ ఆసుపత్రీ, ఇందులో పనిచేసే డాక్టర్లూ చిత్రహింసలకు గురైన వేలాది బాధితులకు చికిత్స చేసారు. చిత్రహింసల స్వభావాన్ని డాక్యుమెంట్ చేసారు. వారు చేసిన కృషి కాశ్మీరు లోయలో కస్టడీ హింసల డాక్యుమెంటేషన్‌కు గణనీయంగా దోహదం చేసింది. డాక్టర్ అషాయ్ ఈ కృషిలో చలా ఉత్సాహంగా, చరుగ్గా పాల్గొన్నాడు. 1993 ఫిబ్రవరి 18 సాయంత్రం చీకటి పడుతుండగా డాక్టర్ అషాయ్‌ని ఒక సి ఆర్ పి ఎఫ్ పికెట్ కాల్చి చంపింది. అప్పుడాయన తన భార్య డాక్టర్ ఫరీదా, కుమార్తె డాక్టర్ రెహానాలతో కలిసి కారులో వెళుతున్నాడు. దాదాపు 7 గంటల 20 నిమిషాల సమయంలో కారు రాంబాగ్ వంతెన దాటి బార్‌జుల్లా పోవడానికి కుడివైపుకు తిరిగింది. వంతెనకు ఇరువైపులా రెండు సి ఆర్ పి ఎఫ్

బంకర్లున్నాయి. మూడో బంకర్ సి ఆర్ పి ఎఫ్ హెడ్ క్వార్టర్స్ దగ్గర వుంది. కారు ఆ వైపే పోబోయింది. ఏ బంకర్లనైతే కారు దాటిందో ఆ బంకర్ల నుంచీ సి ఆర్ పి ఎఫ్ జవాన్లు అకస్మాత్తుగా కారు మీదికి కాల్పులు జరిపారు. డాక్టర్ అషాయ్‌కు తూటాల దెబ్బలు తగిలాయి. ఆయన్ని వెంటనే అతని భార్య కుమార్తెలు కీళ్ళ ఆసుపత్రికి తీసుకుపోయారు. అక్కడ ఎనిమిదిన్నిరకు ఆయన చనిపోయారు.

హత్యకు గురైన మూడో వ్యక్తి డాక్టర్ అబ్దుల్ అహాద్‌గురు. శ్రీనగర్‌లో గల సౌరాలోని వైద్య విజ్ఞాన సంస్థలో గుండె జబ్బుల సర్జను. ఈయన హత్య వివాదాస్పదమయినది. 1993 మార్చి 31న ఆయన కారులో ప్రయాణిస్తుండగా తుపాకులు ధరించిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆయన్ని కిడ్నాప్ చేసారు. మర్నాడు అంటే 1994 ఏప్రిల్ ఒకటిన ఆయన పనిచేస్తున్న ఆసుపత్రి సమీపంలో ఆయన మృతదేహం పడివుంది. డాక్టర్ గురు కూడా చురుకైన మానవ హక్కుల ప్రచారకుడు. మానవ హక్కుల ఉల్లంఘనల గురించి ఆయన సమాచారం ఇస్తుండేవాడు. తీవ్రమైన అశక్తతకు దారితీసే చిత్రహింసల గురించి ముఖ్యంగా సమాచారం ఇస్తుండేవాడు. 1990లో ఈయన్ని నాలుగు నెలల పాటు పి ఎస్ ఏ కింద నిర్బంధించారు. డాక్టరు గురును ఎవరు చంపారు అనేది ఇంకా సందేహాస్పదమే. కాశ్మీరుకు స్వాతంత్ర్యం కావాలని ఎలుగెత్తి చాటిన వాళ్ళలో ఈయన కూడా ఒకడు కావడంతో ఆయన్ని పాకిస్తాన్ అనుకూల మిలిటెంట్లు చంపి ఉండే అవకాశముంది. అయితే భారత సైనిక బలగాలే ఆయన్ని చంపేసాయని కాశ్మీర్‌లో చాలామంది అనుకుంటున్నారు.

జమ్ము-కాశ్మీర్‌లో పారదర్శక విధానాన్ని అనుసరిస్తున్నట్లుగా ఇటీవలి కాలంలో భారత ప్రభత్వం చెబుతూ వస్తోంది. ఇది అతి శయోక్తి. ఎందుకంటే కొందరు పాశ్చాత్య దౌత్యవేత్తలనూ, అదికార ప్రతినిధులనూ ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల హై కమీషనర్‌నూ కాశ్మీరును సందర్శించడానికి అనుమతించినా, ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్, మానవ హక్కుల కమీషన్ ప్రత్యేక పరిశీలకులు కాశ్మీరునూ సందర్శిస్తామని ఎప్పటినుంచో కోరుతున్నప్పటికీ, అధికార హోదాలో కాశ్మీరును సందర్శించి అక్కడా మానవ హక్కుల స్థితిని సమీక్షించడానికి భారత ప్రభుత్వం ఇంతవరకూ వారిని అనుమతించలేదు. ఇంకా ముఖ్యమైన దేమంటే స్థానిక మానవ హక్కుల కార్యకర్తలను అనేక రూపాల్లో వేధింపులకు గురచేసారు. కాశ్మీరు అధ్యయనాల సంస్థ, జమ్ము-కాశ్మీరు ప్రజల పాధమిక హక్కుల (పరిరక్షణ) కార్యాలయాలనూ, అక్కడి వస్తువులనూ జప్తు చేసారని ఏ.జి. నూరానీ 1995 జూన్ 2 'ఫ్రంట్‌లైన్' సంచికలో రాసాడు.

హైకోర్టు న్యాయవాది మొహమ్మద్ అష్రాఫ్ బారాముల్లా బార్ అసోషియేషన్ అధ్యక్షుడు షేక్ మహ్మత్ అష్రాఫ్‌లను మరింత తీవ్రంగా వేధించారు. మొహమ్మద్ అష్రాఫ్ మొదట పోలీసు ప్రాసిక్యూటింగ్ ఆఫీసరు (పి పి ఓ) గా వుండేవాడు. రియాజ్ అహ్మద్ అనే కానిస్టేబుల్ ను సైన్యం చంపి వేసినందుకు నిరసనగా జరిగిన పోలీసుల ఆందోళనకు ఆయన నాయకత్వం వహించడంతో ఆయన్ని ఉద్యోగం నుంచీ డిస్మిస్ చేసారు. 1993 ఏప్రిల్ 21న రియాజ్ అహ్మద్‌ను సైన్యం అరెస్టు చేసి చిత్ర హింసలకు గురిచేసి అదే రోజు చంపేసింది. మిలిటెంట్లకు సహకరిస్తున్నాడని ఆయన మీద సైన్యానికి అనుమానం. అప్పుడు పోలీసులు పెద్ద ఎత్తున ఆందోళన చేసారు. మొహమ్మద్

అష్రాఫ్ పోలీసు సంఘానికి అధ్యక్షుడు కావడంతో ఆయన్ని ఉద్యోగం నుంచీ తొలగించారు. అప్పుడాయన హైకోర్టులో ప్రాక్టీసు మొదలెట్టాడు. హైకోర్టు బార్ అసోసియేషన్ తరపున మానవ హక్కుల ఉల్లంఘనలను డాక్యుమెంట్ చేస్తున్నాడు. ఈ సంవత్సరం ఐక్యరాజ్యసమితి మానవహక్కుల హై కమీషనర్ జోస్ అయాలో లాస్సో సందర్శన సందర్భంగా ఆయన్ని కలవడానికి సన్నాహాలు చేసుకుంటున్నాడు. అందువల్ల 1995 మే ఒకటిన ఆయన్ని సైన్యం అరస్టు చేసింది. నెల రోజుల పాటు ఆయన్ని వివిధ ఇంటరాగేషన్ సెంటర్లలో నిర్బంధించి, చిత్రహింసలకు గురి చేసిన తర్వాత పి ఎస్ ఏ క్రింద జైల్లో వేసారు. లోగడ పోలీసు ఆందళనలో ఆయన పాల్గొనడాన్ని కూడా డిటెన్షన్‌కు ఒక కారణంగా చూపారు.

బారాముల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ అష్రాఫ్ కూడా తన అసోసియేషన్ తరపున మానవ హక్కుల ఉల్లంఘనను డాక్యుమెంట్ చేస్తున్నాడు. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల హై కమీషనర్ బారాముల్లాను సందర్శించినప్పుడు తన బార్ అసోసియేషన్ తరపున ఒక ప్రతినిధి వర్గాన్ని ఆయన వద్దకు తీసుకపోయి సైన్యం చేసే చిత్రహింసలనూ, కస్టడీలో చంపేసే పద్ధతులనూ వివరించాడు. తర్వాత సైన్యం జులై 15 అర్ధరాత్రి బారాముల్లాలో నర్సింగ్ బాగ్‌లో ఆయన ఇంటిపై దాడి చేసి - ఇంట్లో వాళ్ళందర్నీ బయటికి పంపించేసి ఇల్లు సోదా చేసి స్నానాల గదిలో ఒక తుపాకీ దొరికిందని ప్రకటించారు. అష్రాఫ్‌కు ఖచ్చితమైన 'రాజకీయ భావాలున్నాయి' అని అందరూ అన్నప్పటికీ, ఆయన రాజకీయాభి ప్రాయాలను అంగీకరించని వాళ్ళు సైతం ఆయన ఆయుధాలు కలిగి వున్నాడని నమ్మరు. ఆయన అప్పటినుంచీ సైన్యపు ఇంటరాగేషన్ సెంటర్లోనో ఇప్పటివరకూ ఉన్నాడు. జోస్ అయాలా లోస్సో ముందు హాజరయ్యినందుకు తమ అధ్యక్షుణ్ణి అరెస్టు చేశారని ఆర్మీ చిత్రహింసల, అత్యాచారాల ఘటనలను వివరిస్తూ జిల్లా బార్ అసోసియేషన్ లాస్సోకు లేఖ రాసింది.

ఇదంతా చెప్పిన తర్వాత మిలిటెంట్లు కూడా తమ పద్ధతులను విమర్శిస్తే ఏ మాత్రమూ సహించరని చెప్పక తప్పదు. తర్వాతి అధ్యాయంలో పత్రికల పాత్ర గురించి చెప్పేటప్పుడు, విమర్శను అణచి వేయడానికి మిలిటెంట్లు తరచూ భీతావహ పద్ధతులకు పాల్పడినట్లు తెలుస్తుంది. మావన హక్కుల ఉల్లంఘనకు మిలిటెంట్లు ఎలా పాల్పడుతున్నారనే విషయాన్ని మావవహక్కుల సంఘాలు కాశ్మీర్ లో విమర్శించదలచుకున్నా. విమర్శించి క్షేమంగా ఉండగలుగుతామా అనేది సందేహాస్పదమే.

## అమర్‌నాథ్ యాత్ర నిర్వహణ

జమ్ము-కాశ్మీర్ లో సైనిక పాలన అంటే తుపాకీ పాలన కాదనీ, హిందూ జాతీయవాద పాలన అని మేం ఇంతకు ముందే పేర్కొన్నాం. విషయాల్ని అతిశయోక్తులతో చెప్పడం మా అభిమతం గాదు. కాశ్మీర్ సమస్య పట్ల సైన్యం అనుభూతులను గణనీయంగానే మతతత్వీకరించారనీ, అందువల్లనే దాని ప్రవర్తన అలా వుందనీ చెప్పక తప్పదు. జమ్ము-కాశ్మీర్ లో సైనిక బలగాల ప్రవర్తన ప్రత్యేకించి క్రూరంగా వుండడానికి దోహదం చేసిన కారణాల్లో ఇదొకటి అనేది నిస్సందేహం.

అమర్‌నాథ్ యాత్రికుల్ని హర్‌కత్-ఉల్-అన్సార్ బెదిరిస్తే యాత్రీకుల్ని రక్షించే కర్తవ్యాన్ని సైన్యం ఆ బెదిరిపులతో ఏ మాత్రం సంబంధంలేని కాశ్మీరీ ముస్లింలకు వ్యతిరేక ప్రచారం గా మార్చిన వైనాన్ని ఈ రిపోర్టు ప్రారంభంలోనే పేర్కొన్నాం. యాత్ర జరుగుతున్నప్పుడే మేం కాశ్మీరును సందర్శించడంతో సైన్యం చేసే పనిని అతి దగ్గరగా చూసే అవకాశం కల్గింది. అమర్‌నాథ్ యాత్రికుల్ని రక్షించడానికి విస్తృత సైనిక ఏర్పాట్లు చేస్తున్నారుగానీ, గత ఐదేళ్ళుగా ముహర్రం, మిలాద్-ఉన్-నబీ పర్వదినాల్లో సంప్రదాయకంగా తీసే ఊరేగింపుల్ని సైతం ప్రభుత్వం అనుమతించడం లేదని చాలామంది కాశ్మీరీలు మాకు ఫిర్యాదు చేసారు. అయినా ప్రతీకార చర్యగా యాత్రను నిషేధించడాన్ని ఎవ్వరూ సమర్ధించలేరు అయినప్పటికీ యాత్రీకులూ, సైన్యము యాత్రను కాశ్మీరీ ముస్లింలే నిషేధించారనేలా ప్రవర్తించారు.

యాత్రీకుల బృందం జవహార్ సొరంగాన్ని దాటి లోయలోకి ప్రవేశించగానే యాత్రీకులు, ట్రక్కుల్లోనూ, రోడ్ల పక్క బంకర్లలోనూ వుండే సైనికులు విజయం సాధించినట్లుగా పరస్పర అభివాదం చేసుకున్నారు. యాత్రీకులైతే 'భారత్ మాతాకు జై' అని నినాదాలిచ్చారు. యాత్రీకులు ప్రయాణించిన పలు వాహనాలకు మువ్వన్నెల జెండాను కట్టారు. మతపరమైన యాత్రలో ఇది మామూలుగా జరగదు. యాత్రీకులు అనంతనాగ్ జిల్లాలోని గ్రామాలను దాటి పహల్ గామ్‌కు పోయేదారిలో స్థానిక ప్రజలకు తాము విజయాన్ని సాధించినట్టుగా విజయ చిహ్నాలు చూపించే వారనీ, "భారతదేశంలో వుండాలంటే రాముడి పేరు కీర్తించాలి' ('భారత్‌మే రహనా హైతో రామ్ కానామ్ కహనా హై') అని నినాదాలిచ్చారనీ అనంతనాగ్‌లో మాకు అక్కడి స్థానికు లు చెప్పారు. ప్రతీ అంగుళం మేరా వాళ్ళకు రక్షణ గా నిలబడ్డ సైన్యం వాళ్ళు అలా ప్రవర్తిస్తుంటే వాళ్ళను అలా ప్రవర్తించకుండా నిరోధించడానికి ఏమీ ప్రయత్నం చేయలేదు. ఈ రకమైన ప్రవర్తన వల్ల తాము చెప్పడానికి ప్రయత్నిస్తున్న విషయాన్ని భారతీయులు వినడానికి సిద్ధంగాలేరు అన్న కాశ్మీరీల నమ్మకం ఇంకా బలీయం కావడం మాత్రమే జరుగుతుంది.

నిజమే అమర్‌నాథ్ యాత్రలో చాలా మంది భక్తులున్నారు. వాళ్ళ యాత్ర ఉద్దేశం కూడా శుద్ధ మతపరమైందే. కానీ యాత్రనొక రాజకీయ ఘటనగా భావించిన యువకులు యాత్రికులలో చాలామందే వున్నారనేది స్పష్టం. కాశ్మీరీ ముస్లీములకు వ్యతిరేకంగా యాత్రను ఉపయోగించు కోవడానికే వాళ్ళు వచ్చినట్లు కనబడ్డారు. జాతీయ జెండాలను వాహనాలకు కట్టుకోవడం, భాతరమాతను పొగుడుతూ నినాదాలివ్వడం ఇందులో భాగమే. శివుణ్ణి స్మరస్తూ 'హర హర మహాదేవ్' అని ఇచ్చే నినాదాలు ఏదో భక్తి పారవశ్యంలో ఇచ్చినట్లుకాక యుద్ధారావంలా వినవచ్చాయి. ప్రత్యేకించి కాశ్మీరీ ముస్లిముల గ్రామాలగుండా సైన్యం రక్షణలో పోతున్న బస్సుల్లోంచే బిగిపిడికెళ్ళెత్తి మరీ ఈ నినాదాలిచ్చారు. మత సహనస్ఫూర్తి గురించే గర్వించే కాశ్మీరీలను ఈ ప్రవర్తన అవమానించేదిలా కన్పిస్తుందని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.

అమర్‌నాథ్ యాత్రీకులు మైటారు వాహనాల మీద పోగలిగే చిట్ట చివరి పాయింటు పహల్ గామ్. ఇక్కడి జనాభా ఎక్కువగా ముస్లిములు. అందువల్ల ఆ ఊరిలో సైన్యం ముస్లిముల ఇళ్ళను నిత్యం సోదాలు చేసింది. ఊరంతా సైనికులతో

నిండిపోయింది. చాలా కుటుంబాలు ఇళ్ళను ఖాళీ చేసి ఊరొదిలి వెళ్ళిపోయాయి. రోజూ జరిగే సోదాలను చూసి భయపడి పారిపోయారు. ఎందుకంటే సోదాలు తరుచూ కుటుంబంలోని యువకుల్ని చంపడంతో ముగుస్తాయని వాళ్లకు తెలుసు. పైగా మిలిటెంట్లు యాత్రికులపై దాడి చేస్తే (అతర్వాత అదే జరిగింది) సైనిక బలగాలు ప్రతీకారంగా పహల్‌గామ్ నివాసులపై దాడి చేస్తారని కూడా వాళ్ళు భయపడి పారి పోయారు. సీ ఆర్ పి ఎఫ్ సైన్యం సరిహద్దు భద్రతా దళాలూ ఇలాంటి ప్రతీకార దాడులెన్నో చేసి హత్యాకాండకు పాల్పడిన విషయం తెలిసిందే.

# మిలిటెన్సీ - ప్రజలు

*"కాశ్మీరీ ప్రజలు తీవ్రమైన మానసిక ఆందోళనకు లోనయి ఉన్నారు. మానసికంగా ఒత్తిడీ, భయం, ఆందోళనే..... మానసిక ఒత్తిడి శారీరక ఆరోగ్యాన్ని సైతం దెబ్బతీసింది"*

*.......అహసన్-ఉల్-హక్*

*శ్రీనగర్‌లో **1994** జూన్ **18** న జరిగిన సెమినార్ లో చదివిన పత్రంలో*

ప్రజలు 'సైనిక బలగానికీ, మిలిటెంట్లకీ మధ్య నలిగిపోతున్నారు' అని చెప్పడం ఒక ఆనవాయితీ, కాశ్మీరీ ప్రజలు బహుశా ఈ వర్ణను ఆమోదించక పోవచ్చు. ఎందుకంటే మిలిటెంట్లపై వాళ్ళకు విమర్శ వున్నప్పటికీ వాళ్ళను ఆజాదీ లక్ష్యం కోసం పోరాడే వాళ్ళుగా చూస్తారు. ఆజాదీ అనే మాటే ప్రతి కాశ్మీరీ ఒంటినీ పులకింపచేస్తుంది. భారత సైనిక బలగాలను తమను అణచి వేస్తున్న శత్రువులుగా పరిగణిస్తారు.

అయితే మిలిటెంట్ల చర్యలూ, సైనికుల చర్యలూ పరస్పరం ఒకరకంగా దోహదం చేసుకుంటాయి. ప్రజల సాధారణ అనుభూతులైన సాంఘిక, సాంస్కృతిక జీవితాన్నీ వాళ్ళ సాధారణ స్వేచ్ఛలనూ హరించే సందర్భాలుకూడా లేక పోలేదు. ఉదాహారణకు అనేక చోట్ల పాఠశాల భవనాలను సైన్యము, పారామిలిటరీ బలగాలూ స్వాధీనం చేసుకుని క్యాంపులుగా మార్చాయి. అందుకే మిలిటెంట్లు వాటిపై దాడిచేసి వాటిని ధ్వంసం చేస్తున్నారు. లేదా పాఠశాల భవనాలను మిలిటెంట్ల రహస్య స్థలాలుగా వాడుకుంటుంటే సైన్యం వాటికి నిప్పు పెడుతోంది. మిలిటెంట్ల చర్యలూ సైన్యం చర్యలూ లోయలో పాఠశాల వ్యవస్థను ధ్వంసం చేస్తున్నాయి. 1995 మార్చి 22న కాశ్మీర్ టైమ్స్ పత్రిక ప్రచురించిన ఒక రిపోర్టులో గత ఐదేళ్ళలో 300 పాఠశాల భవనాలు ధ్వంసంమైపోయాయని రాసింది. వాటిలో 106 ప్రాథమిక పాఠశాలలు, 65 మాధ్యమిక పాఠశాలలు, 72 ఉన్నత పాఠశాలలు, 27 హైయర్ సెకండరీ పాఠశాలలు వున్నాయి.

లోయలో సినిమా హాళ్ళు లేకుండాపోయాయి. ఇస్లామిక్ ఛాందసవాదాన్ని ఆవాహన చేసుకున్న మిలిటెంట్లు వాటిని నిషేధించారు. తగల బెట్టేశారు. లేదా పేల్చివేసారు. మిగిలివున్న వాటిని సైన్యం స్వాధీనం చేసుకుని ఇంటరాగేషన్ సెంటర్లుగా మార్చింది.

కాశ్మీరు ఒకప్పుడు గ్రామీణ నాటకాలకు ప్రసిద్ధి. వీటికి జమాతే ఇస్లామీ దగ్గర శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, ఇతర గ్రామీణ మేధావులూ అసమ్మతి తెలిపారు. అయితే కళారూపాలను పూర్తిగా ధ్వంసం చేయలేదు. అయినా గత ఐదేళ్ళలో అలాంటి అన్ని రకాల సాంస్కృతిక ప్రదర్శనలూ కనబడకుండా పోయాయి. నాటక రంగం మరుగున పడిపోయింది. నిజంగా కర్ఫ్యూ ప్రకటించినా లేకున్నా భద్రతాదళాలూ, మిలిటెంట్లు ఇద్దరూ చీకటిపడిన తర్వాత ఎలాంటి ఆటంకమూలేని యుద్ధరంగమే కావాలనీ కోరుకుంటున్నారు. ఎవరైనా ధైర్యం చేసి ఇంట్లోంచీ కాలు తీసి బయటపెట్టారా ఎక్కడినుంచో వచ్చి పడే తూటాకో, గ్రెనేడ్‌కో, ప్రతీకార కాల్పులకో బలికావలిసిందే.

ప్రజల సాంఘిక, సాంస్కృతిక జీవనంపై దాని ప్రభావం ఎలా వుంటుందనేది ఊహించుకోవాల్సిందే.

పత్రికలు మరో సాంఘిక వ్యవస్థ. పత్రికా రంగాన్ని ఇటు సైన్యము, అటు మిలిటెంట్లు బెదిరింపులకు గురిచేస్తున్నారు. 1990 తొలి రోజుల్లో గవర్నర్ జగ్‌మోహన్ పత్రికల నోరునొక్కడానికీ, పూర్తిగా సెన్సార్ చేయడానికి ప్రయత్నించాడు. లోయనుంచీ ఏ వార్త బయటికి పోవాలి అనేది ఆయనే నిర్ణయిస్తాడు. 1990 జనవరి 26 న విదేశీ పాత్రికేయులందర్నీ బలవంతంగా బయటికి వెళ్ళ గొట్టాడు. మూడు ఉర్దూ దినపత్రికలను అఫ్తాబ్, అజాన్, అల్-సఫా -- ఏప్రిల్ 16న మూసేయించాడు. దూరదర్శన్ కార్యక్రమాలల్లో ఆయన చేసుకున్న జోక్యం శ్రీనగర్ టీ.వీ. స్టేషన్ డైరెక్టరు లాసాకౌల్‌ను 1990 ఏప్రిల్ 13న జె.కె.ఎల్.ఎఫ్. చంపడానికి దారితీసింది. డైరెక్టరు మరణానికి జగ్‌మోహానే బాధ్యుడని ఆరోపిస్తూ టీ.వీ. స్టేషను ఉద్యోగులందరూ మూకుమ్మడిగా రాజీనామా చేసారు. బి.బి.సి. శ్రీనగర్ విలేఖరి యుసుఫ్ జమీల్ ను 1990 జూన్‌లో సైన్యం కిడ్నాప్ చేసింది. ఆ తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు ఆయన కార్యాలయంపై గ్రెనేడ్లు విసిరారు. (ఫిబ్రవరి 18 మార్చి 31, 1992) ఈ రిపోర్టు తయారీలో వుండగా ఆయన కార్యాలయంలో పార్శలు బాంబు పేలినట్లుగా వార్తలొచ్చాయి. ఆయనకీ, మరో ఇద్దరు సహచరులకూ గాయాలయినట్లు ఆ వార్తలు తెలిపాయి. 1991 ఏప్రిల్ 23 న ఆల్ - సఫా పత్రిక సంపాదకుడు మొహమ్మద్ షాబాన్ వకీల్ హత్యకు గురయ్యాడు. నువ్వంటే నువ్వని ప్రభుత్వము, మిలిటెంట్లూ పరస్పరం అరోపించుకున్నారు. ఆల్-సఫా, శ్రీనగర్ టైమ్స్, ఆఫ్ తాబ్ పత్రికలను వివిధ మిలిటెంటు గ్రూపులు తమ వార్తలు వేయలేదనో, ప్రభుత్వాన్నుంచో, ఇతర ప్రత్యర్థి మిలిటెంటు గ్రూపు నుంచో విమర్శిస్తూ వచ్చిన ప్రకటనలను ప్రచురించారనో బెదిరించాయి. కొన్నిటి విషయంలోనైతే ప్రచురణలనే మూసేయాల్సిన పరిస్థితి వచ్చింది.

ఈ సంవత్సరం (1995) మొత్తం శ్రీనగర్ పత్రికలన్నీ జులై 10నుంచీ ఆగస్టు 3 వరకూ మూత బడ్డాయి. సైనిక బలగాలు ఇఖ్వాన్-ఉల్-ముస్లమీన్ అనే మిలిటెంటు గ్రూపును పోషిస్తున్నాయని అందరూ నమ్ముతారు. దాని నాయకుడు కూకా పార్రే, పత్రికలు ఈ గ్రూపు వార్తలు ప్రచురించడం లేదని పత్రికలపై వీళ్ళకు కోపం వచ్చింది. ఈ గ్రూపుకు చెందిన మిలిటెంట్లు నలుగురు జర్నలిస్టులను అపహరించుకపోయారు. వాళ్ళు బషీర్ మన్సూర్, కాజీ మవుసర్, షఫత్ మట్టో (వీళ్ళంతా గ్రేటర్ కాశ్మీరుకు చెందిన వాళ్ళు), అబ్దుల్ రషీద్ (నిదాయె మశ్రిఖ్ కు చెంది వాడు) వాళ్ళను శ్రీనగర్ నడిబొడ్డునగల ప్రతాప్ పార్క్‌లో వున్న వాళ్ళ కార్యాలయాల నుంచీ అపహరించుకు పోయారు. శ్రీనగర్ లోనూ, అది దాటిన తర్వాతా ఎన్నో ఆర్మీ చెక్ పోస్టులున్నప్పటికీ ఒక్క చోట కూడా వ్యాను ఆగక పోవడం జర్నలిస్టులకు ఆశ్చర్యం కల్గించింది. తర్వాత ఆ గ్రూపు ఒక పత్రికా ప్రకటనను చేతిలో పెట్టి ఇద్దరు జర్నలిస్టులను తిరిగి వెనక్కి పంపేసారు. ప్రకటనను మొత్తం ప్రచురించాలనీ లేకుంటే తక్కిన ఇద్దర్నీ చంపేస్తామనీ బెదిరించారు. వాళ్ళన్నట్లే ప్రకటనను ప్రచురించగానే జర్నలిస్టులను వదిలి పెట్టారు. దీన్ని నిరసిస్తూ లోయనుంచీ ప్రచురితమయ్యే అన్ని పత్రికలనూ జులై 10 నుంచీ ఆగస్టు 3 వరకూ మూసేసారు.

కూకా పార్రే నాయకత్వాన గల ఇఖ్వాన్-ఉల్-ముస్లిమీన్ గురించి మరికొంత ఎక్కువగా ప్రస్తావించే అవసరం ఉందనుకొంటున్నాం. పార్రే పూర్వాశ్రమంలో ఒక జానపద గాయకుడు. ఆయన పాడిన పాటల రికార్డులు ఇంకా ఆలిండియా రేడియో వద్ద వున్నాయంటారు. లోయలో ముఖ్యమైన మిలిటెంటు గ్రూపు అయిన హిజ్బుల్ మజాహిదీన్‌ను వ్యతిరేకించడానికి ఆయనకున్న కారణాలు ఆయనకున్నాయి. ఆయనా, ఆయన గ్రూపు హిజ్బుల్ ముజాహిదీన్‌ను ప్రధాన శత్రువుగా పరిగణిస్తారు. భారత సైనిక బలగాలతో తనకు శత్రుత్వం ఏమీ లేదని ఆయన బహిరంగంగా ప్రకటించాడు. బారాముల్లా జిల్లాలో కూడా పార్రే గ్రూపుకు బలం వుంది. బారాముల్లాలో ఈ గ్రూపుకు చెందిన మిలిటెంట్లు బలవంతంగా చందాలు వసూలు చేస్తూ బహిరంగంగా తిరుగుతుంటారని అంటారు. సైనిక బలగాలు చూస్తూ కిమ్మన కుండ ఉంటారు.

రాజ్యానికి ప్రధాన శత్రువునే తన దాడికి కూడా లక్ష్యంగా పెట్టుకున్న మిలిటెంటు గ్రూపును ప్రభుత్వం పోషించడం చాలా ప్రమాదకరమైన విషయం. ఇలాంటి ఎత్తుగడలనే ప్రభుత్వం పంజాబ్‌లో అమలు చేస్తే వచ్చినదుష్ఫలితాలు తెలిసినవే. అధికారుల ప్రాపు పొందిన అలాంటి గ్రూపు అరాచక నేరగాళ్ల ముఠాగా తయారయి పోగలదు.; ప్రజలకు అంతులేని హాని కల్గించగలదు. ఈ గ్రూపును సైనిక బలగాలు తమకు అసౌకర్యం కల్గించే వ్యక్తుల్ని చంపించడానికి కూడా ఉపయోగించుకో గలదు. ఉదాహరణకు మానవ హక్కుల గ్రూపులకు చెందిన కార్యకర్తలను చంపడం సైన్యానికి ఇబ్బంది కల్గిస్తుంది కాబట్టి ఇలాంటి గ్రూపుల ద్వారా ఆ పని చేయిస్తుంది.

కూప్‌వారా జిల్లా కోటర్ ఖండ్ డివిజనల్ ఫారెస్టు అధికారి మోహమ్మద్ అష్రాఫ్ దర్ ను చంపడం ఈ ప్రమాదకర ధోరణికి సూచనే. ఈయన నిజాయితీ కల్గిన ఆఫీసరు. సైనిక బలగాలు చూస్తుండగానే తుపాకులు పట్టుకు తిరగే కొందరు స్థానికులు కలప రవాణా చేస్తున్నారని ఆయన తవ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసాడు. డిప్యూటీ కమీషనరు కుప్ వారా పోలీసు సుపరింటెంటు, డివిజనల్ ఫారస్టు కమీషనరు, మహమ్మద్ అష్రాఫ్ దర్ ల మధ్య ఒక సమావేశం జరిగింది. ఆ సమావేశంలో మొహమ్మద్ అష్రాఫ్ దర్ ఇచ్చిన ఫిర్యాదును చర్చించారు. కొన్ని రోజుల తర్వాత అంటే 1995 ఏప్రిల్5న కూకా పార్రే గ్రూపుకుచెందిన గుర్తు తెలియని మిలిటెంట్లు అష్రాఫ్‌ను చంపేసారు.

సామాన్య జనంపై మిలిటెంట్లు చేసే ఆగడాలనూ, అత్యాచారాలను పత్రికలు తరచూ రిపోర్టు చేస్తూనే వున్నాయి. రేప్‌లు, బలవంతపు వసూళ్ళు, చంపివేయడం లాంటివి ఈ అత్యాచారాలు. మేం ఈ విషయాన్ని కూడా పరిశోధించాం. రేప్ లాంటి ఘటనలను అతిశయోక్తు లు చేర్చి ప్రచారం చేస్తున్నారనీ అయితే ఇతర రకాల అత్యాచారాలు జరుగుతున్నాయని మాకు చెప్పారు. తమతో ఏకీభవించని వ్యక్తులను చంపేయడం మిలిటెంట్లకు మామూలే. ఈరకమైన హత్యలకు గురైన ప్రధాన బాధిత పక్షం నేషనల్ కాన్ఫరెన్సు. గత ఐదేళ్ళకాలంలో రద్దయిన అసెంబ్లీలో సభ్యులైన 11మందిని మిలిటెంట్లు చంపేసారని నేషనల్ కాన్ఫరెన్సు మంత్రివర్గంలో మంత్రిగా పనిచేసిన ఒకాయన మాకు చెప్పాడు. బలీయమైన మిలిటెంటు గ్రూపుతో ఏకీభవించనివారు నోరు మూసుకునైనా వుండాలి లేదా లోయను విడిచి పెట్టి పోవాలి. మిలిటెంట్లు ప్రజలను వాడుకునే వైఖరితో జవం చిరాకెత్తి పోతున్నారు అని ఒక పరిశీలకుడు అన్నాడు. షెల్టరు ఇమ్మని, డబ్బుఇమ్మనీ, వాహనాలు ఇమ్మని ప్రజల్ని బలవంత పెడతారు.

## పండిట్‌లు

*"షేక్ అబ్దుల్లా నయాకాశ్మీరు గురించి మాట్లాడాడు అంటే పండితుల భూమినీ, వాళ్ళ ఉద్యోగాలనూ లాక్కుని వాటిని ముస్లిములకు ఇవ్వడం అని అర్ధం"*

*-----జమ్ములోని కాశ్మీరీ పండిట్‌ల నాయకుడొకాయన*

కాశ్మీర్ లోయలో హిందువులను కాశ్మీరీ పండిట్‌లు అంటారు. మిలిటెన్సీ బాధితుల్లో వీరూ ఉన్నారు. సంఖ్యరీత్యా వాళ్లు ఎప్పుడూ బలంగా లేకున్నా కాశ్మీరీ జీవనంలో వాళ్ళ ప్రాముఖ్యం వాళ్ళ జనాభా నిష్పత్తి కన్నా ఎక్కువే. 1981 జనాభా లెక్కల ప్రకారం లోయలో పండితుల శాతం 3.95 ముస్లిముల జనాభా 94.96.1990 వరకూ పండిట్‌లు లోయనుంచీ వలసపోవడం అంటూ లేదు. జనాభాలో అతికొద్ది శాతంగానే ఉన్నప్పటికీ లోయలోని ప్రభుత్వోద్యోగాల్లోనూ, ఉపాధ్యాయుల్లోనూ వీళ్ళదే పెద్ద సంఖ్య. దీనికి తోడు గణనీయమైన సంఖ్యలో వీళ్ళే భూస్వాములుగా ఉండేవాళ్ళు. వాళ్ళలో కూడా పలువురు గ్రామీణ స్వంత సాగు కలిగిన రైతులున్నారు. ప్రస్తుతం వలసలో ఎక్కువగా కష్టాలకు గురైంది వీళ్ళే.

కాశ్మీరీ జాతీయోద్యమం ఎడల పండిట్ల నిర్లిప్తవైఖరినీ, షేక్ అబ్దుల్లా ప్రకటించిన సాంఘిక ఆర్థిక సంస్కరణల ఎడల వాళ్ళు ప్రదర్శించిన ప్రతికూల వైఖరినీ మనం ఇప్పటికే చూసాం. ఉద్యోగాల్లోనూ, ఇతర సౌకర్యాల్లోనూ తమ వాటాను ముస్లీములు అన్యాయంగా కొట్టేస్తున్నారనే భావనను వాళ్లు బలంగా పెంచుకున్నారు. సామాజిక పీడననుంచీ ముస్లిములను పైకి తీసుకొద్దామని కాశ్మీరీ నాయకులు పెద్ద ఎత్తునే కృషి చేసినప్పటికీ 40 ఏళ్ళ తర్వాత కూడా వాళ్ళు సాపేక్షికంగా వెనకబడే వున్నారు. ఉదాహారణకు 1981 జనాభా లెక్కల ప్రకారం మొత్తం రాష్ట్రంమంతా చూస్తే ముస్లీములు 64.19 శాతం కాగా హిందువులు 32.24 శాతం. కానీ ఉద్యోగాల్లో (ఇవి 1987 లెక్కలు) గెజిటెడ్ ఆఫీసర్లలో ముస్లీములు 41.71 శాతం ఉండగా, రెండవ తరగతి, మూడోతరగతి ఆఫీసర్లలో వాళ్ళు 56.24 శాతంగా వున్నారు. (అంటే వాళ్ళ జనాభా నిష్పత్తికన్నా ఇంకా తక్కువే) ఒక్క క్లాస్ ఫోర్ ఉద్యోగుల్లోనే ముస్లిములు (65.52) తమ జనాభా నిష్పత్తిని మించివున్నారు (ఈ లెక్కలను 'ఇండియాస్ కాశ్మీర్ వార్' పుస్తకం నుంచీ తీసుకున్నాం. దీన్ని 1990 లో కమిటీ ఫర్ ఇనిషియేటివ్ ఆన్ కాశ్మీర్ సంస్థ ప్రచురించింది.)

తమ ఉద్యోగాలనూ, భూములనూ ముస్లీములు కొట్టేస్తున్నారనే నిరసన కొంత పండితులలో వున్నప్పటికీ మొత్తం మీద కాశ్మీరీ సంప్రదాయాలైన శాంతి, సహనంలు సామాజిక ఐక్యతను కాపాడ్డంలో సహకరించాయి. ఇండియాలో అత్యంత హేయమైన మతకలహాలు జరిగినప్పుడు సైతం కాశ్మీరులో ఒక్క చోటకూడా మత ఘర్షణ జరగలేదని ఈ రిపోర్టు ప్రారంభంలోనే మనం చూసాం. 1986 లో మాత్రమే అనంతనాగ్ లో కొద్దిపాటి ఘర్షణ జరిగింది. కొన్ని దేవాలయాలు ధ్వంసమయ్యాయి. ఇది లోయలో వున్న కాంగ్రెసు అనుకూల రాజకీయ నాయకులు చేసిన కుట్ర అని కాశ్మీరీలంటారు. పైగా బలరాజ్‌పురి లాంటి శాంతి కాముకులు చేసిన ప్రయత్నాలు

సహజీవనాన్ని పునరుద్ధరించడంలోనూ, హిందువులకు నమ్మకం కల్గించడంలోనూ సఫలమయ్యాయి.

ఈ వాతావరణంలోనే 1989-90లలో మిలిటన్సీ తలెత్తింది. అప్పుడే కొంతమంది హిందూ ప్రముఖుల్ని చంపేసారు. ఆజాదీ కోసం జరిగిన ఊరేగింపుల్లో ఇస్లామిక్ నినాదాలను కొందరు ఇచ్చారు. మిలిటెంట్లు అప్పటినుంచీ ఇప్పటివరకూ హిందువుల్ని చాలామందిని చంపారు. అయితే కొందరు ఎంపిక చేసుకున్న ప్రభుత్వ ఏజెంట్లనూ, ఇన్ఫార్మర్లనూ చంపారు. హిందువులు కావడాన చంపింది ఒకే ఒక్క ఘటన. అది1993 ఆగస్టు 14న జరిగింది. ఆ రోజున జమ్ము పోయే బస్సులో ప్రయాణిస్తున్న 15మంది హిందువుల్ని చంపారు. అయితే హిజ్బుల్ ముజాహిద్దీన్, జె.కె.ఎల్.ఎఫ్ రెండు సంస్థలూ ఈ హత్యాకాండను ఖండించాయి. బహిరంగ స్థలాల్లో నిర్లక్ష్యంగా బాంబులు వేయడం, అమాయకుల్ని చంపడం లాంటివి కూడా జమ్ములో జరిగాయి. కానీ కాశ్మీర్ లో తక్కువే. అయితే కొందరు కాశ్మీరీ పండిట్‌లను చంపారు అనే మాట నిజమే. అది మొత్తం పండితుల కులస్తుల్లోనే అనిశ్చితత్వాన్నీ, భద్రతా రాహిత్యాన్నీ కల్గించింది నిజమే. మిలిటెంట్లకు సానుభూతిగా వుండేవారు కేవలం 32 మంది పండిట్‌లనే మిలిటెంట్లు చంపారు అని అంటుండగా (దీనికి ప్రాతిపదిక, మిలిటెంట్లు చంపినందుకు కేవలం 32 మంది పండిట్ల కుటుంబాలు మాత్రమే నష్టపరిహారం తీసుకున్నాయనే లెక్క) తటస్థంగా వుండే పరిశీలకులు 200 నుంచీ 300 మంది పండిట్‌లను మిలిటెంట్లు చంపారు అని అంటారు. మిలిటెంట్లు ఇంతకన్నా ఎక్కువ సంఖ్యలో ముస్లిములను ప్రభుత్వ ఏజెంట్లు అనే ఆరోపణతో చంపారు.

ఏదేమైనా పండిట్లు నిజంగానే భయపడ్డారు. దీన్ని ఆసరాగా తీసుకుని ప్రభుత్వం పండిట్లంతా లోయను వదిలి వెళ్ళి పోయేలా ప్రోత్సహించింది. ఇది ప్రభుత్వ ప్రచారానికి బాగా పనికొచ్చింది. మిలిటన్సీని కొన్ని వారాల్లోనే అణచి వేస్తామనీ, పండిట్లంతా తిరిగి రావచ్చనీ ప్రభుత్వాధికార్లు వాళ్ళకు హామీ ఇచ్చారు. ఎంతమంది వలస పోయారు అనేది కూడా వివాదాస్పదమే. 1990 లో లోయలో హిందువు జనాభా లక్షా ఆరువేలకు మించి వుండదని జనాభా లెక్కలు చెబుతుండగా రెండులక్షల మంది లోయనుంచి బయటికెళ్లి పోయారని ప్రభుత్వం అంటోంది! అయితే 1981 నాటి జనాభా లెక్కలు ఆధారపడ తగినవి కాదు అని పండిట్‌లు అంటున్నారు.

వలస పోయిన పండిట్లలో కాస్త వున్నవాళ్లు (ప్రధానంగా పట్టణ వాసులు) జమ్ములోగానీ, ఇతర చోట్లకానీ ఉద్యోగాల్లోనో, వ్యాపారాల్లోనూ కుదురుకున్నారు. దాదాపు 10 వేల కుటుంబాలు (ప్రధానంగా గ్రామీణ పండిట్‌లు) జమ్ములోని క్యాంపుల్లో బ్రతుకులీడుస్తున్నాయి. వాళ్ళ జీవితాలు దయనీయంగా ఉన్నాయి. లోగడ లోయలో ప్రభుత్వ ఉద్యోగాలు చేసిన వాళ్ళకు క్యాంపుల్లో జీతం ఇస్తున్నారు. ఇతర కుటుంబాలకు నెలకు దాదాపు 15వందల రూపాయలు ఇస్తున్నారు. కొంత చౌకగా బియ్యం లాంటివి ఇస్తున్నారు. ఏ ఇతర శరణార్థులనూ ఇంత మంచిగా భారతదేశంలో ఎప్పుడూ చూడ లేదు. గత ఐదేళ్ళ కాలంలో దాదాపు ఎనిమిది వందల ముస్లిం కుటుంబాలు కూడా లోయనుంచీ వలస పోయాయి. వాళ్ళ అతీగతీ వాళ్ళేమయ్యారూ అనేది ఎవరికీ తెలీదు.

జమ్ము క్యాంపుల్లోని పరిస్థితులు దుర్భరంగా ఉన్నాయి. మేం ముఠి క్యాంపును సందర్శించాం. మొత్తం కుటుంబమంతా ఒకే గదిలో ఉంటున్నారు. మంచినీటి వసతి లేదు. మందుల సౌకర్యంలేదు. ఈ శరణార్థుల పట్ల జమ్ము మధ్య తరగతి వర్గీయుల వైఖరి సాదరంగా లేదు. ఇక జమ్ము ప్రభుత్వానిదైతే ఏమీ పట్టని వైఖరే.

# ముగింపు

*"అసలు ఏం జరుగుతుందో భారతీయులు తెల్సుకోవాలి. కాశ్మీరు ఇండియాతో ఉంటుందా ఉండదా అనేది కాదు అసలు ప్రశ్న. కాశ్మీరులో ఇండియా వదిలి వెళ్ళే వారసత్వం ఏమిటి అనేదే అసలు ప్రశ్న".*

*--ప్రొఫెసర్ ఎ.ఐ. రఫీఖీ*
*కాశ్మీరు యూనివర్శిటీలో చరిత్రకారుడు.*

ఇప్పటి వరకూ ఈ వారసత్వ సంపద అంతా మోసం, కుతంత్రం, హింస, నేరాలే. దానిని అలాగే ఉండనిస్తామా అనేది నిర్ణయించాల్సింది మనమే. **1995** జూన్**2** నాటి 'ఫ్రంట్‌లైన్' పక్ష పత్రికలో ఒక వ్యాసం వ్రాస్తూ ఏ. జి. నూరానీ కాశ్మీరీ పీపుల్స్ లీగ్ నాయకుడైన షబ్బీర్ అహ్మద్ షా అన్న మాటలను ఉటంకిస్తాడు. ఆయనిలా అన్నాడట -- వియాత్నంలో క్రూర యుద్ధాన్ని కొనసాగించడం అమెరికాకు ఎందుకు కష్టమై పోయిందంటే అమెరికా పౌరుల్లోనే ఒక సెక్షను అమెరికా ప్రభుత్వపు హేయమైన చర్యలను తీవ్రంగా విమర్శించడం వల్లే. ఆమెరికన్లు స్పందించినట్లు భారతీయులు స్పందించలేక పోయారనే నర్మగర్భమైన విమర్శ అందులో బహుశా ఉంది.

ఏ రాజకీయ సంక్షోభంలోనైనా ప్రాధమిక సమస్య ఎల్లప్పుడూ సమస్యతో ప్రమేయం వున్న ప్రజల అభిమతాలూ, ఆకాంక్షలూను. ఇది పెద్దగా వివరించి చెప్పవలసిన విషయం కాదు. అయినా దీన్ని నిర్లక్ష్యం చేస్తారు. అందువల్ల ఈ సమస్యకు పరిష్కారం దొరకాలంటే ఏదో రూపంలో ఆ ఆకాంక్షలను పట్టించుకోవాలి. వాటికి సమాధానం చెప్పాలి. ఒక రాజకీయ ఆకాంక్షను ఎలా పరిష్కరించాలి అనేది ముందే చెప్పగల విషయంకాదు. ఎందుకంటే అదొక రాజకీయ క్రమం: ఒక రాజకీయ ప్రక్రియ. అయితే అందుకు నిజాయితీగా, న్యాయంగా, ప్రజాస్వామికంగా కృషి చేయలని మాత్రం డిమాండు చేయాల్సిన అవసరముంది. ఆ ఆకాంక్ష తుపాకులు పట్టుకోవడానికి నిర్ణయించుకుందని గానీ, లేదా ఆ తుపాకులకు విదేశీయులు శిక్షణ ఇస్తున్నారని గానీ సాకులు చూపించి దాన్ని పట్టించుకోకుండా ఉండడం క్షమార్హం కాదు.

కాశ్మీరు లోయ విషయానికొస్తే అక్కడ పట్టించు కోవాల్సిన ఆకాంక్ష కాశ్మీరీలందరూ దాదాపు కోరుకుంటున్నది తమ స్వంత జాతీ గమ్యాన్ని తామే స్వచ్ఛంగా నిర్ణయించుకోగల్గాలి అనేది. ఇది చాలా బలీయమైన కోరిక. ఇది కేవలం మేధావులే కాక అన్ని సెక్షన్ల ప్రజానీకాన్నీ ప్రభావితం చేస్తుంది. ఈ కోరిక జాతీ గుర్తింపు--దీన్నే ఈ మధ్య కాశ్మీరీయత్ అనే పదంతో వర్ణిస్తున్నారు-- చుట్టూ తిరుగుతుంటుంది. ఎలాంటి ఒత్తిళ్ళు వచ్చినా ఈ గుర్తింపుకై చేసే పోరాటం మాత్రం తగ్గలేదు. అయితే ఈ ఆకర్షణలూ,ఒత్తిళ్లతో ప్రభావితం కాకుండా పోలేదు. వీటిలో ఇస్లాంవైపు ఉన్న ఆకర్షణ అన్నిటికన్నా బలంగా ఉందనేది నిజం. పాకిస్తాన్ దానిని ప్రోత్సహిస్తున్నదనేది కూడ నిజం. అయితే ఈ ఆకర్షణ కాశ్మీరీ జాతీయవాదాన్ని అధిగమించి దాన్నికమ్మివేయడంలో సఫలం కాలేదని చెప్పడానికి మేం చాలామంది ప్రముఖుల

అభిప్రాయాల్ని ఉటంకించాం. పైన పేర్కొన్న వ్యాసంలో ఎ.జి.నూరానీ వ్యక్తం చేసిన అభిప్రాయం ఏమంటే --"మొత్తం మీద అత్యధిక ప్రజానీకం మద్దతు ఇస్తున్నది స్వాతంత్ర్య అనుకూల భావానికే తప్ప పాకిస్తాన్ అనుకూల భావానికి కాదు" అని. చాలామంది పరిశీలకుల అభిప్రాయానికి ప్రాతినిధ్యం వహించేది ఈ అభిప్రాయం. ఈ రాజకీయ ఎంపిక కాశ్మీరీ గుర్తింపుతో సంయోగం చెందింది. ఈ కాశ్మీరీ గుర్తింపులో భాగమయిన ఇస్లాం సాధువుల, స్మారక మందిరాల కాశ్మీరీ ఇస్లామే కానీ జమాతే ఇస్లామీ ప్రాతినిధ్యం వహించే శుద్ధ ఇస్లామిక్ కాదు. అయితే ప్రతిదాని మీదా తుపాకే ఆధిపత్యం వహించేచోట చాలామంది వ్యక్తపరిచే ఈ అభిప్రాయం ఎంతవరకు సత్యం అనేది మాత్రం నిజంగా తేల్చడం అంత సులభమేమీకాదు.

దాని రూపురేఖా విలాసాలు ఏమైనప్పటికీ --కాశ్మీరీ, పాన్-ఇస్లామిక్, పాకిస్తాన్ అనుకూల అనే ఎలాంటి రూపురేఖా విలాసాలున్నప్పటికీ ఈ కాశ్మీరీ జాతీయతను గుర్తించాలిచ దాంతో వ్యవహరించాలి; దాన్ని ప్రజాకాంక్షగా ఆమోదించాలి. ఇతరులు దాన్ని కేవలం ప్రభావితం చేయగలరు తప్ప ఫలానా రకంగానే ఉండాలి అని ఆదేశించజాలరు.

చారిత్రక కారణాల రీత్యా ఈ కాశ్మీరీ జాతీయత జమ్ము-కాశ్మీర్ అనే విశాల భూభాగంతో భౌగోళిక ప్రదేశాన్నీ, ఆకాంక్షలనూ పంచుకోవాల్సి వచ్చింది. అయినప్పటికీ అదే చారిత్రక కారణాల రీత్యనే స్వయం నిర్ణయాధికార కాంక్ష రాష్ట్రంలో అత్యధిక ప్రాంతంలో ప్రతిధ్వనిస్తున్నది. అది స్వాతంత్ర్యం కావచ్చు స్వయంప్రతిపత్తి కావచ్చు. భారతదేశం నుంచీ ఎంతోకొంతమేరకు స్వేచ్ఛగా వుండాలనే ఆకాంక్ష అది. దాన్ని రాష్ట్రంలో అత్యధిక జనాభా కోరుకుంటున్నారనిపిస్తోంది. పాకిస్తాన్ ఆక్రమణలో వున్న జమ్ము-కాశ్మీర్‌లో కూడా ఈ ఆకాంక్షే బలీయమైన రాజకీయ ధోరణి. దాన్ని పాకిస్తాన్ ప్రభుత్వం మన ప్రభుత్వం కన్నా ఎక్కువ ఆదరణతో ఏమీ చూడ్డం లేదు.

ఈ ఆకాంక్షతో నిర్దిష్టంగా ఎలా వ్యవహరించాలి?

ఫలానా ఫార్ములానే అనుసరించాలని మేం వాదించడం లేదు. లేదా అంతిమ పరిష్కారాన్ని సూచించడంలేదు. సాధ్యమయ్యే పరిష్కారం ఏదైనప్పటికీ -- అది ఇండియానుంచీ మొత్తం జమ్ము-కాశ్మీరు లేదా అందులో కొంత భాగం విడి పోవడం కావచ్చు; లేదా ఒక ప్రాంతం పాకిస్తాన్ తో విలీనం కావడం కావచ్చు-- దాన్ని మనం ఆమోదించాలి. అయితే అది ఏమయివుండ గలుగుతుందీ అనే దగ్గర కాదు మొదలెట్టల్సింది. కాశ్మీరీ పోరాట రాజకీయ ప్రతినిధులు ఒక ప్రతిపాదన పెడుతున్నారు. అది చర్చలు ప్రారంభించడానికి ఆరంభ బిందువు కావచ్చు. 33 పార్టీలూ సంస్థలూ కలిసి ఆల్ పార్టీ హురియత్ కాన్ఫరెన్సు ను స్థాపించుకున్నాయి. వాళ్ళల్లో వాళ్ళకి ఎన్ని ఘర్షణలున్నా, భిన్నాభిప్రాయాలున్నా కొన్ని మౌలికాంశాలపై వాళ్ళకు ఏకాభిప్రాయం వుంది. స్వయం నిర్ణయాధికార లక్ష్యానికీ, ప్లెబిసైటు నిర్వహణకై ఐక్యరాజ్యసమితి తీర్మానాల అమలుకూ హురియత్ కాన్ఫరెన్సులోని భాగస్వామ్య పక్షాలన్నీ కట్టుబడి వున్నప్పటికీ ఇండియా, పాకిస్తాన్, జమ్ము-కాశ్మీర్ ప్రజానీకాల మధ్య త్రైపాక్షిక చర్చలు జరగాలనీ, అలా పరిష్కార క్రమాన్ని మొదలెట్టవచ్చనీ ప్రతిపాదించారు. వాళ్ళు పెట్టిన ఒకేఒక్క షరతు ఏమంటే

చర్చలకు ఎలాంటి ముందు షరతులూ ఉండకూడదని. అంటే జమ్ము-కాశ్మీరు ఇండియాలో విలీనం అయిపోయిందనీ, ఇకదానికి తిరుగులేదని జమ్ము-కాశ్మీరు ప్రజానీకం ఆమోదించాలని ఇండియా ఒత్తిడి చేయడం మానుకోవాలి. విలీనం పత్రం తిరుగులేనిది అనే దాన్ని తిరస్కరించడమే అసలు సమస్యకాబట్టి దాన్ని ఆమోదించమని ఒత్తిడి చేస్తూ రాజకీయ పరిష్కారం సాధిద్దామని (భారత ప్రభుత్వం) మాట్లాడ్డంలో అర్థంలేదు. ఇండియా రాజకీయ పరిష్కారం పేరిట మాట్లడుతున్నది. జమ్ము-కాశ్మీరు ప్రజానీకం ఏ సమస్యకు పరిష్కారం కావాలని కోరుకుంటున్నారో దానిగురించి కాదనీ, మరొకటేదోననీ స్పష్టంగానే అన్పిస్తోంది. భారత ప్రభుత్వం మాటలకు అర్థం లోయలో ఎన్నికల రాజకీయాల ప్రక్రియను పునరుద్ధరించడమనే. అలా అయితే ఎన్నికయిన ప్రభుత్వం మిలిటెన్సీని ఎదుర్కొంటుంది అని. కానీ రాజకీయ పరిష్కారం అని కాశ్మీరీలు మాట్లాడుతున్నది దీని గురించి కాదు.

భారతదేశంలో జమ్ము-కాశ్మీరు విలీనం పూర్తయిపోయినట్లు కాదనీ, అది వివాదాస్పద విషయమనీ భారత ప్రభుత్వం గుర్తిస్తే సమస్య పరిష్కారానికి నిజమైన రాజకీయ ప్రక్రియను ప్రారంభించవచ్చు. అది అత్యావశ్యకమైన ముందు షరుతు. ఈ ముందు షరతును ఒప్పుకుంటే త్రైపాక్షిక సంప్రదింపులు కాక మరో భిన్నమైన పద్ధతిని ఇండియా కావాలనుకుంటే ఆవిషయాన్ని కాశ్మీరీలకు ప్రతిపాదించవచ్చు. కానీ రాజకీయ పరిష్కారాన్ని ప్రతిపాదిస్తూ ఇండియా ఏ ప్రతిపాదన చేసినా, ఈ సమస్యకున్న వివాదాస్పద స్వభావాన్ని ఒప్పుకోకపోతే ఆ ప్రతిపాదనకు అర్థం లేకుండా పోతుంది. షబ్బీర్ అహ్మద్ షా, ఆజమ్ ఇంక్విలాబీ, యాసిన్ మాలిక్, సయ్యద్ అలీషా జిలానీ, అబల్‌గనీలోన్, ప్రొఫెసర్ గని లాంటి, సమర్థులూ, యోగ్యులూ, సంస్కారవంతులు కాశ్మీరీలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వాళ్ళు ఎంతో బాధ్యతతో వ్యవహరిస్తున్నారు. ఇలాంటి వాళ్ళను చూసి ఏ జాతి అయినా గర్వించవచ్చు. తమ రాష్ట్ర భవితవ్యాన్ని నిర్ణయించుకోవడంలో పండిట్‌లతో సహా అన్ని వర్గాల ప్రజలకూ, ప్రాంతాలకూ అభి ప్రాయాలు చెప్పుకునే అవకాశం ఇవ్వాలనే విధానానికి వీరు నిబద్ధులైవున్నారు. నిజానికి ఇవ్వాళ ఏ పరిష్కారమైనా వివాదా స్పద రాష్ట్రంలోని అన్ని సెక్షన్ల స్థూల భావాలూ పట్టించుకుని సమన్వయం చేయాలి. ఇది లోయ బయట ఉన్న ప్రజల కోరిక మాత్రమే కాదు. ఈ వాస్తవాన్ని లోయ నాయకత్వం గుర్తిస్తున్నది. దురదృష్టవశాత్తు సమస్యగురించి నిర్ణయం తీసుకోవడంలో జమ్ము కాశ్మీర్‌లోని ప్రజలందరికీ మాట్లడే హక్కును నిరాకరిస్తున్నది భారత ప్రభుత్వమే.

భారత ప్రజలకూ, మేధావులకూ, పత్రికలకూ ఒక విన్నపం చేస్తూ మేం ఈ రిపోర్టును ముగిస్తున్నాం. అలాగే భారత ప్రభుత్వం ముందుకొన్ని డిమాండ్లు పెడుతున్నాం.

జమ్ము-కాశ్మీర్‌లో మౌలిక సమస్య హిందూ ముస్లిం ఘర్షణ కాదనీ, ఇండియా-పాకిస్తాన్‌ల శత్రుత్వం కాదనీ, జమ్ము-కాశ్మీర్ ప్రజల స్వయం నిర్ణయాధికార ఆకాంక్షేననీ భారతీయులు గుర్తించాలనీ, తెలుసు కోవాలనీ మే విన్నవిస్తున్నాం. ఈ ఉపఖండ రాజకీయ చరిత్ర క్రమంలో పేరుకుపోయిన ఇతర క్లిష్టతలు దీనిని కమ్మేయకూడదు. ప్రజలలోని ఆకాంక్షకు సుదీర్ఘ చారిత్రక మూలాలున్నాయనేది కూడా మనం ఒప్పుకోవాలి.

విలీన పత్రమూ ఐక్యరాజ్య సమితి తీర్మానాలూ జమ్ము-కాశ్మీరు ప్రజలు ఇండియాలో ఉంటారా లేదా అని తేల్చుకోవడానికి భారత దేశంపై చట్టపర, నైతిక బాధ్యతను పెడుతున్నాయని కూడా మనం అంగీకరించాలి. జమ్ము-కాశ్మీర్ ను ఇండియాలో విడదీయరాని భాగంగా చేసిన సందేహాపూరిత పద్ధతిని విమర్శనాత్మకంగా చూడ్డానికి మనం సిద్ధపడాలి. పాకిస్తాన్ కున్న స్వార్థపూరితమైన కోర్కెలను ఇండియా తనకున్న అంతే స్వార్థపూరితమై నలక్ష్యాలకు ముసుగువేయడానికి సాకుగా వాడు కొంటుందనేది మనం గమనించాలి. అందువల్ల భారత ప్రభుత్వం జమ్ము-కాశ్మీరు విలీనపు వివాదస్పద స్వభావాన్ని గుర్తించాలనీ, కాశ్మీరీ పోరాటంతో రాజకీయంగా వ్యవహరించాలనీ, జమ్ము-కాశ్మీర్ లో మన సైనిక బలగాల అత్యాచారాలకు చరమగీతం పాడాలనీ మనం భారత ప్రభుత్వాన్ని ఒత్తిడి చేయాలని మేం విన్నవిస్తున్నాం.

ఆధునిక యుగంలో ఈ ఉపఖండపు గొప్ప రాజకీయవేత్తలలో ఒకడైన షేక్ మొహమ్మద్ అబ్దుల్లా (ఆయనలో ఎన్ని లోపాలున్నప్పటికీ) తన ఆత్మకథకు ముందుమాటలో 12వ శతాబ్దపు కాశ్మీరీ చరిత్ర కారుడు కల్హణుడి సంస్కృత రచన 'రాజతరంగిణి' నుంచీ "కాశ్మీరాన్ని ఆత్మశక్తితో గెల్చుకోవచ్చు అవును; కత్తి బలంతో? ఎన్నటికీ కాదు" అనే వాక్యాన్ని ఉటంకిస్తాడు. ఉన్నత సంస్కృతి ఉన్న ఆ ప్రాంతాన్ని "ఖడ్గచాలనంతో" గెల్చుకోవడానికి చేసే ప్రయత్నాలను ఇంకేమాత్రము సాగనీయమని నిర్ణయించాల్సింది మనమే.

భారత ప్రభుత్వం ముందు మేం ఈ డిమాండ్లు పెడుతున్నాం.

1. జమ్ము-కాశ్మీరు విలీనంలో నిజమైన వివాదం ఇమిడి వుందనీ అది తిరులేనిది కాదని ఒప్పుకోవాలి. కాశ్మీరు సమస్యకు ఇదే మూలం అని గుర్తించాలి. జమ్ము-కాశ్మీరు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వివాదాన్ని పరిష్కరించే పద్ధతులను అన్వేషించడానికి ఎలాంటి షరతులూ లేకుండా చర్చలు మొదలెట్టాలి.

2. జమ్ము-కాశ్మీర్‌లో సైనిక బలగాలు చేస్తున్న అన్నిరకాల అత్యాచారాలనూ, హత్యాకాండనూ, చిత్రహింసలను అన్యాయమైన అరెస్టులను వెంటనే ఆపేయ్యాలి.

3. జమ్ము-కాశ్మీరులో సైనిక బలగాలు చేస్తోన్న పౌర ప్రజాస్వామిక హక్కుల ఉల్లంఘనల ఆరోపణలను నిష్పాక్షికంగా విచారించడానికి మానవ హక్కుల కార్యకర్తలతో వైద్య, న్యాయ నిపుణలతో, సుప్రసిద్ధ వ్యక్తులతో కూడిన విచారణ కమీషన్‌ను నెలకొల్పాలి. నేరస్తులను దేశ చట్టాల ప్రకారం శిక్షించాలి.

4. సైనిక బలగాల బాధితులకు తగినంత మొత్తంలో వెంటనే నష్టపరిహారం చెల్లించాలి.

5. బాధితులకు సహాయం చేస్తున్న మానవ హక్కుల కార్యకర్తలనూ, లాయర్లను వేధించడం ఆపివేయాలి. జమ్ము-కాశ్మీరును సందర్శించడానికి అనుమతి కోరే ఏ భారతీయ లేదా విదేశీ మానవ హక్కుల గ్రూపులకైనా అనుమతి ఇవ్వాలి. చిత్రహింసలమీద, చట్టం నిర్దేశించని పద్ధతుల్లో జరుగుతోన్న ప్రాణ హారణాల మీద ఐక్యరాజ్యసమితి ప్రత్యేకాధికారి చే జమ్ము-కాశ్మీర్‌లో విచారణ జరపడానికి అనుమతించాలి.

6. ప్రజాభద్రతా చట్టాన్నీ, సైనిక బలగాల ప్రత్యేక చట్టాన్నీ, కల్లోలిత ప్రాంతాల చట్టాన్ని సైనిక బలగాలు చేసే అత్యాచారాలకు శిక్ష లేకుండా చేసే అన్ని చట్టాలనూ రద్దుచేయాలి.

7. నిర్వాసితుల --వాళ్ళు కాశ్మీరీ పండిట్‌లు కావచ్చు లేదా ముస్లీములు కావచ్చు— ప్రాధమిక అవసరాలను పట్టించుకుంటామనీ, వాళ్ళ హక్కులు రక్షిస్తామనీ హామీ ఇవ్వాలి. సమస్యకు అంతిమ పరిష్కారం సాధించడంలో వాళ్ళ ప్రయోజనాలను కూడా తగినంతగా పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇవ్వాలి.

"వాళ్ళది (కాశ్మీరీలది) ఒకేభాష. ఒకేసంస్కృతి. నేను చూసినంతవరకు వాళ్ళంతా ఒకేప్రజ. ఎవరు కాశ్మీరీ హిందూ, ఎవరు కాశ్మీరీ ముస్లిం అనేది చూడగానే గుర్తు పట్టలేను. జమ్ము-కాశ్మీరు భవితవ్యాన్ని కాశ్మీరీల అభిలాషే నిర్ధేశించాలని మామూలు వారికైనా అనిపిస్తుంది."

------ మోహన్‌దాస్ కరం చంద్ గాంధీ

"కాశ్మీరు ప్రజానీకంపై భద్రతాదళాలు తీవ్రమైన దుర్మార్గాలకు పాల్పడుతున్నాయి. అకస్మాత్తుగా దాడి చేస్తారు. అందర్నీ అవమానించేలా గుర్తింపు పెరేడ్లు నిర్వహిస్తారు. అమాయకుల్ని చంపేస్తున్నారు. హతుల సంఖ్య ఇప్పటికే దాదాపుగా 40 వేలకు చేరుకుంది."

------ కాశ్మీర్ యూనివర్శిటీ ఉపాధ్యాయులు
అమెరికా ప్రభుత్వానికి పంపిన మెమోరాండం

"అసలు ఏం జరుగుతుందో భారతీయులు తెల్సుకోవాలి. కాశ్మీరు ఇండియాతో ఉంటుందా ఉండదా అనేది కాదు అసలు ప్రశ్న. కాశ్మీరులో ఇండియా వదిలి వెళ్ళే వారసత్వం ఏమిటి అనేదే అసలు ప్రశ్న".

--ప్రొఫెసర్ ఎ.ఒ. రఫీఖీ
కాశ్మీరు యూనివర్శిటీలో చరిత్రకారుడు.